అనుదినం... జనస్వరం

www.navatelangana.com



నవతెలంగాణ

ఆదివారం 07-4-2024

సంపుటి : 10 సంచిక : 97

సమగ్ర తెలుగు దినపత్రిక

Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00

కాంగ్రెస్ ధ్యేయం సమన్యాయం

మా మ్యానిఫెస్టో ఈ దేశ ప్రజల ఆత్మ



- మోడీ హయాంలో అన్ని వ్యవస్థలు, రంగాలు నిర్వీర్యం
- దేశ సంపద కొందరి చేతుల్లోనే...
- ఇక్కడ మాజీ సీఎం ఫోన్‌ట్యాపింగ్ చేయించారు
- ఢిల్లీలో మోడీ అదే పనిచేస్తున్నారు : తుక్కుగూడ సభలో రాహుల్‌గాంధీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశసంపదను ప్రజలందరికీ సమానంగా పంచడమే కాంగ్రెస్ విధానమని ఆపార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఇదే విషయాన్ని 'న్యాయపత్రం'లో పేర్కొన్నామనీ, అది తమపార్టీకి సంబంధించిన మ్యానిఫెస్టో కాదనీ, దేశ ప్రజల ఆకాంక్షలు, ఆలోచనల్లోంచి ఉద్భవించిన 'ఆత్మ' అని స్పష్టం చేశారు. శనివారంనాడిక్కడి తుక్కుగూడలో జరిగిన జనజాతర సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ మ్యానిఫెస్టో 'న్యాయపత్రం' తెలుగు ప్రతిని ఆవిష్కరించారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు ప్రకటించామనీ, అధికారంలోకి రాగానే అమలు చేస్తున్నామనీ, ఇదే ఆదర్శంతో దేశంలోనూ ఐదు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు ప్రకటించినప్పుడు ప్రజల అవసరాలను, వారి వాణిని దేశానికి వినిపించామన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం 30వేల ఉద్యోగాలు ఇచ్చి, మరో 50వేల ఉద్యోగాలు ఇవ్వబోతున్నదని చెప్పారు. తెలంగాణలో ఎలాగైతే మాట ఇచ్చి నిలబెట్టుకున్నామో అదే విధంగా దేశంలో అమలు చేస్తామన్నారు. నిరుద్యోగులందరికీ ఏడాదికి రూ.లక్ష జీతంతో ఉద్యోగం, అప్రెంటీస్‌షిప్ ఇస్తామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ యువతకు ఎలాగైతే ఉపాధి కల్పిస్తున్నామో, అదే విధంగా లక్ష రూపాయల జీతంతో అన్ని రంగాల్లోనూ శిక్షణ, అప్రెంటీస్‌షిప్ కల్పిస్తామని వివరించారు. దేశంలోని మహిళలు మన భవిష్యత్ చూసుకుంటారు. మహిళలు ఇంటిపని, ఉద్యోగ,ఉపాధి వంటి రెండు పనులు ఏకకాలంలో చేస్తున్నారని చెప్పారు. దేశంలో మోడీ సర్కారు వచ్చాక ప్రజలు మళ్లీ నిరుపేదలు అయ్యారనీ, వారి కోసం నారీన్యాయ్ తెస్తున్నామన్నారు. ప్రతిఒక్క మహిళ బ్యాంకు ఖాతాలో ఏటా రూ.1లక్ష ఇస్తామనీ, దీనివల్ల సమాజంలో విప్లవాత్మక మార్పులు వచ్చి దేశ ముఖచిత్రం మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కిసాన్ న్యాయ్ ద్వారా రైతులకు న్యాయం చేస్తామన్నారు. దేశంలో రోజుకు 30 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ, మోడీ సర్కార్ ధనవంతులకు రూ.16 లక్షల కోట్ల రుణమాఫీ ...3లో

> అసెంబ్లీ ఎన్నికలకు అచ్చొచ్చిన తుక్కుగూడ నుంచే హస్తం పార్టీ లోక్‌సభ ఎన్నికలకు జంగ్ సైరన్ మోగించింది. కొద్ది నెలల క్రితం గెలిచి తీరతాం.. అధికారంలోకి వస్తామంటూ ఆ సభ సాక్షిగా ప్రతినబూని, విజయం సాధించిన ఆ పార్టీ అగ్రనేతలు, మరోసారి అదే రకంగా ఇండియా కూటమి అధికారంలోకి రావటం ఖాయమంటూ నొక్కి చెప్పారు. ప్రధాని మోడీ, ఆయన పార్టీ బీజేపీ వద్ద సీబీఐ, ఈడీలాంటి సంస్థలుంటే, తమ వద్ద ప్రజల పట్ల ప్రేమ, స్వచ్ఛత ఉన్నాయనీ, అవే తమకూ తమ పార్టీకి కొండంత అండంటూ వారు కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపారు. సమభావన, సమన్యాయమే తమ అసలు సిసలు సిద్ధాంతాలనీ, ఆ విజయ రహస్యాల ఆధారంగానే ఈసారి ఢిల్లీ పీఠంపై కాంగ్రెస్ జెండాను ఎగరేయబోతున్నామని వారు జోస్యం చెప్పారు.

నమో అంటే...

నమ్మించి మోసం చేయడమే

- పదేండ్లలో తెలంగాణకు బీజేపీ తీరని అన్యాయం
- విభజన చట్టంలోని హామీలేమయ్యాయి?
- ఏం మొహం పెట్టుకుని బీజేపోళ్లు ఓట్లు అడుగుతారు?
- అధికారంలోకొచ్చేది ఇండియా కూటమే 5లో..
- చూస్తూ ఊరుకోవడానికి జానారెడ్డిని కాదు రేవంత్‌రెడ్డిని
- కేసీఆర్..ఎక్కువ చేస్తే చర్లపల్లి జైలుకే : సీఎం రేవంత్‌రెడ్డి


అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

దొందూ దొందే..

కాంగ్రెస్, బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి





- రైతులను మోసం చేస్తూ పాలన : రైతు దీక్షలో బీఆర్ఎస్ నేతలు
- రెండు పిల్లర్లు కుంగితే రాజకీయం చేస్తారా? : కేటీఆర్
- నా ప్రాణం అడ్డుపెట్టైనా కార్యకర్తలకు అండగా నిలుస్తా : హరీశ్‌రావు

నవతెలంగాణ- విలేకరులు

కాంగ్రెస్, బీజేపీ రైతులను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నాయి.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి.. మోసపూరిత హామీలతో రాష్ట్రంలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం... ఏ ఒక్క హామీని సరిగ్గా నెరవేర్చలేదు. రెండు లక్షల రుణమాఫీ, ...5లో

హుష్..మాయం!

ఎన్సీఈఆర్టీ పుస్తకాలలో మరికొన్ని ప్రస్తావనలకు మంగళం

- బాబ్రీ కూల్చివేత, గుజరాత్‌లో ముస్లింల ఊచకోత తొలగింపు
- మణిపూర్, జమ్మూకాశ్మీర్, భారత్-పాక్ వివాదం ఊసే లేదు



వివరాలు 13లో

వామ పక్షాలకు కొత్త భాష్యం

గాజాపై ఐరాస తీర్మానం

ఓటింగ్‌కు భారత్ దూరం



న్యూయార్క్: గాజాలో కాల్పుల విరమణ పాటించాలని ఐక్యరాజ్యసమితిలోని మానవ హక్కుల మండలి తీర్మానం చేసింది. అయితే ఆ తీర్మానంపై జరిగిన ఓటింగ్‌లో ఇండియా పాల్గొనలేదు. గాజా స్ట్రిప్‌లో ఉన్న అక్రమ నిర్బంధాన్ని కూడా ఎత్తివేయాలని ఇజ్రాయిల్‌ను ఆ తీర్మానంలో కోరారు. తీర్మానానికి అనుకూలంగా 28 ఓట్లు పోలయ్యాయి. ఆరుగురు ...6లో

సీబీఐ విచారణపై కవిత సవాల్

రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తీహార్ జైలులో ఉన్న కవిత సీబీఐ విచారణను సవాల్ చేస్తూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. ఆమెను సీబీఐ విచారణకు అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ కవిత తరపు సీనియర్ న్యాయవాది నితీష్ రాణా శనివారం పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ విచారణకు అనుమతి ఇవ్వడంపై స్టేటస్ కో ఉత్తర్వులు ఇవ్వాలని న్యాయమూర్తిని కోరారు. సీబీఐ తమకు ...13లో


మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

ప్రజల గొంతు వినిపించాలంటే కమ్యూనిస్టులు అవసరం

మతోన్మాదాన్ని ఎదుర్కొని లౌకికత్వాన్ని కాపాడుతాం

- భువనగిరి నియోజకవర్గంపై కమ్యూనిస్టులకే అవగాహన
- వామపక్షాల పోరాట ఫలితమే ఉపాధి హామీ చట్టం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ
- పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ స్థాయి సమావేశం
- హాజరైన భువనగిరి సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

ప్రజా సమస్యలపై కొట్లాడేందుకు పార్లమెంట్‌లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఎంతో అవసరమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. దేశాన్ని మతోన్మాద ప్రమాదం నుంచి ఎదుర్కొని, లౌకికత్వాన్ని కాపాడుతామన్నారు. సీపీఐ(ఎం) ఇబ్రహీంపట్నం నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం ఇబ్రహీంపట్నంలోని పాషా-నరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. భువనగిరి పార్లమెంట్ పార్టీ అభ్యర్థి ఎండి జహంగీర్, జాన్‌వెస్లీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంటు స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కమ్యూనిస్టుల ప్రాబల్యం అత్యధికంగా ఉందన్నారు. నకిరేకల్, భువనగిరి, జనగామ, తుంగతుర్తి, ఇబ్రహీంపట్నం, మునుగోడు నియోజకవర్గాల అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించారని చెప్పారు. ఈ ప్రాంతం నేటికీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వం కలిగి ఉందన్నారు. భూ పోరాటాలతో పాటు తాగు, సాగు నీటి కోసం ...13లో


మాట్లాడుతున్న ఎస్. వీరయ్య

సికింద్రాబాద్ కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా నారాయణన్ శ్రీ గణేష్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నారాయణన్ శ్రీ గణేష్ పోటీ చేయనున్నారు. శనివారం ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన గణేష్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత చేతిలో ఓటమి పాలయ్యారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌లో చేరారు.



పట్టణ ఉపాధి హామీ చట్టం

రూ.700 కనీస వేతనంతో 200 ఉపాధి హామీ పని దినాలు

13లో.

సీపీఐ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల


ప్రభుత్వాల వల్లే.. ఈ సంక్షోభం

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు ఇవ్వాలి
- బకాయిలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలి
- సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలి
- రాజకీయ కోణంలో కాకుండా ప్రజా సమస్యగా చూడాలి : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య
- కార్మికుల నినాదాలతో దద్దరిల్లిన 'నేతన్న మహా గర్జన'

మరో నేతన్న ఆత్మహత్య

బాధిత కుటుంబికులను ఓదార్చిన సీఐటీయూ నేతలు

కుటుంబానికి కేటీఆర్ పరామర్శ, ఆర్థిక సహాయం 5లో..



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సిరిసిల్లకు సాంచాలే గుండె చప్పుడు. అటువంటి చప్పుడు ఆగే పరిస్థితి నెలకొంది. వెంటనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బకాయిలు చెల్లించి, కొత్తగా ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించాలి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్లే వస్త్ర పరిశ్రమలో సంక్షోభం నెలకొంది' అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సుమారు 2వేల మంది కార్మికులు శనివారం 'నేతన్న మహాగర్జన' నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల వల్లే సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో పడిందన్నారు. చేనేత, టెక్స్‌టైల్ బోర్డును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని, కనీసం ఇక్కడి కార్మికుల గురించి ఆలోచించినా వారికి కొంత ఉపశమనం లభించేదని అన్నారు. ముఖ్యంగా యారన్, ఇతర వస్త్రాల ఉత్పత్తిపై నాలుగు శాతంగా ఉన్న జీఎస్టీని ...5లో

పేదల గుడిసెలపై పెద్దల కన్ను

కాళ్లపై పడినా కనికరించని అధికారులు

- సొంత ఇండ్లు నిర్మించి ఇచ్చేదాకా కదలం : బాధితులు
- 2022లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్టాలిన్‌నగర్ పేరుతో గుడిసెలు
- గుడిసెల కూల్చివేత దుర్మార్గ చర్య :రంగయ్య, సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి

గ్రేటర్ వరంగల్‌లోని పైడిపల్లి శివారులో గుడిసెల కూల్చివేత



నవతెలంగాణ-కాశిబుగ్గ

గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ పైడిపల్లి శివారులోని ఎస్సారెస్పీ కాలువ వద్ద ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలపై పెద్దల కన్ను పడింది. అధికారుల అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల ముసుగులో కొంతమందితో కలిసి కోర్టులో కేసు వేయించారు. దీంతో కోర్టు ఉత్తర్వుల మేరకు శనివారం తెల్లవారు జామున పోలీసులు, రెవెన్యూ మున్సిపల్ అధికారులు పేదల గుడిసెలను కూల్చేశారు. విధ్వంసం సృష్టించారు. స్టాలిన్ నగర్‌గా పేరుపెట్టుకున్న ఆ ప్రాంతం మొత్తాన్ని ధ్వంసం చేసారు. వివరాల్లోకి వెళితే..3వ డివిజన్ పైడిపల్లి శివారులో ఎస్సారెస్పీ కాలువ సమీపంలోని ప్రభుత్వ భూమిలో 2022 ఆగస్టులో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్టాలిన్‌నగర్ పేరుతో ...5లో

అప్రజాస్వామికం

- గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి
- అక్రమంగా అరెస్టు చేసిన బషీర్‌ను తక్షణమే విడుదల చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్ 5లో..



మహారాష్ట్ర అడవుల్లోకి ఏనుగు మళ్లింపు సక్సెస్ : మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో నాలుగు రోజులుగా ప్రజలను భయాందోళనలకు గురిచేసి, ఇద్దరి మరణానికి కారణమైన ఏనుగును తిరిగి మహారాష్ట్ర అడవుల్లోకి మళ్ళించడంలో రాష్ట్ర అటవీ శాఖ చేపట్టిన చర్యలు ఫలించాయని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అటవీ శాఖ అధికారులు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి, అనుక్షణం అప్రమత్తతో వ్యవహరిస్తూ, జాడను కనిపెట్టుకుంటూ సురక్షితంగా ఏనుగును సమన్వయంతో మళ్లించారని తెలిపారు. ఏనుగు మహారాష్ట్ర అడవుల్లో నుంచి తెలంగాణలోకి ప్రవేశించడం ఇదే మొదటిసారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరిగితే అనుసరించాల్సిన కార్యాచరణ విషయంలో కచ్చితమైన ప్రణాళికలతో సిద్ధంగా వుండాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు.

పార్టీ ఫిరాయింపుల చట్టానికి సీఎం రేవంత్‌రెడ్డి తూట్లు

- కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీలను విస్మరించి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారనీ, ఫిరాయింపుల చట్టానికి తూట్లు పొడుస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ బీజేపీ జెండాను ఎగురవేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టికల్ 370 రద్దుతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతున్నదని చెప్పారు. తలాఖ్ రద్దుతో ముస్లిం ఆడబిడ్డలకు ప్రధాని మోడీ అండగా నిలబడ్డారన్నారు. రామాలయాన్ని కట్టించామని తెలిపారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి అంత్యోదయ విధానం ద్వారా ప్రభుత్వ ఫలాలు ప్రతి పేదవాడి అందాలనే లక్ష్యానికి అనుగుణంగా పేద మహిళలకు ఇండ్ల నిర్మాణం, వంట గ్యాస్ కనెక్షన్లు, బ్యాంకు అకౌంట్లు ఇవ్వడం, మరుగుదొడ్ల నిర్మాణం, ఆయుష్మాన్ భారత్ కార్డులు వంటి అనేక పథకాల ద్వారా సంక్షేమం అందిస్తున్నామని వివరించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎన్డీయే కు 400 సీట్లు సాధించే లక్ష్యంతో ఇంటింటికీ వెళ్తున్నామన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ కనుమరుగు అవుతున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసి గారడీ మాటలతో ముందుకుపోతున్నదని విమర్శించారు. ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా రాహుల్‌గాంధీ, కేసీఆర్ లాంటివారు బీజేపీని ఏం చేయలేరని స్పష్టం చేశారు. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ డబుల్‌డిజిట్‌ను స్థానాలను గెలువబోతున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు.

టెన్త్ విద్యార్థులకు ఐఐటీ, నీట్‌పై ఉచిత ఆన్‌లైన్ తరగతులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు 30 రోజులపాటు ఐఐటీ, నీట్‌పై ఉచిత ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నట్టు మెటామైండ్ అకాడమి చైర్మెన్ ఎ మనోజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 రోజుల కోర్సులో ప్రముఖ ఐఐటీయన్లు, మేడికోలతో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తామని తెలిపారు. ప్రతిరోజూ పరీక్షను నిర్వహిస్తామని వివరించారు. ప్రముఖ సైకాలజిస్టు సుధీర్ సంద్రతో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 9090898928/9090898902 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎప్‌సెట్‌కు 3.41 లక్షల దరఖాస్తులు

- ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసుకునే అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు రికార్డు స్థాయిలో 3,41,548 దరఖాస్తులొచ్చాయి. ఇందులో తెలంగాణ నుంచి 2,83,570 మంది, ఏపీ నుంచి 57,978 మంది దరఖాస్తు చేశారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే గడువు శనివారంతో ముగిసింది. ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసేకునే అవకాశం మే ఒకటో తేదీ వరకు ఉన్నది. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగానికి 2,46,056 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 95,185 మంది, ఆ రెండు విభాగాలకూ 307 మంది కలిపి మొత్తం 3,41,548 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుం రూ.250తో ఈనెల తొమ్మిది వరకు, రూ.500తో అదేనెల 14 వరకు, రూ.2,500తో ఈనెల 19 వరకు, రూ.ఐదు వేలతో వచ్చేనెల ఒకటో తేదీ వరకు అవకాశముందని వివరించారు. ఈనెల 29 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మే ఏడు నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. మే ఏడు, ఎనిమిది తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రాతపరీక్షలను, తొమ్మిది నుంచి 11 వరకు ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాల కోసం https://eapcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి సూచించారు.

ఎండ @ 44.5 డిగ్రీలు

- ఈ ఏడాది ఇదే అత్యధిక ఉష్ణోగ్రత
- రాష్ట్రంలో మరింత పెరిగిన ఎండలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రోళ్లు పగిలేలా కొట్టే ఎండలు సాధారణంగా మే చివరి మాసంలో కొడతాయి. కానీ, ఈసారి ఏప్రిల్ మొదటి వారంలోనే దంచి కొడుతున్నాయి. గాలిలో తేమ శాతం కూడా బాగా పడిపోయింది. పొద్దస్తమానం ఫ్యాన్లు నడుస్తున్నా..కూలర్లు పెట్టుకున్నా వేడిగాలితో ఇంట్లో ఉండలేనీ, బయట తిరగలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. నల్లగొండ జిల్లా నాంపల్లి, సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గరిమెళ్లపాడులో అత్యధికంగా 44.5 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇదే కావడం గమనార్హం. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎల్బీనగర్, జూబ్లీహిల్స్‌లో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదుకాగా, 26 జిల్లాల్లో 43 డిగ్రీలకుపైగా గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. రాష్ట్రంలో ఆదివారం కూడా కొన్ని జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందనీ, రాత్రి పూట కూడా సాధారణం కంటే వాతావరణం వేడిగా ఉండే సూచనలున్నాయనివాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే, ఆది, సోమవారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.

నాంపల్లి(నల్లగొండ)	44.5 డిగ్రీలు
పెన్‌పహాడ్(సూర్యాపేట)	44.5 డిగ్రీలు
గరిమెళ్లపాడు (భద్రాద్రి కొత్తగూడెం)	44.5 డిగ్రీలు
ఎల్కపల్లి(కొమ్రంభీమ్ ఆసిఫాబాద్)	44.4 డిగ్రీలు
మేడారం(ములుగు)	44.4 డిగ్రీలు
అశ్వాపురం(భద్రాద్రి కొత్తగూడెం)	44.4 డిగ్రీలు
మల్కారం(భద్రాద్రి కొత్తగూడెం)	44.4 డిగ్రీలు
హాజీపూర్(మంచిర్యాల)	44.4 డిగ్రీలు
మరిపెడ(మహబూబాబాద్)	44.4 డిగ్రీలు
తడకమళ్ల(నల్లగొండ)	44.3 డిగ్రీలు

బిల్ కలెక్టర్లకు విద్యుత్ సంస్థలోనే ఉపాధి కల్పించాలి

తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బిల్ కలెక్టర్లకు విద్యుత్ సంస్థలోనే ఇతర ఉపాధి కల్పించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఈశ్వర్ రావు అధ్యక్షతన శనివారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు మాట్లాడుతూ బిల్ కలెక్టర్లందరికీ లేబర్ కమిషనర్ జారీ చేసిన జీవో నెంబర్ 11 ప్రకారం స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. ఒక బిల్లు కట్టించుకుంటే దానిపై రూ.2.51 ఇస్తారని తెలిపారు.

ఏపీఎస్ఈబీ కాలం నుంచి విద్యుత్ సంస్థలో బిల్ కలెక్టర్ల వ్యవస్థ ఉందనీ, ఎన్‌పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ (రెండు డిస్కం)లలో దాదాపు 650 మంది పని చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు జీరో బిల్ సిస్టం పెట్టిన తర్వాత 80 శాతం మంది వినియోగదారులకు బిల్లులు చెల్లించే అవసరం లేకుండా పోయిందని చెప్పారు. మిగిలిన 20 శాతం మంది ఆన్‌లైన్‌లోనే బిల్లులు కట్టుకుంటున్నారని చెప్పారు. దీంతో బిల్ కలెక్టర్లకు ఆర్థిక ఇబ్బదులు తప్పడం లేదనీ, 20 నుంచి 25 ఏండ్లుగా విద్యుత్ సంస్థనే నమ్ముకుని బతుకుతున్న బిల్ కలెక్టర్లు (పీస్ రేట్ ఉద్యోగులు) ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ఈఆర్ఓ లేదా డీఈ కార్యాలయంలో పని చేసేందుకు అవకాశం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. లేకపోతే 650 మంది బిల్ కలెక్టర్ల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆఫీస్ బేరర్ల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించనున్నట్టు తెలిపారు. ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.కుమారాచారి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.స్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రమేష్, నాయకులు జె.బస్వరాజ్, బి.కృష్ణయ్య, లక్ష్మయ్య, రాజేశ్వరి, సోమేష్, ఆశాలత, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ మాజీ ప్రెసిడెంట్ హనుమంతరావు ఆధ్వర్యంలో

జనజాతరకు అంబర్‌పేట నాయకులు



హైదరాబాద్ : పీసీసీ మాజీ ప్రెసిడెంట్ హనుమంతరావు ఆధ్వర్యంలో అంబర్‌పేట నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు తుక్కుగూడలో నిర్వహించిన జనజాతరకు తరలివెళ్లారు. ఈ సభకు వెళ్లిన వారిలో నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, దిద్ది రాంబాబు, పులి జగన్, శంబుల శ్రీకాంత్ గౌడ్, తోలుపునోరి కృష్ణా గౌడ్, జిల్లా వెంకటేష్, అనేగంటి దిలీప్ కుమార్ నేత తదితరులున్నారు. వీరితో పాటు పెద్దఎత్తున కార్యకర్తలు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫోన్ల ట్యాపింగ్ పై సీబీఐ విచారణ జరిపించాలి

- పాత్రదారుల అరెస్టులే కాదు సూత్రదారులెవ్వరో తేల్చాలి : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్
- సమగ్ర విచారణ కోరుతూ గవర్నర్‌కు బీజేపీ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఫోన్ల ట్యాపింగ్‌పై సీబీఐతో విచారణ జరిపించాలనీ, అసలు దోషులెవ్వరో తేల్చాలని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, పార్లమెంట్ బోర్డు మెంబర్, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దేశద్రోహం కంటే తీవ్రమైన ఈ కేసులో పాత్రదారుల అరెస్టుకే పరిమితం కాకుండా సూత్రధారులెవ్వరో తేల్చాలని కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు బీజేపీ నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇజ్రాయిల్ నుంచి టెక్నాలజీని దిగుమతి చేసుకుని ప్రతిపక్ష పార్టీల నేతలు, వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖుల ఫోన్లను ట్యాపింగ్ చేయడం దుర్మార్గమన్నారు. టెలిగ్రామ్ యాక్టు ప్రకారం కేంద్రం అనుమతి లేకుండా ఫోన్ల ట్యాపింగ్ చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఈ కేసులో ఆధారాల్లేకుండా సాఫ్ట్‌వేర్‌ను ధ్వంసం చేసి మూసీ నదిలో పడేశారనేది తేలిందన్నారు. కీలకమైన ఈ కేసు విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ కేసులో పాత్రదారులను అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారనీ, సూత్రధారులను ఎందుకు అరెస్టు చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ధరణి, డ్రగ్స్ మాఫియా, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో దోషులెవ్వరినీ వదలబోమంటున్నారు తప్ప బీఆర్ఎస్ నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. మునుగోడు ఉప ఎన్నికల్లో పోలీసు వాహనాల ద్వారా బీఆర్ఎస్ డబ్బులను చేరవేశారని ఆరోపించారు. ఒకటెండ్రు ఫోన్ల ట్యాపింగ్ జరిగితే తప్పేంటి అని కేటీఆర్ కొట్టిపారేయడం సరిగాదన్నారు. బీఆర్ఎస్‌తో మిలాఖత్ అయ్యి ఈ కేసును కాంగ్రెస్ వదిలినా మేం మాత్రం వదలబోమని స్పష్టం చేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో శాసనమండలి బీజేపీ పక్ష నేత ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి, అధికారి ప్రతినిధి ఎన్వీ సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి

- అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వర్షపు నీరు వథా కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలనీ, ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం అందుకు సన్నద్ధం కావాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశాన్ని ఆమె నిర్వహించారు. వర్షపు నీటి నిల్వ, వినియోగించుకునే విధానం, టెర్రస్ గార్డెనింగ్ ద్వారా వాతావరణంలో ఉష్ణోగ్రతలను తగ్గించుకోవడం, టెర్రస్‌లపై సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో ఆమె సమీక్షించారు. వర్షపు నీరు ఉపయోగించుకుంటే వరద ముంపు, నీటి ఎద్దడి వంటి ప్రధాన సమస్యలను అధిగమించొచ్చని సూచించారు. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో భవనాల నిర్మాణాలు పెరిగిపోవడం వల్ల ప్రతి ఏటా వర్షాకాలంలో కొన్ని కోట్ల లీటర్ల నీరు వథా అవుతుందని అధికారులు వివరించారు. ఒక వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణం గల భవనంలో సుమారు లక్ష లీటర్ల నీరు వథా అవుతుందన్నారు. రాష్ట్రంలో అన్ని చోట్ల ఇంటి యజమానులు వారి ఇండ్ల రూఫ్ టాప్‌లపై వర్షపు నీటిని వడిసిపట్టి వాటిని నిల్వ చేసుకోవడం ద్వారా నిత్యావసర వినియోగానికి, మొక్కల పెంపకానికి ఆ నీరు ఉపయోగపడుతుందని పర్యావరణ నిపుణులు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు. ముందుగా రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో వర్షపు నీరు నిల్వ చేసి, వాటిని వినియోగించుకునే ప్రక్రియను ప్రారంభించాలంటూ సీఎస్ శాంతి కుమారి సూచన మేరకు సమావేశంలో నిర్ణయించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని ప్రభుత్వ సమూదాయాల్లో వర్షపు నీరు నిల్వ కోసం స్టోరేజ్ ట్యాంక్‌ల ఏర్పాట్లు, సోలార్ ప్లాంట్ల ఏర్పాట్లు చేసి, సాధారణ ప్రజానీకానికి కూడా ఆదర్శంగా నిలువలని అధికారులకు సూచించారు. రానున్న వర్షా కాలం సీజన్‌కు సంబంధించి ప్రణాళికలు రూపొందించాలని ఆమె అధికారులను కోరారు. ఏప్రిల్‌లో వెయ్యి మంది ప్లంబర్లకు, వినియోగదారులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్లంబర్లకు శిక్షణ ఇవ్వడం ద్వారా కాలనీ సంక్షేమ సంఘాలకు, ప్రజలకు వర్షపు నీరు వినియోగం, నిర్వహణపై అవగాహన పెరుగుతుందని సమావేశంలో అధికారులు అభిప్రాయపడ్డారు. జీహెచ్‌ఎంసీ ఇతర మున్సిపల్ పట్టణాల్లో కూడా ఈ కార్యక్రమాలు కొనసాగించాలని ఆమె ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ వలన 390 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యిందని అధికారులు వివరించారు. భవిష్యత్ అవసరాల కోసం రాష్ట్రంలో ప్రజలందరూ తమ తమ ఇండ్లలో ఇంకుడు గుంతలు, సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు, రూఫ్ గార్డెనింగ్‌లు ఏర్పాటు చేసుకోవాలనీ, అవగహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలందరూ ఏకమై వర్షపు నీరు వినియోగానికి భాగాస్వామ్యం కావాలని వాణీప్రసాద్ చెప్పారు. విద్యుత్ ఆదా, సోలార్ పరికరాల వినియోగంపై కూడా ప్రజలకు అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.జీహెచ్‌ఎంసీ పరిధిలో 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన 38 వేల భవనాలున్నాయనీ, అందులో 11 వేల భవనాలు తనిఖీ చేశామనీ, 7,883 భవనాలు మాత్రమే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్నాయని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ వివరించారు. నీటి వథాను అరికట్టాల్సిందిగా హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ ఎండీ సుదర్శన్ రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, మున్సిపల్ శాఖ సంచాలకులు దివ్య, హార్టికల్చర్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, వర్షపు నీటి ప్రాజెక్టు డైరెక్టర్ కల్పనా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో ఆరోగ్యానికి చేటు

- మాచన రఘునందన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పొగాకుతో ఆరోగ్యానికి చేటని రిసోర్స్ సెంటర్ ఫర్ టుబాకో కంట్రోల్‌చే టుబాకో కంట్రోల్ స్టాల్‌వర్డ్‌గా గుర్తింపు పొందిన మాచన రఘునందన్ తెలిపారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పొగాకు ఉత్పత్తుల కారణంగా ప్రజల ఆరోగ్యం, ఐశ్వర్యానికి ముప్పు కలగకముందే వాటిని విడిచిపెట్టాలని సూచించారు. అనేక మంది జీవితాలు, కుటుంబాలు ఛిద్రం కావడానికి కారణమైన పొగాకు ప్రతి ఒక్కరు మానేంత వరకు తన కృషి కొనసాగుతుందని ఆయన తెలిపారు. పొగాకును వివిధ రూపాల్లో తీసుకుంటున్న వారు మెరుగైన జీవితం, ఆయుష్షును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గద్దర్ కూతుర్ని విస్మరించడం దుర్మార్గం

- అధికారం రాగానే వేరే అభ్యర్థికి సీటివ్వడం పచ్చిమోసం : దాసోజు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ గద్దర్ కూతుర్ని విస్మరించడం దుర్మార్గమనీ, గత ఎన్నికల్లో ఆమెకు సీటిచ్చి ఇప్పుడు వేరే అభ్యర్థిని ప్రకటించడం పచ్చిమోసం అని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వయోభారంతో అలసిపోయినప్పటికీ పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కష్టకాలంలో పాదయాత్రలు చేసి, ఆడి, పాడి అసువులు బాసిన గద్దరన్నను, వారి కుటుంబాన్ని అవకాశవాదంతో విస్మరించి, అవమానించడం నేరమని విమర్శించారు. సినిమా అవార్డులతో సంతోషపెట్టి, అసలు రాజ్యాధికారం మాత్రం రాకుండా నయవంచన చేయడం న్యాయమా? అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు నేడే పరీక్ష

- అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో మొత్తం సీట్లతోపాటు ఏడు నుంచి పదో తరగతి ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో ఆదివారం ప్రవేశ పరీక్ష జరగనుంది. అదేరోజు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతి, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏడు నుంచి పదో తరగతికి దరఖాస్తు చేసిన అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తామని మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 62,983 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోకుండా అభ్యర్థులు ఎవరైనా ఉంటే telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా వెంటనే వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

అంబేద్కర్ ఓపెన్‌వర్సిటీకి న్యాక్ ఏ గ్రేడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ విశ్వవిద్యాలయానికి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్)కు ఏ గ్రేడ్ గుర్తింపు వచ్చింది. ఈ మేరకు ఆ వర్సిటీ రిజిస్ట్రార్ ఏవీఎన్ రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది జులైలో న్యాక్ బృందం విశ్వవిద్యాలయంలో పర్యటించి అన్ని విభాగాలనూ పర్యవేక్షించి 2.96 పాయింట్లతో బీ ప్లస్ గ్రేడ్ ఇచ్చిందని తెలిపారు. తమకు రావాల్సిన స్థాయిలో పాయింట్లు రాలేదంటూ మళ్లీ అసెస్‌మెంట్ కావాలని న్యాక్‌కు దరఖాస్తు చేశామని పేర్కొన్నారు. దీంతో న్యాక్ కమిటీ ఆరుగురు సభ్యుల బృందంతో మార్చి 21–23 వరకు మళ్లీ అసెస్‌మెంట్ చేశారని వివరించారు. ఆ బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం న్యాక్ పాలక వర్గం శనివారం బెంగుళూరులో సమావేశమై అంబేద్కర్ ఓపెన్ విశ్వవిద్యాలయానికి నాలుగు పాయింట్ల ఫార్ములాలో 3.12 స్కోర్‌తో ఏ గ్రేడ్ కేటాయించిందని వెల్లడించారు. ఏ గ్రేడ్ రావడం పట్ల, అందు కోసం కష్టపడ్డ ఉద్యోగులకు విశ్వవిద్యాలయ వీసీ సీతారామారావు అభినందనలు తెలిపారు.

జగన్ ప్రభుత్వం కూలిపోవడమే నా లక్ష్యం

- పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్ అవినాష్ రెడ్డి ఓడిపోవాలి
- ఐదేండ్లుగా న్యాయం కోసం ఒంటరి పోరాటం
- వివేకానంద రెడ్డిని హత్య చేయించిన వారికి కఠిన శిక్ష పడాలి : డాక్టర్ నర్రెడ్డి సునీత రెడ్డి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రానున్న ఎన్నికల్లో ఏపీ సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూలిపోవడమే తన లక్ష్యమని మాజీ మంత్రి వైఎస్.వివేకానంద రెడ్డి కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీత రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె వైఎస్ కుటుంబ నేపథ్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రానున్న ఎన్నిక ల్లో ఏపీలో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ .అవినాష్ రెడ్డితో పాటు వైఎస్ఆర్ సీపీని చిత్తుగా ఓడిపోవడమే తన లక్ష్యమన్నారు. తమ నాన్న వైఎస్.వివేకానంద రెడ్డిని హత్య చేసిన, చేయించిన వారికి రాజకీయ భవిష్యత్ ఉండకూడ దన్నారు. వారికి కఠిన శిక్ష విధించాలని కోరారు. హత్య చేసిన వారికి చట్ట సభల్లో అడుగుపెట్టే అవకాశం ఉండకూడదన్నారు. తనకు జరిగిన నష్టం, ఆవేదన, బాధ మరొకరికి జరగకూడదనే న్యాయం కోసం ఐదేండ్లుగా ఒంటరిగా పోరాటం చేస్తున్నానని తెలిపారు. తనకు జరిగిన అన్యాయం గురించి ప్రజలకు తెలియజేస్తే వారే ఎన్నికల్లో ఓటు వేసే ముందు తగిన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. జగన్ జైలుకు వెళ్లిన పుడు పార్టీని షర్మిల కాపాడారని, ఎన్నికల్లో గెలిపించారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆమె ఇమేజ్ పెరుగుతుందనే జగన్ పక్కనబెట్టి మోసం చేశారని ఆరోపించారు. కడపలో షర్మిల వెంట ఉంటానన్నారు. న్యాయం కోసం తాను పడుతున్న కష్టాన్ని చూసి కొందరు ఐఏఎస్ అధికారులు, వైసీపీ నేతలు బాధపడిన సందర్భాలు ఉన్నాయ న్నారు. ఐదేండ్లుగా న్యాయం కోసం ఒంటరిగా పోరాటం చేస్తున్నానని, తన పోరాటం వెనుక ఏ పార్టీ, నాయకుడు లేరని స్పష్టం చేశారు. తన ఈ న్యాయ పోరాటంలో ఎన్నో అడ్డంకులు, ఇబ్బం దులను సృష్టిస్తున్నారని వాపోయారు. న్యాయం కోసం పోరాడేందుకు దేవుడు తనకెంతో శక్తిని ఇచ్చారని, తాను కాకపోతే ఇంకెవరు వారికి శిక్ష వేయిస్తారని ప్రశ్నించారు. వివేకానంద రెడ్డిని దస్త గిరి చంపారనేది ఆరోపణ మాత్రమేనని, దస్తగిరి నాలుగో నిందితుడని తెలిపారు. తన తండ్రి హత్య కేసులోని నిందితులు, నేతలను విడిచిపెట్టేది లేదని,తనకున్యాయం జరిగే వరకు ఈ పోరా టం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.



టొబాకోపనిషత్

ఆరెస్బీ



గిరీశం : ఏం వాయ్, మైడియర్ బ్రదిన్లా! ఎడం దవడ ఎర్రవారింది?

వెంకటేశం : నాన్న గూబ గదలేశాడు

గిరీ : ఏం చేశావేంటి?

వెంక : సంధ్య వార్చలేదని!

గిరీ : వార్చినట్టు చెయ్యలేకపోతివో!

వెంక : చూద్దనుకున్నాను.

గిరీ : అనుకోడాలు, గినుకోడాలు జాన్తానై! నన్ను చూడట్లేదా, రోజూ ఎంతసేపు ధ్యానం చేస్తున్నానో! ఒకడు చూస్తాడనుకొన్నప్పుడు, చూడట్లేదనుకొన్నపుడూ మన వేషం ఒకేలా ఉండాలి.

వెంక : ఏమని ధ్యానం చేస్తారేమిటి మీరు?

గిరీ : ఏమనా? నా కంచంలో నాలుగు మెతుకులు ఎప్పుడు పడ్తాయాయనే!

వెంక : అది తప్పు కదండీ? ఎవరైనా దేవుడ్ని ధ్యానం చెయ్యాలి గాని అన్నం కోసమా చేస్తారు?

గిరీ : ఏవందోయ్ నీ ఉపనిషత్తు? "అన్నం బ్రహ్మే తి వ్యజానాత్!" అంటే అన్నమే బ్రహ్మ అని తెలుసుకోవోయ్, వెధవాయా! అని చెప్పింది కదూ! దీన్నే నీ బోటి పామరులకు అర్థం చేయించేందుకు సుళువుగా 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అన్నారు మన పెద్దలు. అమెరికా వాడైనా అన్నం తినేముందు "ఫాధర్! గివ్ అజ్ అవర్ డెయిలీ బ్రెడ్" అనేగా ధ్యానం చేస్తాడు. వాడు రొట్టె ముక్కలు తింటాడు కాబట్టి అలా అడిగాడు. మన 'చమకం'లో ఏమన్నాడూ? "శ్యా మాకాశ్చమే" చామల అన్నం మా మజాగా ఉంటుంది ఓ దేవుడా! నాకు ఇవ్వు! అని కదా ప్రార్థించాలి. నువ్వు దేన్ని తినాలనుకుంటే దాన్ని కలిపి 'చమక' పారాయణం చేయొచ్చు. ఇదే 'రెలిజియస్ రిఫార్మ్!'.

వెంక : నేను చేగోడీలు చమే! గడ్డపెరుగూ చమే! అనచ్చా అండీ!

గిరీ : లోపలే అనుకో! లేకుంటే మీ తండ్రి ఎడ్యుకేషన్ లేకపోవడం వల్లనూ, రీజన్ తెలియకా 'చమకం' పాడు చేస్తున్నాడని నీ చెమ్డాలు తీయొచ్చు! నా మట్టుకు నాకు భారత ప్రధానే ఆదర్శం. టీవీ కేమేరాలు చూస్తున్నాయనుకున్నపుడూ, ఇంట్లోనైనా ఒకే పద్ధతిలో ఉంటుంది ఆయన ధ్యానం. గంధంతో అడ్డపట్టీలు పెట్టుకుని, భూకైలాస్‌లో ఎన్టీఆర్‌లా మధ్యలో శివలింగం లాంటి బొమ్మేయించుకుని ఆయన చేసే ధ్యానం ఎంత రియలిస్టిక్‌గా ఉంటుంది!

వెంక : అలా చేయొచ్చా అండీ!

గిరీ : దటీజ్ ప్యూర్ ఇగ్నోరెన్స్! నీకు మతపరమైన విషయాల్లో బొత్తిగా నాలెడ్జ్ లేదల్లే ఉంది. నేనీ మధ్య అన్ని మతాల ఎస్సెన్స్ తీసి ఒక కొత్త మతం ఏర్పాటు చేశాను. అక్బర్ 'దీన్ ఇల్లాహి' లాగా. దాన్ని అమెరికా నుండే ప్రజ్వలింపజేయాలనుకుంటున్నాను. ఎందుకంటే భారతదేశంలో రెలిజియస్ ఫ్రీడమ్ లేదనే గోల అక్కడ్నించే ఎక్కువ వినబడుతోంది.

వెంక : అద్సరే గానీండి. మొన్న మీరు ఒక శాస్త్రి గారింటి నుండి పొగాక్కట్ట ఎత్తుకొచ్చారు కదా! పాపం చేశారని దేవుడు కోప్పడడా?

గిరీ : పాపాలు, శాపాలు మా ఇంగ్లీషు వాళ్ళకు తగలవు. లేకంటే ప్లాసీ యుద్ధం నుండి మన దేశంలో జరిగిన ఊచకోతలకు ఎన్ని శాపాలు తగలాలి వాడికి. ఒక్క బెంగాల్ కరువులోనే ముప్పయి లక్షల మంది చనిపోయారు కదా! అలాంటి మూఢ నమ్మకాలు పెట్టుకుంటే వాడి రాజ్యం మీద సూర్యుడు ఎప్పటికీ నిలిచేవాడేనా?

ఇక నువ్వన్న పొగాకు కట్ట సంగతి. వెనకటికి మా పిన తండ్రి ఒకాయన చెవి మెలేసి మరీ ఉపనిషత్తులన్నీ భట్టీయం వేయించాడు. దాని పేరేంటో కూడా మరిచిపోయాను. దాన్లో కూడా నీలాంటి శిష్యుడు సందేహాలడుగుతూంటాడు. నా బోటి గురువు వాడి డౌట్లు తీరుస్తూంటాడు. మన సంవాదాన్ని ఎవరైనా తాటాకు మీద రాసి పడేస్తే మరో రెండు వందలేళ్ళకు అదే 'టొబాకోపనిషత్' అయ్యేది. పొగాకు కట్టకి పాపమేమిటోయ్, కాల్చిపారేసేదానికి? పైగా లోకోపకారం కూడా.

వెంక : అదెలాగండీ!

గిరీ : ఎలాగా ? చుట్ట కాలిస్తే భగ్ భగ్‌మని పొగ స్టీమింజన్‌లాగా ఆకాశంలోకిపోయి వర్షమై కురవదా? ప్రభుత్వాలు గనుక ఓటేయడం తప్పనిసరి చేసినా చేయకపోయినా దేశ పౌరులంతా తప్పని సరిగా మన లంక పొగాకుతో చేసిన చుట్టలు కాల్చాలని చట్టం చేస్తే.. గుప్పుగుప్పున పొగ పైకెళ్లి మన దేశం మీంచి వానదేవుడు అసలు కదుల్తాడా? పైగా భారత దేశంలోని నిరుద్యోగ సమస్యను దాదాపు పరిష్కారం చేయగలుగుతాడు మన ప్రధాని.

వెంక : అదెలాగండీ!

గిరీ : 140 కోట్ల మంది కనీసం రోజుకి ఐదు చుట్టలు తాగినా ఏడు వందల కోట్ల చుట్టలవసరం. సగం మందికి చుట్టల కంపెనీల్లో ఉద్యోగాలు, మిగిలిన వారికి పొగాకు పొలాల్లో ఉపాధి! దాంతో ఈ ఎన్నికల్లో మన ప్రధాని బయట పడటం గ్యారంటీ!

డొల్ల విరాళాలు

ఈబీలు కొనుగోలు చేసిన పలు 'షెల్ కంపెనీ'లు

వాటి నుంచి రాజకీయ పార్టీలకు నిధులు

- అత్యధిక మొత్తం అధికార బీజేపీకే
- ఈ కంపెనీల వెనకున్నదెవరో?
- ఈడీ, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలి: మోడీ సర్కారును డిమాండ్ చేస్తున్న మేధావులు, నిపుణులు



న్యూఢిల్లీ : మోడీ సర్కారు తీసుకొచ్చిన వివాదాస్పద ఎలక్టోరల్ బాండ్ల(ఈబీ) పథకం విషయంలో రోజుకో ఆసక్తికరమైన విషయం బయటపడుతున్నది. సాధారణంగా, తన ప్రతిష్టకు భంగం కలిగించే సత్యాలపై స్పందించటం ప్రధాని మోడీకి ఇష్టముండదు. ఈబీ పథకం చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై తన తొలి స్పందనను అందించటానికి ఆయన ఒకటిన్నర నెల సమయం తీసుకున్నారు. ఈబీల ద్వారా "ఎవరు డబ్బు చెల్లిస్తున్నారో.. ఎవరు స్వీకరిస్తున్నారో ఇప్పుడు కనీసం అందరికీ తెలుసు" అని బహిరంగ సభలో చెప్పటం ద్వారా మోడీ.. కోర్టు తీర్పునూ తనకు అనుకూలంగా మల్చుకున్నాడని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇంతకు ముందు ఎవరు ఎవరికి నిధులు ఇచ్చారో ఎవరికీ తెలియదని చెప్తూ తమ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈబీ పథకాన్ని సమర్థించుకునే యత్నం చేశారు.

అయితే, ఈ ఈబీల ద్వారా ప్రధానంగా లాభపడింది బీజేపీ మాత్రమేనన్నది కాదనలేని వాస్తవమని విశ్లేషకులు అంటున్నారు. వివిధ సంస్థల నుంచి ఆ పార్టీకి దేశంలోనే మరే ఇతర పార్టీకి లేనంతగా వేలకోట్ల నిధులు వచ్చి చేరాయి. ముఖ్యంగా, దర్యాప్తులో ఉన్న కంపెనీలు, నష్టాల్లో ఉన్న సంస్థలూ బీజేపీకి నిధులు సమకూర్చటం చర్చనీయాంశంగా మారింది.

33 నష్టాల్లో ఉన్న కంపెనీలు (అనేక అనుమానిత షెల్ కంపెనీలు) రూ.576 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేశాయని 'ది హిందూ' కథనం వెల్లడించింది. అందులో చాలా వరకూ బీజేపీకే నిధుల రూపంలో వెళ్లినట్టుగా తెలుస్తున్నది.

ఎస్బీఐ నుంచి సమాచారం బహిర్గతమైన తర్వాత ఈ కంపెనీల గురించి కీలక సమాచారం అందింది. ఈ కంపెనీలు 2016-17 నుంచి 2022-23 వరకు ఏడేండ్లలో దాదాపు రూ. 1 లక్ష కోట్ల మొత్తం నష్టాన్ని చవిచూసినట్టు తెలిసింది. ఇలాంటి నష్టాల్లో ఉన్న కంపెనీలు ఎలక్టోరల్ బాండ్లను ఎలా కొనుగోలు చేశాయి? ఈ కంపెనీల డైరెక్టర్లు ఎవరు? అసలు ఈ షెల్ కంపెనీల వెనుక ఎవరున్నారు? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇలాంటి షెల్ కంపెనీలపై విచారణకు ఆసక్తి చూపకపోవటం గమనార్హం.

ఎలక్టోరల్ బాండ్స్ కేసు విచారణ సమయంలో ఇలాంటి షెల్ కంపెనీలను నిరోధించేందుకు సవరణలు చేయాలని కూడా సీజేఐ సూచించారు. ఇంత నష్టాల్లో ఉన్న ఈ షెల్ కంపెనీలను నియంత్రించే కీలుబొమ్మలు ఎవరు? భారతీయ ఓటరు ఈ వాస్తవాలను ఎప్పటికైనా తెలుసుకుంటాడా? అని రాజకీయ విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరు డబ్బు చెల్లిస్తున్నారో, ఎవరు స్వీకరిస్తున్నారో ఇప్పుడు అందరికీ తెలుసునన్న మోడీ వాదనను వట్టి మాటేనని దీనిని బట్టి అర్థమవుతున్నదని వారు అంటున్నారు.

నష్టాల్లో ఉన్న డొల్ల కంపెనీల వెనుక ఉన్న అసలు దాతలను కనిపెట్టటంపై మోడీ ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్టయితే, ఈ కంపెనీల డైరెక్టర్లను ప్రశ్నించాలని ఈడీ, సీబీఐలను కోరేదని అంటున్నారు. అయితే, వేల కోట్ల నిధులను స్వీకరించిన అధికార బీజేపీ సర్కారు మాత్రం అంత ధైర్యం చేయదని వారు అంటున్నారు.

ఎలక్టోరల్ బాండ్ల పథకం ప్రకటించిన తర్వాత అనేక షెల్ కంపెనీలు సృష్టించబడినట్టు కొన్ని వార్త కథనాలను బట్టి తెలుస్తున్నది. మూడు సంవత్సరాల ఉనికి రికార్డు కలిగిన ప్రస్తుత కంపెనీలు మాత్రమే బాండ్ కొనుగోళ్లలో పాల్గొనవచ్చని ఈబీ పథకం నిబంధన. అయితే, ఈ నిబంధనను కూడా తీవ్రంగా ఉల్లంఘనకు గురైందనీ, దీనిపై కూడా ప్రత్యేక విచారణ అవసరమని రాజకీయ విశ్లేషకులు, మేధావులు, నిపుణులు అంటున్నారు. "నేను తినను.. ఇంకొకరిని తిననివ్వను" అని అవినీతిపై సహించేది లేదనే మోడీ.. ఇలాంటి కంపెనీలపై ప్రత్యేక దర్యాప్తు జరిపించాల్సిన అవసరం ఉన్నదని డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీ ఆటలు సాగనివ్వం

మతతత్వ రాజకీయాలను అనుమతించం

ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్క సీటునూ గెలవకుండా చూస్తాం : కేరళ సీఎం పినరయి విజయన్



తిరువనంతపురం : కేరళలో బీజేపీ మతతత్వ రాజకీయాలపై ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్ హెచ్చరికలు పంపారు. ఆ పార్టీ ఆటలు రాష్ట్రంలో సాగనివ్వబోమని చెప్పారు. కాషాయపార్టీ మతతత్వ రాజకీయాలను వామపక్షాలు అనుమతించబోవని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాషాయ పార్టీ ఒక్క సీటు కూడా గెలవకుండా చూస్తామని విజయన్ అన్నారు. దేశానికి, ప్రజలకు సంఘ్ పరివార్ విసురుతున్న సవాళ్లను వామపక్షాలు అధిగమిస్తాయనీ, వారిని అధికారం నుంచి తరిమికొట్టేందుకు కృషి చేస్తాయని మీడియా సమావేశంలో విజయన్ చెప్పారు. " బీజేపీని అధికారం నుంచి దించాలనే లక్ష్యంతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం. అందుకే జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక ఫ్రంట్‌లో చురుకుగా చేరాం. మేము ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాం. బీజేపీ మొత్తం 20 స్థానాల్లో(కేరళలో) ఓటమిని చవిచూడటమే కాదు.. ఈసారి ఏ నియోజకవర్గంలోనూ రెండో స్థానం దక్కించుకోలేకపోతుంది" అని విజయన్ అన్నారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయనీ, కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ప్రయోజనం లేదని ఆయన అన్నారు.

"గత ఐదేండ్ల అనుభవంతో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయడం వల్ల ప్రయోజనం లేదని ప్రజలు అర్థం చేసుకున్నారు. దేశంలో ప్రమాదకర విధానాలను అమలు చేస్తున్న బీజేపీని గద్దె దించేందుకు వామపక్షాలు ప్రజల నుంచి ఓట్లు అడుగుతున్నాయి" అని విజయన్ చెప్పారు. మతతత్వ ఫాసిస్టులతో పోరాడిన చరిత్ర వామపక్షాలకు ఉన్నదన్నారు. కొన్ని ఓట్ల కోసం తాము తమ రాజకీయాలను మార్చుకోబోమని విజయన్ స్పష్టం చేశారు. కేరళలోని 20 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 26న ఎన్నికలు జరగనుండగా, జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఇక్కడ ప్రధానంగా అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్), యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్)ల మధ్య పోటీ ఉన్నది.

డబ్బులు ఎవరికి వెళ్లాయి?

ఫోన్ ట్యాపింగ్ కేసులో కూపీ లాగుతున్న పోలీసులు


రాధాకిషన్‌రావును లోతుగా ప్రశ్నిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు బృందం తాము స్వాధీనం చేసుకున్న డబ్బులను ఎవరికి పంపిణీ చేశారనే విషయమై దర్యాప్తు అధికారులు ఒక్కటొక్కటిగా కూపీ లాగుతున్నారు. గత ఉప ఎన్నికలు మొదలుకొని అసెంబ్లీ ఎన్నికల వరకు ఎంత మందిని ట్రాప్ చేసి రాధాకిషన్‌రావు బృందం డబ్బులను స్వాధీనపర్చు కుందనే విషయమై ఒక జాబితాను కూడా స్పెషల్ టీం అధికారులు రూపొందిస్తున్నట్టు తెలిసింది. తమ కస్టడీలో ఉన్న రాధాకిషన్‌రావును మూడో రోజు విచారణలో ఈ అంశంపైనే ఎక్కువగా దృష్టి సారించినట్టు తెలిసింది. ప్రధానంగా, ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు ఇచ్చిన ఫోన్ నెంబర్లేగాక తన వైపు నుంచి కూడా ఎంత మంది ఫోన్లను ట్యాప్ చేసి వారి నుంచి డబ్బులను సీజ్ చేసింది తెలుసుకోవటానికి స్పెషల్ టీం అధికారులు ప్రత్యేకంగా దృష్టిని సారించారు. ఈ విషయంలో గతంలో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, డీఎస్పీ ప్రణీత్‌రావు విచారణల సందర్భంగా బయటపడిన సమాచారాన్ని ఇప్పుడు రాధాకిషన్‌రావు ఇస్తున్న సమాచారంతో క్రోడీకరించి దర్యాప్తును ముందుకు సాగిస్తున్నట్టు తెలిసింది. ఈ కేసులో మరికొందరి పోలీసుల పేర్లను కూడా రాధాకిషన్‌రావు బయటపెట్టటంతో వారిని కూడా విచారించటానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. మొత్తమ్మీద, డీసీపీ స్థాయి అధికారైన రాధాకిషన్‌రావును క్షుణ్ణంగా విచారించటం ద్వారా.. ఈ కేసులో మిగిలిపోయిన అంశాలు కూడా వెలుగులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. కాగా, రాధాకిషన్‌రావు డబ్బు పంపిణీ జరిపిన వ్యక్తులను గుర్తించి వారి నుంచి కూడా సమాచారాన్ని సేకరించటానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

వేటాడి..వేధించటానికే... సీపీఐ(ఎం) ఖాతా నిలువరింత

త్రిస్సూర్ జిల్లా కమిటీ బ్యాంక్ ఖాతాను స్తంభింపచేసిన ఐటీ అధికారులు



తిరువనంతపురం : కేరళలోని త్రిస్సూర్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ప్రయోజనార్థం.. సీపీఐ(ఎం) త్రిస్సూర్ జిల్లా కమిటీ బ్యాంక్ ఖాతాను ఆదాయపన్ను శాఖ అధికారులు స్తంభింపచేశారు. పార్టీకి ఈ మేరకు నోటీసులు జారీ చేశారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంజి రోడ్‌లోని జిల్లా కమిటీ అకౌంట్‌ను స్తంభింపచేసినట్లు ఆ నోటీసులో తెలియచేశారు. దానికి గల కారణమేంటనేది ఆ నోటీసులో వారు వివరించలేదు. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఎలాంటి లావాదేవీలు జరగరాదని ఆ నోటీసు పేర్కొంది.

ఈ ఖాతా వివరాలు పరిశీలించేందుకు శుక్రవారం రాత్రి ఐటీ అధికారులు బ్యాంక్ ఎంజి రోడ్ బ్రాంచికి చేరుకున్నారు. అదే సమయంలో జిల్లా కమిటీ కార్యదర్శిని కూడా బ్రాంచికి రావాల్సిందిగా పిలిపించారు. అంతకుముందు రోజే కోచిలో జిల్లా కార్యదర్శి ఎం.ఎం.వర్గీస్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇంటరాగేట్ చేశారు. కరవన్నూర్ సర్వీస్ కో ఆపరేటివ్ బ్యాంక్‌కు సంబంధించిన సమస్యలకు సంబంధించి ఇంటరాగేషన్ జరిగింది. ఖాతా వివరాలను ఐటీ అధికారులు అడిగి తెలుసుకున్నారు.

ఐటీ శాఖ చర్యలపై సీపీఐ(ఎం) ఖండన

ప్రతి సంవత్సరం పార్టీ ఆదాయం, ఖర్చుల వివరాలను ఆదాయపన్ను శాఖకు, ఎన్నికల కమిషన్‌కు సీపీఐ(ఎం) అందచేస్తుందని ఆ ప్రకటన పేర్కొంది. అలాగే త్రిస్సూర్ జిల్లా కమిటీ అకౌంట్ వివరాలను కూడా తెలియచేశామన్నారు. ముందస్తు సమాచారం, ఎలాంటి వివరణ లేకుండా అకౌంట్‌ను స్తంభింపచేశారని కార్యదర్శివర్గం విమర్శించింది.

త్రిస్సూర్ జిల్లాలోసహకార బ్యాంకులకు సంబంధించిన సమస్యలపై పార్టీ నిర్దిష్ట వైఖరి తీసుకుంటూ వస్తోందని తెలిపింది. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాలను, ప్రతిపక్ష పార్టీలను వెంటాడి, వేధించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానంలో భాగమే ఈ చర్యలని కార్యదర్శివర్గం విమర్శించింది. ఈ ఎన్నికల క్రమంలో మరింత చురుకుగా పాల్గొనాల్సిందిగా, ఈ విధానాలపై పోరాడాల్సిందిగా కేరళ ప్రజలను కార్యదర్శివర్గం ఆ ప్రకటనలో కోరింది.

11న ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

పోస్టర్ ఆవిష్కరణలో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఈనెల 11న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణలు, సభలు, సమావేశాలు గ్రామ, మండల, జిల్లా కేంద్రాల్లో నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాద్‌రావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, నాయకులు టి కిషోర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ 1936, ఏప్రిల్ 11న ఏఐకేఎస్ ఏర్పడిందని చెప్పారు. జాతీయోద్యమంలో భాగంగా ఆవిర్భవించిన ఏఐకెఎస్ ఒకవైపు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూనే మరోవైపు జమీందార్లు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా సంస్థానాల్లో పోరాటాలను నిర్వహించిందని గుర్తు చేశారు. అర్హులైన పేదలకు భూమి దక్కాలనీ, కౌలు రేట్లు తగ్గించాలనీ, గ్రామీణ ప్రాంతాల్లో సాగు చేస్తున్న రైతుల రుణాలను మాఫీ చేయాలనీ, అనేక ప్రాంతీయ డిమాండ్లను తీసుకుని నిరంతరం పోరాటాలు నిర్వహించిందన్నారు. స్వామి సహజానంద సరస్వతి మొదటి అధ్యక్షునిగా, ఎన్‌జి రంగ కార్యదర్శిగా ఈ సంఘం ఆవిర్భవించిందని చెప్పారు. ఆవిర్భావ కాలంలోనే ఈఎంఎస్ నంబూద్రిపాద్, సుందరయ్య లాంటి అనేక మంది జాతీయోద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈనెల 11న దేశవ్యాప్తంగా కిసాన్ సభ జెండాలను ఆవిష్కరించి అదే సందర్భంలో సభలు, సమావేశాల ద్వారా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాన్ని బహిర్గతం చేయాలన్నారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆ చట్టాలను వెనక్కి తీసుకుంటూనే చాపకింద నీరులా కేంద్రం అమలు చేయడానికి పూనుకుంటున్నదని విమర్శించారు.

విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టిందన్నారు. ప్రజానీకానికి నష్టం చేసే విధానాలను కేంద్రం అవలంభిస్తున్నదని చెప్పారు. ఎన్నికలు జరుగుతున్న ఈ సందర్భంలో రైతు రుణాల గురించి మాట్లాడటం లేదన్నారు. కనీస మద్దతు ధరల చట్టం గురించి మాట్లాడటం లేదని అన్నారు. కలిసొచ్చే రైతు సంఘాలను కలుపుకుని ఆందోళనా పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ ధ్యేయం సమన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

చేసి, రైతులకు మాత్రం ఒక్క రూపాయీ మాఫీ చేయలేదని గుర్తుచేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ)కి చట్టబద్ధ హామీ, రుణమాఫీ అమలు చేస్తామని చెప్పారు. డాక్టర్ ఎమ్ఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ఫార్ములా ప్రకారమే రైతులకు లబ్ధి చేకూరుస్తామని వివరించారు. శ్రామిక్ న్యాయ్‌లో భాగంగా కార్మికులకు కనీస వేతనాలు తెస్తామనీ, ఉపాధి హామీ కింద రోజుకు రూ.400 ఇస్తామనీ, ఇతర పనులనూ ప్రకటిస్తామని తెలిపారు. దేశంలో 50 శాతం జనాభా వెనుకబడిన తరగతులకు చెందినవారు ఉన్నారనీ, వారిలో 15 శాతం దళితులు, 8 శాతం గిరిజనులు, ఆదివాసులు, 15 శాతం మైనార్టీలు, 5 శాతం నిరుపేదలు జనరల్ కేటగిరిలో ఉన్నారని చెప్పారు. ఈ కేటగిరిలోకే 90 శాతం జనాభా వస్తారనీ, కానీ వీరెవరూ ఏ వ్యవస్థలోనూ వ్యవస్థలో కనిపించరని అన్నారు. మీడియా కంపెనీ యజమానుల్లో ఎవరూ వెనుకబడిన తరగతుల వారు లేరనీ, అదే పరిస్థితి ఇతర కంపెనీల్లోనూ ఉందన్నారు. దేశాన్ని 90 మంది ఐఏఎస్‌లు నడుపుతుంటే, వారిలో కేవలం ముగ్గురు మాత్రమే బీసీలు ఉన్నారనీ, కానీ జనాభాలో వారు 50 శాతంగా ఉన్నారని విశ్లేషించారు. గిరిజనుల్లో ఒక్క ఐఏఎస్, ముగ్గురు దళితులు మాత్రమే ఉన్నారని చెప్పారు. బడ్జెట్‌లో వంద రూపాయల ఖర్చులో కేవలం రూ.6 మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీ అధికారుల కోసం ఖర్చు చేస్తున్నారనీ, సంపద సమానంగా పంపిణీ జరగట్లేదని అభిప్రాయపడ్డారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తెలంగాణ తరహాలో దేశంలోనూ కుల గణన చేపడతామనీ, దేశాన్ని ఎక్స్‌రే తీసి, ఆర్థిక సంస్థల సర్వే చేసి పాలు-నీళ్ల వేర్వేరు చేస్తామన్నారు. దేశ సంపద ఏ వర్గం చేతిలో ఉన్నదో నిగ్గు తేలుస్తామని హెచ్చరించారు. విప్లవాత్మక మార్పులు తెస్తూ, ప్రజల హక్కుల్ని వారికే ఇస్తామని చెప్పారు. మీడియా, బ్యూరోక్రసీ, దేశంలోని అన్ని సంస్థల్లో జనాభా ప్రాతిపదికన ఎవరి వాటా వారికి దక్కేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మాజీ సీఎం ప్రభుత్వాన్ని ఎలా నడిపారో ప్రజలకు తెలుసనీ, వేలాదిమంది ఫోన్లు ట్యాపింగ్ చేసి, బ్యాంకులు, ఇంటలిజెన్స్, పోలీస్ వ్యవస్థల్ని దుర్వినియోగం చేశారన్నారు. ప్రభుత్వం మారగానే ఆ డేటా మొత్తం ధ్వంసం చేశారని అన్నారు. గత ప్రభుత్వంలో ప్రజల్ని భయపెట్టి, సమాజాన్ని ఆందోళనలోకి నెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో మాజీ సీఎం చేసిన పనులనే ఢిల్లీలో నరేంద్రమోడీ ప్రభుత్వం కూడా చేస్తున్నదని ఆరోపించారు. ఈడీ బలవంతపు వసూళ్ల సంస్థగా మారిందన్నారు. బీజేపీ దేశంలోనే అతిపెద్ద వాషింగ్ మెషిన్‌ను నడిపిస్తున్నదనీ, ఎన్నికల కమిషన్‌లో కూడా తన వ్యక్తుల్ని పెట్టారని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్స్ ప్రపంచంలోనే అతిపెద్ద కుంభకోణమనీ, పైసలు ఇచ్చి పనులు తీసుకొనేలా వ్యవస్థను మార్చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఐ ఎప్పుడైతే ఏ సంస్థను భయపెడుతుందో, అదే నెల ఆ కంపెనీ ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో బీజేపీకి డబ్బు చెల్లిస్తుందనీ, దేశంలో మౌలిక వసతుల కల్పన కాంట్రాక్టుల్ని ఇలాంటి వారికే ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ బీ టీంను ఓడించామనీ, ఇప్పుడు దేశంలో 'ఏ' టీంను ఓడిస్తామని స్పష్టం చేశారు. రాజ్యాంగం దేశ ప్రజలకు రక్షణ కల్పిస్తుందనీ, బీజేపీ ఆ రాజ్యాంగాన్నే మార్చే ప్రయత్నం చేస్తున్నదనీ, కానీ అలా జరగనివ్వబోమని స్పష్టం చేశారు. తమది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనే ప్రయత్నమని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోడీ 3, 4 శాతం ఉన్న పెద్దల కోసమే పనిచేస్తున్నారనీ, ఆయన దగ్గర మీడియా, సీబీఐ, ఈడీ వంటివి ఉన్నాయన్నారు. తమ దగ్గర కేవలం ప్రజల ప్రేమ, ఆశీస్సులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ ఇస్తామనీ, వారి కో ఆపరేటివ్ సొసైటీలకు తక్కువ ధరకు రుణాలు ఇప్పిస్తామని చెప్పారు. యువకులు, మహిళలు, రైతులు, కూలీలు, వెనుకబడిన తరగతులవారి కోసం మరో ఐదు హామీలు ఉన్నాయనీ, ఇది దేశ ముఖచిత్రాన్ని మారుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మ్యానిఫెస్టో దేశ ప్రజల ఆత్మ అనీ, వారి బాధలు విని దీన్ని రూపొందించామని చెప్పారు. తనకు, ప్రజలకు ఉన్నది కేవలం రాజకీయ సంబంధం మాత్రమే కాదనీ, ప్రేమ ఆత్మీయతలతో కూడిన కుటుంబ సంబంధమని అన్నారు. సోనియాగాంధీ తెలంగాణ ప్రజలకు తోడుగా నిలిచారనీ, ఢిల్లీలో తానూ ప్రజల కోసం పోరాడే సైనికుడిగానే ఉంటాననీ, రాష్ట్రంలో చిన్న పిల్లలు పిలిచినా మీకోసం వచ్చేస్తానని భరోసా ఇచ్చారు. తాను బతికున్నంతకాలం మీ ముందే ఉంటాననీ, సేవ చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందనీ, మాజీ సీఎం కేసీఆర్ ఇక్కడి ప్రజల కలల్ని కాలరాసారని విమర్శించారు. దేశానికి తెలంగాణ దారి చూపాలనీ, అందరం ఒక్కటై కలిసి పనిచేద్దామన్నారు. మేడిన్ తెలంగాణ అనే బ్రాండ్ మేడిన్ చైనా కంటే పెద్దగా కావాలనీ, అదే తరహాలో మేడిన్ రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రావాలని ఆకాంక్షించారు. బీజేపీ దేశంలో విద్వేషాన్ని నింపుతోందనీ, మతాల మధ్య కొట్లాటలు పెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కానీ రాష్ట్రంలో ప్రజలంతా ప్రేమతో కలిసిమెలిసి ఉంటారనీ, ఇదే సందేశం రాష్ట్రం నుంచి దేశానికి వెళ్లాలని ఆకాంక్షించారు.



కొత్త పాట

భారతీయ భిన్న సాంస్కృతిక విలువలకు తిలోదకాలిస్తూ భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తిని తుంగలో తొక్కుతూ హిందూత్వ రాష్ట్రంగా ప్రకటించాలని ఉవ్విళ్లూరుతున్న వీరు వారసత్వం గురించి వల్లిస్తున్నారు. ఎంత విచిత్రం! ఇంకా ఏమన్నారు తెలుసా! 'ఇంకా నయం ఇడ్లీ, దోసెలను రాజకీయం చేయలేదు, చేసుంటే అవి తమిళనాడుకే పరిమితమయ్యేవి' అన్నారు. భిన్నమైన, ప్రాంతీయ ఆహారపు అలవాట్లను గౌరవించే గుణ సంపన్నత ఉన్న మనిషా ఈయన? బీఫ్ తింటున్నారని కొట్టి చంపే మూకకు నాయకుడిగా ఉండి, మాంసాహారులనే మంద బుద్ధులని ప్రచారం చేసే సన్నాసులకు వత్తాసు పలికే గొంతు ఆహారపు వారసత్వాన్నీ మాట్లాడ టమా! ఎంత నిస్సిగ్గుతనం! ఏ ఎండకా గొడుగు పట్టే లక్షణమంటే ఇదే మరి!

ఎన్నికలల విహారంలో ఎన్నో కొత్తగా కనిపిస్తుంటాయ్, మరెన్నో కొత్తగా వినిపిస్తుంటాయి. ఏం చేస్తాం వినకతప్పదు. కలల విహారంలో కళల సోయగాలు కనకతప్పదు. ఎన్ని చివుళ్ల గొంతుదిగినా వసంత కాలాన కోయిల గొంతుమారదు. ఎన్ని పండ్లు ముక్కు కొరికినా చిలుక పలుకూ మారదు. వేపపువ్వు చేదుమారదు. మామిడి పండు మధురమూ మారదు. సంధ్య ఎరుపు తరగదు. జాబిలి తెలుపు మలగదు. ఎందుకంటే ఇవి ప్రకృతి ధర్మ నియమాలు. కలుష రహిత గుణాలు. ఇక మారే గొంతు ఒక్క మనిషి సొంతమే. అదికూడా అవసరార్థమై నానా విధ విన్యాసాలకు పాల్పడే నాయకమన్యుల కొత్త గొంతులు వింతపాటలు వినిపిస్తుంటారు. కోరికలు నెరవేర్చుకునేందుకు కొత్త పాటలూ ఎత్తుకుంటారు. వసంతకాలం గనక కోయిలల తీయని గానాలతో పాటు, మనకు ఎన్నికల పుణ్యాన నాయకుల కొత్తపాటలూ చెవిన మోగుతున్నాయి. పాటలు హాయిగా అనిపించినా కొత్తపాటని, విని తరించినా ఏమీ ఫర్వాలేదు. కానీ పాటెందుకు మారిందో అందులోని మర్మమేమిటో తెలుసుకోలేకపోతే మోసపోతాం, మొసలి కన్నీటికి కరిగిపోతాం!

సార్వత్రిక ఎన్నికల వేల పదేండ్లుగా కడుపునిండా మింగించిన నాయకుడు, దాని రుచి ఇంకా జనానికి తెలియనట్టు తిరిగి చెబుతున్నాడు. మొన్న తమిళనాడుకు ప్రచారానికి వచ్చిన మోడీ తోడిరాగంలో కొత్త పాటను వినిపించాడు. పాపం ఛానెల్‌వాళ్లు రికార్డు చేసి మరీ రిలే చేశారు. నాకు తమిళ భాషంటే ఎంతో ఇష్టం, నేను తమిళం నేర్చుకుంటా, ఐక్యరాజ్య సమితిలో తమిళంలో మాట్లాడతానని ప్రతిజ్ఞ చేశారు. అంతేకాదు ఇంతవరకు తమిళ భాషకు అన్యాయం జరిగిందని, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తమిళభాష భారతదేశంలో ఉందన్న విషయాన్ని ప్రపంచానికి చెప్పలేక పోయాం. గర్వపడలేక పోయాం. రాజకీయాల వల్లే ఈ భాషను విస్తరించలేక పోయామని తెగ ఆవేదన చెందారు మన మోడీ గారు. ఇవి మొసలి కన్నీరులా ఉందని అంటే కాదని ఎవరైనా అనగలరా! ఈయనగారి పాలనలోనే, ఇంకా ఆ సంఘటనల జ్ఞాపకాలు పచ్చిపచ్చిగానే ఉన్నాయి. తమిళ ఉద్యోగులను హిందీలో మాట్లాడాలని ఒత్తిడి తెచ్చి భారతీయులు కాదా మీరని అవమానించిన వాళ్లు తమిళ భాష గొప్పతనాన్ని పొగడడమా! దేశం మొత్తంలో ఒకే మతం, ఒకే పన్ను, ఒకే భాష అనే నినాదాన్ని ఇస్తూ, హిందీ భాషని దక్షిణ భారతంపై బలవంతాన రుద్దే ప్రయత్నం చేసింది ఎవరు? దక్షిణాది ప్రాంతీయ భాషల ప్రాధాన్యతను గుర్తించ నిరాకరించింది ఎవరు? మోడీగారి ప్రభుత్వం కాదా! తమిళభాషా ఔన్నత్యాన్ని, దాని వారసత్వాన్ని పోరాడి నిలుపుకుంటున్నది అక్కడి తమిళ ప్రజలే. అక్కడే కాదు, కన్నడ, మళయాల, తెలుగు ప్రజలు కూడా హిందీ భాషాధిపత్య రాజకీయాలను తిప్పికొట్టారు. రాజకీయంగా ఉద్యమించారు కనుకనే భాషా సంస్కృతిని వారసత్వంగా నిలుపుకున్నారు. తమిళభాషా ఘన వారత్వాన్ని ప్రపంచమంతటా చెప్పుకోవాలనీ ప్రధాని సెలవిచ్చారు. భారతీయ భిన్న సాంస్కృతిక విలువలకు తిలోదకాలిస్తూ భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తిని తుంగలో తొక్కుతూ హిందూత్వ రాష్ట్రంగా ప్రకటించాలని ఉవ్విళ్లూరుతున్న వీరు వారసత్వం గురించి వల్లిస్తున్నారు. ఎంత విచిత్రం! ఇంకా ఏమన్నారు తెలుసా! 'ఇంకా నయం ఇడ్లీ, దోసెలను రాజకీయం చేయలేదు, చేసుంటే అవి తమిళనాడుకే పరిమితమయ్యేవి' అన్నారు. భిన్నమైన, ప్రాంతీయ ఆహారపు అలవాట్లను గౌరవించే గుణ సంపన్నత ఉన్న మనిషా ఈయన? బీఫ్ తింటున్నారని కొట్టి చంపే మూకకు నాయకుడిగా ఉండి, మాంసాహారులనే మంద బుద్ధులని ప్రచారం చేసే సన్నాసులకు వత్తాసు పలికే గొంతు ఆహారపు వారసత్వాన్నీ మాట్లాడటమా! ఎంత నిస్సిగ్గుతనం! ఏ ఎండకా గొడుగు పట్టే లక్షణమంటే ఇదే మరి!

అసలు మన అధినాయకుని కొత్త పాటకు కారణమేమో తెలుసు కోవటం చాలా అవసరం. ఉత్తర భారతంలో ఎట్లాగూ ఎన్నికల్లో సీట్లు తగ్గుతాయనేది స్పష్టమయిన విషయం. ఇక ఉన్నదొక్కటే ఆశ. గతం నుండి కాలు మోపనీయని దక్షిణాది, ముఖ్యంగా తమిళనాడులో కొన్నయినా సీట్లు పొందాలన్న ఆశ తప్ప మరేమీ కాదు. అందుకు తమిళ సెంటిమెంటును పండించే బృహత్ నాటకానికి నాందీ వచనం పలుకుతున్నారు మోడీగారు. భావోద్వేగాలను రెచ్చగొట్టటం వీరికి కొత్తేమీ కాదు కదా! అందుకే తమిళ భాష, ఇడ్లీ, దోశ గుర్తుకొచ్చాయి వీరికి, సాధారణంగా పరిపాలకులు పదేండ్లుగా ప్రజలకు ఏమిచేశానో ఎంత అభివృద్ధి చేశానో, చెప్పి ఓట్లడుగుతారు. అవేమీ లేవు గనక, సెంటిమెంటు నెత్తుకున్నది ఎన్నికల కోకిల. అంతేకాదు, కచ్చతీవు ద్వీపాన్నీ పదేండ్లుగా మాట్లాడని, పరిష్కరించని అంశాన్ని రాజకీయం చేసే పనికి పూనుకుంటున్నారు. దాని ద్వారా ఓట్లు దండుకోవాలనే ఆశ తప్ప ప్రజల మేలు కోరుకోవడమేమీ లేదు. తమిళనాడు ప్రభుత్వం, తమ ప్రజల కోసం చేసిన చట్టాలను, తమ గవర్నరు ద్వారా ఆమోదం పొందకుండా నిలుపుదల చేసిన తీరు ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. కోర్టులు, వీరు తమ ప్రతినిధులుగా నియమించిన గవర్నర్లను తప్పుబడుతూనే ఉన్నారు. కేరళలోనూ అంతే చేస్తున్నారు. అయినా దక్షిణాది ప్రజల కోసం తెగ ఆవేదన చెందే నటనా, ఎత్తుకున్న పాటా ఎంత ఎబ్బెట్టుగా ఉందో జనం గమనిస్తూనే ఉన్నారు.

సంపాదకీయం

మోడీ బిల్డప్‌నే మోయడం అవసరమా?



తెలకపల్లి రవి

జానపద కథల్లో శక్తులన్నీ కలిసి ఎవరికో పట్టం కట్టాలని చూసినట్టు భారతదేశంలో, పాలక వ్యవస్థలన్నీ కలిసి నరేంద్రమోడీ బీజేపీప్రభుత్వాన్ని మూడోసారి ప్రతిష్టించడానికి పథకాలు వేస్తున్నాయి. ఎన్నికలలో ఓటు వేసి గెలిపించవలసిన ప్రజలను మానసికంగా సిద్ధం చేయాలను కుంటున్నాయి. నిజానికి మోడీని ఢిల్లీలో తీసుకొచ్చిన మొదటి రోజు నుంచి ఈ వ్యూహం వుంది. ఇప్పుడు ఆయన మూడవసారి అధికారంలోకి రావడం అనివార్యమని మోత పరమార్థం అదే. ఎలాగూ గెలిచే మోడీని ఎదుర్కోవడం వృథా అని నూరిపోయడం అందులో భాగమే. తెలుగునాట సీనియర్ మాజీ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు కూడా అదే తరహాలో మోడీని మోయడం అనివార్యమని నమ్ముతూ ఆ ప్రచారానికి ఊతమిస్తున్నారు. గత పదేండ్ల నుంచి మోడీకే వత్తాసునిస్తున్న ముఖ్యమంత్రి జగన్ కూడా బీజేపీ జోలికిపోకుండా తనవంతు సహాయం అందిస్తున్నారు. ఇక తెలంగాణలో ఓటమిపాలైన మాజీ సీఎం కేసీఆర్ కూడా కాంగ్రెస్‌నే ఏకైక శత్రువుగా భావిస్తూ బీజేపీకి పరోక్షంగా సహకరిస్తున్నారు. జాతీయ మీడియా దాదాపుగా మోడీయాగా మారిపోగా తెలుగు మీడియా కూడా ప్రాంతీయంగా తమకు నచ్చినవారికి మద్దతిస్తూ జాతీయ స్థాయిలో బీజేపీకి అనుకూలమైన రాగాలే వినిపిస్తున్నది. ఏతావాతా బీజేపీ హ్యాట్రిక్ విజయం గురించి వారికన్నా ఎక్కువగా ఈ శక్తులు ప్రచారం చేస్తున్నాయి. వామపక్షాలుగానీ, బీజేపీ ఎన్డీఏకు వ్యతిరేకంగా ఏర్పాటైన 'ఇండియా' దండగమారి ప్రయత్నమనీ, వామపక్షాలు ఏదో సైద్ధాంతికంగా వ్యతిరేకించడం తప్ప చేయగలిగింది లేదనీ అహోరాత్రులు అపహాస్యం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలుగా పోరాడటం సహజంగా జరుగుతుందనే కనీస ప్రజాస్వామిక సంప్రదాయాన్ని కూడా భరించలేకపోతున్నాయి.

రాజకీయ ప్రత్యామ్నాయాల నేపథ్యమేమిటి?


నిజంగానే ఇది చాలా విడ్డూరమైన పరిస్థితి.దేశ విదేశాలలోని గుత్తాధిపతులకు మోడీ రాకకోసం ఎందుకంత పరితపిస్తున్నారనేది ఆలోచించవలసిన అంశం. గతంలో కాంగ్రెస్ అవిచ్ఛిన్నంగా ముప్పై ఏండ్లు దేశాన్ని పాలించింది.ప్రతిపక్షాలకు చాలా తక్కువ సీట్లే వుండేవి.బెంగాల్, కేరళ, తమిళనాడు, పంజాబ్ వంటిచోట్ల తప్ప బలమైన ప్రత్యామ్నాయ పక్షాలు కూటములు కూడా వుండేవి కావు. అయినా ప్రతి ఎన్నికలోనూ కాంగ్రెస్‌ను ఓడించేందుకు విస్తారమైన ప్రయత్నం జరిగేది. అందుకు గల అవకాశాలకు తగినట్టు వేదికలను ఏర్పాటు చేయడం జరుగుతుండేది. ఆ క్రమంలోనే 1957లో కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వాన తొలి కాంగ్రెసేతర కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. 1967నాటికి ఎనిమిది రాష్ట్రాలలో కాంగ్రెసే తర ప్రభుత్వాలొచ్చాయి. 1977లో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ తర్వాత ప్రతిపక్షాల ఐక్యత దాన్ని ఓడించడానికి దారితీసింది. రాష్ట్రాలలోనూ కేంద్రంలోనూ ఏర్పడిన ఈ ప్రభుత్వాలు పూర్తికాలం సాగకుండా కేంద్రం కుట్రలు చేసింది.ప్రతిపక్షాల అనైక్యతా అందుకు దోహదం చేసింది, ఎమర్జెన్సీతో ఓడిపోయిన ఇందిరాగాంధీ తిరిగి అధికారంలోకి రాగలిగారు.ఆమె దారుణహత్య తర్వాత ఆమె కుమారుడు రాజీవ్‌గాంధీ సానుభూతి వెల్లువలో చరిత్రలోనే లేనంత పెద్ద మెజారిటీతో అంటే 400 పైన స్థానాలతో ప్రధాని అయ్యారు. ఇప్పుడు పాలన చేస్తున్న బీజేపీకి ఆ ఎన్నికల్లో రెండంటే రెండు సీట్లే వచ్చాయి. ఆ 1984 ఎన్నికల్లో బెంగాల్‌లో సీపీఐ(ఎం), ఉమ్మడి ఏపీలో ఎన్టీఆర్ నేతృత్వంలో టీడీపీ మాత్రమే నిలదొక్కుకో గలిగాయి. టీడీపీ జాతీయ ప్రధాన ప్రతిపక్షం కూడా అయింది. అంతేగానీ పలాయన మంత్రం పాడింది లేదు.1989లో వీపీసింగ్ ప్రభుత్వం కూడా వచ్చింది. పాలకపక్షం బలం చూసి లేదా ప్రతిపక్షాల బలహీనత చూసి ముందే చేతులెత్తేసింది లేదు, రాజీవ్‌గాంధీ హత్య తర్వాత మళ్లీ పీవీ నరసింహారావు మైనార్టీ ప్రభుత్వం వచ్చింది. ఈ కాలంలోనే బీజేపీ మత రాజకీయాలను అయోధ్య వంటి సమస్యలనూ పెంచుతూ శక్తి పెంచుకున్నది. 1989, 1996-97లలో కేంద్రంలో విఫలయత్నాలు చేసి 1998లో తొలిసారి అధికారం చేపట్టగలిగింది. మారిపోయిన తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు మద్దతు అందుకు ప్రధాన కారణమైంది. వాజ్‌పేయి పాలనా సమర్థతలో దేశం వెలిగిపోతోందని ప్రచారం మోగించిన కాలం కూడా మర్చిపోలేము. 2004లో మళ్లీ యుపిఎ సర్కారు ఏర్పడే వరకూ చంద్రబాబు వారికే మద్దతుగా వున్నారని మర్చిపోరాదు. వాజ్‌పేయికి స్వంతంగా మెజార్టీ లేని మాట నిజమే గాని బలపరిచే పార్టీలు చాలా వుండేవి. అయినా ఓటమిపాలు కాక తప్పలేదు. తర్వాత మన్మోహన్ సింగ్ నాయకత్వంలో వామపక్షాల మద్దతుతో ఏర్పడిన యుపిఎ ప్రభుత్వం రెండు పర్యాయాలు పాలన చేసింది. అణుఒప్పందం తర్వాత వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకున్నా అవకాశవాద ప్రాంతీయ పార్టీలు దానికి మద్దతునిచ్చాయి. మోడీ రెండుసార్లు పాలించడం అసాధారణమన్నట్టు చెప్పేవారు, మన్మోహన్ కూడా పదేండ్లు పాలించారనేది దాటేస్తుంటారు.

అవకాశవాదం అనర్థం

అనేక ప్రాంతీయ పార్టీల అవకాశవాదం, కాంగ్రెస్ బలహీనపడటం,వామపక్షాలు ప్రతికూల పరిస్థితిలో పడటం,దేశంలో పాలకవర్గాలు మతవాద, మితవాద రాజకీయాలను ప్రోత్సహించడం, సరళీకరణ విధానాలు అనివార్యంగా మతమార్కెట్ తత్వాలను ప్రోత్సహించడం వంటి కారణాల వల్ల బీజేపీ, ఆరెస్సెస్‌లు పట్టు పెంచుకున్న మాట నిజం. దేశ, విదేశీ గుత్తాధిపతులు ఫైనాన్స్ పెట్టుబడిశక్తులు కూడా ఆయనకు దన్నుగా నిలిచిన మాటా వాస్తవం. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజాస్వామిక విలువలనే బలహీనపరిచే ప్రయత్నాలు కూడా కాదనలేనివి. అయితే ఈ కారణాలన్నీ ప్రత్యామ్నాయంకోసం పోరాడవలసిన అవసరాన్ని మరింత పెంచుతాయే గాని తగ్గించవు. ఎందుకంటే వీటి అంతిమఫలితం మోసేది శ్రమజీవులు, సామాన్య ప్రజానీకమే. అలాటి ప్రత్యక్ష దాడులే మనం చూస్తున్నాం. ఆ ప్రజలు అందుకు వ్యతిరేకంగా ఒక్కతాటిపై నిలవకుండా మతపరమైన విభజనలు, విద్వేషాలు పెంచడం కూడా జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మరింత ఐక్యంగా నిలబడి పొంచివున్న ప్రమాదాన్ని ప్రతిఘటించవలసి వుంటుంది. అంతేగాని అభివృద్ధి నిరోధక శక్తులు ఎలాగూ విజయం సాధిస్తాయి గనక ప్రజాస్వామిక వాదులు ప్రత్యామ్నాయ శక్తులు ప్రతిపక్షాలు లొంగిపోవాలనడం ఎలాంటి తర్కం?పాలకవర్గాలు స్వార్థ ప్రయోజనాల కోసం ఎంతకైనా దిగజారతాయనే వాస్తవిక అవగాహన లేకుండా ఏదో అవకాశవాదాలతో అంచనా వేసుకోవడం ఎక్కడకు దారితీస్తుంది? ఏపీ, తెలంగాణలలోనే ఈ తరహా ఆలోచనల పర్యవసానాలు చూసూనేవున్నాం, బీజేపీ నిరంకుశత్వాన్ని మతతత్వ రాజకీయాలను నికరంగా ఎదుర్కొనే బదులు ఊగిసలాటలు, లోపాయికారీ పోకడలకు పాల్పడిన ప్రతివారూ మూల్యం చెల్లించక తప్పలేదు.అయినా టీడీపీ, జనసేన దాంతో జతకట్టడానికి ఉబలాటపడ్డాయి, వైసీపీ అప్రకటిత మైత్రి బంధం పాటిస్తున్నది. అయినా సరే మోడీ సర్కారు ఆ రాష్ట్రానికి అన్యాయం చేస్తూనే వుంది. తెలంగాణలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య కపట నాటకం నడిపిస్తూ తన పబ్బం గడుపుకొంటున్నది. ఈ పరిణామాల పట్ల స్పష్టమైన కచ్చితమైన వైఖరి తీసుకోకపోతే ఆయా పార్టీలూ రాష్ట్రాలూ కూడా నష్టపోవడం అనివార్యమవుతుంది. కాంగ్రెస్ నాయకత్వమే ఆ మెళకువతో అన్ని చోట్ల సరైన వైఖరి తీసుకోలేకపోతున్న తీరును కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ సూటిగా విమర్శించారు. ఇక ప్రాంతీయ పార్టీల బలహీనతలు వుండనే వుంటాయి. కానీ అవేవీ దేశం ముందున్న కర్తవ్యాన్ని మార్చలేవు.

400 సీట్ల పాట, నిరంకుశత్వ బాట

ఇదంతా ఒక ఎత్తయితే అసలు మోడీ మరింత ఆధిక్యతతో అధికారానికి రావడం తథ్యమనే ప్రచారానికి ఆధారమేమిటి? టైమ్స్ నౌ,న్యూస్ 18, ఇండియా టీవీ, ఇండియా టుడే ఇలా ఏవేవో సర్వేలు ఇందుకు ఆధారంగా చూపిస్తుంటారు. జాతీయ మీడియా దాంతో చేతులు కలిపే సర్వే సంస్థలూ ఇంతకన్నా భిన్నమైన అంచనాలు ఎలా ఇస్తాయి? కాకపోతే వాటిలో కూడా మెజార్టీ ఇస్తూనే రకరకాల అంకెలు వదలుతున్నారు.330 నుంచి 411 వరకూ ఎన్డీఏకు వస్తాయని లెక్కలు చెబుతున్నారు. సర్వేలు చాలాసార్లు విఫలం కావడం చూశాం. ఒక మేరకు నిజమైనా అంచనాలకు చాలా దూరంలో నిలబడిన పరిస్థితీ చూశాం. యూపీలో బీజేపీ బ్రహ్మాండంగా వచ్చేస్తుందనీ, హిందీ రాష్ట్రాలలోనూ గుజరాత్‌లోనూ బలం పెంచుకుంటుందని చెప్పే అంచనాలపై ఆధారపడి ఈ జోస్యాలు చెబుతున్నారు. నిజానికి యూపీలో కూడా ఎస్పి కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం అసలు వుండదని చెప్పలేము. బీహార్‌లో రెండు కూటములు పోటాపోటీగా నడుస్తున్నాయి. నితీశ్‌కుమార్ కన్నా ఆర్జేడి నాయకత్వంలోని 'ఇండియా'కే మెరుగైన అవకాశాలు న్నాయి. మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో మొన్నటి ఎన్నికలలో బీజేపీ విజయం సాధించినా కాంగ్రెస్ ధీటుగానే ఓట్లు తెచ్చుకున్నది.కనక వీటిని ఏకపక్షంగా చెప్పడం చెల్లుబాటు కాదు. బెంగాల్‌లో తృణమూల్, ఒరిస్సాలో బీజేడీ ఎక్కువ స్థానాలు తెచ్చుకుంటాయనేది సర్వేల సారాంశంగా వుంది. దక్షిణభారతంలో కర్నాటకలో మాత్రం బీజేపీకి ఎక్కువ స్థానాలు వస్తే తెలంగాణలోనూ ఒక మోస్తరుగా తెచ్చుకోవచ్చే అవకాశం వుంది.కేరళ, తమిళనాడు ఏపీల్లో బీజేపీ నామమాత్రం. ఏపీలో బీజేపీతో కలవడం వల్ల టీడీపీకి కూడా నష్టమనే అంచనాలూ అనేకం. తమిళనాడులో డిఎంకె కూటమి దాదాపు తుడిచిపెడితే కేరళలో యుడిఎఫ్,ఎల్‌డిఎఫ్ మధ్యనే సీట్ల విభజన వుంటుంది. మహారాష్ట్రలో పోటాపోటీగానే నడవొచ్చు. ప్రధాన రాష్ట్రాలలో పరిస్థితి ఇలా వుంటే బీజేపీకి ఏదో అపూర్వమైన ఆధిక్యత వస్తుందని ఎలా చెబుతున్నారు?ఈ మధ్య కాలంలో మతరాజకీయాల నుంచి ఎలక్టోరల్ బాండ్ల వరకూ ఎన్ని విషయాల్లో మోడీ ప్రభుత్వం నిరసనను ఎదుర్కొంది? నిరుద్యోగం, ధరల పెరుగుదల రాష్ట్రాల అప్పుల భారం వంటి అంశాలు ఆందోళన కలిగించడం లేదా? ఆ ప్రభావం ఓటర్లపై వుండనే వుండదా?



> **బీజేపీకి నిజంగా తిరుగులేదనేట్టయితే ప్రతి సందర్భంలోనూ ఏకపక్షంగా చర్యలు తీసుకోవలసిన అవసరమేమొచ్చింది? ఈ అయిదేండ్ల కింద నడిచిన రైతాంగ ఆందోళనను అణచివేశామనుకుంటే మళ్లీ మొదలవలేదా? అప్పటి పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళన కూడా కొత్తరూపంలో మొదలవలేదా? మీడియా నోరు నొక్కేందుకు ప్రతిపక్షాల ఖాతాలనూ, కార్యకలాపాలనూ అడ్డుకునేందుకు రకరకాల అప్రజాస్వామిక చర్యలకు పాల్పడాల్సిన అవసరమేమొచ్చింది? అరవింద్ కేజ్రీవాల్, హేమంత్‌సోరేన్ వంటి ముఖ్యమంత్రుల అరెస్టు ఏం చెబుతుంది? నిజమైన సమస్యలను పక్కదోవ పట్టించడానికి కాకపోతే కచ్చతీవు వంటిపాత అంశాలను తిరగదోడడం, చైనాతో వివాదాలను పదేపదే పైకి తేవడం, పాకిస్తాన్‌పై ఏదో చేస్తున్నట్టు బిల్డప్‌లు ఇవన్నీ ఎందుకు?**

> **అనేక ప్రాంతీయ పార్టీల అవకాశవాదం, కాంగ్రెస్ బలహీనపడటం, వామపక్షాలు ప్రతికూల పరిస్థితిలో పడటం,దేశంలో పాలకవర్గాలు మతవాద, మితవాద రాజకీయాలను ప్రోత్సహిం చడం, సరళీకరణ విధానాలు అనివార్యంగా మతమార్కెట్ తత్వాలను ప్రోత్సహించడం వంటి కారణాల వల్ల బీజేపీ, ఆరెస్సెస్‌లు పట్టు పెంచుకున్న మాట నిజం. దేశ, విదేశీ గుత్తాధిపతులు ఫైనాన్స్ పెట్టుబడిశక్తులు కూడా ఆయనకు దన్నుగా నిలిచిన మాటా వాస్తవం. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజాస్వామిక విలువలనే బలహీనపరిచే ప్రయత్నాలు కూడా కాదన లేనివి. అయితే ఈ కారణాలన్నీ ప్రత్యామ్నాయంకోసం పోరాడవలసిన అవసరాన్ని మరింత పెంచుతాయే గాని తగ్గించవు. ఎందుకంటే వీటి అంతిమఫలితం మోసేది శ్రమజీవులు, సామాన్య ప్రజానీకమే.**

బీజేపీకి నిజంగా తిరుగులేదనేట్టయితే ప్రతి సందర్భంలోనూ ఏకపక్షంగా చర్యలు తీసుకోవలసిన అవసరమేమొచ్చింది? ఈ అయిదేండ్ల కింద నడిచిన రైతాంగ ఆందోళనను అణచివేశామనుకుంటే మళ్లీ మొదలవలేదా? అప్పటి పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళన కూడా కొత్తరూపంలో మొదలవలేదా? మీడియా నోరు నొక్కేందుకు ప్రతిపక్షాల ఖాతాలనూ, కార్యకలాపాలనూ అడ్డుకునేందుకు రకరకాల అప్రజాస్వామిక చర్యలకు పాల్పడాల్సిన అవసరమేమొచ్చింది? అరవింద్ కేజ్రీవాల్, హేమంత్‌సోరేన్ వంటి సీఎంల అరెస్టు ఏం చెబుతుంది? నిజమైన సమస్యలను పక్కదోవ పట్టించడానికి కాకపోతే కచ్చతీవు వంటిపాత అంశాలను తిరగదోడడం, చైనాతో వివాదాలను పదేపదే పైకి తేవడం, పాకిస్తాన్‌పై ఏదో చేస్తున్నట్టు బిల్డప్‌లు ఇవన్నీ ఎందుకు? ఇంతచేసినా బీజేపీలోనూ, సంఘ పరివార్‌లోనూ అంతర్గతంగా విభేదాలు రావడం, ఉన్నతాధికారులే విభేదాలు వెల్లడించడం నిజమే కదా? టీడీపీఎలాగో వెంటబడి పొత్తు కుదుర్చుకుంది కానీ దగ్గరకు వచ్చిన బీజేడీ, అకాలీదళ్ వంటివారు కూడా మళ్లీ వెనక్కు పోలేదా? పొత్తుపెట్టుకున్న టీడీపీ అనుకూలంగా వుండే వైసీపీ కూడా తాము మైనార్టీలకు వ్యతిరేకం కాదని చూపుకోవడానికి ఎన్ని తంటాలు పడుతున్నాయి?

దేశంలో పరిస్థితి అలా వుంచి అమెరికా జర్మనీ, ఐక్యరాజ్యసమితి కూడా అప్రజాస్వామిక ధోరణులపై ఆందోళన అభ్యంతరాలు వెలిబుచ్చలేదా? వాటి జోక్యం సరైందా అనే ప్రశ్న ఒకటైతే మోడీ సర్కారు చర్యల పట్ల స్పందనలు ఎలా వున్నాయనేది దీన్నిబట్టి విదితమవుతుంది. ఇవి మన ప్రజలు గమనించలేరనీ, స్పందించరనీ అనుకోవడం పొరబాటు. గతంలో చాలాసార్లు చైతన్య వంతమైన తీర్పులతో చారిత్రక మార్పులు తెచ్చిన భారతీయ ఓటర్లు ఇప్పుడు కూడా బొత్తిగా ఆ మెళకువ చూపించకపోరు. అది ఏ రాష్ట్రంలో ఏ రూపంలో, ఏ స్థాయిలో వుంటుందనేది వాస్తవంలో చూడాలి. గతంలో ప్రత్యామ్నాయాలు వచ్చినపుడు ఇన్ని ప్రతిపక్ష ప్రభుత్వాలు ఇన్ని ప్రాంతీయపార్టీలూ వుండేవి కావు. కాకపోతే ఇప్పుడు ప్రాంతీయ పార్టీల స్వభావంలో మార్పు వచ్చిన మాట నిజమే గానీ బీజేపీతో కలిసినవి తక్కువే. ఎన్నికల ఫలితాల తర్వాత మాత్రమే ప్రభుత్వ ఏర్పాటు గురించిన చర్చకు అర్థం వుంటుంది. అప్పుడు ఎవరేమి చేస్తారనేది కీలకం. ఈ లోగా ఎన్నికల సవాళ్లను ధీటుగా ఎదుర్కొవలసి వుంటుంది. దేనికైనా సిద్ధపడటం వేరు, ముందే చేతులు ఎత్తేయడం వేరు. ముందే మోడీ నాలుగువందల లెక్కలతో అదరగొడితే చెల్లుబాటు కాదని ప్రకటించడం తప్పనిసరి. ■

'ఉరి'సిల్లగా... మార్చొద్దు

సిరిసిల్ల... ఉరిసిల్లగా మారకముందే నేతన్నలను ఆదుకోకుంటే పాత రోజులు పునరావృతమవుతాయి. కండె పోగులే మరణమృదంగాలై చేనేత కార్మికులను బలిగొన్న గతం మరోసారీ నిజం కాకుండా ఉండాలంటే సర్కార్ పెద్దమనసుతో తాయిలాలు ప్రకటించాలి. గడిచిన ఏడాది బతుకమ్మ చీరల పెండింగ్ బకాయిలు రూ.220 కోట్లు ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించకపోగా, ఈ ఏడాది చీరల ఆర్డర్లివ్వలేదు. ఫలితంగా అసాములు మరమగ్గాలకు హాలీడే ప్రకటించడంతో పనులు లేక 30 వేల మంది కార్మిక కుటుంబాలు వీధిన పడ్డాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్వాకానికి తోడు కేంద్రంలోని మోడీ సర్కార్ చర్యలు మూలిగే నక్కపై తాటిపండులా పరిణమించాయి.. టెక్స్‌టైల్, చేనేత బోర్డులను రద్దు చేయడంతో పాటు వాటి ఉత్పత్తులు, ముడిసరుకులపై కేంద్రం పెంచిన 12 శాతం జీఎస్టీ నేతన్నలకు శాపంగా మారాయి. సిరిసిల్ల నేత కార్మికుల దుస్థితికి తప్పు ఎవరిదనే చర్చ పక్కనపెట్టి ముందు వారిని ఆదుకునేందుకు రేవంత్ సర్కార్ వెంటనే చర్యలు చేపట్టాలి.

-ఊరగొండ మల్లేశం

పొగలు.. సెగలు...

మనం ఇప్పుడు ఏప్రిల్ మొదటి వారంలోనే ఉన్నాం. కానీ మే చివరి వారంలో ఉన్న ఫీలింగ్ కలుగుతోంది. 'సూరయ్య' దెబ్బకు ఉదయం పది దాటిందంటే చాలు... రోడ్ల మీదికి రావటానికి జనం జంకుతున్నారు. రోడ్ల మీది దాకా ఎందుకు..? ఇంట్లో ఫ్యాన్ కింద కూర్చున్నా శరీరం పొగలు.. సెగలూ కక్కుతోంది. లీటర్లకు లీటర్లు నీళ్లు తాగుతున్నా... ఒక్క చుక్కా బయటకు రావటం లేదు. అంతా ఒంట్లోనే ఇంకిపోతున్నవి. ఒకవైపు పరిస్థితి ఇలా ఉంటే... మరోవైపు కుండలు, కూలర్లకు భలే గిరాకీ వచ్చింది. పుచ్చకాయలు, కొబ్బరి బోండాలు, నిమ్మ, చెరుకు రసాల బండ్ల వద్ద జనం క్యూ కడుతున్నారు. ఈ డిమాండ్ రీత్యా కాసింత లావాటి పుచ్చకాయ చెట్టెక్కి కూర్చుని రూ.వందిస్తే గానీ దిగిరానంటోంది. కొబ్బరి బోండాల్లో సాధారణ రకం, బెంగళూరు, కేరళ కాయలంటూ రకరకాల వెరైటీల్లో అమ్ముతున్నారు. సాధారణరకం ధర రూ.30గా ఉంటే, మిగతా రకాలకు రూ.60 పెట్టాల్సిందే. అదే లీటరు బాటిల్‌లో కొబ్బరి నీళ్లు నింపుకోవాలంటే రూ.130 సమర్పించు కోవాల్సి వస్తోంది. ఎండదెబ్బకు జనం జేబులు ఈ విధంగా గుల్లవుతుంటే 'సూర్యారావు' మాత్రం రోజుకు రోజుకి తన ప్రతాపాన్ని పెంచుకుంటూ పోతున్నాడు. 40, 43, 45 డిగ్రీలనుకుంటూ వేలం పాటలాగా ఉష్ణోగ్రతలతో హీటెక్కిస్తున్నాడు. బాబ్బాబూ.. మీలో ఎవరైనా వాడికి తెలిసిన వాడుంటే, కాస్త చెప్పండి, ఈ ఉక్కపోత నుంచి, ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం కల్పించమని...అలా చేస్తే ఆయనక్కూడా నాలుగు కొబ్బరి బోండాలు కొట్టిద్దాం...

- బి.వి.యన్.పద్మరాజు

కరెంటోళ్లా.. మజాకా..!

ఎవ్వరి మాటా వినడు సీతయ్యా... అన్నట్టు, కరెంటోళ్లు ఈ మధ్య హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం మీద సీరియస్ అయ్యారు. 'అది ఐపీఎల్ మ్యాచ్ అయితే ఏంటి..? ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం అయితే ఏంటి..?' నా బిల్లు నాకు కట్టకపోతే కరెంటు కట్‌చేసి పడేస్తామంతే...అంటూ అగ్గి మీద గుగ్గిలమయ్యారు. అవటమే కాదు... మొన్నటి హైదరాబాద్-చెన్నై మ్యాచ్‌కు ఒకరోజు ముందు ఉప్పల్ స్టేడియానికి కరెంటు కట్‌చేసి పడేశారు. దెబ్బకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)కు దిమ్మతిరిగి బొమ్మ అగుపడ్డది. కరెంటు డిపార్టుమెంటోళ్లని బతిమిలాడుకున్నారో లేక బిల్లు మొత్తం కట్టేశారో తెలీదుగానీ, మ్యాచ్ రోజు మాత్రం స్టేడియానికి కరెంటు సరఫరా అయింది. దీంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదే తరహాలో బడాబాబుల పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు కరెంటు బిల్లులు ఎగ్గొడితే... కత్తెరతో కరెంటు తీగలు కట్‌చేసి, ముక్కు పిండి బిల్లు వసూలు చేయాలని కోరుతున్నారు రాష్ట్ర ప్రజలు...

- కె.నరహరి

యోగక్షేమం వహామ్యహం

ఎల్ఐసి బ్రాంచి మేనేజరు పరుగు పరుగున ఫ్లెక్సీ తయారు చేసే వెంకట్ దగ్గరికొచ్చాడు. మా హెల్త్ క్యాంపు పోస్టర్ తయారయ్యిందా అనడిగాడు. ఒక్కసారి స్క్రీను మీద చూడండి సార్ ప్రింటు తీసిస్తా అన్నాడు వెంకట్. మీ వాట్సప్పులో పెట్టాను చూడలేదా అనీ అన్నాడు. ఈ రూట్లో పోతూ వచ్చానులే అన్నాడు బి.ఎం. స్క్రీను పైన వచ్చిన పోస్టర్ చదివి, ఏమయ్యా వెంకట్ కొంప ముంచావు కదయ్యా అన్నాడు. ఏమైంది సార్ అన్నాడు వెంకట్. "యోగి క్షేమం" కాదయ్యా "యోగక్షేమం" అనుండాలి. వెంకట్ వెంటనే అలాగే మారుద్దాము సార్, "యోగి క్షేమం" కూడా ముఖ్యమేగా ఇప్పుడు అన్నాడు వెంకట్. బ్రాంచి మేనేజరు ఆశ్చర్య పోయాడు వెంకట్ తెలివికి.


నలభై ఏండ్ల క్రితం అదో పెద్ద మీటింగు. అందులో ముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రులు, అధికారులు, పెద్దోళ్లు, ప్రజలు ఇలా అందరూ ఉన్నారు. సభను మొదలు పెట్టిన ఒక పెద్దాయన "సర్వే జనాస్సుఖినో భవన్తు" అన్నాడట. సరే అది అర్థమైనోళ్లకు అయింది, కాకున్నా ఇదేదో వినడానికి బాగుందని కొందరు పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి గారి వంతు వచ్చినప్పుడు ఆయన మాట్లాడుతూ పెద్దాయన చెప్పేటప్పుడు సర్వేవాళ్ళు మాత్రమే బాగుండాలని అన్నారు కాని అందరూ బాగుండాలి కదా అనేశాడు. పక్కనున్న సెక్రెటరీ పరుగు పరుగున పోయి ముఖ్యమంత్రి చెవిలో సర్వేజనా అంటే జనాలందరూ అని అర్థం సార్ అన్నాడట మైకును చేత్తో మూసి. ముఖ్యమంత్రి వెంటనే ఇప్పుడు సెగ్రెటీ చెప్పాడు సర్వేజనా అంటే అందరు జనాలు అని అర్థం. బాగుంది, నాకు కావలసింది కూడా అదే అందరూ బాగుండాల. అందరూ బాగుండాలి అందులో మనముండాలి అన్న మాటలు జనాల నోటిలో ఎప్పుడైనా, ఎక్కడైనా వినిపిస్తూనే ఉంటాయి. ఎందుకంటే అవి అందరికీ అర్థమయ్యేవి కాబట్టి, ఆమోదం ఉండాలే కాని ఇలాంటి డైలాగులు వస్తూనే ఉంటాయి.



జంధ్యాల రఘుబాబు
9849753298

అయ్యవారు సర్వేజనా, యోగక్షేమం వహామ్యహం లాంటి మాటలు వాడినప్పుడు ఎవరెవరి స్పందన ఎలా ఉంటుందో ముందే అనుకున్నాం. అలా కాకుండా అచ్చమైన తెలుగులో చెబితే అందరూ విని ఆనందిస్తారు. ఒక దర్శకుడొచ్చి పెద్ద కవి పాట తనే రాసి తనే పాడతాడు, చెల్లెలు నాట్యం చేస్తుంటుంది కాబట్టి మంచి పాట రాయండి పదికాలాలు నిలిచిపోతుంది అన్నాడట సినారె గారితో. నారాయణరెడ్డి గారికి నన్ను దోచుకొందువటే, ఒంటరినైపోయాను ఇక ఇంటికి ఏమనిపోను లాంటి పదాలు వాడడం ఇష్టం. అందుకే నెమలిలా నాట్యం చేయమ్మా అంటూ పాట రాశారట. దర్శకునికి చూపిస్తే ఇలా కాదండి బాబూ, పాటలో ఏదో మంచి భావం ఉంది, అర్థం కాకున్నా చెవులకు వినసొంపుగా ఉంది అనుకోవాలి ప్రేక్షకులందరూ. కాబట్టి పెద్ద పెద్ద సమాసాలు, సంస్కృత పదాలు ఉండాలి, సినిమాలో కవి స్వయంగా పాడతాడు ఆ పాట అన్నాడట. సినారె గారికి అర్థమైపోయింది. వెంటనే "చరణ కింకిణులు ఘల్లుఘల్లుమన, కరకంకణములు గలగలలాడగ.... వినీల గజభర.. విలాస బంధుర.. తనూలతిక చంచలించిపోగ.... ఆడవే మయూరి" అంటూ రాశారట. ఇక చూస్తాండి దర్శకుడు మొహంలో వెలుగే వెలుగు. ఇది సార్ పాటంటే అని సినారె గారి కాళ్లు మొక్కినంత పనిచేశాడట.

మనల్ని ఆంగ్లభాష ఏలకముందు సంస్కృతం హవా నడిచిందని అందరికీ తెలుసు. దాన్ని దైవ భాష అనేవాళ్ళు, అంటే దేవుళ్ల మాట్లాడుకునే భాష అని అర్థం. ఇంతకూ దేవుళ్లంటే ఎవరు అన్న ప్రశ్న రావడం సహజం. ఇప్పుడు ఎన్నికల సమయం కాబట్టి ఓటర్లే దేవుళ్ల అందరికీ. 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతె తత్ర దేవతా' అన్న శ్లోకం కూడా. దానర్థం ఎక్కడైతే మహిళలను పూజిస్తారో అక్కడ దేవతలు నివసిస్తుంటారు, ఎక్కడైతే వారికి మర్యాద చేయరో అక్కడ పనులు ఫలితాలనివ్వవు, అదెంత మంచి పనైనా సరే అని దానర్థం. ఎంత మంచి మాటలు వినడానికి. అదీ ఈ మాటలన్నది ఎక్కడో కాదు మనుస్మృతిలో. మరి అందులో అన్ని మంచి వాక్యాలున్నాయా ఉంటే వాటిని నిజంగా నిజం చేయొచ్చు కదా అని సగటుజీవి ఆలోచనల్లో అనుమానం వస్తుంది. మంచి మాటలు తెలియడం, ఉండడం కాదు అవి అమలు చేసే దాంట్లోనే ఉంది అసలు రహస్యం. ఈ ప్రభుత్వాలు ఎవరికి వత్తాసు పలుకుతు న్నాయి? సామాన్య ప్రజలకా లేక ఉన్నోళ్లకా అన్నది అసలు ప్రశ్న.



సురుకు

మనం మళ్లీ యోగక్షేమం వహామ్యహం దగ్గరికి వద్దాం. ఈ మాటలు భగవద్గీతలో ఉన్నవి. అందులో అనుమానమక్కరలేదు. మంచిమాటలు ఎక్కడున్నా స్వీకరించాల్సిందేనని ఇంతకుముందే చెప్పుకున్నాం. యోగా అంటే పనిచేసే మార్గాలు, క్షేమ అంటే సంరక్షణ, వహామి అంటే తీసుకుపోవడం, అహం అంటే నేనే అని అర్థాలు. కాబట్టి ఎల్.ఐ.సి మీ అన్ని ఆర్థిక బాధ్యతలను తన చేతుల్లో పెట్టుకొని వాటిని సంరక్షిస్తుంది అని అర్థం. అందుకే రెండు చేతులతో దీపాన్ని రక్షిస్తున్నట్టు ఉంటుంది దాని గుర్తు. మీరు ఖాతాదారులలో భాగమైతే వాటిని మీ కోసం ఎల్.ఐ.సి నిర్వహిస్తుంది అని ఆ స్లోగన్ చెబుతుంది. నిజంగా ఎల్.ఐ.సి ఇవన్నీ నిర్వర్తించడమే కాదు కాలంతో పాటు మారి ఒక్క ఖాతాదారులకే కాదు మొత్తం ఆర్థిక వ్యవస్థకే వెన్నెముకగా నిలబడింది. అటు సాధారణ బీమా రంగంలో నాలుగు ప్రభుత్వ కంపెనీలూ అదే పనిచేస్తున్నాయి.

ఇక ఎవరి క్షేమం ఎవరు కాపాడుతున్నారన్నది అసలు విషయం. ప్రజల, రైతుల, మధ్య తరగతి దిగువ మధ్య తరగ్గె ప్రజలు, ఇలా అందరి క్షేమాన్ని జీవిత బీమా రంగంలో ఎల్.ఐ.సి, సాధారణ బీమా రంగంలో నాలుగు ప్రభుత్వ కంపెనీలు పగలు రాత్రి అని తేడా లేకుండా పని చేస్తూ తమను తాము నిలుపుకుంటూ ఆర్థిక భారతాన్ని అత్యంత ప్రేమగా చూసుకుంటున్నాయి. మరి ఆ తల్లిపాలు తాగుతూ నాయకులేం చేస్తున్నారు అన్నది మరో ప్రశ్న. ఎవరి క్షేమం ఎవరు కాపాడుతున్నారు అని చూస్తే అందరికీ తెలిసిపోయేది ఒక్కటే అది సవతి తల్లి ప్రేమ. అందుకే వీటిని కాపాడే సైనికుల్లాంటి ఉద్యోగులు అన్ని పార్టీల ఎంపీ అభ్యర్థుల దగ్గరికి పోయి వీటిని సంరక్షిస్తామంటూ మాట తీసుకుంటు న్నాయి. ఇచ్చిన మాట నిలబెట్టుకొమ్మనీ కోరుతున్నాయి. అప్పుడు దేశానికి మొత్తంగా ఈ యోగక్షేమం వహామ్యహం అనే మాటలు రక్షణనిస్తాయి. అసలైన జాతీయత, దేశభక్తి అంటే అవే మరి. ఇప్పుడు మొత్తం భారత దేశం క్షేమంగా, స్నేహంగా ఉండవలసిన సమయం. ■



నమో అంటే.. నమ్మించి మోసం చేయడమే

- కేసీఆర్..ఎక్కువ చేస్తే చర్లపల్లి జైలుకు పంపిస్తా : తుక్కుగూడ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నమో అంటే నమ్మించి మోసం చేయడమేనని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. శనివారం తుక్కుగూడలోని రాజీవ్‌గాంధీ మైదానంలో జరిగిన జనజాతర బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. తమ పార్టీ జాతీయస్థాయి ఎన్నికల మ్యానిఫెస్టోను తెలంగాణ గడ్డ మీద నుంచి రాహుల్‌గాంధీ ఆవిష్కరించడం గర్వకారణమన్నారు. సోనియాగాంధీ ఇదే గడ్డ మీద నుంచి ఆరు గ్యారెంటీలిచ్చి రాష్ట్రంలో మూడు రంగుల జెండాను రెపరెపలాడించారని గుర్తుచేశారు. ఇప్పుడు జాతికి ఐదు గ్యారెంటీలను రాహుల్‌గాంధీ అంకితం చేశారని కొనియాడారు. జూన్ నాలుగో తేదీన వెలువడే ఫలితాల్లో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతున్నదని ఆశాభావం వ్యక్తంచేశారు. జూన్ 9న ఎర్రకోటపై మువ్వన్నెల జెండాను ఎగురవేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తర తెలంగాణ నుంచి గోదావరి, దక్షిణ తెలంగాణ నుంచి కృష్ణానది పోటెత్తి సునామీని సృష్టిస్తే ఎలా ఉంటుందో తుక్కుగూడ కాంగ్రెస్ శ్రేణుల సంద్రం అలా ఉందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు కదం తొక్కితే బీఆర్ఎస్ కనిపించకుండా పోయిందనీ, బీజేపీని కూడా తుక్కుతుక్కుగా తొక్కడానికి తుక్కుగూడకు వచ్చిన కాంగ్రెస్ శ్రేణులకు ధన్యవాదాలు అని చెప్పారు. కాంగ్రెస్ బలం, పునాది కార్యకర్తలేననీ, వారి కష్టంతోనే తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. మోడీ గుజరాత్ మోడల్‌పై తెలంగాణ మోడల్ ఆధిపత్యాన్ని చూపించబోతున్నదని నొక్కి చెప్పారు. పదేండ్లుగా ప్రధాన మంత్రిగా ఉన్న మోడీ ఏటా రెండు కోట్ల చొప్పున పది కోట్ల ఉద్యోగాలివ్వలేదని విమర్శించారు. పార్లమెంట్‌లో ఇదే అంశంపై తాను ప్రశ్నిస్తే కేవలం 7 లక్షల ఉద్యోగాలనే మోడీ ప్రభుత్వం ఇచ్చిందని తేలిందన్నారు. 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వనందుకు మోడీకి ఓటెయ్యాలా? రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మోసం చేసినందుకు మోడీకి ఓటెయ్యాలా? నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో పోరాటం చేస్తున్న 750 మంది రైతులను పొట్టనబెట్టుకున్నందుకు ఓటెయ్యాలా? కనీసం బాధిత కుటుంబాలను పరామర్శించనందుకు ఓటెయ్యాలా? 2022 నాటికి ప్రతి పేదవాడికీ ఇండ్లు కట్టిస్తానని మాటతప్పినందుకు ఓటెయ్యాలా? మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో ప్రజలను విభజించినందుకు మోడీకి ఓటెయ్యాలా? ఓట్ల కోసం దేశాన్ని ఉత్తర, దక్షిణ భారత్‌లుగా విభజించి చూపుతున్నందుకు ఓటెయ్యాలా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అకాల వర్షాలతో హైదరాబాద్ నగరం అతలాకుతలమైతే సికింద్రాబాద్ ఎంపీగా ఉన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి ఒక్క పైసానైనా తెచ్చారా? ఏం మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు? అని నిలదీశారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రావాల్సిన ఐటీఐఆర్, బయ్యారం ఉక్కు కర్మాగారం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదాను పదేండ్లలో కాలంలో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణలోని కీలకమైన ఏడు మండలాలను అన్యాయంగా ఏపీలో కలిపారన్నారు. తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన బీజేపీకి బొందపెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సూర్యాపేట, కరీంనగర్‌కు పోయి మాజీ సీఎం హోదాలో కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేరని మాట్లాడొచ్చా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల కాలంలోనే వందేండ్ల విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. అధికారం పోయింది, కాలు విరిగింది, కూతురు జైలుకు పోయింది కాబట్టి బాధలో ఉన్నప్పుడు ఆయనపై విమర్శలు చేయొద్దని ఇంత కాలం సమన్వయం పాటించామని సీఎం అన్నారు. ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోవడానికి, వినడానికి తాను జానారెడ్డిని కాదు.. రేవంత్‌రెడ్డినని చెప్పారు. ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తే అంగిలాగు ఊడదీసి చర్లపల్లి జైలులో చిప్పకూడు తినిపిస్తానని హెచ్చరించారు. పదేండ్ల కాలంలో పేదలకు డబుల్ బెడ్ ఇండ్లు మీరు ఇవ్వకపోవచ్చుగాని కేసీఆర్ మీ కోసం చర్లపల్లిలో డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తానని హామీనిచ్చారు. ఎందుకంటే చర్లపల్లి జైలులో మీరు, మీ బిడ్డ, కొడుకు, అల్లుడు వస్తే ఉండనీకి డబుల్ బెడ్ రూమ్ కావాల్సిందేనన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కట్టించిన చోట తాము ఓట్లు అడుగుతామనీ, కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించిన దగ్గర అడుక్కోవాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్ల పనులను రూ. 22,500 కోట్లతో ప్రారంభించామని తెలిపారు. కడుపుకట్టుకుని రాష్ట్ర ప్రజల కోసం రోజుకు 14 గంటలు పనిచేస్తున్నామనీ, తెలంగాణలో కాంగ్రెస్‌ను కనీసం 14 సీట్లలో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. హెలికాప్టర్‌లో తిరుగుతూ, విదేశీ పర్యటనలు చేస్తూ .గంటకో డ్రెస్ మార్చే మోడీని గెలిపించొద్దనీ, ప్రజల కోసం దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న రాహుల్‌గాంధీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మోడీ పరివారంపై రాహుల్‌గాంధీ పరివారం విజయం తథ్యమన్నారు.

ఆర్థిక, విద్యుత్ సంక్షోభాన్ని సృష్టిస్తే.. గాడిలో పెడ్తున్నాం : డిప్యూటీ సీఎం భట్టి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక, విద్యుత్ సంక్షోభాన్ని సృష్టించి సుడిగుండంలా చేసి పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ రెండు వ్యవస్థలను గాడిలో పెట్టామన్నారు. ఒకటో తేదీనే ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలిస్తున్నామన్నారు. రాహుల్‌గాంధీ నిరంతరం పర్యవేక్షణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేస్తూ ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. నరేగా కింద రూ.400 వేతనం ఇస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. తెలంగాణ మోడల్‌గా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేంద్రంలో తీసుకురావడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, పార్లమెంట్ స్థానాల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే

తుక్కుగూడ సభకు హాజరైన తెల్లం వెంకట్రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ శనివారం నిర్వహించిన బహిరంగసభలో ఒక ప్రత్యేక సన్నివేశం చోటు చేసుకుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఏకైక బీఆర్ఎస్ ఎమ్మెల్యే , భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు ఆ సభలో ప్రత్యక్షమయ్యారు. మొదట్నుంచి ఆయన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ముద్రపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెల్లం చివరిదాకా బీఆర్ఎస్ ఉంటాడా? గోడ దూకి కాంగ్రెస్‌లోకి చేరతాడా? అనే గుసగుసలు వినిపిస్తూ ఉన్నాయి. ఇవి ఇలా వినిపిస్తున్న తరుణంలోనే ఆయన తుక్కుగూడ సభలో ప్రత్యక్షమవడం గమనార్హం. కాకపోతే ఇప్పటిదాకా తెల్లం పార్టీ మారబోతున్నట్టు ప్రకటించలేదు. కాంగ్రెస్ కండువా కప్పుకోలేదు. ఇదే ఇక్కడ హైలెట్.



బాలికలపై లైంగిక దాడులు

- వేర్వేరు చోట్ల రెండు ఘటనలు
- నిందితుల్లో ఒకరికి రిమాండ్



నవతెలంగాణ-తాండూరు రూరల్/ ఆర్మూర్

రెండు వేర్వేరు ప్రాంతాల్లో బాలికలపై లైంగిక దాడుల ఘటనలు వెలుగుజూశాయి. వికారాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో చోటుచేసుకున్న ఈ ఘటనల్లో ఒకరిని రిమాండ్‌కు పంపగా.. మరొకరిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

వికారాబాద్ జిల్లా తాండూరు మండలం ఐనెల్లి గ్రామానికి చెందిన బూడిద అంబేష్ ఆటో డ్రైవర్. అదే గ్రామానికి చెందిన ఓ బాలిక(17) పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల కోసం అంబేష్ ఆటోలో వెళ్లింది. ఈ క్రమంలో అతను బాలికతో పరిచయం పెంచుకున్నాడు. అయితే, గురువారం బాలిక, తన స్నేహితురాలితో కలిసి తాండూర్‌లో ఓ పెండ్లికి వెళ్లింది. విషయం తెలుసుకున్న అంబేష్ అక్కడికి వెళ్లాడు. పెండ్లి అయిపోయిన తర్వాత బాలికను ఇంటి దగ్గర వదలిపెడతానని ఆటో ఎక్కించుకుని తాండూర్ నుంచి ఐనెల్లి గ్రామ శివారులోని తన భూమిలోకి తీసుకెళ్లాడు. అక్కడ బాలికను బెదిరించి ఆమెపై లైంగికదాడి చేశాడు. ఆ సమయంలో ఆమెను వదిలేస్తే జరిగిన విషయం ఇంట్లో చెబుతుందని భావించి.. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో బాలికను ఆటోలో తీసుకెళ్లి తాండూర్ రైల్వే స్టేషన్‌లో వదిలిపెట్టి పారిపోయాడు. అనంతరం బాధితురాలు ఇంటికి వెళ్లి విషయాన్ని అమ్మమ్మకు, అమ్మకు చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడు అంబేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తాండూర్ రూరల్ సీఐ అశోక్ తెలిపారు.

యువకునిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై చేపూర్ గ్రామ యువకుడు సంపత్ లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక(15)ను ప్రేమిస్తున్నానని, పెండ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి, ఆమెపై లైంగికదాడి చేశాడు. విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బాలికను భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో బాధితురాలు ఇంట్లో వారికి చెప్పలేదు. అయితే, ఏప్రిల్ 3న బాలిక ఇంటి వద్ద కండ్లు తిరిగి పడిపోయింది. వెంటనే పట్టణంలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షలు చేసి మూడు నెలల గర్భవతి అని చెప్పారు. దీంతో బాలిక తల్లిదండ్రులు విషయం తెలుసుకుని.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంపత్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏసీబీకి చిక్కిన మాదాపూర్ ఎస్ఐ రంజిత్, రైటర్ విక్రమ్

నవతెలంగాణ-మియాపూర్



రంగారెడ్డి జిల్లా మాదాపూర్ ఎస్ఐ రంజిత్, రైటర్ విక్రమ్ శనివారం రూ.20వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించి ఏసీబీ రంగారెడ్డి డీఎస్పీ ఆనంద్‌బాబు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని సాయినగర్ కాలనీలో 60 గజాల్లో కృష్ణ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. ఆ స్థలం తనదే అని ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కృష్ణపై కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్ఐ, రైటర్ ఇద్దరూ కలిసి కృష్ణను రూ.లక్ష లంచం డిమాండ్ చేశారు. చివరికి రూ.30వేలు ఇవ్వాలని బెదిరించారు. దాంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. శనివారం మాదాపూర్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ, రైటర్ ఇద్దరూ కృష్ణ నుంచి రూ.20వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

- ముగ్గురికి గాయాలు
- కామినేని ఆస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-చిట్యాలటౌన్



బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ కేంద్రంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణ కేంద్రంలోని సంతోష్ నగర్‌లో గుంటూరుకు చెందిన కోటేశ్వరరావు కొంతకాలంగా గుట్టు చప్పుడు కాకుండా బాణాసంచా తయారు చేస్తున్నాడు. ఇందుకు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామానికి చెందిన మేడి యాదయ్య ఇల్లును కిరాయికి తీసుకున్నాడు. కొంతమంది వర్కర్లతో కలిసి పని చేయిస్తున్నాడు. శనివారం ఉదయం బాణాసంచా తయారు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పేలడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో కోటేశ్వరరావుతో పాటు చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన గుడిసె శాంతి, మేళ్లచెరువు మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన బానోతు సైదికి గాయాలయ్యాయి. వారిని వెంటనే నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి, నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు, చిట్యాల ఎస్ఐ డి.సైదాబాబు పరిశీలించారు. అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

మరో నేతన్న ఆత్మహత్య

నవతెలంగాణ - సిరిసిల్ల/ సిరిసిల్ల టౌన్

కార్మిక క్షేత్రం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉపాధి లేక మరో నేతన్న ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్నాళ్లుగా చేసేందుకు పని లేక.. కుటుంబం గడవడం కష్టమవడం.. మరోవైపు అప్పులు తీరే మార్గం లేక ప్రాణం తీసుకున్నాడు. సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సిరిపురం లక్ష్మీనారాయణ ప్రగతినగర్‌లో లింగయ్య అనే ఆసామి దగ్గర మరమగ్గాల కార్మికునిగా పని చేస్తుండేవాడు. కొద్ది రోజుల నుంచి పని లేకపోవడంతో ఇంటి సమస్యలు పెరిగిపోయాయి. మరోపక్క లక్ష్మీనారాయణ పెద్ద కొడుకు టెక్స్‌టైల్ పార్కులో పనిలేక ఇతర ఉపాధిని వెతుక్కుంటున్నాడు. చిన్న కొడుకు హైదరాబాదులోని ఓ కంపెనీలో పనిచేయగా.. ఇటీవల అతడి ఉద్యోగం కూడా పోయింది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఆ కుటుంబాన్ని చుట్టుముట్టాయి. అటు పనిలేక.. ఇటు అప్పులు రూ.2 లక్షలు తీర్చే మార్గం లేక ఆత్మస్థైర్యం కోల్పోయిన లక్ష్మీనారాయణ శనివారం ఇంట్లో ఉరేసుకున్నాడు. అవే ఆయన ఆత్మహత్యకు దారితీశాయని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు.

కేటీఆర్ పరామర్శ, ఆర్థిక సాయం

నేతన్న సిరిపురం లక్ష్మీనారాయణ మృతదేహానికి సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే కేటీఆర్ నివాళులర్పించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద లక్ష్మీనారాయణ కుటుంబాన్ని కేటీఆర్ ఓదార్చారు. తక్షణ సాయం కింద పార్టీ తరఫున రూ.50వేలు అందించారు. నేతన్న కుటుంబానికి ప్రభుత్వం తరఫున రావాల్సిన ఆర్థిక సహాయం కోసం కలెక్టర్ అనురాగ్ జయంతితో కేటీఆర్ మాట్లాడారు. ప్రభుత్వం తరఫున రావాల్సిన సహాయాన్ని వెంటనే అందించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సీఐటీయూ నాయకుల ఓదార్పు

సిరిపురం లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య పరామర్శించి ఓదార్చారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నేతన్నలకు ఉపాధి దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, మూశం రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్య రక్షణకు బీజేపీని ఓడించాలి

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్

- వనపర్తిలో ఎం.రాములు సంస్మరణ సభ



నవతెలంగాణ -వనపర్తి

దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకో వడానికి పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ అన్నారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎం.రాములు సంస్మరణ సభను పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వెంకట్ మాట్లాడుతూ.. ఎం.రాములు అనారోగ్యంతో మరణించడం బాధాకరమని అన్నారు. విద్యార్థి, ఉపాధ్యాయ, సైన్స్, ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కులం- కులతత్వం, మతం - మతతత్వం, శాస్త్రీయ అవగాహన తదితర అనేక అంశాలపై కార్యకర్తలకు అవగాహన క్లాసులు బోధించా రని తెలిపారు. జిల్లా స్టడీ సర్కిల్లో రెగ్యులర్ విద్యార్థిగా ఉండేవారని, నిత్య అధ్యయనశీలి అని కొనియాడారు. సీపీఐ(ఎం) బలోపేతం, సెక్యులర్ శక్తులను బలోపేతం చేయడం.. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించే వారిని ఈడి, ఐటీ, సీబీఐ తదితర స్వతంత్ర సంస్థల ద్వారా వేధింపులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ వెంట ఉంటే నీతిపరులు, వెలుపల ఉండి వ్యతిరేకిస్తే అవినీతిపరులని ముద్ర వేసి జైల్లోకి పంపుతున్నారన్నారు. అందులో భాగంగానే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, కవిత తదితరులను జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల బాండ్ల పేరుతో కార్పొరేట్ సంస్థల నుంచి నిధులు కాజేసి ప్రజల ఓట్లకు గాలాలు వేస్తున్న బీజేపీనే దేశంలో అతిపెద్ద అవినీతి పార్టీ అని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు, సామాన్యులపై భారాలు మోపుతోందని, హిందూ- ముస్లిం తగాదాలు సృష్టించి ఓట్ల రాజకీయం ఆడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, ఆర్.రామ్‌రెడ్డి, ఏం.నాగిరెడ్డి, ఎం.కృష్ణయ్య, రఘుపతి రెడ్డి, వీరయ్య లెక్చరర్ ఎస్.నారాయణ, ఏపీ మల్లయ్య సీనియర్ జర్నలిస్టు ఉషన్న, రాజారాం ప్రకాష్, ఎం.రాములు భార్య వెంకటేశ్వరమ్మ, కుమారుడు విక్రమ్, అల్లుడు డాక్టర్ శ్రీనివాసులు, బావమరిది చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


పేదల గుడిసెలపై పెద్దల కన్ను

(మొదటిపేజీ తరువాయి)

1650 మంది ఇండ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారు. ఈ క్రమంలో పైడిపల్లి కొత్తపేట గ్రామాల రైతులు కూడా గుడిసెవాసులకు సహకరించారు. కానీ, ఆ భూమిపై కన్నేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు పైడిపల్లి కొత్తపేటలోని కొంతమంది రైతులకు మాయమాటలు చెప్పి కోర్టులో దావా వేయించారు. కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు గుడిసె వాసులకు ఎలాంటి నోటీసులూ అందించకుండా శనివారం తెల్లవారుజామున సుమారు 500 మంది పోలీసువు, 20 జేసీబీలతో వచ్చి పేదల ఇండ్లను కూల్చేశారు.

తమకు సొంత ఇండ్లు లేనందు వల్లే ఇక్కడ గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నామని.. కొంత సమయం ఇస్తే ఖాళీ చేస్తామని గుడిసె వాసులు కాళ్లావేళ్లా పడినా అధికారులు కనికరించలేదు. ఎదురు తిరిగిన వారిని నిర్దాక్షిణ్యంగా పోలీసులు లాక్కెళ్లి వ్యాన్‌లోకి ఎక్కించారు. ఈ సందర్భంగా గుడిసెవాసులు మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల కిందట పైడిపల్లి శివారులోని ఎస్సారెస్పీ కాలువ వద్ద తాము గుడిసెలు వేసుకున్నామన్నారు. తమకు సొంత ఇండ్లు లేవని, గిరి గిరి చిట్టీలు తీసుకొని సుమారు రూ.50 వేల ఖర్చుతో గుడిసెలు వేసుకొని ఇక్కడే నివసిస్తున్నామని తెలిపారు. స్టాలిన్‌నగర్ అని పేరు పెట్టుకున్నామని తెలిపారు. పోలీసులు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అకస్మాత్తుగా వచ్చి తమ గుడిసెలను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సొంత ఇల్లు లేకనే గుడిసెలు వేసుకుని నివసిస్తున్నామని, ప్రభుత్వానికి చేతనైతే తమకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతవరకు తాము ఇక్కడే ఉంటామని స్పష్టం చేశారు.

గుడిసెల కూల్చివేత దుర్మార్గపు చర్య
సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి రంగయ్య



పైడిపల్లి శివారులో వందలాది మంది పేదలు గుడిసెలు వేసుకుని రెండు సంవత్సరాలుగా అక్కడే నివాసం ఉంటున్నారు. గత రాత్రి రెవెన్యూ సిబ్బంది పోలీస్ బలగాలతో వచ్చి నిరంకుశంగా ఆ గుడిసెలను కూల్చి వేయడాన్ని ఖండిస్తున్నాం. ఈ భూమి ఎస్సారెస్పీ కాలువ కోసం సేకరించారు. దానికి సంబంధించి భూ యజమానులకు నష్టపరిహారం కూడా చెల్లించారు. ఈ భూమి ఎవరికీ సంబంధించిన పట్టాభూమి కాదు. పూర్తిగా ప్రభుత్వ భూమి. ఒకపక్క పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కల్పిస్తామని ప్రభుత్వాలు చెప్పాయి. కాబట్టి ఆ ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెల స్థలాలకు పట్టాలు ఇచ్చి.. పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని.. పేదలందరికీ న్యాయం చేయాలి.

దొందూ దొందే..

(మొదటిపేజీ తరువాయి)

రైతుబంధు రూ.15వేలకు పెంచడంలాంటి ఏ హామీనీ నెరవేర్చకుండా.. రైతులను మోసం చేస్తున్నది.. లక్షల ఎకరాల్లో పంటలు ఎండి పోతున్నా.. కనీసం పట్టించు కోవడం లేదు.. ఎకరాకు రూ.25వేల పరిహారం అందించాలి" అని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా రైతు దీక్షలు' చేపట్టారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువుతో పంటలు ఎండి రైతులు నష్టపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ వద్ద రైతు దీక్షలో ఆయన మాట్లాడారు. మేడిగడ్డ నుంచి రోజు 200క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కాళేశ్వరం జలాలను ఎలా సద్వినియోగం చేయాలో తెలియక, నీటిని వదలక పోవడంతోనే పంటలు ఎండిపోయాయని అన్నారు. కాళేశ్వరంలోని 300 పిల్లర్లలో రెండు పిల్లర్లు ఇసుకలో కుంగితే రిపేరు చేయకుండా రాజకీయాలు చేయడం వల్లే పంటలు ఎండే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు బోనస్ ఇవ్వాలని అనుకుంటున్నామని ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ లాగా అడ్డుకోకుండా తాము కూడా బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామని తెలిపారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ నష్టం చేస్తున్నదన్నారు. రైతు దీక్ష తరహాలోనే త్వరలోనే నేతన్నల దీక్ష చేపడతామని వెల్లడించారు.

తమ కార్యకర్తలపై కేసులు పెడుతూ బెదిరింపులు

సంగారెడ్డిలో రైతు దీక్షలో, అలాగే జహీరాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. తమ పార్టీని, తమను తిట్టడం తప్పా.. కాంగ్రెస్ వారికి అభివృద్ధి గురించి ఆలోచన లేదని విమర్శించారు. కేంద్రంలోని మోడీ సర్కార్ కూడా రైతులకు రుణమాఫీ, మద్దతు ధర ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు దొందూ దొందే అంటూ విమర్శించారు. తమ కార్యకర్తలపై కేసులు పెడుతూ బెదిరిస్తున్నారని.. ఏ ఒక్కరూ భయపడొద్దని, తమ ప్రాణాలను అడ్డుపెట్టైనా కార్యకర్తలకు అండగా నిలుస్తామని ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచిన బి.బి పాటిల్.. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన వాడు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలన కంటే కుట్రలు, కుతంత్రాలకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వాణిజ్యభవన్ సెంటర్ వద్ద జరిగిన రైతుదీక్షలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా అధికార పార్టీ యంత్రాంగం మొత్తం క్రికెట్ మోజులో నిమగ్నమయ్యారని విమర్శించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు మంత్రులు గజ దొంగల్లా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు.

రైతుల పండించిన వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటూ రూ. 500 బోనస్‌ను చెల్లించాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన దీక్ష చేపట్టారు. ఆలేరు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. ఏ రైతును కదిలించినా కన్నీరే వస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తాలో చేపట్టిన రైతు దీక్షలో అన్నారు.

ఖమ్మం జిల్లా కల్లూరులో మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీలు నలుగురు, కాంగ్రెస్ ఎంపీలు ముగ్గురు ఉన్నారని ఏనాడూ తెలంగాణ అభివృద్ధి కోసం మాట్లాడిన దాఖలాలు లేవని విమర్శించారు. జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి రైతు దీక్ష చేపట్టారు.

జైలుకు పోత కానీ పార్టీ మారను : ఎర్రబెల్లి

పాలకుర్తి దీక్షలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ మాట్లాడుతూ.. తాను జైలుకు పోత.. కానీ పార్టీ మారే ప్రసక్తే లేదన్నారు. హామీల అమలు అడిగితే కేసులతో భయపెడుతున్నారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని టీఆర్ఎస్‌గా మార్చే ఆలోచన చేస్తున్నామని అన్నారు.

అప్రజాస్వామికం

- గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి
- అక్రమంగా అరెస్టు చేసిన బషీర్‌ను తక్షణమే విడుదల చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరంగల్ నగరంలో పైడిపల్లి- కొత్తపేట శివారులోని ప్రభుత్వ భూమిలో రెండున్నరేండ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న 1,200 మంది పేదలపై శుక్రవారం రాత్రంతా పోలీసులు విధ్వంసం సృష్టించారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తెలిపింది. స్టాలిన్ నగర్‌గా పేరుపెట్టుకున్న ఆ ప్రాంతం మొత్తాన్ని ధ్వంసం చేశారని విమర్శించింది. పేదలకు ఇండ్ల పట్టాలిస్తామనీ, ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి రూ.ఐదు లక్షలు సహాయం చేస్తామంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేసింది. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న ఆ పేదలకు పట్టాలు ఇవ్వొచ్చనీ, ఇండ్లు కట్టుకోవడానికి సహాయం చేయొచ్చని పేర్కొంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదనీ, ఈ ధోరణిని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలు గుడిసెలు వేసుకున్నందుకు స్థానిక రైతులకు కూడా కొంత సౌలభ్యం ఏర్పడిందని తెలిపారు. పక్కనున్న వ్యవసాయ మార్కెట్‌లో కూడా కొన్ని సౌకర్యాలు ఏర్పడ్డాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక గ్రామీణ ప్రజలు, ఈ గుడిసె వాసులు పరస్పరం సహకరించుకుంటూ సంతోషంగా ఉన్న సమయంలో ఉన్నట్టుండి పోలీసులు విరుచుకుపడ్డారని పేర్కొన్నారు. సీపీఐ(ఎం) నాయకుడు బషీర్‌ను అరెస్టు చేశారని తెలిపారు. ఇతర నాయకుల కోసం ఇప్పుడు వెతుకుతున్నారని వివరించారు. ఇంతకంటే అన్యాయం ఏముంటదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడిందంటూ ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మహబూబాబాద్‌లో గుడిసెలను కూల్చివేశారని తెలిపారు. ఆ తర్వాత హన్మకొండలో ఒక కేంద్రంలో, జగిత్యాల, కోరుట్లలో గుడిసెలను ధ్వంసం చేశారని విమర్శించారు. జగిత్యాల, కోరుట్లలో గుడిసెలు ధ్వంసం చేసేటప్పుడు 307 సెక్షన్ కింద కూడా కేసులు పెట్టి నాయకులను 33 రోజులు జైలులో పెట్టారని తెలిపారు. తర్వాత బచ్చన్నపేటలో గుడిసెలు ధ్వంసం చేసి, ఇప్పుడు మళ్లీ వరంగల్‌లోని స్టాలిన్‌నగర్‌లో గుడిసెలను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్య పునరుద్ధరణ అనిపించుకోదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ గుడిసె వాసులకు పట్టాలిచ్చి, ఇండ్లు కట్టుకోవడం కోసం ప్రతి కుటుంబానికీ రూ.ఐదు లక్షల సహాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన బషీర్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. గుడిసెవాసులపై కేసులు పెట్టొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

ప్రభుత్వాల వల్లే ఈ సంక్షోభం

(మొదటిపేజీ తరువాయి)

12శాతానికి పెంచి నేతన్నల నడ్డి విరిచిందన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ కార్మికవర్గంపై చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. ఆయా కార్పొరేట్ కంపెనీలకు పెద్దపీట వేస్తూ బహుళజాతి కంపెనీల పనులు వేగంగా జరిగేలా సాయం అందిస్తున్న కేంద్రం.. ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో కార్మికులు, నష్టాల్లో నడుస్తున్న వస్త్ర పరిశ్రమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో గత సర్కారు ఈ ప్రాంత పరిశ్రమకు ఇచ్చిన ఆర్డర్ల బకాయిలు చెల్లించకపోవడం, ఇప్పుడున్న సర్కారు కనీసం దాని గురించి ఆలోచించకపోవడం బాధాకరమని అన్నారు. రాయితీపై యారన్, కరెంటు కూడా ఇవ్వలేదన్నారు. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో కార్మికుల కోసం నిర్మించిన అపరల్ పార్క్‌లోని షెడ్లల్లో తొండలు గుడ్లు పెడుతున్నాయని ఎద్దేవా చేశారు. మూన్నెళ్లుగా ఉపాధి లేక 30వేల మంది కార్మికులు రోడ్డునపడ్డారని, తినడానికి తిండి లేక ఆత్మహత్య చేసుకునే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల కిందట పవర్‌లూమ్ కార్మికుడు శ్రీనివాస్, శనివారం మరో కార్మికుడు సిరిపురం సత్యనారాయణ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోవడమే ఇందుకు అద్దం పడుతోందన్నారు. సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారే ప్రమాదం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులెవరూ ప్రాణం తీసుకోవద్దని, ధైర్యంగా ఉండాలని అన్నారు. సమస్య పరిష్కారం కోసం పోరాడుదామని, దీన్ని రాజకీయ కోణంలో కాకుండా ప్రజా సమస్యగా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. పాలక, ప్రతిపక్షాలు ఒకరిపైనొకరు ఆరోపణలు చేసుకోకుండా ఈ ప్రాంత వస్త్ర పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేతన్నల సమస్యలు పరిష్కరించాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్లను కోరినట్టు తెలిపారు. స్పందించిన మంత్రులు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని చెప్పారు.



నేతన్నలకు ఉపాధి కల్పించి, సిరిసిల్ల గుండె చప్పుడును కాపాడాలన్నారు. ఈ నేతన్నల మహాగర్జనలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీఐటీయూ రాష్ట్ర పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, సీఐటీయూ, ఇతర సంఘాల జిల్లా నాయకులు మూషం రమేష్, పంతం రవి, కోడం రమణ, తాటిపాముల దామోదర్, మంచే శ్రీనివాస్, మండల సత్యం, వెళ్లండి దేవదాస్, సిరిసిల్ల రవీందర్, మోర రాజు, లక్ష్మీనారాయణ, వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ నాణ్యమైన వైద్యం ప్రభుత్వాల బాధ్యత

- ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయాలి : ఐద్వా, డీవైఎఫ్ఐ రాష్ట్ర సదస్సులో మల్లు లక్ష్మి, కోట రమేష్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ చెప్పారు. ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. 'ప్రజారోగ్యం, ప్రభుత్వ ఆస్పత్రులు'అనే అంశంపై శనివారం హైదరాబాద్‌లో ఐద్వా, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సును నిర్వహించాయి.

ఈ సందర్భంగా మల్లు లక్ష్మి, కోట రమేష్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని పటిష్టపర్చాలనీ, వైద్య రంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజలు వైద్య సేవలు అందించేందుకు మరిన్ని ప్రభుత్వ ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని కోరారు. ఉన్న వాటిలో మౌలిక వసతులను మెరుగుపర్చాలనీ, వైద్యులు, ఇతర సిబ్బందిని నియమించాలని చెప్పారు. వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డబ్ల్యూహెచ్‌వో నిబంధనల ప్రకారం వెయ్యి మందికి ఒక డాక్టర్ ఉండాలనీ, దాన్ని కచ్చితంగా అమలు చేయాలని కోరారు. సకాలంలో వైద్యం అందకపోవడంతో రోగులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న జనాభాకనుగుణంగా ఆస్పత్రులు అందుబాటులో లేకపోవడం వల్ల లక్షలాది మంది గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ఆస్పత్రులకు వెళ్తున్నారని వివరించారు. పలు టెస్టులు, సర్జరీల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తుందని చెప్పారు. సరిపడా సిబ్బందిని నియమించి పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలను బలోపేతం చేయాలని కోరారు. మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ప్రసూతి మరణాలు, శిశు మరణాలను తగ్గించాలని చెప్పారు. పౌష్టికాహార లోపం వల్ల పిల్లలు చనిపోతున్నారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపర్చాలని సూచించారు. మొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందించాలని కోరారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి, డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ జావీద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలత, కోశాధికారి రత్నమాల, సహాయ కార్యదర్శి కె నాగలక్ష్మి, నాయకులు శశికళ, లక్ష్మమ్మ, వినోద, షబానా, మస్తాన్‌బి, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సాగర్, కిషన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రాజీనామా చేయించాలి

- లేదంటే స్పీకర్ ద్వారా అనర్హత వేటు వేయించాలి : రాహుల్ గాంధీకి కేటీఆర్ సవాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రాజీనామా చేయించాలనీ, లేదంటే స్పీకర్ ద్వారా అనర్హత వేటు వేయించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అలా చేయడం ద్వారా చెప్పిందే చేస్తాం, అబద్ధాలు చెప్పమనే విషయాన్ని నిరూపించుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ఆయన శనివారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. భారతదేశంలో ఇతర పార్టీల నుంచి నేతల్ని చేర్చుకోవడం ప్రారంభించిందే కాంగ్రెస్ అని విమర్శించారు. తాను ప్రారంభించిన ఆయారాం- గయారాం సంస్కృతిపై ఇప్పటికైనా కాంగ్రెస్ విధానం మార్చుకోవడం మంచిదేనని తెలిపారు. ఆ పార్టీ తన మ్యానిఫెస్టోలో పార్టీ మారితే ఆటోమేటిగ్గా సభ్యత్వం రద్దు అనే హామీని పేర్కొనడం స్వాగతించదగిందని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఎప్పటిలానే చెప్పేదొకటి చేసేదొకటిగా ఉంటుందని తెలిపారు. తాను హామీ ఇచ్చిన దానికి పూర్తి వ్యతిరేకంగా కాంగ్రెస్ విధానాలుంటాయని విమర్శించారు.

ఒకవైపు మ్యానిఫెస్టోలో ఇతర పార్టీల నుంచి చేర్చుకోమంటూనే... తెలంగాణలో కారు గుర్తుపై గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేకి ఎంపీ టికెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను రాజీనామా చేయకుండానే పార్టీలో చేర్చుకుందని తెలిపారు. రాహుల్ గాంధీకి తమ హామీలపై నిబద్ధత ఉంటే ఈ అంశంపై మాట్లాడాలని సూచించారు. లేకుంటే ఆయన ఒక హిపోక్రట్‌గా మిగిలిపోతారని పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్‌పై శిక్షణా తరగతులు

- కళాశాల విద్యాశాఖ, ఐఐటీ బాంబే మధ్య ఒప్పందం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలోని డిగ్రీ విద్యార్థులకు ఆడియో, వీడియో రూపంలో వివిధ రకాల సాఫ్ట్‌వేర్‌పై శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. శనివారం హైదరాబాద్‌లో కళాశాల విద్యాశాఖ కమిషనర్, ఐఐటీ బాంబేకు చెందిన స్పోకెన్ ఇంగ్లీష్ ట్యుటోరియల్ ప్రాజెక్టు మధ్య ద్వైపాక్షిక ఒప్పందం కుదిరింది. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం, ఐఐటీ బాంబే, స్పోకెన్ ట్యుటోరియల్‌ప్రాజెక్టు నేషనల్ కోఆర్డినేటర్ ఆకాంక్ష సాయిని ఆ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఐటీ సాఫ్ట్‌వేర్, యూ ట్యుటర్ కోర్సు, మూక్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది.

ఈ ప్రాజెక్టు 2009 నుంచి కేంద్ర ప్రభుత్వం వారి ద్వారా నేషనల్ మిషన్ ఆన్ ఎడ్యుకేషన్ ఐసీటీ ద్వారా నిర్వహిస్తున్నది. ఈ స్పోకెన్ ట్యుటోరియల్‌లో బేసిక్ ఐటీ స్కిల్స్, గ్రాఫిక్, యానిమేషన్, ప్రోగ్రామ్ లాంగ్వేజెస్, వెబ్ డెవలప్‌మెంట్, డాటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులను విద్యార్థులకు అందిస్తుంది. విద్యార్థులు ఐఐటీ బాంబే స్పోకెన్ ట్యుటోరియల్ ప్రాజెక్టు ద్వారా శిక్షణా కార్యక్రమాలను ఇంగ్లీష్, తెలుగు, హిందీ తదితర 22 ప్రాంతీయ భాషల్లో నేర్చుకుంటున్నారు. విద్యార్థులు ఐటీ స్కిల్స్, కంప్యూటర్ సంబంధిత సాంకేతిక అంశాల్లో యానిమేషన్, మల్టీమీడియా ప్రోగ్రాం లాంగ్వేజ్‌లో శిక్షణ పొంది వివిధ రకాల స్కిల్ ఆధారిత ఉపాధి అవకాశాలను అందుకుంటారు. కళాశాల అధ్యాపకులకు కూడా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నది. ఈ స్పోకెన్ ట్యుటోరియల్ జాబ్ ఫెయిర్, జాబ్‌మేళాలు నిర్వహిస్తూ శిక్షితులైన విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నది.

ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు జి యాదగిరి, రాజేంద్రసింగ్, అకడమిక్ గైడెన్స్ అధికారి పి బాలభాస్కర్, అకడమిక్ అధికారి ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశమివ్వండి!

- లేదంటే విద్యాసంవత్సరం నష్టపోతాం : స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేయని విద్యార్థుల ఆందోళన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉన్నత విద్యను అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులు చాలామంది స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కొత్తగా (ఫ్రెష్), పునరుద్ధరణ (రెన్యూవల్)కు దరఖాస్తు చేసుకోలేదు. దీంతో వందలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మరోసారి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. చాలా మంది విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలుండటం వల్ల పరీక్షలపై దృష్టి పెట్టారు.

ఇంకోవైపు దరఖాస్తులు చేసుకోవాలంటూ కొన్ని కాలేజీల యాజమాన్యాలు కూడా విద్యార్థులకు సమాచారం ఇవ్వలేదు. దీంతో వారికి స్కాలర్‌షిప్ దరఖాస్తుకు చివరి తేదీ తెలియక దరఖాస్తు చేసుకోలేదు. మార్చి 31తో దరఖాస్తు గడువు ముగిసిన విషయం తెలిసిందే. దరఖాస్తు చేసేందుకు మరోసారి అవకాశమివ్వాలంటూ హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయానికి ప్రతి రోజూ విద్యార్థులు వస్తున్నారు. అధికారులు గడువు ముగిసిందని చెప్తున్నారు. మరోసారి దరఖాస్తు చేసేందుకు అవకాశం ఇచ్చేది లేదంటున్నారు. దీంతో చాలా మంది పేద విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆధారంగానే ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రాకపోతే సొంతంగా ఫీజులు చెల్లించే పరిస్థితి లేదు.

ఆ విద్యార్థులకు మరోసారి అవకాశమివ్వకపోతే ఈ విద్యా సంవత్సరం చదువుకు దూరమయ్యే ప్రమాదమున్నది. దీనివల్ల చాలామంది పేద విద్యార్థులకు అన్యాయం జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దరఖాస్తు చేసుకునేందుకు మరోవారం, పది రోజులు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంక్షే శాఖ, విద్యాశాఖ అధికారులు స్పందించి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు చివరిసారి అవకాశం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్య శాఖను ప్రక్షాళన చేస్తాం

- సీనియార్టీ ప్రకారమే ప్రమోషన్లు : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



రాష్ట్రంలో వైద్య శాఖను ప్రక్షాళన చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వరల్డ్ హెల్త్ డే సెలబ్రేషన్స్‌ను పురస్కరించుకుని ఉస్మానియా మెడికల్ కళాశాల అల్యూమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో సూపర్ స్పెషాలిటీ విద్యార్థులకు గోల్డ్ మెడల్ ప్రదానోత్సవం నిర్వహించారు. మంత్రి హాజరై విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో ఆధునిక వైద్య కళాశాలలు, వైద్యశాలలను నిర్మించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రి విషయం కోర్టులో ఉన్నదని.. అది తేలగానే ఆధునిక ఆస్పత్రిగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రస్తుతం కమిషనర్లను, డైరెక్టర్లను సీనియార్టీ ప్రకారం నియమిస్తున్నామని తెలిపారు. వైద్య శాఖలో సీనియార్టీకి ప్రాధాన్యత ఇస్తూ ప్రమోషన్లు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రత్యేక చికిత్సలు ఉండేలా కృషి చేస్తామన్నారు. వైద్యాధికారులు, ఉద్యోగులు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఉస్మానియా అంటేనే ఒక బ్రాండ్ అని.. అది మెడికల్ అయినా ఇంజినీరింగ్ అయినా ఉస్మానియానే అని అన్నారు. రాష్ట్రంలో మోడల్ లెక్చర్ హాల్స్, హాస్టల్ బిల్డింగ్స్ నిర్మిస్తామని తెలిపారు. జూన్‌లో వీటికి ప్రత్యేక బడ్జెట్‌ను తీసుకొచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెడికల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుధాకర్ యాదవ్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర కుమార్, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, డాక్టర్ శివ శివరాంప్రసాద్, అసోసియేషన్ చైర్మెన్ డాక్టర్ కృష్ణారెడ్డి, అధ్యక్షులు శ్రీధర్, కార్యదర్శి కృష్ణమూర్తి, ఆఫీస్ ఇన్‌చార్జి రఘుమోహన్, వేణుగోపాల్ గౌడ్, పూర్వ వైద్య విద్యార్థులు, యువ వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



కేసీఆర్ పొగరుబోతు, అబద్ధాలకోరు

- ఆయన మాటలను నమ్మొద్దు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ సీఎం కేసీఆర్ పొగరబోతు, అబద్ధాలకోరు అనీ, ఆయన మాటలను నమ్మొద్దంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలను కోరారు. శనివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాటా అబద్ధమేనని అన్నారు. ఆయనలా తమ పార్టీ నేతలు పాస్ పోర్టులను అమ్ముకోలేదనీ, కాంట్రాక్టర్లకు బ్రోకర్లుగా పని చేయలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఫ్రస్ట్రేషన్‌లో సిగ్గులేకుండా పిచ్చి లేచినట్టుగా బ్రోకర్, జోకర్ అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. సూర్యాపేటకు నాగార్జునసాగర్ నుంచి తాగునీరు మాత్రమే ఇచ్చామనీ, సాగునీరు కాదని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారమే సూర్యాపేట, పాలేరుకు నీళ్లిచ్చామే తప్ప కేసీఆర్ ముఖం చూసి కాదని చెప్పారు. ఆయన పొగరు వల్లే 104గా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 39కి పడిపోయిందనీ, అందులోనూ 25 మంది కాంగ్రెస్‌లో చేరబోతున్నారని తెలిపారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ధనిక రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిన కేసీఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. పదేండ్లలో పంట నష్టం ఇవ్వని ఆయన ఫామ్‌హౌజ్‌లో నిద్రపోయారని విమర్శించారు. నాలుగు మాసాల కాంగ్రెస్ పాలనను చూసి ఉలిక్కి పడుతున్న కేసీఆర్, కుర్చీ వేసుకుని కడుతా అని చెప్పిన ప్రాజెక్టుల్లో ఒక్కటైనా నిర్మించారా? అని ప్రశ్నించారు. దమ్ముంటే మేడిగడ్డకు కాదు... పాలమూరుకు రావాలని జూపల్లి సవాల్ విసిరారు. మిషన్ భగీరథలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోయిన 12 సార్లు సోనియా, ఖర్గే అపాయింట్ మెంట్ ఇచ్చారనీ, కేసీఆర్ ఏనాడు హైదరాబాద్‌లో ఉన్న మంత్రులను కలవలేదని తెలిపారు. తలకిందులుగా తపస్సు చేసినా రాష్ట్రంలో బీఆర్ఎస్ ఒక్క లోక్ సభ సీటూ గెలవదని తెలిపారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతే పార్టీనే రద్దు చేసుకుంటా... అని చెప్పే దమ్ము కేసీఆర్ కు ఉందా? అని ప్రశ్నించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేసీఆర్ అత్తగారి ఊర్లో ఎవరు ఎటువైపు ఉంటారో చూద్దామా? అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో కేసీఆర్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడారని తప్పుపట్టారు. ఆయన వాడిన భాషకు కౌంటర్ ఇస్తే తల ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. కేసీఆర్ చవట, దద్దమ్మ కాకపోతే మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా ఎలా మార్చారని ప్రశ్నించారు. 2014 నుంచి బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రూ.4 వేల పెన్షన్ హామీని అమలు చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ హయంలో పంట నష్టం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పదేండ్లలో పాలమూరుకు కేసీఆర్ ఏం చేశారని ప్రశ్నించారు. మిషన్ భగీరథలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని మంత్రి పొన్నం ఆరోపించారు

బూటకపు ఎన్ కౌంటర్లకు కాంగ్రెస్‌దే బాధ్యత

- ములుగు ఎస్పీ కనుసన్నల్లోనే ఎన్‌కౌంటర్లు
- బీకే ఏఎస్ఆర్ కార్యదర్శి ఆజాద్ పేరుతో మావోయిస్టుల లేఖ

నవతెలంగాణ-ఏటూరు నాగారం ఐటిడిఏ

ములుగు జిల్లా సహరిద్దు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం భీజాపూర్ పూజారి కాంకేర్‌లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం -అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరుతో శనివారం ఒక లేఖ విడుదలైంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాజ్యం స్వభావం మారదని, ప్రజల కోసం పోరాడుతున్న మావోయిస్టులపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర పోలీసులు రాజ్యహింసకు తెగబడుతున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ కంపనీల అడుగులకు మడుగులొత్తేలా వారు పనిచేస్తున్నారు. ఈ హింసలో పార్టీలకు ఎలాంటి భిన్నాభిప్రాయం లేదని, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అన్ని పార్టీలదీ ఒకటే వ్యూహం అన్నారు. డ్రోన్లు, హెలీకాప్టర్లతో ఆకాశ మార్గం గుండా దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో మహారాష్ట్ర సరిహద్దులో ముగ్గురు కామ్రేడ్స్‌పై విష ప్రయోగం చేసి పట్టుకొని అతి కిరాతకంగా హింసించి ఎన్‌కౌంటర్ కథలు అల్లారన్నారు. శనివారం తెల్లవారుజామున బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ పూజారి కాంకేర్ తెలంగాణ గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ, కోబ్రా పోలీసులకి మావోయిస్టులకు మధ్య జరిగిన భయంకర యుద్ధంలో మావోయిస్టులు ముగ్గురు అమరులయ్యారని పేర్కొన్నారు. తెలంగాణ ఎస్ జెడ్సీ సభ్యులు కామ్రేడ్ సాగర్‌తోపాటు కామ్రేడ్ మణిరాం (ఏసీఎం) మరో కామ్రేడ్ అమరులయ్యారన్నారు. అప్పుడు కేసీఆర్, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను పరిరక్షిస్తానని.. ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతానని చెప్పి మావోయిస్టు పార్టీపై పోలీసు బలగాలతో దాడులు చేయిస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యహింసలో ఒకరిని మించిన వారు ఇంకొకరు అన్నట్టు రుజువు చేసుకుంటున్నారన్నారు. ములుగు ఎస్పీ పథకం రచించి ఈ ఎన్‌కౌంటర్‌కు పాల్పడినట్టు తెలుస్తోందని.. అందుకు మూల్యం చెల్లించుకోక తప్పదని లేఖలో పేర్కొన్నారు.

15 కోట్ల మార్క్‌కు డిమ్యాట్ ఖాతాలు

- ఏడాదిలో కొత్తగా 3.5 కోట్ల అకౌంట్స్ జారీ

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో రికార్డ్ స్థాయిలో కొత్తగా 3.7 కోట్ల డిమ్యాట్ ఖాతాలు తెరిచారు. అంతక్రితం ఏడాదితో పోల్చితే 32 శాతం అధికం. స్టాక్ మార్కెట్‌లో నేరుగా పెట్టుబడులపై ఆసక్తులు పెరగడంతో భారీ సంఖ్యలో కొత్త ఖాతాలు నమోదవుతున్నాయి. 2024 మార్చి ముగింపు నాటికి దేశంలో మొత్తం డీమ్యాట్ ఖాతాలు 15 కోట్లు దాటి నూతన మైలురాయిని చేరుకున్నాయి. ఈక్విటీ మార్కెట్ల నుంచి ఆకర్షణీయ రాబడులను పొందవచ్చనే ఆలోచనలతో అనేక మంది డిమ్యాట్ ఖాతాలను తెరిచారు. గడిచిన ఏడాది కాలంలో సగటున ప్రతి నెలా 30 లక్షలకు పైగా కొత్త డీమ్యాట్ ఖాతాలు నమోదయ్యాయి. 2020-21లో 1.4 కోట్ల కొత్త డిమ్యాట్ ఖాతాలు తెరుబడ్డాయి.దేశంలో సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సిడిఎస్ఎల్), నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డిఎల్)లు డిమ్యాట్ ఖాతాలను తెరవడం, నిర్వహించడం చేస్తున్నాయి. గడిచిన ఏడాదిలో ఈ సంస్థలు వరుసగా 11.9 శాతం, 15.14 శాతం పెరుగుదలను సాధించాయి. 2023 మార్చి ముగింపు నాటికి దేశంలో ఈ రెండు సంస్థలు కలిసి 11.45 కోట్ల డిమ్యాట్ ఖాతాలను అందించాయి. భారత మార్కెట్లపై పలు ఎజెన్సీలు అంచనాలు పెంచడం, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెరగడం, ఈక్విటీలపై యువత ఆసక్తి, పలు కంపెనీలు ఐపిఒలకు రావడం తదితర అంశాలు డిమ్యాట్ ఖాతాల పెరుగుదలకు ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2023-24లో ఐపిఒల ద్వారా ద్వారా 76 కంపెనీలు రూ.61,921 కోట్ల నిధులు సమీకరించాయి. అదే ఏడాది సెన్సెక్స్ నిఫ్టీలు వరుసగా 24.85 శాతం, 28.61 శాతం చొప్పున రిటర్న్‌లను అందించాయి. బిఎస్ఇ మిడ్ క్యాప్ సూచీ 63.4 శాతం, స్మాల్ క్యాప్ 60 శాతం చొప్పున పెరిగాయి.

బిగ్‌సీ ఉగాది ఆఫర్లు

నవ తెలంగాణ -హైదరాబాద్



మొబైల్స్ రిటైల్ అమ్మకాల్లో 21ఏండ్లకు పైగా అనుభవమున్న బిగ్ సీ...ఉగాది పండగ సందర్భంగా తమ కస్టమర్లకు వినూత్న ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టివిలు,ల్యాప్‌టాప్, ఏసీ కొనుగోళ్లపై 7.5శాతం వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్, ఆకర్షణీయమైన ఆఫర్లు అందిస్తున్నట్టు కంపెనీ సీఎండీ ఎం. బాలు చౌదరి తెలిపారు. ఒక ఏడాది మొబైల్ ప్రొటెక్షన్ కొనుగోలుపై రెండో సంవత్సరం రూ.8వేల విలువగల మొబైల్ ప్రొటెక్షన్ అదనంగా పొందవచ్చు. ప్రతి మొబైల్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి పొందవచ్చు. డౌన్‌పేమెంట్, వడ్డీ లేకుండా సులభమైన వాయిదా పద్ధతి సౌకర్యం కూడా ఉందని సీఎండీ వివరించారు. ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలతో పాటు అనేక ఆఫర్లను బిగ్‌సీ అందిస్తోంది.

రాజ్యసభ సభ్యుడిగా అనిల్ యాదవ్ ప్రమాణం

- గుజరాత్ నుంచి ఎగువసభ ఎంపీగా బీజేపీ అధ్యక్షుడు నడ్డా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



కాంగ్రెస్ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా అనిల్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం పార్లమెంట్‌లోని ప్రత్యేక రూంలో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ కొత్తగా ఎన్నికైన ఆరుగురు నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయన్ సింగ్, రాజ్యసభ సెక్రటరీ జనరల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ మందాడి ప్రమాణం చేశారు.

అంతకు ముందు బీజేపీ అధ్యక్షుడు జయప్రకాశ్ నడ్డా గుజరాత్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేశారు. అలాగే మహారాష్ట్ర నుంచి అశోక్ రావు శంకర్ రావు చౌవాన్ (బీజేపీ), రాజస్థాన్ నుంచి చున్నిలాల్ గరాసియా (బీజేపీ), పశ్చిమ బెంగాల్ నుంచి టీఎంసీకి చెందిన సుశ్మిత దేవ్, మహ్మద్ నదిముల్ హక్ ప్రమాణం చేశారు.

అనంతరం నూతన సభ్యులతో కలిసి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ఫొటో సెషన్‌లో పాల్గొన్నారు. కాగా, 2015 నుంచి 2018 వరకు కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులుగా అనిల్ యాదవ్ పని చేశారు. అనంతరం 2018లో ముషీరాబాద్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో నిలిచి ఓటమి పాలయ్యారు. 2023లో పార్టీ ఆయనను సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. ఇటీవల తెలంగాణ నుంచి మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ కాగా, ఇందులో ఒక స్థానం నుంచి అనిల్ కుమార్ యాదవ్‌కు కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కల్పించింది. రాజ్యసభ ఎన్నికల్లో అనిల్ ఎన్నిక కావడంతో ఆయన ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు.

గాజాపై ఐరాస తీర్మానం

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా ఓటేశారు. 13 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఇండియాతో పాటు ఫ్రాన్స్, జపాన్, నెదర్లాండ్స్, రొమేనియా దేశాలు కూడా ఓటింగ్‌లో పాల్గొనలేదు. వ్యతిరేకంగా ఓటు వేసిన దేశాల్లో అర్జెంటీనా, బల్గేరియా, జర్మనీ, అమెరికా ఉన్నాయి. అనుకూలంగా ఓటేసిన దేశాల్లో బంగ్లాదేశ్, బెల్జియం, బ్రెజిల్, చైనా, ఇండోనేషియా, కువైట్, మలేషియా, మాల్దీవులు, ఖతార్, సౌత్ ఆఫ్రికా, యూఏఈ, వియత్నాం ఉన్నాయి.

కర్రిగుట్టపై తుపాకీ గుండ్ల వర్షం

- ముగ్గురు మావోయిస్టులు మృతి
- వివరాలు వెల్లడించిన పోలీసు వర్గాలు

నవతెలంగాణ-చర్ల



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోసూరు పోలీస్‌స్టేషన్ పరిధి నంబి అటవీ ప్రాంతంలో కర్రిగుట్టపై మావోయిస్టులకు భద్రతా దళాలకు జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో సాగర్ అలియాస్ సంతోష్, మనీ రామ్‌తోపాటు మరో మావోయిస్టు ఉన్నారు. కర్రిగుట్ట ప్రాంతంలో మావోయిస్టులు రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్తంగా శుక్రవారం దండకారణ్యాన్ని జల్లెడ పట్టసాగాయి. ఈ క్రమంలో ఉసురు బ్లాక్ పూజారి కాంకేర్ సమీప అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. గ్రే హౌండ్స్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్తంగా మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. సంఘటనా స్థలం నుంచి ఎల్ఎంజీ, ఏకే 47 సహా 12 బోరు తుపాకులు, అనేక ఆయుధాలు, నిత్యావసర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధ్రువీకరించారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

- టిప్పర్ మట్టి పడి అన్నాచెల్లెళ్లు ముగ్గురు..
- కేబుల్ బ్రిడ్జిపై కారు ఢీకొని ఒకరు..

నవతెలంగాణ - హుజూరాబాద్/మియాపూర్



పెద్దమ్మ బోనాలకు వెళ్లి తిరిగి వస్తుండగా.. టిప్పర్‌లోని మట్టి మీద పడటంతో ఊపిరాడక ముగ్గురు అన్నా చెల్లెళ్లు ప్రాణం కోల్పోయారు. ఈ విషాద ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. అలాగే, హైదరాబాద్‌లోని కేబుల్ బ్రిడ్జిపై ఫొటోలు దిగుతున్న యువకులను కారు ఢీకొట్టడంతో ఒకరు ప్రాణం కోల్పోయారు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలో పెద్దమ్మ బోనాలు జరిగాయి. ముదిరాజులంతా బోనాలతో దేవాలయంలో పూజల్లో పాల్గొన్నారు. బోనాలు ముగిసిన తర్వాత అన్నాచెల్లెలు గంట విజయ్, గంట వర్ష, వారి పెద్దనాన్న కూతురు గంట సింధూజ మోటార్ సైకిల్‌పై ఇంటికి బయలుదేరారు. గ్రామ మధ్యలో బొడ్రాయి వద్ద ఎదురుగా టిప్పర్ వస్తుండటంతో రోడ్డు పక్కన ఆగారు. కానీ, వేగంగా వచ్చిన టిప్పర్ అదుపు తప్పి మూలమలుపు వద్ద బోల్తా పడింది. టిప్పర్‌లో ఉన్న మట్టి రోడ్డు పక్కన ఆగిన ముగ్గురు పిల్లలపై పడింది. ఆ వెనుకనే వస్తున్న సింధూజ తాత కొమురయ్య పిల్లలు కనిపించకపోవడంతో కేకలు వేశాడు. స్థానికులు వెంటనే జేసీబీ సహాయంతో మట్టిని తొలగించారు. అప్పటికే ముగ్గురు పిల్లలు ఊపిరాడక ప్రాణం కోల్పోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతదేహాలను హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వర్ష, సింధూజ, విజయ్ ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

కేబుల్ బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం

హైదరాబాద్‌లోని కేబుల్ బ్రిడ్జిపై శుక్రవారం అర్ధరాత్రి కారు ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతిచెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్ (25), అజయ్ కేబుల్ బ్రిడ్జిపై అర్ధరాత్రి ఫొటోలు దిగుతున్నారు. ఈ క్రమంలో ఓ కారు వీరిని ఢీకొట్టింది. దాంతో అనిల్, అజయ్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, వారిని ఆస్పత్రికి తరలించారు. అనిల్ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కారు నెంబర్ ఆధారంగా యజమాని వెంకట్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, తన కారును ఇతరులు తీసుకెళ్లారని ఆయన చెప్పాడు. పరారీలో ఉన్న డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

బ్రిడ్జిపై సెల్ఫీలు దిగొద్దు : ఇన్‌స్పెక్టర్ మల్లేష్

కేబుల్ బ్రిడ్జిపై సెల్ఫీలు నిషేధించినట్టు ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారి వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేబుల్ బ్రిడ్జి వంతెనపై వాహనాలు నిలపడం, సెల్ఫీలు దిగడం పూర్తిగా నిషేధమన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బ్రిడ్జి వంతెనకు ఇరువైపులా ఉన్న గోడ ఎత్తు పెంచాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరామన్నారు.

రోడ్డు ప్రమాదంలో..తల్లీ కూతుళ్లు మృతి

నవతెలంగాణ-దమ్మపేట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, ఇద్దరు పిల్లలు మృతిచెందారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన దంపతులు చీపు బాలకృష్ణ(35), లక్ష్మి(30)కు ఇద్దరు కుమార్తెలు శరణ్య(8), శాన్విక(6). వీరంతా బైక్‌పై ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట నుంచి అశ్వరావుపేట వైపు కోళ్ల ఫారంలో పనిచేయటానికి వస్తున్నారు. మందలపల్లి సమీపంలో దాబా హోటల్ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీ కొట్టింది. అదే సమయంలో కింద పడిన వారిపై నుంచి లారీ వెళ్లడంతో తల్లి, ఇద్దరు కుమార్తెలు అక్కడికక్కడే మృతిచెందారు. చీపు బాలకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

కోర్టు ఆదేశాల మేరకు కుంట్లూర్ సర్వే నెంబర్ 234, 235లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన గోడౌన్‌లను మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి నేతృత్వంలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్, హయత్ నగర్ పోలీసులు, ఫైర్ సిబ్బంది, జిల్లా టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో కూల్చివేశారు. గోడౌన్‌లో టైల్స్, ఇతర సామగ్రి ఉండడంతో 2 వారాలు గడువు ఇస్తూ కూల్చివేతలు చేపట్టినట్లు మున్సిపల్ అధికారులు చెప్పారు.

మహేష్‌కు బెస్ట్ యాక్టింగ్ అవార్డు



నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్‌లోని వాసవి కాలనీకి చెందిన గుడుగుంట్ల మహేష్ బెస్ట్ యాక్టింగ్ అవార్డును అందుకున్నారు. త్యాగరాయ జ్ఞాన సభలో జోష్ నేషనల్ ఫిలిం అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన నంది అవార్డ్స్ - 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ బింబిసార, విశ్వంభరా సినిమాల డైరెక్టర్ వశిష్ట చేతుల మీదుగా బెస్ట్ యాక్టింగ్ అవార్డును మహేష్ అందుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తనకు ఏ పాత్ర ఇచ్చినా ఆ పాత్రలో ఒదిగిపోయి ప్రేక్షకులను సంతోషపరచడమే తన లక్ష్యమన్నారు.



అనాథ విద్యార్థి గృహం ఓ ఆలయం

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

అనాథ విద్యార్థి గృహం ఒక దేవాలయం అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ చిత్రా లే అవుట్‌లోని అనాథ విద్యార్థి గృహ గ్రౌండ్ ఫ్లోర్‌లో కొత్తగా నిర్మించిన 14 వాష్ రూమ్స్, అధునాతన హెయిర్ కటింగ్ సెలూన్, వాషింగ్ మిషన్స్ ఏరియాలను శనివారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ విద్యార్థులకు భోజన, వసతి, ప్రైవేట్ పాఠశాలలలో, కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు ఇప్పించి, అధునాతన లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, ఆధునిక వైద్య సేవలు, అన్ని విద్య సౌకర్యాలు కల్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్న అనాథ విద్యార్థి గృహం ఒక దేవాలయం అని అన్నారు. ఎలాంటి ఉద్యోగులను పెట్టుకోకుండా, ఎవరికి జీతాలు లేకుండా హాస్టల్ లో అన్ని బాధ్యతలను ముఖ్యంగా ఆర్థికపరమైన పరిపాలన బాధ్యతలు విద్యార్థులకే అప్పచెప్పి, వినూత్నమైన పద్ధతిలో పరిపాలన చేస్తున్న గృహ కమిటీని అభినందించారు. అనంతరం గృహ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అనాథ గృహ అధ్యక్షులు మార్గం రాజేష్, ప్రధాన కార్యదర్శి పద్మజ, సలహా మండలి చైర్మన్ శశిమోహన్, కోశాధికారి సుప్రసన్న దేవి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

'మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు'



నవతెలంగాణ - బడంగ్‌పేట్

ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పహాడి షరీఫ్ మాజీ ఎంపీటీసీ మహమూద్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, పట్లోళ్ల యువ నాయకుడు కార్తీక్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పండుగలను కుల, మతాలకు అతీతంగా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ విందులో కౌన్సిలర్లు దస్తగిర్ షేక్ అఫ్జల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాసర్ అవళ్లి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో నాయకులు..



మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పహాడి షరీఫ్ గ్రామంలో ఉన్న ప్రీమియర్ పంక్షన్ హాల్లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎంపీ. డా. రంజిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా చైర్ పర్సన్ తీగల అనితా హరినాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దీప భాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ అబ్దుల్లా, జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, రిప్రజెంట్ వైస్ చైర్మన్ సయ్యద్ యూసుఫ్ పటేల్, నాయకులు ఖలీఫా, కౌన్సిలర్ యాహియా తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం డివిజన్‌లోని హిల్ కాలనీ కమ్యూనిటీ హాల్లో పోలింగ్ బూత్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్ రావు, నూతి శ్రీనివాస్ రావు, మధుకర్ గౌడ్, బద్దం రాంరెడ్డి, కిరణ్ యాదవ్, భద్ర రాజు, రాజ్ కుమార్, వెంకట్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - ఎల్బీనగర్

జన జాతర సభకు తరలిన నాయకులు



నవతెలంగాణ - చైతన్యపురి

చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే జన జాతర సభకు ఆర్కేపురం నుండి కార్యకర్తలు, నాయకులు శనివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు వాగ్దానాలను అమలు చేసిందని, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఇచ్చే హామీలను అమలు చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పున్నా గణేష్ నేత, ముప్పిడి లింగస్వామి గౌడ్, యాదవ రెడ్డి, హైటెక్ రాము, శ్రీనివాస్ గుప్తా, శ్రీకాంత్ రెడ్డి, విప్లవ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్య పరచడమే జనజాతర లక్ష్యం

నవతెలంగాణ - సంతోష్‌నగర్

అన్ని వర్గాల ప్రజలను చైతన్య పరచడమే జన జాతర లక్ష్యం అని కాంగ్రెస్ నాయకుడు మధుయాష్కీ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే జన జాతర సభకు వెళ్లే బస్‌ను శనివారం జెండా ఊపి మధుయాష్కీ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు చంపాపేట్ నుండి స్థానిక నాయకులతో కలిసి 300 మంది కార్యకర్తలు, అభిమానులు, తదితరులతో కలిసి వెళ్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం చైర్మన్ నల్ల రఘుమా రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామా రమణ రెడ్డి, సామ రంగారెడ్డి, రవీందర్ గౌడ్, మెట్టు వెంకట్ రెడ్డి, గౌతమ్ రెడ్డి, జగదీష్, నిషికాంత్ రెడ్డి, దినేష్ రెడ్డి, బాలకృష్ణ, శివ, సామ శ్రీధర్ రెడ్డి, శంకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఓటుతో ప్రజాస్వామ్య వ్యవస్థను

మరింత బలోపేతం చేయాలి

- స్వీప్ నోడల్ అధికారి అరుణ కుమారి



నవతెలంగాణ - సిటీబ్యూరో

ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన ఎన్నికల ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేసి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని స్వీప్ నోడల్ అధికారి అరుణ కుమారి కోరారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో గల జీవీకే షాపింగ్ మాల్‌లో ఓటు హక్కు వినియోగం, ఓటు ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'ఐ ఓట్ ఫర్ షుడర్' అని వ్రాసిన ప్లకార్డులను ప్రదర్శించారు. అదేవిధంగా ఓటర్లను చైతన్య పరిచే విధంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

షాపింగ్ మాల్ కు వచ్చిన ప్రతి ఒక్కరూ ఓటరు చైతన్య కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి అరుణ కుమారి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి కీలకమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఓటరు జాబితాలో తమ పేరును చెక్ చేసుకోవాలని తెలిపారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని, కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం కల్పిస్తున్న అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. అందరు స్ఫూర్తి వంతంగా ఓటింగ్‌లో పాల్గొని పోలింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వీప్ అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ ఆశా, జూబ్లీహిల్స్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ (డీ.పీ.ఓ.లు), ఆర్పీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సత్యం హోమియోపతి

ఉచిత హెల్త్ క్యాంప్ ప్రారంభం

నవతెలంగాణ - చైతన్యపురి

కొత్తపేట్ డాక్టర్స్ కాలనీలోని లక్ష్మీ వైట్ హౌస్ షాపింగ్ కాంప్లెక్స్ నందు సత్యం హోమియోపతి హెల్త్ క్యాంపును షాపింగ్ కాంప్లెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ తడక వెంకటేష్, తడక రమేష్, పెద్ది జగదీష్, సత్యం హోమియోపతి చైర్మన్ గుజ్జ సత్యం చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ కార్పొరేట్ హోమియోపతి అందరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో 5 సంవత్సరాల క్రితం మొదటి బ్రాంచ్‌ని ప్రారంభించామని గుర్తు చేశారు. అందరికీ ఉచిత డాక్టర్ కన్సల్టేషన్ ఒక నెల ఉచిత మందుల సౌకర్యం కలిగిస్తున్నామని, ఈ సౌకర్యాన్ని వీలైనంత ఎక్కువ మంది ఉపయోగించుకోవాలని కోరారు. హోమియోపతి మందులు అన్ని వయసుల వారికి, ఎటువంటి వ్యాధి అయినను వాడవచ్చు అని అన్నారు. ఈ మందుల వలన ఎటువంటి దుష్పరిణామాలు లేకుండా సంపూర్ణంగా వ్యాధి మూలాల నుండి ఉపశమనం లభిస్తుందన్నారు. వ్యాపారస్తులకు, వినియోగదారులకు ఉచిత వైద్య పరీక్షలు, మందులు అందజేయబడునని అన్నారు. ఈ సౌకర్యాన్ని పొందడానికి మరిన్ని వివరాల కోసం 9121218585 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రాజేష్, కస్తూరి సుదర్శన్, కుడికాల బాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.



మన ఆరోగ్యం మన హక్కు

సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా

నవతెలంగాణ - చైతన్యపురి

మన ఆరోగ్యం మన హక్కు అని రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిరా అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సరూర్‌నగర్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఆరోగ్య స్థాయిని మెరుగుపరచడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటుందని అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఆరోగ్యంగా ఉండడం మానవ ఆరోగ్యానికి నిర్వచనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి. వెంకటేశ్వర్ రావు, డిస్ట్రిక్ట్ రిహాబిటేషన్ ఆఫీసర్ రమేష్, రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన డాక్టర్లు అరుణ కుమారి, అరుణ, స్వర్ణ కుమారి, అనిత, వినోద్, గీత, దామోదర్, ధరణి కుమార్, రాకేష్, అంబికా, అర్చన, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడి పట్ల

మక్కువ పెంచేందుకే కార్యక్రమాలు

నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి

నవతెలంగాణ - హస్తినాపురం

పిల్లల్లో బడి పట్ల మక్కువ పెంచేందుకు తమ పాఠశాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాగర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న నాగార్జున మోడల్ స్కూల్‌లో శనివారం మాంటిస్సోరి విద్యార్థులకు కాన్వొకేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి మాట్లాడుతూ విశాలమైన ఇండోర్, అవుట్ డోర్ ప్లే గ్రౌండ్స్‌తో పాటు స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసి చిన్నారుల మానసిక, శారీరక వికాసానికి కృషి చేస్తున్నామన్నారు. చిన్నారుల్లో గ్రహణశక్తి పెంపొందించేందుకు దృశ్యశ్రవణ తరగతి గదులు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్ పర్సన్ గుమ్మకొండ రజనీ విఠల్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ రావు, ఇంచార్జిలు సవిత, పుష్పలత, అరుణ, దివ్య, ప్రియాంక, ఉషశ్రీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



గైర్హాజరైన పీ.ఓ, ఏ.పీ.ఏ ఇతర పోలింగ్ సిబ్బందిపై

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి : రోనాల్డ్ రోస్

నవతెలంగాణ - సిటీబ్యూరో

ఎన్నికల శిక్షణ తరగతులకు గైర్హాజరైన పీ.ఓ, ఏ.పీ.ఓలు 1773 మందికి, ఇతర పోలింగ్ సిబ్బంది 2037 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ ఆదేశాలు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల కోసం నియమితులైన పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు పోలింగ్ రోజున వారు చేయవలసిన విధులు, బాధ్యతల నిర్వహణలో ఎలాంటి పొర పాట్లు జరగకుండా ఉండేందుకు నియోజకవర్గ స్థాయిలో శిక్షణ తరగతులకు హాజరు కావాలని జిల్లా ఎన్నికల అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 1, 2వ తేదీల్లో రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈ రెండ్రోజుల పాటు శిక్షణకు గైర్హాజరైన వారందరికీ శనివారం ఏప్రిల్ 6వ తేదీన తిరిగి శిక్షణ కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి సంబంధిత నోడల్, సహాయ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. అందుకు ఆదేశాలిచ్చినప్పటికీ కొందరు గైర్హాజరు కావడంతో జిల్లా ఎన్నికల అధికారి తీవ్రంగా పరిగణించి గైర్హాజరైన పోలింగ్ ఏ.పీ.ఓ , పీ.ఓలు, ఇతర పోలింగ్ సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించారు.

దుప్పట్లు, పాదరక్షకాలు పంపిణీ



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మానవతా హృదయంతో అనాథలకు సేవ చేయాలనే ఉద్దేశంతో దుప్పట్లు, పాదరక్షకాలను పంపిణీ చేసినట్టు మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ మొక్క నరేందర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్‌గుల్‌లో ఉన్న మాతృదేవోభవ అనాథ ఆశ్రమం చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి.. వారికి సేవ చేయాలనే లక్ష్యంతో దుప్పట్లు, పాదరక్షకాలు అందజేసినట్టు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఈ అనాథ ఆశ్రమానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వారి మిత్రులు, ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరి తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కును సద్వినియోగించుకోవాలి



- కమిషనర్ వాణి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును సద్వి నియోగం చేసుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణి కోరారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్‌లో పార్లమెంట్ ఎలక్షన్ - 2024 స్వీప్ నా ఓటు హక్కును తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలనే కార్యక్రమంలో భాగంగా అనే తీమ్ తో జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరామ్ కాలనీ బస్ స్టాప్ నుంచి విజయ లక్ష్మీ గార్డెన్ వరకు శానిటేషన్ సిబ్బంది, మెప్మా సిబ్బందితో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఈ ర్యాలీలో భాగంగా శ్రీరామ్ కాలనీ ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద ఓట ర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సుదర్శన్, వార్డు ఆఫీసర్స్, శానిటేషన్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, నూతన ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
8
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
ఆదివారం | ఏప్రిల్ 07, 2024 | www.navatelangana.com

ఘనంగా సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు



- ఆదర్శ వృద్ధాశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-జవహర్‌నగర్

మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి జన్మదినం సందర్భంగా జవహర్‌నగర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆదర్శ వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ నగర్‌లోని ఆదర్శ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొగిలి పాక వెంకటేష్, పసుపులేటి వీర భాస్కర్‌రావు, ఏనుగుల బాల్ రెడ్డి, తదితరులున్నారు.

నీటి సమస్య పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్



నవతెలంగాణ-జవహర్‌నగర్

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్యల పరిష్కారానికి జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ కేటాయించినట్లు జవహర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జవహర్ నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలోని ప్రజలు నీటి సమస్యలకు 9502458449 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి తెలుపవచ్చని, ఈ అవకాశాన్ని జవహర్ నగర్ ప్రజలు అందరూ వినియోగించుకోవాలని కోవాలని కోరారు.

తాగునీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించాలి

- మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా ప్రత్యేక అధికారి విజయేంద్ర

నవతెలంగాణ-సిటీబ్యూరో

తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికా చేపట్టాలని, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనముల శాఖ, స్పెషల్ సెక్రెటరీ విజయేంద్ర, అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి తాగునీటి సరఫరాపై మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ముందుగా క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరా పరిస్థితిపై సంబంధిత అధికారులు స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి విజయేంద్ర మాట్లాడుతూ..ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరా అంశం అత్యంత కీలకమైనదని, దీనిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా తీరును ప్రతి రోజూ క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తితే వెంటనే యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని తెలిపారు. అవసరమైన చోట చేతి పంపులు, బోరు మోటార్లు, పైప్ లైన్ల మరమ్మతులు వంటివి సకాలంలో చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను పూర్తి



స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, నీటి ఎద్దడి కారణంగా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. అవసరం ఉన్నా దగ్గర ట్యాంకర్లను వినియోగించాలని తెలిపారు. మున్సిపల్ కార్యాలయాలకు, వాటర్ వర్క్స్, గ్రామ పంచాయతీ పరిధిలో, మున్సిపల్ పరిధిలో టోల్ ఫ్రీ, కాల్ సెంటర్ నెంబర్లు ప్రతి ఒక్కరికీ తెలిసేలా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలోని మండలాల పరిధిలో గల నివాస ప్రాంతాలకు సరిపడా నీటి నిలువలు అందుబాటులో ఉన్నాయా లేదా అన్న అంశం మీ అందరికీ అవగాహన ఉండాలన్నారు. మండల ప్రత్యేక అధికారుల తో పాటు తహశీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్ర స్థాయిలో నీటి సరఫరా తీరును అనునిత్యం పర్యవేక్షణ జరపాలని సూచించారు. స్పెషల్ ఆఫీసర్లు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తూ, ఎక్కడైనా లోపాలు గమనించిన వెంటనే సరిదిద్దాలని, తాగునీటి వ్యవస్థకు ఇబ్బంది తలెత్తకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని మార్గనిర్దేశం చేశారు. మిషన్ భగీరథ ద్వారా పూర్తి స్థాయిలో నిర్దీత పరిమాణంలో నీటి సరఫరా జరుగుతోందా లేదా అన్నది మండల అధికారులు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు సరి చూసుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ప్రస్తుత వేసవిలో ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి సమస్య రాకుండా నిబద్ధతతో పని చేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో ఎలాంటి నీటి కొరత లేదన్నారు. వేసవి కాలంలో నీటి వినియోగం పెరిగి తాగునీటి వనరులు తగ్గిపోతాయని, ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ప్రణాళిక రూపొందించుకొని జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించామని తెలిపారు. జిల్లాలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకై జిల్లా అధికారులను మండల స్పెషల్ ఆఫీసర్లుగా నియమించామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా తాగునీటి ఎద్దడి ఏర్పడితే నీటి సమస్యను పరిష్కరించడం కోసం జిల్లా పంచాయతీ కార్యాలయంలో కాల్ సెంటర్‌లో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటుచేస్తామని చెప్పారు. అవసరమైతే టాంకర్స్ ద్వారా నీటిని సరఫర చేస్తామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, గ్రామాల్లో గ్రామ పంచాయతీల కార్యదర్శులు పర్యవేక్షణ జరిపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని నివాస ప్రాంతాలలో నీటి కొరతను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎక్కడా నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నామని, అవసరమైన చోట బోరు మోటార్లు, హ్యాండ్ పంపులు, ఇతర తాగునీటి వనరులకు మరమ్మతు పనులు జరిపిస్తామన్నారు. జిల్లా స్థాయి అధికారులు మారుమూల ప్రాంతాలను సందర్శిస్తూ నీటి సరఫరా తీరుతె న్నుల గురించి వారి ద్వారా క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితి ని తెలుసుకోవాలని సూచించారు. ప్రస్తుత వేసవి సీజన్ దృష్ట్యా మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, ఆర్.డబ్ల్యు. ఎస్ అధికారులు, ఎంపిడిఓలు సమన్వయంతో, సమిష్టిగా పని చేయాలన్నారు.నీటి కొరత ఏర్పడకుండా చేపడుతున్న చర్యలు ప్రజలకు తెలిసేలా చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా పరిషత్ సీఈవో దిలీప్ కుమార్, డీపీవో వెంకటయ్య, డీఆర్డీఏ పీడీ సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్లు, వాటర్ వర్క్స్ అధికారులు, పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ డివిజన్ నోమా బస్టాప్ దగ్గర ముస్కె సరస్వతీ యాదవ్ జ్ఞాపకార్థం ముస్కె రాములు యాదవ్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్నదని తెలిపారు. నిత్యం వివిధ పనుల కోసం పరిసర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, నెమలి రవి, అల్లాడి కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహేందర్‌గౌడ్ జ్ఞాపకార్థం అన్నదానం



నవతెలంగాణ-శామీర్‌పేట

తూంకుంట మున్సిపల్ కేంద్రానికి చెందిన మహేందర్ గౌడ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు మూడుచింతలపల్లి మండలంలోని జగ్గం గూడ గ్రామంలోని హెూమ్ ఫర్ ద డిసబుల్డ్ అనాథ ఆశ్రమంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆశ్రమంలో సుమారు 270 మంది అనాథ పిల్లలున్నారని వారికి అన్నదానం చేయడం సంతోషంగా ఉందని మహేందర్ గౌడ్ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓంకార్ గౌడ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మెన్ చిర్ర బోయిన రామచందర్ యాదవ్, కాసుల సుభాష్ గౌడ్, తోకల నరేష్ యాదవ్, కాసుల వంశీ గౌడ్, దేశం శివశంకర్ గౌడ్, తూముకుంట నరసింహ గౌడ్, తూముకుంట రవీందర్ గౌడ్, దేశం అంజయ్య గౌడ్, కర్రి మోహన్ గౌడ్, నక్క నరసింహ గౌడ్, పంజాల సాయి ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో 'అన్యువల్ డే'



- హాజరైన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ.. జీవితంలో సక్సెస్ అవ్వాలంటే జల్సాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణతో పని చేస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు చూశానని, చిన్నచిన్న ఇబ్బందులకు భయపడకుండా సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక నృత్యాలు, ఫోక్ డాన్సులు ఆహుతులను విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో చామకూర సీఎంఆర్ కళాశాలల చైర్మెన్ గోపాల్ రెడ్డి, సీఎంఆర్ ఐటీ కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చర్లపల్లి డివిజన్‌కు చెందిన నాయకులు వెనుగంటి విజయ్ కుమార్ తండ్రి వెనుగంటి వెంకటేష్ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ వెంకటేష్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

-నవతెలంగాణ,కాప్రా



బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, ఉప్పల్ మాజీ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ శనివారం చర్లపల్లి రైల్వే టార్మినల్ ను సందర్శించారు.

-నవతెలంగాణ,కాప్రా

ఎమ్మెల్యే మల్లారెడ్డికి మరో షాక్..

- అక్రమ నిర్మాణాలను కూల్చేసిన అధికారులు
- రాజకీయ కక్షతోనే నిర్మాణాలు తొలగింపు
- బీఆర్ఎస్ నేత వీర్లపల్లి రాజమల్లారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కుటుంబానికి మరో షాక్ తగిలింది. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మల్లారెడ్డి పెద్ద కుమారుడు చామకూర మహేందర్‌రెడ్డి అక్రమంగా నిర్మించిన షెడ్లను మున్సిపల్ అధికారులు జేసీబీలతో శనివారం తొలగించారు.

15 ఏండ్ల నుంచి కోర్టులో వివాదం

మేడ్చల్ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారి 44 పక్కనే ఉన్న 45, 46 సర్వే నెంబర్లలో 318 గజాల స్థలం వివాదం గత 15 ఏండ్ల నుంచి కోర్టులో నడుస్తుంది. ఈ స్థలం నాదే అంటే.. నాదే అంటూ కాంగ్రెస్ నాయకుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి కొడుకు మహేందర్ రెడ్డిలు కోర్టుకు వెళ్లారు. అయితే గత 15 ఏండ్ల నుంచి ఈ వివాదం కోర్టులో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే మల్లారెడ్డి కొడుకు మహేందర్‌రెడ్డి 318 గజాల స్థలంలో ఒక రూం నిర్మించడంతో పాటు షెడ్లను ఏర్పాటు చేశారు. వీటిని ఓ వైన్స్ షాప్ యజమానికి అద్దెకు ఇవ్వడంతో గత కొంత కాలంగా ఆ రూంలో వైన్స్ షాపు, పక్క షెడ్లలో పర్మిట్ రూం నడుస్తోంది. అయితే కోర్టులో కేసు నడుస్తుండగా అక్రమ కట్టడాలు కట్టడం ఏంటని వేముల శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు శనివారం ఉదయం పర్మిట్ రూంతో పాటు షెడ్డును తొలగించారు. కాగా వైన్స్ నిర్వాహకుడు, మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ ఎంపీపీ రజిత భర్త వీర్లపల్లి రాజమల్లారెడ్డి మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే నేడు వైన్స్ పర్మిట్ రూం ఇతర నిర్మాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారని ఆరోపించారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి కానీ వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని హితవు పలికారు. రాజకీయంగా పార్టీ మారలేదని ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్ పార్టీకి కౌన్సిలర్లు రాజీనామా



- చైర్మెన్ వైఖరితో తమ వార్డులు అభివృద్ధికి నోచుకోలేదని మనస్తాపం

నవతెలంగాణ-శామీర్‌పేట

మున్సిపల్ చైర్మెన్, గత కమిషనర్ వైఖరితో తమ వార్డులు అభివృద్ధికి నోచుకోలేదని మనస్తాపానికి గురైన తూంకుంట మున్సిపల్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపల్ కేంద్రంలో శనివారం కౌన్సిలర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. రాజీనామా చేసిన వారిలో 2వ వార్డు కౌన్సిలర్ పొల్లమొల్ల పాండు, 3 వార్డు కౌన్సిలర్ సింగిరెడ్డి రజనీ వేణుగోపాల్ రెడ్డి, 6వ వార్డు కౌన్సిలర్ గుంతల లక్ష్మీ కృష్ణారెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ కోడిమేల ఉమా ఆంజనేయులు ఉన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. తూంకుంట మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో స్వతంత్రులుగా పోటీ చేసే గెలిచామని, తమ వార్డుల అభివృద్ధి కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేరామని పేర్కొన్నారు. కానీ మున్సిపల్ చైర్మెన్ కారంగుల రాజేశ్వరరావు, గత మున్సిపల్ కమిషనర్ పక్షపాత వైఖరితో తమ వార్డుల అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వారు మున్సిపల్ వ్యాప్తంగా అక్రమ కట్టడాలకు, అక్రమ వెంచర్లకు ప్రోత్సహిస్తున్నారని, ఏ రోజూ తమ మాటకు విలువ ఇవ్వలేదని ఆవేదనన వ్యక్తం చేశారు. తమ వార్డులను అభివృద్ధి చెందాలంటే రాజీనామానే సరైన నిర్ణయమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైన నిధులు తెచ్చుకొని మా వార్డులను అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నామని తెలిపారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-అల్వాల్



అల్వాల్‌లోని బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠించి మండలం పర్తి చేసుకున్న (40 రోజులు) శుభ సందర్భంగా శనివారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధ్వజస్తంభ దాత రామ్మోహన్ కుటుంబ సభ్యులు వంశపార్యంపర్య చైర్మెన్ రాజా సంజయ్ గోపాల్, సైన్సర్, ఆలయ ఈవో ఎం. వీరేశం, వెంకట్రామిరెడ్డి శివరామకృష్ణ, రామచంద్రరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్ కుటుంబ సభ్యులకు నామినేటడ్ పదవీ ఇవ్వాలి

నవతెలంగాణ-అల్వాల్

గద్దర్ కుటుంబంలో ఒకరికి కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటడ్ పదవి ఇవ్వాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ప్రెసిడెంట్ శంకర పేర్కొన్నారు. శనివారం అంబేద్కర్ నగర్ కాలనీ ఓల్డ్ ఆల్వాల్‌లో గద్దర్ సంతాప సభ ఏర్పాటును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ప్రజలను చైతన్యపరిచిన గద్దర్‌పై 1997, ఏప్రిల్ 6వ తేదీన జరిగిన కాల్పుల ఘటనను గర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్



సేవలను గుర్తించి ఆయన కుటుంబ సభ్యులకు నామినేటడ్ పదవి ఇవ్వాలని అంబేద్కర్ యువజన సంఘం, దళిత మోర్చా సంఘాలు కోరుతున్నాయని ఆయన తెలిపారు.

కార్డియాలజీ అడ్వాన్స్‌మెంట్స్‌పై

మెడికల్ ఫిజిషియన్లకు అవగాహన

- మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహణ

నవతెలంగాన-సిటీబ్యూరో

కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) ద్వార తాజా కార్డియాలజీ అడ్వాన్స్‌మెంట్స్‌పై మెడికల్ ఫిజిషియన్లకు మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవగాహన కలిపించారు. మెడికవర్ హాస్పిటల్, హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలోని టి-హబ్ లో సమగ్ర నిరంతర వైద్య విద్య ఈవెంట్‌ను నిర్వహించింది. రిజిస్టర్డ్ మెడికల్ ఫిజిషియన్లకు తాజా పురోగతులు, సాంకేతికతల పై కార్డియాలజీలో నవీకరించడానికి ప్రముఖ కార్డియాలజిస్టుల బృందం నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అనీల్‌కృష్ణ, సీనియర్ కన్సల్టెంట్, ఇంటర్వేషనల్ కార్డియాలజిస్ట్, చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శరత్‌రెడ్డి, సీనియర్ ఇంటర్వేషనల్ కార్డియాలజిస్ట్, సిటీవో, కాంప్లెక్స్ కరోనరీ ఇంటర్వెన్షన్స్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ పి, కన్సల్టెంట్ ఇంటర్వేషనల్ కార్డియాలజిస్ట్, డాక్టర్ సతీష్ కుమార్ కైలాసం, గ్రూప్ మెడికల్ డైరెక్టర్, మెడికవర్-ఇండియా తెలంగాణ వ్యాప్తంగా దాదాపు





250 మంది రిజిస్టర్డ్ మెడికల్ ఫిజిషియన్ పాల్గొన్నారు. ఇంటర్వేషనల్ కార్డియాలజీలో సంచలనాత్మక మెళకువలు, సంక్లిష్ట కరోనరీ వ్యాధులలో పురోగతి, హృదయ సంబంధ వ్యాధుల నిర్వహణ కోసం సాక్ష్యం-ఆధారిత పద్ధతులపై అంతర్దృష్టులను అందించింది. సీఎంఈ ఆరోగ్య సంరక్షణ నిపుణుల మధ్య జ్ఞాన భాగస్వామ్యాన్ని, కార్డియాక్ కేర్‌లో నిరంతర అభ్యాసం సహకారాన్ని పెంపొందించింది. మెడికవర్ హాస్పిటల్ నుంచి 12 మంది కార్డియాలజీ కన్సల్టెంట్‌ల నేతృత్వంలో జరిగిన చర్చలు, రోగుల సంరక్షణను మెరుగుపరచడానికి హాజరైన వారికి తాజా జ్ఞానం, నైపుణ్యాలు ఉన్నాయని నిర్ధారించడం, రంగంలో తాజా పురోగతిని హైలైట్ చేసింది. మెడికవర్ హాస్పిటల్ సీఎంఈ ప్రోగ్రామ్ వంటి విద్యా కార్యక్రమాలను నిర్వహించడానికి తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఇది వృత్తిపరమైన అభివృద్ధిని ప్రోత్సహించడంలో రోగులకు హృదయనాళ ఆరోగ్య సంరక్షణ అత్యున్నత ప్రమాణాలను సమర్థించడం వంటివీ ఈ కార్యక్రమం ద్వారా తెలిపారు.


కాంగ్రెస్ జన జాతర సభకు తరలిన నాయకులు



జవహర్‌నగర్‌లో..

నవతెలంగాణ-అల్వాల్

తూక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించిన జన జాతర బహిరంగ సభలో పాల్గొనేందుకు మైనంపల్లి హనుమంతరావు, అశోక్ రెడ్డి బృందం సభ్యులు శనివారం బయలుదేరారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీచ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలతో కలిసి మైనంపల్లి హనుమంతరావు, అశోక్ రెడ్డి తదితరులు వెళ్లారు.



అల్వాల్‌లో..

జవహర్‌నగర్‌లో..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ఛలో తుక్కుగూడ, జన జాతర సభకు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు.

కాప్రాలో..

తెలంగాణ కాంగ్రెస్ జన జాతర సభకు చర్లపల్లి డివిజన్ నాయకులు కార్యకర్తలతో బయలుదేరిన కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్.తదితరులున్నారు.



కాప్రాలో..



మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ జన జాతర సభకు తరలుతున్న నాయకులు

జేఎన్‌టీయూలో మెషిన్ లెర్నింగ్ వర్క్‌షాప్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రతిష్టాత్మకమైన క్వెస్ట్ 2024 లో భాగంగా మెషిన్ లెర్నింగ్‌పై సమగ్ర వర్క్‌షాప్ జేఎన్‌టీయూ హెచ్‌లో శనివారం నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.పి. సుప్రీతి నేతృత్వంలో, మెషిన్ లెర్నింగ్ రంగంలో అవసరమైన నైపుణ్యాలు, పరిజ్ఞానంతో పాల్గొనే వారిని సన్నద్ధం చేయడం వర్క్‌షాప్ యొక్క లక్ష్యం. ఈ కార్యక్రమంలోఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డా. ఆరతి, డాక్టర్ నీరజ, వర్కషాప్ సజావుగా విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు.



మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆశ్రయ అనాథ శరణాలయంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంధం వృద్ధి ఆధ్వర్యంలో వృద్ధులకు, చిన్న పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం హరివర్ధన్ రెడ్డి జన్మదిన సందర్బంగా కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశం, రమేష్ ఆంజనేయులు చౌదరి, సందీప్, రమాకాంత్, పూర్ణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ/కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం





- కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

తుక్కుగుడా రాజీవ్ గాంధీ ప్రాంగణంలో, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకటించనున్న భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల ఫెస్టో ప్రకటించనున్న సందర్భంగా, ఏర్పాటు చేసిన తుక్కుగుడా సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో... తరలిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ సైన్యం, ఈ సందర్భంగా జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, డాక్టర్.జి.రంజిత్ రెడ్డి, ఏ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో, అందరం ముందుకు సాగుదాం, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ జెండాను ఎగురవేద్దాం... అన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ గడ్డ నుంచి భావిభారత ప్రధాని రాహుల్ గాంధీ, దేశ స్థితిగతులను మార్చేందుకు ముందుకు సాగుతున్నారని, ఈ గడ్డ నుంచే పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రకటిస్తుండడం చాలా గర్వకారణం అని అన్నారు. ఇప్పటికే రూ.500లకుకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల వైద్యసేవలు వంటి పథకాలు పేదల జీవితాల్లో ఆర్థిక వేసులుబాటును కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వచ్చాక మొదటిసారి కాంగ్రెస్ అధినాయకత్వం రాష్ట్రానికి వస్తున్న ఈ సభకు కార్యకర్తలు,నాయకులు సైనికుల్లా కదిలి రావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించే జనజాతర సభ'కు శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్ నేతృత్వంలో బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో జన జాతర సభకు భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కన్నయ్య, చెన్నయ్య, రాజు, శంకర్ గౌడ్, శివ, పాండు, మహేష్, కర్ణాకర్, బాబు మరియు నాయకుడు మహిళా నాయకురాలు తరలి వెళ్లారు.

నవతెలంగాణ-బాలానగర్



తుక్కుగూడలో జరుగబోయే కాంగ్రెస్ పార్టీ భారీ జన జాతర సభకు, ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ డివిజన్ పరిధి నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళా నాయకురాళ్లతో కలిసి సభ ప్రాంగణానికి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, మోజెస్, యాదగిరి, వాలి నాగేశ్వరరావు, భిక్షపతి, సన్యాసి రావు, జానయ్య, రవీందర్, సునీత, శిరీష పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

డాక్టర్ బండారు సుశ్రుత్ కుమార్‌కు అరుదైన గౌరవం



- కార్డియాలజీ విభాగంలో డి. ఎం గా రాష్ట్ర స్థాయి టాప్ ర్యాంకు
- వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా గోల్డ్ మెడల్,మెమెంటో ప్రదానం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కేఎన్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (2023) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డియాలజీ వైద్య విభాగం పరీక్షలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టకు చెందిన ప్రముఖ సంఘ సేవకులు, వ్యాపారవేత్త డాక్టర్ బండారు శ్రీనివాస్ గుప్త కుమారుడు డాక్టర్ బండారు సుశ్రుత్ కుమార్ కార్డియాలజీ డి.ఎం.గా అత్యధిక మార్కులు సాధించి తెలంగాణ రాష్ట్ర స్థాయి టాపర్‌గా ఎంపికై గోల్డ్ మెడల్ సాధించారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఉస్మానియా వైద్య కళాశాల ఆడిటోరియంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ డాక్టర్ సుశ్రుత్ కుమార్‌కు గోల్డ్ మెడల్‌తో పాటు మెమెంటోను ప్రధానం చేసి అభినందించారు. భవిష్యత్తులో కూడా వైద్యరంగంలో ఉన్న స్థాయికి ఎదిగి అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ సుశ్రుత్ కుమార్‌కు వైద్యశాఖ మంత్రి సూచించారు. అనంతరం ప్రొఫెసర్లు డాక్టర్ సయ్యద్ ఇమాముద్దీన్ డాక్టర్ ప్రవీణ్, పలువురు వైద్య నిపుణులతోపాటు, మేడ్చల్ జిల్లా, కార్యనిర్వాహకులు తేరాల శ్రీనివాస్ గుప్తా, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు, పలువురు జర్నలిస్టులు, పుష్పగుచ్చాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.



దిల్ కుష్ నగర్ బస్తీ వాసులకు అండగా ఉంటాం



- బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

గత 50 సంవత్సరాల నుంచి దిల్ కుష్ నగర్ ప్రజలు రోడ్డు లేక ఎంతో ఇబ్బందులు ఎదుర్కున్నారని, గత మూడు సంవత్సరాల క్రితం జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో సీసీ రోడ్డును నిర్మించారని బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. ఇప్పుడు ఆ రోడ్డును ఐడీపీఎల్ సంస్థ సంబంధించిన భూమియని సంబంధిత అధికారులు క్రమబద్దీకరిస్తూ హద్దులలో కంచె ఏర్పాటు చేసే క్రమంలో దిలీకుష్ నగర్‌లోని ప్రధాన రహదారికి అడ్డుగా కంచె వేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శనివారం స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డికి తెలపగా వెంటనే అక్కడికి చేరుకొని సమస్య పై చర్చించి స్థానికులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దిల్ కుష్ నగర్ నివసితులకు స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో వేసిన రోడ్డు మూసివేయడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వాపోయారు. దీనిపై ఎమ్మెల్యేతో సంప్రదించి ఐడిపిఎల్ అధికారులతో చర్చించి స్థానికులకు తగిన న్యాయం చేస్తానని కార్పొరేటర్ హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బాలానగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాజా, దిల్ కుష్ నగర్ అధ్యక్షులు మొహమ్మద్ ముజీబ్, మాజీ అధ్యక్షులు మొహమ్మద్ మొహిసిన్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ జనత పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ సందర్బంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి అయోధ్య నగర్‌లో 44వ ఆవిర్భావ దినోత్సవ సందర్బంగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి బీజేపీ జెండాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పులి బలరాం, వెంకటేశ్వర రెడ్డి, వెంకట్ రెడ్డి, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, పద్మా రెడ్డి, నందు గౌడ్, శ్రావణ్ గౌడ్, సందీప్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



ఫైనల్ ఎస్టిమేషన్ నివేదికలు పంపండి

- మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాన-సిటీబ్యూరో



అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీతో పాఠశాలలో మౌలిక వసతుల కల్పన పై సదుపాయాలను క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి ఫైనల్ ఎస్టిమేషన్ నివేదికలు త్వరగా సమర్పించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీసీ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, ఈఈ, పీఆర్, ఈఈ ఆర్ అండ్ బి, ఎం ఏయూడీ, ఆర్ డబ్ల్యుఎస్, ఈ డబ్ల్యు ఐడీసీ అధికారులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మౌలిక వసతులు అవసరమైన పాఠశాలలను సందర్శించి, నిర్వహించాల్సిన పనుల ఫైనల్ ఎస్టిమేషన్‌ను రూపొందించి వెంటనే పంపాలని కలెక్టర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీటి సౌకర్యం, తరగతి గదుల మేజర్, మైనర్ మరమ్మతులు, టాయిలెట్ మరమ్మతులు, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణ పనులు, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ వంటి మౌలిక వసతుల పర్యవేక్షణ పనుల వ్యయ అంచనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పాఠశాలలను తనిఖీ చేసి పక్కాగా ప్రతిపాదన రూపొందించాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల పనులు అమ్మ ఆదర్శ కమిటీ ద్వారానే పూర్తి చేయాలన్నారు. పాఠశాల మౌలిక వసతుల కల్పన కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఏ పాఠశాలలో ఏఏ పనులు చేపట్టాలో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనుల గురించి కార్యాచరణ రూపొందించుకోవాల్సిందిగా కోరారు. జిల్లాలో ఉన్న ఇంజనీరింగ్ అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు త్వరగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనులలను కొన్నింటిని గుర్తించడం జరిగిందన్నారు. మిగిలిన పాఠశాలలను కూడా గుర్తించి త్వరగా నివేదిక సమర్పించాలన్నారు. మౌలిక వసతులకల్పనతో పాఠశాలల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ కుమారి, డిఆర్ డిఎ పిడి సాంబశివరరావు, మెప్మా అధికారి అనిల్, ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాస్, ఈ డబ్ల్యు ఐడీసీ, పంచాయతీ రాజ్ , ఏఎంఓ రవీంద్ర రాజ్, టిఎస్ఈడబ్ల్యు ఓడిసి, డిప్యూటీ ఈఈ బుగ్గయ్య , ఈఈ దుర్గ ప్రసాద్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ విద్యార్థుల 5కే రన్‌కు భారీ స్పందన



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో శనివారం ఉదయం క్యాంపస్ ఇంజినీరింగ్ మెకానికల్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు నిర్వహించనున్న ఫెస్ట్ (విద్యార్థులచే నిర్వహించు సాంకేతిక విద్యా పరిశోధ ప్రదర్శన)లో భాగంగా విద్యార్థులు 5కే రన్ క్యాంపస్‌లో నిర్వహింహించారు. ఈ కార్యక్రమాన్నికి ముఖ్య అతిథిలుగా ఏసీపీ కె శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వర రావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కేపీహెచ్‌బీ పీఎస్, యూనివర్సిటీ రెక్టర్ డాఆర్ కె. విజయ కుమార్ రెడ్డి రిజిస్టర్ డాఆర్. కె.వెంకటేశ్వర్ రావు, ప్రిన్సిపాల్ డాఆర్.వెంకట నర్సింహా రెడ్డి, డిపార్ట్‌మెంట్ విభాగాదిపతి డాఈ. రాంజీ ఫాకల్టీ కోర్డినేటర్ ప్రొఫెసర్ భ్రమరా డిపార్ట్‌మెంట్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యాక్రమంలో దాదాపుగా 200 మంది పాల్గొన్నారు. సెకండ్ హార్ట్ ఫిసోసియో ఫౌండేషన్ డాఆర్. అర్చన, డాఆర్. స్వామి, ప్రోటీన్ షేక్స్ స్పాన్సర్ న్యూటి రోయిన్, మిస్టర్ కౌశిక్, సీఈఓ విశ్వ, టీబీఐ సహాయ సహకారాలు

బాటసారుల దాహార్తి తీర్చడం అభినందనీయం



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

బాటసారుల దాహార్తి తీర్చడం కోసం దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ శేషగిరి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ లయన్స్ క్లబ్ ఆఫ్ ఉషోదయ, ఉషోదయ కాలనీ ఫేజ్ 2 సంక్షేమ సంఘం సంయుక్తధ్వర్యంలో కాలనీలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన కాలనీ వాసుల, లయన్స్ క్లబ్ ప్రతినిధుల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండు వేసవిలో చలివేంద్రాలు ప్రధాన డివిజన్‌లోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ కాలనీ అధ్యక్షుడు పేరారెడ్డి, కార్యదర్శి రవికాంత్, సంయుక్త కార్యదర్శి కుమార్, సలహాదారు కామేశ్వర రావు, డివిజన్ కార్యదర్శి నవాబ్ భాయ్, లయన్స్ క్లబ్ కార్యదర్శి అచ్యుత్, కోశాధికారి రాంకుమార్, సలహాదారు రిషేందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు..



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రానున్న లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కూకట్‌పలిల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తుక్కుగూడ "జన జాతర" భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు వేల సంఖ్యలో కార్యకర్తలు తరలి వెళ్లారు. శనివారం సాయంత్రం కూకట్‌పల్లి నియోజకవర్గం, కైతలపూర్ నుంచి కూకట్‌పల్లి కాంగ్రెస్ ఆధ్వర్యంలో సుమారు 100 బస్సులకు కూకట్‌పల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్ కోటంరెడ్డి వినయ్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ జండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ బహిరంగ సభకు డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు పదివేల మందికి పైగా భారీ ఎత్తున తరలి వెళ్లారు.

కార్పొరేట్, ప్రయివేటు కళాశాలలకు

వేసవి సెలవులు వెంటనే ఇవ్వాలి

- ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ
- జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయం ఎదుట నిరసన
- సీనియర్ అసిస్టెంట్ కు వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో/మల్కాజిగిరి

ఇంటర్మీడియట్ కార్పొరేట్, ప్రయివేటు కాలేజీలకు వెంటనే వేసవి సెలవులు ప్రకటించాలి అని ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం నేరేడ్‌మెట్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థిని, విద్యార్థులకు మార్చి 19వ తేదీ పరీక్షలు పూర్తి అవ్వగానే వేసవి సెలవులు ఇవ్వాలని ఇంటర్మీడియట్ అధికారులు సర్క్యులర్ విడుదల చేసినా జిల్లాలో అమలు కావడం లేదు అన్నారు. కార్పొరేట్, ప్రయివేటు కళాశాలలు సెలవులు ప్రకటించకుండా విద్యార్థిని, విద్యార్థులకు క్లాసులు నడుపుతున్నారన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు వేసవి సెలవుల సర్క్యులర్ తుంగలో తొక్కేసిన కార్పొరేట్, ప్రయివేటు ఇంటర్మీడియట్ కళాశాలల యజమాన్యలు మాకు సెలవులు ఇప్పించండి అని విద్యార్థులు అధికారులకే స్వయంగా ఫోన్ చేస్తున్న పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. జిల్లాలో శ్రీ చైతన్య, నారాయణ కార్పొరేట్, ప్రయివేటు కళాశాలలు యథావిధిగా తరగతి గదులు నిర్వహిస్తున్నాయి. ఎండలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో విద్యార్థులకు వేసవి సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు సర్క్యులర్ విడుదల చేసిన బేకాతరు చేస్తూ విద్యార్థులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై అనేకసార్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారులకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తరపు నుంచి ఫోన్లు చేసి కళాశాలలు నడుపుతున్నారు విద్యార్థులకు సెలవు ఇప్పించండి అని పదే పదే చెప్పినా పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ నరసింహారెడ్డికి వినతి పత్రం ఇవ్వడం అందజేశారు. విద్యార్థులకు కార్పొరేట్, ప్రయివేటు ఇంటర్మీడియట్ నిర్బంధ విద్య నుంచి విద్యార్థులకు వేసవి సెలవులు ఇప్పించాలని, లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటానికి రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్, జిల్లా సహాయ కార్యదర్శి అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్ రావు, నాయకులు మనీ కంట, అనుదీప్, శ్రీమన్, సాయి చరణ్, చింటూ, సాయిరాం, మిట్టు, గిరిధర్, పవన్, రాజేష్, చరణ్ నాయక్, ప్రభుచరణ్, సాత్విక్, అంజి తదితరులు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన హక్కు

- నేడు అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవం
- డాక్టర్.ఆరతి బళ్లారి కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్ కిమ్స్ హాస్పిటల్స్, కొండాపూర్

నవతెలంగాన-సిటీబ్యూరో

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవితాలను అందించడానికి, ప్రోత్సహించడానికి, ముఖ్యమైన ఆరోగ్య సమస్యల గురించి అవగాహన పెంచడానికి ప్రయత్నంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న నిర్వహిస్తారు. ఇది మన ఆరోగ్యం, శ్రేయస్సుకు మొదటి స్థానం ఇవ్వడానికి గుర్తు చేస్తుంది. ఈ సంవత్సరం థీమ్ "నా ఆరోగ్యం, నా హక్కు" ఈ థీమ్ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను పొందే ప్రాథమిక మానవ హక్కుల గురించి చెబుతుంది. ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడానికి ప్రతిచోటా అవకాశం కల్పించడంపై దృష్టి పెట్టాలని సూచిస్తుంది.

అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవం-2024 లక్ష్యాలు

ప్రతి ఒక్కరికీ, ప్రతిచోటా అందుబాటులో ఉండే, సరసమైన, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అవసరాన్ని హైలైట్ చేయండి. హెల్త్ ఈక్విటీని ప్రోత్సహించండి: ఆరోగ్య ప్రాప్యత, ఫలితాలలో అసమానతలను పరిష్కరించండి. ఆరోగ్యకరమైన ప్రవర్తనలను ప్రోత్సహించండి. వ్యాధిని నివారించడానికి, జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన చర్యలను ప్రోత్సహించండి. ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయండి: ప్రపంచ ఆరోగ్య సవాళ్లు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోగల సామర్థ్యం ఉన్న స్థితిస్థాపక ఆరోగ్య వ్యవస్థల అభివృద్ధికి మద్దతు ఇవ్వండి.

వ్యక్తిగత స్థాయిలో, మీరు ఈ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఏమి చేయవచ్చు?

మిమ్మల్ని మీరు ఎడ్యుకేట్ చేసుకోండి. ప్రపంచ ఆరోగ్య సవాళ్లు, ఆరోగ్య హక్కు గురించి మరింత తెలుసుకోండి. మరీ ముఖ్యంగా, మిమ్మల్ని మీరు ఎడ్యుకేట్ చేస్తున్నప్పుడు ఆరోగ్యానికి సంబంధించి చాలా తప్పుడు సమాచారం నమ్మదగిన వనరులకు కట్టుబడి ఉంటుంది.

అవగాహనను వ్యాప్తి చేయండి :

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రాముఖ్యత, థీమ్ గురించి స్నేహితులు, కుటుంబ సభ్యులతో మాట్లాడండి. నమ్మకమైన సమాచారాన్ని మళ్లీ షేర్ చేయండి, భయపెట్టడం, తప్పుడు/తప్పుడు సమాచారం చాలా ప్రమాదకరం.

సపోర్ట్ హెల్త్ ఇనిషియేటివ్స్:

హెల్త్ ఈక్విటీని మెరుగుపరచడానికి పనిచేస్తున్న సంస్థలకు విరాళం ఇవ్వండి. స్థానిక ఆరోగ్య క్లినిక్‌లు లేదా కమ్యూనిటీ సెంటర్లలో మీ సమయం లేదా నైపుణ్యాలను స్వచ్ఛందంగా అందించండి. మీ స్వంత ఆరోగ్యానికి బాధ్యత వహించండి: మీ ఆహారం, వ్యాయామం, జీవన శైలి గురించి ఆరోగ్యకరమైన నిమయాలను పాటించండి. రెగ్యులర్ చెకప్‌లు, స్క్రీనింగ్‌లను చేయించుకోవాలి. మీ స్వంత శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో ముఖ్యం. ఆరోగ్యం అనేది ఒక ప్రత్యేక హక్కు. అందరూ అనుభవించే హక్కు. ఈ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన మరింత సమానమైన ప్రపంచం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేద్దాం.



ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రస్తావించబడిన సాధారణ ఆరోగ్య సమస్యలు

అంటు వ్యాధులు : హెచ్ఐవి/ఎయిడ్స్, మలేరియా, క్షయ, హెపటైటిస్ వంటి అంటు వ్యాధుల నివారణ, చికిత్స మరియు నిర్వహణను హైలైట్ చేయడం. నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్ (NCD\T): కార్డియోవాస్కులర్ వ్యాధులు, క్యాన్సర్, మధుమేహం, శ్వాసకోశ వ్యాధులు వంటి దీర్ఘకాలిక వ్యాధుల గురించి అవగాహన పెంచడం, వాటి సంభవించకుండా నిరోధించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించాలి.

మానసిక ఆరోగ్యం: మానసిక ఆరోగ్య సమస్యల గురించి అవగాహన పెంచడం, భయాన్ని తగ్గించడం, మానసిక ఆరోగ్య సేవలు, మద్దతును ప్రోత్సహించాలి.

ప్రసూతి శిశు ఆరోగ్యం: ప్రినేటల్ కేర్, సురక్షితమైన ప్రసవం, వ్యాధి నిరోధక టీకాలు, పోషణతో సహా తల్లి మరియు శిశు ఆరోగ్య ఫలితాలు చూడాలి.

ఆరోగ్య సంరక్షణ : ఆరోగ్య సంరక్షణ యాక్సెస్‌లో అసమానతలను పరిష్కరించడం మరియు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్కరూ అవసరమైన ఆరోగ్య సేవలను పొందగలరని నిర్ధారించడానికి సార్వత్రిక ఆరోగ్య కవరేజీని ప్రోత్సహించడం.

పర్యావరణ ఆరోగ్యం : ఆరోగ్యంపై పర్యావరణ కారకాల ప్రభావం, గాలి, నీటి కాలుష్యం, వాతావరణ మార్పు, వృత్తిపరమైన ప్రమాదాలు వంటి వాటిపై దృష్టి సారించాలి.

హెల్త్ ఈక్విటీ: ఆరోగ్యం సామాజిక నిర్ణయాధికారులను ఉద్దేశించి, ప్రతి ఒక్కరూ వారి సామాజిక ఆర్థిక స్థితి, జాతి లేదా ఇతర కారకాలతో సంబంధం లేకుండా వారి అత్యున్నత స్థాయి ఆరోగ్యాన్ని పొందే అవకాశాన్ని కలిగి ఉండేలా ఆరోగ్య సమానత్వం కోసం చూడాలి. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం కేవలం ఒక రోజు కార్యక్రమం మాత్రమే కాదు. ప్రపంచ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ప్రతిఒక్కరూ చురుకైన పాత్ర పోషించాలని ఇది చర్యకు పిలుపు. చురుకుగా పాల్గొనడం ద్వారా వారు ఆరోగ్యకరమైన ప్రపంచానికి తోడ్పడవచ్చు. ఆరోగ్యం అనేది అన్ని సంతోషాలకు పునాది.

నవతెలంగాణ
10
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
ఆదివారం | ఏప్రిల్ 07, 2024 | www.navatelangana.com



బోరబండ డివిజన్ నుంచి ఉగాది పండుగ రోజున పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కార్పొరేటర్ బాబా పసివుద్దీన్‌తో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో ఎస్సీ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు తలారి, ఎస్‌టీ జీవన్ నాయక్, స్వరాజ్, నగర అధ్యక్షుడు బుజ్జి, మౌలానా పాల్గొన్నారు.

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఆభరణాలతో యువతుల అందం రెట్టింపు

● నటి మీనాక్షి చౌదరి

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఆభరణాలతో యువతుల అందం రెట్టింపు అవుతుందని వర్ధమానటి మీనాక్షి చౌదరి అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని సోమా జిగూడ లోని కల్యాణి జ్యూవెలరీస్‌లో ఏర్పాటు చేసిన ఫెస్టివల్ కలెక్షన్స్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ని నూతన వెరైటీలు వచ్చినా సాం ప్రదాయ మేలవింపుతో కూడిన ఆభరణాలకు ప్రత్యేక ఆదరణ ఉంటుందన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఉగాదిని పుర స్కరించుకొని ఆధునిక సాం ప్రదాయ మేల మింపుతో ఆభర ణాలను అందుబాటులో తీసుకురావడం అభినం దనీయమన్నారు.

కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు : శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్



కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల కాంగ్రెస్ పార్టీ శ్రీగణేష్‌ను అభ్యర్థిగా ప్రకటించిందని, ఈ మేరకు శనివారం మధ్యాహ్నం కాంగ్రెస్ అధిష్టానం వర్గం అధికారిక ఉత్తర్వులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు అభ్యర్థిగా ప్రకటించడం పట్ల శ్రీ గణేష్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ గణేష్ 23 డిసెంబర్ జరిగిన ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ నుంచి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారని, 42 వేల పైచిలుకు ఓట్లు సాధించారు. కాగా బీఆర్ఎస్ నుండి పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యేలు లాస్య నందిత శ్రీ గణేష్ కంటే 17000 ఓట్లు మెజార్టీ సాధించారు దీంతో అప్పుడు శ్రీ గణేష్ రెండవ స్థానానికి పరిమితమయినట్లు తెలిపారు. డిసెంబర్ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత ఆకస్మిక గా రోడ్డు ప్రమాదంలో మరణించడంతో నియోజకవర్గానికి ఈ ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తుక్కుగూడ కాంగ్రెస్ జన జాతరకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

● గణేష్ ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లిన కార్యకర్తలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఉప ఎన్నికల అభ్యర్థి శ్రీ గణేష్ ఆధ్వర్యంలో తుక్కుగూడకు కాంగ్రెస్ సభకు భారీ ఎత్తున తరలినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం అభ్యర్థి శ్రీ గణేష్ 20 బస్సులలో నియోజక వర్గానికి చెందిన కార్యకర్తలు మహిళలను హాజరయ్యారు. స్థానిక ఇంపీరియల్ గార్డెన్ హాజార్ జండా ఊపి బస్సులను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి నియోజకవర్గం నుండి తన గెలుపు తథ్యమని, తనపై నమ్మకంతో తనకు ఈ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి టికెట్ ఇచ్చినందుకు ఆయన కాంగ్రెస్ పార్టీ అధిష్టాన పెద్దలకు కృతజ్ఞతలు చెప్పారు. కంటోన్మెంట్ ప్రజల ఆశీస్సుల వల్లే తనకు కాంగ్రెస్ పార్టీలో టికెట్ లభించిందని ఈ సదర్భంగా ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు గణేష్ వెంట ఉండి ర్యాలీకి తరలి వెళ్లారు.

● మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియావుద్దీన్ ఆధ్వర్యంలో..

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జరిగే జనాతర మహాసభకు కాంగ్రెస్ అగ్ర నాయకులు తరలినట్లు తెలిపారు. బోరబండ డివిజన్ నుండి మూడు సెట్విన్ బస్సులు, 30 కార్లలో సుమారు 300 మంది మహిళలు, యువకులు కాంగ్రెస్ కార్యకర్తలు హాజరుకానున్నట్లు తెలిపారు. జై కాంగ్రెస్ నినాదంతో బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ జండాఊపి ప్రారంభించినట్లు తెలిపారు. కార్పొరేటర్ బాబా ఫసివుద్దీన్ యువకులు ర్యాలీగా హాజరుకానున్నట్లు తెలిపారు.

జనజాతరకు భారీగా తరలింపు

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ ఎమ్మెల్యే కంటెస్టడ్ అభ్యర్థి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో శని వారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరి ధిలోని 5 డివిజన్స్ నుండి నేతలు కార్య కర్తలు తుక్కుగుడాలో జరుగుతున్న జన జాతరకు హాజరయ్యారు.ఈ కార్యక్ర మం లో సంతోష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన లోకసభ ఎన్నికల మ్యాని ఫెస్టో అన్ని వర్గాలకు అండగా ఉందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్



తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహి స్తున్న జనజాతర మహాసభకు ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నాయ కులు, కార్యకర్తలు,అభిమానులతో కలిసి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయ రెడ్డి,ఆధ్వర్యంలో 2 వేలకు పైగా మందితో బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఐమాక్స్ థియేటర్ పక్కనగల పార్కింగ్ ప్రాంతం నుండి భారీ ర్యాలీతో బయలుదేరి సోమాజిగూడ,బంజారాహిల్స్,వెంకటేశ్వర కాలనీ,జూబ్లీహిల్స్ డివిజన్ల మీదుగా తరలినట్లు తెలిపారు.



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా సంక్షేమ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని ఎంపీ అభ్యర్థి దానం అన్నారు. ఈ సం దర్భంగా ఆయన తుక్కు గూడ జన జాతర సభకి ఫిల్మ్‌నగర్‌లోని మహ నీయుల విగ్రహాలను నుంచి బయలు దేరి నట్లు తెలిపారు. సికింద్రాబాద్ నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో పాటు ఖైరతాబాద్ ఎమ్మెల్యే ప్రస్తుత ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రోహిణ రెడ్డి, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ జెండా ఊపి బస్సు, ఇతర వాహనాలను ప్రారంభించినట్లు తెలిపారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

సూపర్ ట్విన్స్‌ను సత్కరించిన కోచ్ శ్రీనాథ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

చదరంగంలో అసా ధారణ విజయాలు సాధిం చిన సూపర్ ట్విన్స్‌ను భారత మహిళల జట్టు కోచ్ శ్రీనాథ్ సత్కరించారు. అరేనా బాస్కెట్‌బాల్ ఫోకస్ ఉన్నప్ప టికీ,వారి అంకితభావం, నైపుణ్యాలు చదరంగంలో చేసిన కృషి శ్రేష్టమైనది, వా రికి ఈ మంచి గుర్తింపును సంపాదించి పెట్టిందని పలువురు విశిష్ట వ్యక్తులు తెలిపారు. ఈ సంద ర్భంగా శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ భారత మహిళల బాస్కె ట్‌బాల్ టీమ్ కోచ్, శ్రీనాథ్, వర్మ కస్టమ్స్ టీమ్ కెప్టెన్, డాక్టర్ లీనా ప్రియంబద, కాశీ, దాట్ల విశ్వనాథ్ రాజు డైరెక్టర్ సాధన అరేనా సూపర్ ట్విన్స్, అమయా అగర్వాల్ అనయ్ అగర్వాల్, ప్రఖ్యాత చెస్ దిగ్గజాలు ఆధ్వర్యంలో సాధన బాస్కెట్‌బాల్ అరేనాను ప్రారంభించి ప్రసంగించారు. సూపర్ ట్విన్స్ "సూపర్ ట్విన్స్ గాట్ ఫెలిసిటెడ్ బై ఇండియన్ కోచ్ శ్రీనాథ్" అనే బిరుదుతో సత్కరించన ఆయనకు చెస్ సంఘంలో ఉన్న గౌరవానికి సూచిక అన్నారు.

బమ్‌రుక్నుద్ దౌలా చెరువు రక్షణకు సుప్రీంకు వెళతాం

● సెంటర్ ఫర్ వెల్ బీయింగ్ ఎకనా మిక్స్ హైదరాబాద్ వ్యవస్థాపక డైరెక్టర్, సోషల్ యాక్టివిస్టులు బనాసర్వత్

నవతెలంగాణ-బంజారాహిల్స్



సుమారు 400 ఏండ్లకు పైగా చరిత్ర కలిగిన బమ్‌రుక్నుద్ దౌలా చెరువును రక్షించుకునేందుకు అవసరమైతే దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టుకు వెళ్తామని, సెంటర్ ఫర్ వెల్ బీయింగ్ ఎకనా మిక్స్ హైదరాబాద్ వ్యవస్థాపక డైరెక్టర్, సోషల్ యాక్టివిస్ట్ లుబనా సర్వత్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చెరువుల కబ్జాపై ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జీవరాసుల మనుగ డకు ప్రధాన వనరు నీటిని సంరక్షించుకోవడంలో ప్రజలు ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు అత్యంత విచారకరమ న్నారు. శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీకి ఎదురుగా ఉన్న బమ్‌రుక్న దౌల చెరువు ఎంతో ప్రా ముఖ్యత కలిగిన చెరువన్నారు. అప్పటి మహారాజులకు,సాధారణ ప్రజలకు సైతం మంచినీటి అవసరాలు తీర్చిన చెరువు ప్రస్తుతం కనుమరుగయ్యే స్థితిలోకి వెళ్లడం తీవ్ర విచారకరమని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం కబ్జాల పర్వం మరింత తీవ్రతరం అయిందన్నారు.2017 లో చెరువు విస్తీర్ణం సుమారు 17 ఎకరాలని సూచించిన ప్రభుత్వ సంస్థలు అనంతరం 10 ఎకరాలని చూపించాయని, ఇలా పొంతన లేని సర్వే రిపోర్టును ముందుంచి మొత్తం కబ్జాకు గురయ్యేం దుకు తోడ్పడ్డారని మండిపడ్డారు. ఎంతో విశిష్టత కలిగి ఉండటంతో పాటు స్థానిక నీటి అవసరాలను తీర్చుతున్న చెరువు కబ్జా విషయం తెలుసుకుని తాను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటి)ని ఆశ్రయించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు వేగవంతమైన చర్యలు తీసుకోవాల్సిన గ్రీన్ ట్రిబ్యునల్ సైతం అలసత్వం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తన కేసు ఏప్రిల్ 4 గురువారం హియరింగ్ ఉండగా ఎలాంటి విచారణ జరపకుండా జూలైకి వాయి దా వేశారని చెప్పారు. అతి ముఖ్యమైన కేసును వాయిదా వేయడం ఏమిటని ప్రశ్నించగా హైకోర్టులో కేసు ఉందని అక్కడి న్యాయమూర్తులు దురుసుగా మాట్లాడడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. సహజ సంపదలైన చెరు వు లు, అడవులు వంటి వాటి రక్షణ కోసం పోరాటం చేస్తున్న వారికి భరోసా ఇవ్వాల్సిన న్యాయస్థానాలే ఇలా వ్యవహ రిస్తే తమలాంటి వారి పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. సహేతుకమైన కారణాలు చూపకుండా తన కేసును వాయిదా వేసిన ఎన్‌జీటిని మరోసారి సంప్రదిస్తానని ఆమె చెప్పారు. ఎన్‌జీటిలో న్యాయం జరగకపోతే దేశ అత్యున్నత న్యాయస్థానానికి వెళ్లి అయినా సరే చెరువును కాపాడు తాన న్నారు. మానవాళి ఇంకా నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తు అంధకారంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. చెరువుల రక్షణ కోసం పోరాడుతున్న తమతో ప్రజలంతా కలిసి రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏపీ మైనారిటీ కమిషన్ మాజీ సభ్యుడు, న్యాయవాది సయ్యద్ తారక్ ఖాద్రి, ఫారుక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను గెలిపిస్తాం



● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

నియోజకపరిధిలోని పార్లమెంట్ ఎలక్షన్లలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను గెలిపించుకుంటా మని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో సనత్‌నగర్ నియోజకవర్గ సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్లమెంట్ అభ్యర్థి పద్మారావుగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలు హైదరాబాద్ నగరం నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అందరూ గెలిచారని, అదే ఊపుతో సికింద్రాబాద్ పార్లమెంట్ గెలవాలన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్ని నియోజవర్గాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించారన్నారు. కేసీఆర్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. నగరంలో ఎమ్మెల్యే ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియదని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ప్రస్తుతం చేరుతారన్నారు. హైదరాబాద్ నగరంలో బలమైన శక్తిగా బీఆర్ ఎస్ ఉందని, సికింద్రాబాద్ పార్లమెంట్ సీట్ బీఆర్ ఎస్ గెలిస్తే కేంద్ర కాబినెట్ మంత్రిని ఓడించిన చరిత్ర మనకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ చెప్పిన స్కీమ్ లను అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని, ప్రభుత్వంలో ఉన్నప్పుడు కన్నా ప్రతిపక్షంలో ఇంకా బాగా పని చేస్తా న్నారు. కార్యకర్తలకు అందరికి అవకాశలు దొరుకుతాయన్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లా డుతూ కరెంట్, మంచినీటి ఇబ్బందులు చాలా ఉన్నాయని, ఆరు గ్యారెంటీలును ప్రభుత్వం అమలు కాలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం ప్రజలోకి తీసుకొని వెళ్ళాలన్నారు. పద్మారావుగౌడ్ గెలు పు కోసం పని చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ నియోజకవర్గ అన్ని డివిజన్‌ల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అదం సంతోష్ ఆధ్వర్యంలో చేరికలు



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గ సీతాఫల్‌మండి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జలంధర్‌రెడ్డితో పాటు నాయ కులు, కార్యకర్తలు, కంటెస్టెండ్ ఎమ్మెల్యే అభ్యర్థి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలన తో పాటుగా ఇచ్చిన హామీలు అమ లు చేస్తున్న వేళా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్థాయిలో నేతలు కార్యకర్తలు పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అదం సృజన్ కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రీయ కళామంచ్ సింగిడి-2024 పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఓయూ



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉస్మానియా యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కళామంచ్ సింగిడి-2024 పోస్టర్స్‌ను శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హైదరా బాద్ మహానగర ప్రముఖ్ డా.రామకృష్ణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వీ తేజలు మాట్లాడుతూ ఏబీవీపీ అంటే కేవలం ధర్నాలు రాస్తారోకోలే కాకుండా విద్యారంగ సమస్యలపై నిత్యం పోరాడుతూ విద్యార్థులను చైతన్య పరుస్తామన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని, వారిలో ఉన్న కళనైపుణ్యాలను కూడా వెలుగు లోకి తీసుకురావాలి అని ఉద్దేశంతో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్రీయ కళామంచ్, "సింగిడి" పేరుతో ప్రతీ సంవత్సరం ఎంతో మంది విద్యార్థి కళాకారులను వెలుగులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. సాంస్కృతిక పోటీలను ఏప్రిల్ 20,21 లాలో ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు వారి కళా నైపుణ్యాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు రాష్ట్రీయ కళామంచ్ సింగిడి- 2024 పేరుతో విద్యార్థుల ముందుకు తెచ్చామన్నారు. విద్యా ర్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ శ్రీహరి, స్టేట్ అల్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్,స్టేట్ సవిష్కర్ కన్వీనర్ తోట శ్రీనివాస్ , విద్యానగర్ జిల్లా కన్వీనర్ హరి ప్రసాద్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ రాజు, విద్యార్థి నాయకులు సాయి, గణేష్ సాగర్, శంకర్, ధృహన్, శివ శంకర్, హరి ప్రసాద్, కోటీ, శివశంకర్, ఉదయ్, కార్తిక్ ,వినయ్, ప్రణీత్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీలో మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలి

● ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి రీసెర్చ్ స్కాలర్ సత్య

నవతెలంగాణ-ఓయూ



ఓయూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెయిన్ లైబ్రరీలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం రిజిస్టార్ ప్రొ. లక్ష్మీ నారాయణకి వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల అభ్యర్థన మేంకు శనివారం రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీ నారాయణ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెయిన్ లైబ్రరీ సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్ నెల్లి సత్య మాట్లాడుతూ ఓయూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెయిన్ లైబ్రరీ దేశంలోని అత్య ంత పురాతనమైన చారిత్రక కలిగిన లైబ్రరీ అని అన్నారు. కానీ ఇటీవల సరైన నిర్వహణ లేక మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొం టున్నారన్నారు. తక్షణమే ఓయూ పరిపాలన అధికారులు లైబ్రరీలో సమస్యలు పరిష్కరించాల న్నారు. రీసర్చ్ స్కాలర్స్ లక్ష్మణ్, సోమనాథ్, విద్యార్థి నాయకులు సుమన్ అశ్విన్ పాల్గొన్నారు.



హెల్త్, శానిటేషన్ సూపరింటిండెంట్‌లకు సన్మానం

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు హెల్త్, శానిటే షన్ సూపరింటిండెంట్‌లుగా పదోన్న తులు పొందిన దేవేందర్, మహేందర్ లను స్వర్ణధామ నగర్ కాలనీవాసులు సత్క రించారు. శనివారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో హెల్త్ సూపరింటిండెంట్ దేవేందర్, శానిటేషన్ సూపరింటిండెంట్ ఆకుల మహేందర్ లను కాలనీవాసులు శాలువాలతో సత్కరించి, పూల బోకేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణదామ నగర్ కాలనీవాసులు రాయల మోహన్ రావు, టి.వి.సురేష్, మాజీ ఎంపీపీ కటారి రమణయ్య ,మనోజ్ పాటిల్, వర్ధన్ రావు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... కంటోన్మెంట్ పౌరులకు విశేష సేవలను అందిస్తూ.. అందరి అదర అభిమానాలను పొందాలని అకాంక్షించారు.

జి.వి బాధితులకు న్యాయం చేయండి

● ముఖ్యమంత్రికి బాధితుల విజ్ఞప్తి

నవతెలంగాణ-బంజారాహిల్స్...



పేద, మధ్యతరగతి ప్రజలకు స్థలాలు, పెట్టుబడి పై రాబడి అని నమ్మించి భారీ మోసానికి పాల్పడిన జీవీ బిల్డర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ చట్టపరంగా చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బాధితులు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బాధిత కమిటీ సభ్యులు కార్తీక్, రమేష్, హరిప్రియ, నాగరాజులతో కలిసి జాతీయ బీసీ రాజ్యా ధికార మహిళా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షురాలు రోజా మాట్లాడారు. చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగించే సాధారణ ప్రజల లక్ష్యంగా జీవి సంస్థను ఏర్పాటు చేసి లక్ష్మి నారాయణ జ్యోతి దంపతులు మోసానికి తెరలేపారన్నారు. ఉప్పల్ కేంద్రంగా ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించి చిరువ్యాపారం చేసుకునే యువతకు కమిషన్ ఆశ చూపి వారిగా వందలాది మందిని మోసం చేశారని తెలిపారు. సుమారు 500 కోట్లకు పైగా మోసం జరిగి నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అండతోనే మోసాల పరంపర కొనసాగిందని ఆరోపించారు. ఇప్పటికే ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా సంస్థ వ్యవస్థా పకులను అరెస్టు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం చేసిన కుంభకోణాలను వెలికిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై కూడా ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, లాలూ ప్రసాద్, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో వసతిగృహాలకు వెళ్లే ప్రధాన రహదారి

● రాత్రి అయితే బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు
● చోద్యంగా చూస్తున్న అధికారులు
● రాత్రి వేళ లైబ్రరీ సమయం ముగిసిన అనంతరం బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్

నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికారులు పట్టింపు లేని ధోరణితో ఓయూ విద్యార్థులు గత కొన్ని నెలల నుండి ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిమ్మ చీకట్లో బిక్కుబిక్కుమంటూ కాలంవెల్లడిస్తు న్నారు. పూర్తిస్థాయిలో వివరాల్లోకి వెళితే ఓయు సైన్స్ కళశాల ఎదుట నుంచి సెంటినరి హాస్టల్ (బాలికల), మానేరు, న్యూ గోదావరి, సర యు, లాంటి ఈ నాలుగు వసతి గృహాలు ఇదే ప్రధాన రహదారి సద రు రహదారికి ఇరువైపులా అరణ్యము ఉన్నాయి.ఈ ప్రధాన రహదారి వెంట విధి దీపాలు (స్ట్రీట్ లైట్స్), వెలుగుక కొన్ని నెలలు కావడంతో రాత్రి అయిన ఈ రహదారి వెంట వసతిగృహాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక మరొక వైపు పాములు, తేళ్ల,విష పురుగులతో పాటుగా గుంపులు గుంపులుగా గ్రామసింహాల సంచారంతో సెంటినరి హాస్టల్ కు వెళ్లే బాలికలు భయభ్రాంతులకు గురైతున్నారు. ఇది ఒక ఎత్తు అయితే రాత్రిపూట గ్రంథాలయంలో పలు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న రాత్రి 10 గంటల తరువాత రాకపోకలకు చుక్కలు చూస్తున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట గ్రంథా లయ సమయం ముగిసిన వెంటనే గ్రంథాలయం నుండి వసతిగృహనికి వెళ్ళటానికి ఉదయం మాదిరిగా రాత్రి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగక ముందే వెంటనే పూర్తిస్థాయిలో విధి దీపాలు ఏర్పాటు చేయాలని, లేని యెడలే ఉద్య మిస్తాం అంటూ పృథ్వీ రాజు, సాయి, గణేష్, శివ ,హరి, ప్రసాద్‌లు హెచ్చరించారు. పలుమార్లు ఓయూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన అధికారులు పట్టించుకోకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించలేరా ? అంటు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
ఆదివారం | ఏప్రిల్ 07, 2024 | www.navatelangana.com

గద్దర్ పేరుతో ప్రజా కలల యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- ప్రొఫెసర్ కంచె ఐలయ్య

నవతెలంగాణ - ముషీరాబాద్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అయితే ఆ తెలంగాణ రావడానికి సింబల్ ప్రజా గాయకుడు గద్దర్ అని ప్రొఫెసర్ కంచె ఐలయ్య అన్నారు. శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భావప్రకటన-పాలకుల అణచివేత గాయపడ్డ పాట పేరుతో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కంచె ఐలయ్య మాట్లాడుతూ. ఆటపాట చరిత్ర సృష్టికర్త గద్దర్ అని తుపాకులతో కాల్పులు జరిపి ఆరు గుండ్లు దిగాయన్నారు. గుండ్లు తీసినప్పటికి వెన్నుముక్కలో ఒక తుపాకి గుండును పెట్టుకోని 20 ఏండ్లు బతికిన గొప్ప వీరుడని కొనియాడారు. తెలంగాణ ఉద్యమం గద్దర్‌తో మళ్లీ పుడుతుందనే భావనతో 1997లో కాల్పులు జరిపారని విమర్శించారు. ఆయన సాయుధ పోరాటంలో పాడిన పాట ఒక దశ అయితే కారంచెడులో జరిగిన సంఘటనలో పాడిన పాటలు మరో దశ అని, అంతేకాకుండా రాబోతున్న తెలంగాణ సంగ్రామానికి పాడిన పాటలు కూడా బహుళ ప్రాచుర్యం పొందాయన్నారు. గద్దర్ చనిపోయే నాటికి భారత రాజ్యాంగాన్ని కాపాడాలని భావించి పోరాటం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వస్తే స్వేచ్ఛ వస్తుందనే ఉద్దేశంతోనే ఆ పార్టీలో చేరారని గుర్తు చేశారు. శరీరంలో తుపాకీ గుండు పెట్టుకొని తెలంగాణ ఉద్యమంలో ఆడిపాడారని అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటిలో ఆయనకు 6 అడుగుల విగ్రహాన్ని పెట్టారని అక్కడ గద్దర స్మృతివనం రాబోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గద్దర్ అవార్డును ప్రకటించడం జరిగిందన్నారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో గద్దర్ పేరుతో ప్రజాకలల యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. పేదలకు భూమి పంపిణీ, కుల వ్యవస్థ, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప యోధుడు గద్దర్ అని కొనియాడారు. రామమందిరం కంటే ఎక్కువగా అంబేద్కర్ మందిరాలు కట్టాలని అన్నారు. గద్దర్ చరిత్ర అంబేద్కర్‌తో ముడిపడి ఉందని అంబేద్కర్ చేసిన పోరాటాలు రాసిన రాజ్యాంగాన్ని ప్రజల్లోకి తీసుకుపోయిన గొప్ప వ్యక్తి గద్దర్ అని అన్నారు. గద్దర్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ సంగంరెడ్డి పృథ్విరాజ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గుమ్మడి విఠల్ సూర్యకిరణ్, డాక్టర్ జిలకర శ్రీనివాస్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రముఖ అంబేద్కర్ వాది జే.బి.రాజు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ప్రజాగాయకులు విమలక్క, యశ్పాల్, ఎం.వి.ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్రెడ్డి, సీపీఐ నాయకులు బాలమల్లేష్, గద్దర్ సతీమణి గుమ్మడి విమల ప్రెస్ అకాడామీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రముఖ నాయకుడు మచ్చా దేవేందర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



పత్రిక ప్రకటన

మహరాజ శ్రీ గౌరవనీయ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ నాగర్‌కర్నూల్
O.S.No.634 of 2021
Between:-
Md.Sadiq and others ...వాదుల
మరియు
Md.Gore Miya and others ...ప్రతివాదుల

Summons

To
5)Smt.Tasleema Begum W/o Channu Pasha D/o Late Habeen Jani age:45,occ:House Hold R/o H. No.2-3,Marripalthy,Upparapally, Uppununthala Mandal.(D5)
7) Yousuf bee W/o Pasha Miya Age:70 occ:House wife(D7)
8) Sabera Begum W/o Late md. Jabber Age:60 occ:House wife (D8) D 7,8 both R/o H.No 9-10-120,Risala Bazar,Galkonda,Hyd.

మాక్లయింట్స్ అయినటువంటి **Md. Sadiq and others** అనువారు పైన తెలిపిన కోర్టులో **Suit For Partit ion and Se parate Possession** కొరకు కేసు వేసినారు.**SyNo.310 Ext Ac 1-12 gts Situated at Tadoor village and Mandal.**అట్టి పైన తెల్పిన కేసు నందు ప్రతివాదులకు **Summons** అందని కారణంగా కోర్టు వారు పత్రిక ప్రకటన ద్వారా **Summons** జారి చేయు టకు ఆర్డర్ ఇచ్చినారు.కావున ఈ **Summons** పేపరు ప్రకటన ద్వారా మీకు అనగా పైన తెలిపిన ప్రతివాదులకు గార్లకు తెలుపుట ఏమనగా పై కేసులో కోర్టులో హాజరు నిమిత్తం పైన తెలిపిన తేదిలో మీరు కాని మీ తరుపున న్యాయవాది కాని కోర్టు ముందు పైన తెలిపిన కోర్టు లో తేది 16-04-2024 రోజు నిర్ణయించడం జరిగినది కావున పైన తెల్పిన తేది నందు ఉదయం గం॥ 10-30.నిలకు హాజరు కాగలరు లేని యెడల కేసు కోర్టు వారు ఏక పక్షముగా నిర్ణయించెదరు.

"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"

DAYANAND NAIKAL
BSC.,LLB.,
ADVOCATE
NAGARKURNOOL-509 209,(TS)
Cell No;9059804363

IN THE COURT OF PRI. ISTRICT JUDGE AT KHAMMAM
I. A. NO OF 2023
IN
A.S.S.R, NO. 1528 OF 2023

Between:
Kondapureddy Veera Reddy ... Petitioner/Appellant
And
Kondapureddy Bhaskar Reddy & 9 others ... Respondents/Respondents

To
1. Kondapureddy Mohan Reddy, S/o. Late Raghava Reddy, Age: 68 Years, Occ: Milk Vending Business, R/o. Pandillapalli Village, Chinthakani Mandal, Khammam District (Respondent No. 4).
2. Smt. Kondapureddy Vijayalaxmi, W/o. Late Kutumba Reddy, Age: S9 Years, Occ: Employee, R/o. Mahesh Co-operative Urban Bank, Osman Gunj Road, Mohanjahi Market Center, Hyderabad (Respondent No. 5).
3.Kondapureddy Pradeep, S/o. Late Kutumba Reddy, Age: 37 Years, Occ: Student, R/o. Mahesh Co-operative Urban Bank, Osman Gunj Road, Mohanjahi Market Center, Hyderabad (Respondent No. 6).
4.Smt. Kondapureddy Sunitha, D/o. Late Kutumba Reddy, Age: 42 Years, Occ: Household, R/o. Mahesh Co-operative Urban Bank, Osman Gunj Road, Mohanjahi Market Center, Hyderabad (Respondent No. 7).

NOTICE

Take Notice that in the above I.A. filed under Order XLI Rule 3-A of C.P.C. R/w. Section 5 of Limitation Act by Petitioner/Plaintiff seeking to delay condonation in filing the Appeal you Nos. 1 to 4 are Respondent Nos. 4 to 7. The said I.A. is posted to **19-04-2024** for your appearance. You may appear either in Person or through your Counsel/s by **10-30 A.M.** before the above Hon'ble Court on that day, failing which you shall be set exparte and the I.A. will be decided in your absence.

//By Order of the Court.//
K.RAMESH KUMAR
ADVOCATE,
H.No: 10-4-74,
Mamillagudem,
Khammam City and District.
KHAMMAM.
Dt. 06-04-2024.

IN THE COURT OF HON'BLE II ADDL.JUNIOR CIVIL JUDGE, RANGAREDDY DIST.
AT: L.B. NAGAR.
O.S.No.32 of 2023

Between:
Mr.Syed Nawaz Ahmed ...Plaintiff
AND
Shaik Quadeer and others. ...Defendants

To
1.Shaik Qadeer S/o.Shaik Yakoob, Aged: 41 years, Occ: Business, R/o.16-233/2, Quba Colony, Balapur (V) & (M) R.R.Dist.
2.Mrs.Sayeed Unnisa W/o, Mohd. Moosa Qureshi, Age: 32 Years, Occ: Household, R/0.7-63/2, Shaheen Nagar, Balapur(V) & (M) Mandal, R.R.District
3.Mrs. Habeeb Unnisa W/o. Mohammed Omer Shareef, Aged 36 years, Occ: Household R/0.16-73/4, Shaheen Nagar, Balapur(V) & Mandal, R.R.District
4.Mohammed Abdul Khalid, S/o. Mohammed Abdul Jaber, Aged about 42 years, Occ: Ex-Corporator, R/o.22-6-780, Panjesha Guruna Galli, Charminar, Hyd ...Defendants No.1 to 4

Please take notice that the Plaintiff had filed above suit against Defendant No.1 to 5 in respect of suit scheduled property for declaration to declare him as absolute owner of the suit scheduled property, for recovery of the possession of the same and consequently to declare the **sale deed bearing No.769 of 2016, dated: 19.01.2016, sale deed No.770 of 2016, dated: 19.01.2016, Regd. AGPA (with possession) vide Doct.No.5424 of 2017, dated: 14.09.2017** and Regd. Memorandum of Deposit of **Title Deeds No.6001 of 2020, Dated: 30.06. 2020** as null and void and not binding upon the plaintiff. Further it is submitted that the Hon'ble Court had ordered notice to you No.1 to 4 and posted the above matter **to 02.05.2024.**

Please appear on the above said date of hearing i.e., **02.05.2024 at about 10:30 AM**, failing which the Hon'ble Court will set you exparte and matter will be decided on merits.

//ORDER OF THE COURT//
B.SURESH
G.VENKAT REDDY
COUNSELS FOR PLAINTIFF
Flat No.204.2nd Floor, MJK Apts, Barkatpura Chaman, On 123 Cafe.Barkatpura, Hyderabad-500 027.Cell: 9391024627, 9347209378 9391024624

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE CUM XIV ADDL MM
AT: HAYATHNAGAR.
O.S.No.213 of 2024

Between:
GUNREDDY KOTI REDDY and others ...Plaintiffs
And
1 D.RAM GOPAL REDDY
2 All Concerned ... Defendants

NOTICE

To,
All Concerned ...Defendant No.2

Please take notice that the above named plaintiffs filed a suit for declare the plaintiffs are the absolute owner and possessor of the **SUIT SCHEDULE 'A' PROPERTY:** All the piece and parcel of Open Land bearing Plot No. 5, admeasuring 300 Sq.Yards or 250.83 Sq.Mtrs, in Survey No.617 to 619, situated at **PEDDA AMBERPET VILLAGE,** presently **ABDULLAPURMET MANDAL**, Ranga Reddy District, and bounded by: **North:** Plot No: 4, **South:** Plot No: 6, **East:** Plot No: 20, **West:** 25' Feet Wide Road. **SUIT SCHEDULE 'B'PROPERTY:** All the piece and parcel of Open Land bearing Plot No.117, admeasuring 200 Sq.Yards or 167.23 Sq.Mtrs, in Part of Survey Nos.527 and 531, situated at **PEDDA AMBERPET VILLAGE,** presently **ABDULLAPURMET MANDAL,** Ranga Redy District, and bounded by: **North: 40** Feet Wide Road, **South:** Plot No: 113, **East:** Plot No: 116, **West:** Plot No: 118 and to declare the plaintiffs are the legal heir of Late **GUNREDDY ARUNA W/o GUNREDDY KOTI REDDY.**

If any persons are having objection or right, title, interest and claim whatsoever in and over the aforementioned properties and the legal heir of Late **GUNREDDY ARUNA W/o GUNREDDY KOTI REDDY** they may appear before the Hon'ble Court **on Dt: 18/04/2024 at 10:30 A.M.,** if you fails to appear before the Hon'ble Court on the above said date and time, the case will be decided in your absence as per Law.

//BY ORDER OF THE HON'BLE COURT//
Sd/-
M/s.CH.SURESH,
K.RAMA MURTHY
Advocates,
Plot No.149, H.No.4-13-86/11, Huda Sai Nagar Colony, Vanasthalipuram, Hyderabad-70. Cell:9848597228.
Counsel for the Plaintiffs

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL DISTRICT JUDGE: RANGA REDDY DISTRICT
AT: LB NAGAR
I.A.NO.1391 OF 2023
IN
O.S.NO. 179 OF 2019

BETWEEN:
Mr. Mukund Lal Badruka and others ...PETITIONERS/PLAINTIFFS
AND
Hari Prasad Badruka and Others .../RESPONDENTS/ DEFENDANTS

NOTICE

To
Mrs Saroja Bai, D/o Late Sital Singh, W/o Late Makan Singh Aged about :77 yrs, Occ: House wife, R/o.H.No.13-6-822/B-14, Ambedkar Nagar, Langer House,Hyd ...Respondent No. 12
Sri Chityala Chandra Mohan Reddy S/o Madhava Reddy, Aged about 55yrs, Occ: Business, R/o. H.No.16-2-147/55/H/2, Anand Nagar, Malakpet, Hyd-36 ...Respondent No.25
Mr M.Ramachandra Reddy, S/o M. Subba Reddy, Aged about 67yrs, Occ: Business, R/o.Flat No.507, MS Block-II oldM.L.AQuarters,Hyd ...Respondent No.31
Y.Madhan Mohan Rao, S/o Y.V. Narsimha Rao, Aged about 73yrs, Occ:Business, R/o.104, Studio, Sycamore, Road No.4, Banjara Hills, Hyd ...Respondent No.34
Mrs.Sai Supriya, W/o.Sri Ganesh, Aged about 36yrs, Occ: House wife, R/o.H.No. A-1, Shanthi Nivas Apartment, Mettuguda, Secunderabad. ...Respondent No. 35
Y.Venkata Ratnakar S/o: Y.Madhan Mohan Rao, Aged about 41yrs, Occ:Doctor, R/o.A1 Shanti Nivas Apartment, Mettuguda, Secunderabad ...Respondent No.38

Please take notice that, the above said plaintiff filed the above petition against you and others for Partition and for consequential declaration and injunction before the Hon'ble I Addl. District Judge at LB Nagar vide IA No.1391 of 2023 in O.S. No.1179/2019. The said petition is coming for your appearance **on 26.04.2024.**

Hence you are hereby informed to appear before the above said court **on 26.04.2024 at 10.30 A.M.,** in person or through your counsel, failing which the matter will be decided in your absence according to law.

SCHEDULE OF PROPERTY

All that the agricultural land admeasuring Ac. 24-31 gts in Sy No. 9, situated at Alizapur Village, Gandipet Mandal, RR District, and bounded by:**NORTH :** Land in Survey No 10
SOUTH : Land in Survey No 5 (Military Area)
EAST : Land in Survey No.6,7 & 8
WEST : Nekanampura Village Shivar

(By order of the Court)
M/s.S.NAGESH REDDY,
Advocate
Flat no. 101 & 102, Saai Priya Apartments, Jaffar Ali Bagh, Somajiguda, Hyd –500082.
Ph no. 9963205550.

PUBLIC NOTICE

విజయం అంటే ఏమిటి?

'నేను నేర్చుకున్న విషయం ఇతరులు ఎదగడానికి ఎలా సహాయపడుతుందని నన్ను నేను ప్రశ్నించుకుంటాను. తమ ప్రాధాన్యం, సమయ నిర్వహణపై మహిళల కోసం సెషన్‌లను నిర్వహిస్తాను. విజయం అంటే ఏమిటి? పైకి చేరుకోవడం అని నేను అంటారు. NASSCOMలో నేను హాజరైన సెషన్‌లలో ఒక గ్లోబల్ కంపెనీ సీఎఫ్ఓ విజయం గురించి మాట్లాడుతూ 'ప్రజలు ఏమి కోరుకుంటున్నారో అనవసరం. తోటివారి ఒత్తిడి మీ విజయాన్ని నిర్వచించకూడదు' అన్నారు. ఇది నా మనసును బాగా తాకింది' అంటూ ఆమె తన మాటలు ముగించారు.

- సలీమ

సవాళ్లను పరిష్కరించడంలో

'గత ఎనిమిది నెలలుగా నేను కృత్రిమ మేధ ఆధారితమైన ఏఐ ఆప్స్ విశ్వసనీయత ఇంజనీరింగ్, డిజిటల్ పరివర్తనలో నిమగ్నమై ఉన్నాను. మేము ఈ ఏఐ ఆప్స్ ప్లాట్‌ఫారమ్‌ను మార్చడానికి Gen AIని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నాం. మరింత సమర్థవంతంగా చేయడానికి చూస్తున్నాం' అని ఆమె వివరించారు. మహిళలు నిచ్చెన ఎక్కేటప్పుడు వారికి రోల్ మోడల్‌లు, మార్గదర్శకులు ముఖ్యమని తేజా అభిప్రాయం. డెల్ టెక్నాలజీస్‌లో గొప్ప ప్రోగ్రామ్‌లను మహిళలు అందిస్తున్నప్పటికీ వారి సవాళ్లను పరిష్కరించడంలో ఆసల్యం జరుగుతుందని అన్నారు. 'ఇంజనీరింగ్‌లో మా క్లాసులో నలుగురు అమ్మాయిలమే ఉండేవాళ్ళం. నేడు ఈ సంఖ్య దాదాపు సమానంగా ఉంది. సమాజం కూడా అభివృద్ధి చెందింది. నా కుటుంబంలో నేను మొదటి మహిళా ఇంజనీర్. ఇప్పుడు చాలా మంది ఉన్నారు. ఇది స్వాగతించ దగిన మార్పు' ఆమె చెప్పింది.





ఇంకేదైనా చేయాలని

మేము సీఎస్ఆర్ కార్యకలాపాలపై దృష్టి కేంద్రీకరించి సాంకేతికతతో ఇంకేదైనా చేయాలని భావించాను. బ్రెయిలీ పాఠ్యపుస్తకాలను రూపొందించడంలో సహాయం చేయడానికి దృష్టి లోపం ఉన్నవారి కోసం పనిచేసే మిత్ర జ్యోతి అనే ఎన్‌జీఓతో కలిశాము. మహమ్మారి సమయంలో వలస కార్మికుల పునరావాసం కోసం బుద్ధ ఫౌండేషన్ మమ్మల్ని సంప్రదించింది. దీని కోసం మేము మొబైల్ ఆధారిత పరిష్కారాన్ని రూపొందించాము. కర్ణాటక ప్రభుత్వ అభ్యర్థన మేరకు పిల్లలు, పౌరుల్లో సైబర్ సెక్యూరిటీ అవగాహన కోసం గేమిఫికేషన్ సొల్యూషన్‌ను కూడా రూపొందించాము. ప్రస్తుతం నేను 300 మంది వాలంటీర్లతో కలిసి పనిచేస్తున్నాను. ఈ ప్రయాణం నన్ను ఎంతో ఉత్తేజపరుస్తోంది.

హుష్..మాయం!

న్యూఢిల్లీ : 11, 12 తరగతులకు సంబంధించిన ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల నుండి మరికొన్ని ప్రస్తావనలు అదృశ్యమయ్యాయి. అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత, గుజరాత్ హింసలో ముస్లింల ఊచకోత, మణిపూర్ ఘర్షణలు, జమ్మూకాశ్మీర్‌పై భారత్ వైఖరి...వంటి అంశాల ప్రస్తావన ఇకపై మనకు ఈ పుస్తకాలలో కన్పించదు. ఎన్సీఈఆర్టీ చేసిన ఈ మార్పులు ఆన్‌లైన్ పాఠ్యపుస్తకాలలో కన్పించనప్పటికీ పాఠ్య పుస్తకాలను త్వరలోనే సవరిస్తామని అధికారులు తెలిపారు. 'రాజకీయాలలో చోటుచేసుకున్న తాజా మార్పులను దృష్టిలో పెట్టుకొని అయోధ్యకు సంబంధించిన అంశాన్ని కూలంకషంగా సమీక్షించడం జరిగింది. ఎందుకంటే సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తాజాగా కొన్ని మార్పులు చేసింది. వాటికి పెద్ద ఎత్తున మద్దతు లభించింది' అని ఎన్సీఈఆర్టీ వివరణ ఇచ్చింది.

గుజరాత్ అల్లర్ల ఊసే లేదు

11వ తరగతి రాజకీయ శాస్త్ర పాఠ్య పుస్తకంలోని ఐదవ ఛాప్టర్‌లో (ప్రజాస్వామిక రాజకీయాలు-1) ఉన్న గుజరాత్ అల్లర్ల అంశాన్ని తొలగించారు. 86వ పేజీలో ఇలా ఉంది...'ఈ పేజీలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు సంబంధించిన ప్రస్తావనను మీరు గమనించారా? ఈ ప్రస్తావనలు మానవ హక్కులపై పెరుగుతున్న అవగాహనను, మానవ గౌరవానికి ఎదురవుతున్న ఇబ్బందులను ప్రతిబింబిస్తున్నాయి. వివిధ రంగాలలో మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన అనేక కేసులు. ..ఉదాహరణకు గుజరాత్ అల్లర్లనే తీసుకోండి. వీటిని దేశవ్యాప్తంగా ప్రజల దృష్టికి తీసుకుపోవడం జరుగుతోంది' అని ఉంది. దీనిని ఇలా మార్చారు. 'వివిధ రంగాలలో మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన అనేక కేసులను దేశవ్యాప్తంగా ప్రజల దృష్టికి తీసుకుపోవడం జరుగుతోంది' అని మార్చేశారు. అంటే గుజరాత్ అల్లర్ల ప్రస్తావనను తొలగించారు.

ముస్లింల ఊచకోత ప్రస్తావనే లేదు

11వ తరగతి రాజకీయ శాస్త్రం పాఠ్య పుస్తకంలోని 112వ పేజీలో 'రాజకీయ సిద్ధాంతం' అనే ఛాప్టర్‌లోనూ, 'లౌకికతత్వం' అనే ఎనిమిదో ఛాప్టర్‌లోనూ కొన్ని ప్రస్తావనలను ఎన్సీఈఆర్టీ తొలగించింది. ప్రస్తుతం ఆ ఛాప్టర్‌లో ఇలా ఉంది. '2002లో గుజరాత్‌లోని గోద్రాలో జరిగిన అల్లర్ల తర్వాత అనేకమంది ముస్లింలు సహా వెయ్యి మందికి పైగా ప్రజలను ఊచకోత కోశారు'. ఇకపై దీనిని ఇలా మారుస్తారు. '2002లో గుజరాత్‌లోని గోద్రాలో జరిగిన అల్లర్ల తర్వాత వెయ్యి మందికి పైగా ప్రజలను చంపేశారు' ఇలా మార్చడానికి ఎన్సీఈఆర్టీ ఏమని కారణం చెప్పిందంటే... ఏ అల్లర్లలో అయినా మతాలకు అతీతంగా ప్రజలు ఇబ్బందులు పడతారట. అది కేవలం ఏదో ఒక మతానికే పరిమితం కాదట.

బాబ్రీ కూల్చివేత కూడా...

12వ తరగతి రాజకీయ శాస్త్ర పాఠ్య పుస్తకంలో 'భారత రాజకీయాల్లో తాజా పరిణామాలు' పేరిట ఎనిమిదో ఛాప్టర్ ఉంది. అందులోని 136వ పేజీలో ఇలా ఉంది. 'రాజకీయ సమీకరణకు రామజన్మభూమి ఉద్యమం, అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేతల వారసత్వం ఏమిటి?'. సవరించిన పాఠ్యపుస్తకంలో ఈ వాక్యం ఇలా ఉంది. 'రామ జన్మభూమి వారసత్వం ఏమిటి?'.

ఇదే ఛాప్టర్‌లో బాబ్రీ మసీదు కూల్చివేత అంశాన్ని తొలగించారు. 139 పేజీలో ఇలా ఉంది. '1992లో అయోధ్యలోని వివాదాస్పద కట్టడం (బాబ్రీ మసీదు అంటారు) కూల్చివేతలో అనేక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఉదంతం దేశ రాజకీయాలలో అనేక మార్పులు తెచ్చింది. భారతీయ జాతీయతావాదం, లౌకికతత్వ స్వభావంపై విస్తృత చర్చ జరిగింది. బీజేపీ, హిందూత్వ రాజకీయాల ఉద్ధానానికి, ఈ పరిణామాలకు సంబంధం ఉంది'. అయితే దీనిని ఇలా మార్చేశారు. 'అయోధ్యలోని రామజన్మభూమి దేవాలయంపై శతాబ్దాలుగా నెలకొన్న చట్టపరమైన, రాజకీయ వివాదం దేశ రాజకీయాలను ప్రభావితం చేయడం మొదలు పెట్టింది. అది అనేక రాజకీయ మార్పులకు కారణమైంది. రామజన్మభూమి మందిర ఉద్యమం కేంద్ర బిందువుగా మారింది. ప్రజాస్వామ్యం, లౌకికవాదంపై చర్చలు, సంభాషణలు మొదలయ్యాయి. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు (2019 నవంబర్ 9న) నేపథ్యంలో అయోధ్యలో రామమందిర నిర్మాణానికి ఈ మార్పులు దారితీశాయి' అని మార్చారు.

మాయమైన 'మణిపూర్'

12వ తరగతి పుస్తకంలోని మొదటి ఛాప్టర్‌లో మణిపూర్ ప్రస్తావన ఉంది. అందులో ఏముందంటే...మణిపూర్‌లో ప్రజలు ఎన్నుకున్న శాసనసభను సంప్రదించకుండానే 1949 సెప్టెంబరులో విలీన ఒప్పందంపై సంతకం చేసేలా మహారాజుపై ఒత్తిడి తేవడంలో భారత ప్రభుత్వం విజయం సాధించింది. ఈ చర్య మణిపూర్‌లో ఆగ్రహానికి, తిరుగుబాటుకు కారణమైంది. ఆ పరిణామాలు ఇప్పటికీ కన్పిస్తూనే ఉన్నాయి....సవరించిన పాఠ్యాంశంలో మణిపూర్ ప్రస్తావనను తొలగించారు. దానిలో ఇలా ఉంది. '1949 సెప్టెంబరులో విలీన ఒప్పందంపై సంతకం చేసేలా మహారాజును ఒప్పించడంలో భారత ప్రభుత్వం విజయం సాధించింది'.

భారత్, పాక్ వివాదాన్ని సైతం...

119వ పేజీలోని ఛాప్టర్ 7లో 'ప్రజల ఆకాంక్షలు' పేరిట ఉన్న పాఠ్యాంశం భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న సరిహద్దు వివాదాన్ని ప్రస్తావించింది. అందులో ఇలా ఉంది. 'ఈ ప్రాంతం చట్టవిరుద్ధ ఆక్రమణలో ఉన్నదని భారత్ వాదిస్తోంది. పాకిస్తాన్ ఈ ప్రాంతాన్ని ఆజాద్ పాకిస్తాన్ అని పిలుస్తోంది'. మార్చేసిన పాఠ్యాంశంలో ఏమని ఉందంటే...అయితే అది పాకిస్తాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించిన భారత భూభాగం పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూకాశ్మీర్ (పీఓజేకే). జమ్మూకాశ్మీర్‌కు సంబంధించి భారత ప్రభుత్వ తాజా వైఖరికి అనుగుణంగా ఈ మార్పును తీసుకొచ్చామని ఎన్సీఈఆర్టీ తెలిపింది.

వామపక్షాలకు కొత్త భాష్యం

వామపక్షాలకు ఎన్సీఈఆర్టీ కొత్త నిర్వచనం ఇచ్చింది. 12వ తరగతి పాఠ్యపుస్తకంలోని ఛాప్టర్ 3లో ప్రస్తుతం ఏముందంటే 'వామపక్షాలు పేదలు, అట్టడుగు వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తాయి. ఈ వర్గాల కోసం తీసుకునే ప్రభుత్వ విధానాలను సమర్థిస్తాయి'. దీనిని ఎలా మార్చేసారో చూడండి. 'ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణకు మద్దతు ఇచ్చే వారిని గురించి వామపక్షాలు మాట్లాడతాయి. స్వేచ్ఛాయుత పోటీపై ప్రభుత్వ నియంత్రణలను ఇష్టపడతాయి'. ఇక 'ప్రజాస్వామిక రాజకీయాలు' పేరిట 10వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తకంలో ప్రస్తుతం ఉన్న తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ, ఎన్సీపీ ప్రస్తావనలను 4వ చాప్టర్ నుంచి తొలగించారు. అమ్‌ఆద్మీ పార్టీ, నేషనల్ పీపుల్స్ పార్టీలను చేర్చారు. ఈ మార్పులకు ఎన్సీఈఆర్టీ చెప్పిన కారణమేమిటో తెలుసా? సీపీఐ, ఎన్సీపీలు జాతీయ పార్టీలు కావట. అందుకే ఆయా పార్టీల ప్రస్తావనలను తొలగించారట. వాటి స్థానంలో అమ్‌ఆద్మీ, నేషనల్ పీపుల్స్ పార్టీలను చేర్చారట. ఈ రెండు పార్టీలనూ 2023లో ఎన్నికల కమిషన్ జాతీయ పార్టీలుగా ప్రకటించిందని ఎన్సీఈఆర్టీ గుర్తు చేసింది. ఎన్సీఈఆర్టీ 12వ తరగతి రాజకీయ శాస్త్రం పాఠ్య పుస్తకంలోని ఛాప్టర్ 7లో ఓ పేరాను సవరించి, అందులో ఆర్టికల్ 370 రద్దును ప్రస్తావించింది. గతంలో ఏముందంటే...అనేక రాష్ట్రాలకు సమాన అధికారాలు ఉన్నాయి. ఈశాన్య ప్రాంతంలోని జమ్మూకాశ్మీర్ వంటి కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక అధికారాలు ఉన్నాయి...ఈ పేరాను సవరించి ఇలా మార్చారు....అయితే జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేకాధికారాలు కల్పించే ఆర్టికల్ 370ని 2019 ఆగస్టులో రద్దు చేయడం జరిగింది.

ప్రజల గొంతు వినిపించాలంటే కమ్యూనిస్టులు అవసరం

(మొదటిపేజి తరువాయి)

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అవిశ్రాంత పోరాటాలు నిర్వహించి విజయం సాధించామన్నారు. భువనగిరి పార్లమెంటు సరిహద్దులు ఇతర పార్టీల అభ్యర్థులకు తెలుసా అని ప్రశ్నించారు. ఈ నియోజకవర్గంలో ఏనాడైనా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పోరాటాలు చేశాయా అని నిలదీశారు. గత యూపీఏ ప్రభుత్వంలో వామపక్షాల బలం ఉన్న కారణంగానే జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని సాధించుకున్నామన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని సాధించుకున్నామన్నారు. బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత ఈ చట్టాలను తుంగలో తొక్కుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సరైన పంథాలో పోరాటాలు నిర్వహించడం లేదని విమర్శించారు. లౌకిక విలువలను కాపాడటంలో విఫలమైనదన్నారు.

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపిందన్నారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. అభ్యుదయవాదులకు, అవకాశవాదులకు మధ్య ఈ పోటీ జరుగుతున్నదన్నారు. డబ్బులు వెదజల్లి గెలవాలని చూస్తున్న పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ చరిత్ర ఏంటో ఈ ప్రాంత ప్రజలందరికీ తెలుసన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను ఇంకా ఎన్ని సంవత్సరాలు కొనసాగిస్తారని ప్రశ్నించారు. సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల అనేక ప్రాజెక్టులు వెనుకబడుతున్నాయన్నారు. తెలంగాణకు ఎయిమ్స్ ఇచ్చినా కనీస వసతులు కల్పించడం లేదని, 44 డిపార్ట్‌మెంట్లు ఉంటే 20 డిపార్ట్‌మెంట్లు మాత్రమే పని చేస్తున్నాయని చెప్పారు. మూసీ ప్రక్షాళనతో పాటు ముందు మూసీని శుద్ధి చేయాలని డిమాండ్ చేశారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందన్నారు. ఆ పోరాట వారసత్వం కలిగిన కమ్యూనిస్టు అభ్యర్థిగా తాను ప్రజల ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఆదరించి, అభిమానించి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కడిగల్ల భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీరాంనాయక్, జగదీష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యాదయ్య, సామెల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ విచారణపై కవిత సవాల్

(మొదటిపేజి తరువాయి)

ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని వివరించారు. కవితను ప్రశ్నించే అంశంపై విచారణ చేపట్టాలని కోరారు. "మద్యం స్కాం కేసులో కవితను విచారించాల్సి ఉన్నదని, దీనికి అనుమతి కావాలని కోరుతూ శుక్రవారం సీబీఐ కోర్టును ఆశ్రయించింది. అయితే.. దీనిపై మాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు, కనీసం ఆ పిటిషన్ కాపీ కూడా మాకు చేరలేదు. అయినప్పటికీ దీనికి కోర్టు అనుమతి ఇచ్చింది. అందుకే.. దానిని మేం సవాల్ చేస్తున్నాం. కవితను సీబీఐ విచారణకు అనుమతి ఇవ్వడంపై స్టేటస్ కో ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరాం" అని కవిత తరపు న్యాయవాది నితీష్ రాణా స్పష్టం చేశారు. అందుకు రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి భవేజా నిరాకరించారు. పిటిషన్ పై వాదనలు విన్న తర్వాతే ఏ ఉత్తర్వులైనా ఇస్తామని స్పష్టం చేశారు. అయితే.. ఎటువంటి వాదనలు వినకుండా స్టేటస్ కో ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని న్యాయమూర్తి కావేరి భవేజా స్పష్టం చేశారు. కవిత పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు సీబీఐ మూడు రోజులు వరకు సమయం కోరింది. తదుపరి విచారణను ఈనెల 10న చేపట్టనున్నామని, ఏ నిబంధనల ప్రకారం పిటిషన్ దాఖలు చేశారో స్పష్టంగా తెలియజేయాలని సీబీఐకి కోర్టు తెలిపింది. తదుపరి వాదనలు విన్న తర్వాతే, ఏ ఉత్తర్వులు అయినా ఉంటాయని కోర్టు స్పష్టం చేసింది.

పట్టణ ఉపాధి హామీ చట్టం

- ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు
- గవర్నర్ వ్యవస్థ రద్దు
- పార్లమెంట్ పరిధిలోకి ఈడీ, సీబీఐ
- సీపీఐ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల
- మార్పు కోసం ఓటు : డి.రాజా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొస్తామని, రోజుకు రూ.700 కనీస వేతనంతో 200 ఉపాధి హామీ పని దినాలు కల్పిస్తామని సీపీఐ ఎన్నికల మ్యానిఫెస్టో పేర్కొంది. "18వ లోక్‌సభకు జరిగే ఎన్నికలు మన లౌకిక ప్రజాస్వామ్య, గణతంత్రానికి, దాని భవిష్యత్తుకు, మన రాజ్యాంగ ధర్మానికి చాలా కీలకమైనవి" అని పేర్కొంది. శనివారం సీపీఐ కేంద్ర కార్యాలయం (అజయ్ భవన్)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జాతీయ నాయకులు బీకే కాంగో, సయ్యద్ అజీజ్ పాషా, దినేష్ వర్ష్నేలతో కలిసి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేశారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను పార్లమెంటు పరిధిలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఈ మ్యానిఫెస్టో పేర్కొంది. "ఫెడరలిజాన్ని బలోపేతం చేయడానికి గవర్నర్ వ్యవస్థ రద్దు చేయడం కోసం తమ పోరాటాన్ని ఉధృతం చేస్తాం. కేంద్రం జోక్యాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తాం" అని పేర్కొంది. "రాష్ట్రాలలో ఎన్నికైన ప్రభుత్వాలకు ప్రధాన విధాన నిర్ణయాలు తీసుకునే అధికారం కల్పిస్తాం" అని తెలిపింది.

మార్పు కోసం ఓటు: డి.రాజా

బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాలన దేశంలో పూర్తిగా విపత్తుకు దారితీసిన నేపథ్యంలో పాలన మార్పు కోసం ఓటు వేయాలని డి.రాజా పిలుపునిచ్చారు. "ఈ ఎన్నికలు దేశానికి, దాని భవిష్యత్తుకు చాలా కీలకమైనవి. ప్రధాని నరేంద్ర మోడీ పాలన దేశానికి వినాశకరమైనది" అని అన్నారు. రాజ్యాంగంపై దాడి జరుగుతోందని, ఆర్ఎస్ఎస్ రాజకీయ సైన్యమైన బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. నరేంద్ర మోడీ పాలనలో దేశ ప్రజల బతుకులు కష్టతరంగా మారాయని అన్నారు. దేశంలోని మొత్తం సంపదను అతి సంపన్నులపై కేంద్రీకరించి, వెనుకబడిన వారిని కడు పేదరికంలో ఉంచుతున్న మోడీ పరిపాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కేందుకు ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ఎత్తుగడలను ఓడించేందుకు ప్రజలంతా కలిసి రావాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజల సమస్యలను లేవనెత్తేందుకు తమ పార్టీ తనవంతు పాత్ర పోషిస్తుందని అన్నారు.

మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు

"పౌరసత్వ సవరణ చట్టం, యూఏపీఏ రద్దు కోసం పోరాటం కొనసాగిస్తాం. ఎన్నికల కమిషనర్ల నియామకం పారదర్శకంగా జరగాలి. సాధారణ జనాభా గణనతోపాటు కుల గణనను డిమాండ్ చేయాలి. పట్టణ ఉపాధి హామీ కోసం ఒత్తిడి పెంచుతాం. సైన్యంలో కాంట్రాక్టీకరణ కోసం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలి. గిగ్-వర్కర్లకు సామాజిక భద్రత.

పార్లమెంట్ పరిధిలో ఈడీ, సీబీఐ పని చేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీల 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తాం. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లను తీసుకొస్తాం. పన్నుల విధింపు చర్యలను సవరిస్తాం. సంపదపై పన్నును విధిస్తాం. కార్పొరేట్ పన్ను పెంచుతాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో 200 పని దినాలు. కనీస వేతనం రూ.700 ఉండేలా కృషి చేస్తాం. కేంద్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో చొప్పించిన అన్ని అశాస్త్రీయ భాగాలను తొలగిస్తాం " అని సీపీఐ వాగ్దానం చేసింది.

గంజాయి అక్రమ రవాణపై కఠిన చర్యలు

- నిరంతరం పోలీసు నిఘా
- 1379 కేజీల గంజాయిని దగ్ధం చేసిన ఎస్పీ చందనా దీప్తి



నవతెలంగాణ- నార్కట్‌పల్లి

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా నిరంతరం నిఘా పెట్టి పనిచేస్తున్నామని ఎస్పీ చందనా దీప్తి అన్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 26 కేసుల్లో 1379 కేజీల గంజాయిని సీజ్ చేసి.. కోర్టు ఉత్తర్వుల ప్రకారం దగ్ధం చేసినట్టు తెలిపారు. నార్కట్‌పల్లి మండలం గుమ్మలబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో శనివారం జిల్లా ఎస్పీ, డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వీర్యం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 26 కేసుల్లో రూ.కోటి 93లక్షల విలువగల 1379 కిలోల గంజాయిని సీజ్ చేసి నిర్వీర్యం చేసినట్టు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా గంజాయిని రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదా, సీఐ రాఘవరావు, బీసన్న, సైదులు, నాగరాజు, ఆర్‌ఐలు సురాప్ప నాయుడు, సంతోష్, ఎస్ఐ అంతి రెడ్డి పాల్గొన్నారు.

నవచిత్రం



నాగరాజు నెక్కంటి, అశ్విని శ్రీ, సతీష్‌కుమార్

మిస్ జానకీ షూటింగ్ షురూ

ఎస్ ఎన్ చాందిని క్రియేషన్స్ బ్యానర్ పై నాగరాజు నెక్కంటి నిర్మాణ సారథ్యంలో బిగ్ బాస్ ఫేమ్ అశ్విని శ్రీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మిస్ జానకి'. సతీష్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా శనివారం అత్యంత ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించుకుంది. నిర్మాత సి.కళ్యాణ్ క్లాప్ కొట్టి సినిమాను ప్రారంభించారు. నటుడు మహేష్ కుమార్ మాట్లాడుతూ, 'ఈనెల 20 నుంచి ఏకధాటిగా 30 రోజులు రెగ్యులర్ చిత్రీకరణ జరుపుకుంటుంది. ఆ తరువాత మరో షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తి చేస్తాం. ఇది లేడీ ఓరియెంటెడ్ చిత్రం. ఈ సినిమాతో అశ్విని శ్రీకు మంచి పేరు వస్తుందని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

"బిగ్ బాస్' తరువాత చాలా స్టోరీలు విన్నాను. కానీ ఈ స్టోరీ విన్నప్పుడు చాలా బాగుంది. చాలా డిఫరెంట్‌గా ఉందనిపించింది. ఈ సినిమాలోని నా క్యారెక్టర్ 'డీజే టిల్లు' సినిమాలో రాధిక క్యారెక్టర్‌లా అందరికీ గుర్తుండిపోతుంది' అని నాయిక అశ్విని శ్రీ అన్నారు. డైరెక్టర్ సతీష్ కుమార్ మ్లాట్లాడుతూ,'అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్ నాగరాజు నెక్కంటికి థ్యాంక్స్. అలాగే కథని నమ్మి నాతో జర్నీ చేస్తున్న నటీనటులకు, టెక్నీషియన్లకు ధన్యవాదాలు. ఈ సినిమా కచ్చితంగా అందరికి నచ్చుతుంది' అని చెప్పారు.

ఆదరణ అద్భుతం



మీనాక్షి గోస్వామి, సూర్య తేజ

సూర్య తేజ హీరోగా పరిచయం అవుతూ నటించిన చిత్రం 'భరతనాట్యం'. 'దొరసాని' ఫేమ్ కెవిఆర్ మహేంద్ర దర్శకత్వం వహించారు. పిఆర్ ఫిలింస్ పతాకంపై పాయల్ సరాఫ్ నిర్మించారు.

మీనాక్షి గోస్వామి కథానాయికగా నటించారు. వేసవి కానుకగా ఈనెల 5న విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి సూపర్ హిట్ సాధించి సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ని నిర్వహించింది.

దర్శకుడు కెవిఆర్ మహేంద్ర, 'కొత్త హీరో, హీరోయిన్‌తో కొత్త నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా ఇంత గ్రాండ్‌గా సినిమా తీయడం, థియేటర్స్‌లో విడుదల చేయడం డబుల్ టాస్క్ అన్ని సవాళ్ళని దాటుకొని ఏపీ, తెలంగాణలో 150కి పైగా థియేటర్స్‌లో రిలీజ్ చేయడం పెద్ద సక్సెస్‌గా భావిస్తున్నాం. థియేటర్స్‌లో రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. చూసిన ప్రతి ప్రేక్షకుడు ఎంజాయ్ చేస్తున్నాడు. వస్తున్న రెస్పాన్స్ చూసి ఆంధ్రాలో తొమ్మిది థియేటర్స్‌ని పెంచారు. వీకెండ్స్‌తో పాటు ఉగాది హాలీడేస్ కూడా మాకు హెల్ప్ అవుతాయి' అని తెలిపారు. 'చూసిన ప్రేక్షకులంతా సినిమా చాలా బావుందని అభినందించారు. సెకండ్ హాఫ్ చాలా బావుందని, నేను చక్కగా నటించానని, మొదటి సినిమాలా అనిపించలేదని చాలా మంది మెచ్చుకున్నారు. చిన్న సినిమా అనుకున్నాం కానీ చాలా పెద్ద సినిమాలా ఉందని చెబుతుంటే చాలా ఆనందంగా అనిపించింది' అని హీరో సూర్య తేజ ఏలే చెప్పారు.

తప్పుని అస్సలు భరించలేను



కమల్‌హాసన్

కమల్ హాసన్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో లైకా ప్రొడక్షన్స్‌తో పాటు రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'. వీరిద్దరి కాంబినేషన్‌లో 1996లో విడుదలై, బాక్సాఫీస్ దగ్గర సరికొత్త రికార్డులను క్రియేట్ చేసిన 'ఇండియన్' చిత్రాన్ని 'భారతీయుడు'గా విడుదల చేసింది. ఆ మూవీకి సీక్వెల్‌గా ఇప్పుడు 'భారతీయుడు 2' రూపొందుతోన్న సంగతి తెలిసిందే . భారతీయుడు సీక్వెల్ అంటే ఎలాంటి అంచనాలుంటాయో వాటిని మించేలా డైరెక్టర్ శంకర్ ఈ చిత్రాన్ని విజువల్ వండర్‌గా ఆవిష్కరిస్తున్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడే స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతిగా కమల్ హాసన్ పవర్‌ఫుల్ పెర్ఫామెన్స్ ఇవ్వటానికి రెడీ అయ్యారు. ఈ సినిమా శరవేగంగా రూపొందుతోంది. తాజాగా ఈ సినిమాను జూన్ నెలలో విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కూడా మేకర్స్ విడుదల చేశారు. తెల్లటి ధోతి, కుర్తాలో కమల్ హాసన్ అవినీతికి వ్యతిరేకంగా పోరాటం అంటే ఎంత స్వచ్ఛంగా ఉండాలో అంతటి స్వచ్ఛత పోస్టర్‌లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. జీరో టాలరెన్స్ (తప్పును అస్సలు భరించలేను) అని పోస్టర్‌పై ఉన్న లైన్ చాలా ప్రభావవంతంగా ఉంది. కమల్ హాసన్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్.జె.సూర్య, బాబీ సింహ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ప్రేక్షకులు ఎంపిక చేసిన వారితోనే సినిమా



రామ్‌గోపాల్ వర్మ

ఆర్‌జీవీ డెన్ వేదికగా శనివారం దర్శకుడు రామ్ గోపాల్ వర్మ 'యువర్ ఫిల్మ్' అనే కాన్సెప్ట్‌ని మీడియా ద్వారా వివరించారు. ప్రేక్షకులే సినిమా హిట్, ఫ్లాప్ నిర్ణయిస్తారు కాబట్టి, ఆ ప్రేక్షకులే సినేమాకు సంబంధించిన హీరో, హీరోయిన్, డైరెక్టర్, సినిమాటోగ్రాఫర్ ఇలా అన్ని టెక్నీషియన్స్‌ను ఆర్‌జీవీ వెబ్సైట్ ద్వారా ఓటింగ్ పద్దతిలో ప్రజలే ఎన్నుకుంటారు.

ప్రజలు నిర్ణయించిన వారితోనే సినిమాని నిర్మిస్తారు. ఆర్‌జీవీ నిర్మాతగా ఆరు నెలలలో తీసి రిలీజ్ చేస్తారు. సినిమా కథనీ ఆర్‌జీవీ వెబ్సైటులో ఒక రెండు లైన్సులో పెట్టి, ఆ కథ లైను నచ్చిన యాక్టర్స్, డైరెక్టర్స్, డిఓపి, మ్యూజిక్ డైరెక్టర్ ఇలా అందరూ కూడా అప్లై చేసుకోవచ్చు. ప్రేక్షకులు ఇంటరెస్ట్ ఉండి అప్లై చేసుకున్న ప్రతి డిపార్ట్మెంట్ వారికి, ఎవరి వర్క్ నచ్చిందో వారిని ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకుంటారు. అలా ఎన్నుకున్న వారిని ఆర్‌జీవీ డెన్ టీమ్ షార్ట్ లిస్ట్ చేసి వెబ్సైట్‌లో పెడతారు. ఆ తరవాత పెట్టే టాస్కులని బట్టి వారు ఆడిషన్స్ ఇస్తూ ఉంటారు.

ఆ ఆడిషన్స్‌లో ప్రేక్షకులకు ఎక్కువగా ఎవరు నచ్చితే, అతను హీరోగా సినిమా తీస్తారు. ఇదే తరహాలో హీరోయిన్, డైరెక్టర్స్, డిఓపి ఇలా అందరూ కూడా ప్రేక్షకుల ద్వారా ఎన్నుకోబడతారు. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల కోసం ఎన్నుకున్నదే ప్రజాస్వామ్యం అలానే ప్రేక్షకుల చేత, ప్రేక్షకుల కొరకు, ప్రేక్షకుల కోసం చేసే సినిమాలే ఈ యువర్ ఫిల్మ్ ఐడియా. ఈ యువర్ ఫిల్మ్ అనేది భాషతో సంబంధం లేకుండా అన్ని భాషల వారితో నిర్మాణం ఆర్‌జీవీ డెన్ నుండి జరుగుతుంది.

సరికొత్తగా సీతా కళ్యాణ వైభోగమే



సుమన్ తేజ్, గరీమ చౌహాన్

సుమన్ తేజ్, గరీమ చౌహాన్ హీరో, హీరోయిన్లుగా డ్రీమ్ గేట్ ప్రొడక్షన్స్ పతాకంపై సతీష్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ నిర్మిస్తున్న చిత్రం 'సీతా కళ్యాణ వైభోగమే'.

భారీ యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు మంచి ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఈ చిత్రం రాబోతోంది. గోవాలో కొరియోగ్రాఫర్ భాను మాస్టర్ నేతృత్వంలో దాదాపు 250 మంది డ్యాన్సర్లతో ఈ చిత్రంలోని ఒక పాటను ఇటీవల చిత్రీకరించారు.

తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇదొక లవ్ అండ్ యాక్షన్ మూవీ అని ఈ పోస్టర్ చెప్పకనే చెబుతోంది.

సరికొత్త కథా కథనాలతో ప్రొడ్యూసర్ రాచాల యుగంధర్ ఈ మూవీని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 100 మంది ఫైటర్లతో చిత్రీకరించిన భారీ యాక్షన్ సన్నివేశాలు ఈ సినిమాకే హైలెట్‌గా నిలవనున్నాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన విడుదల తేదీని ప్రకటించనున్నారు' అని చిత్ర బృందం తెలిపింది. 'గగన్ విహారి' విలన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో నాగినీడు, శివాజీ రాజా, ప్రభావతి, వెంకీ మంకీ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.ఈ సినిమాకు సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, కెమెరామెన్ పరుశురామ్, ఎడిటర్ డి. వెంకట ప్రభు, ఫైట్ మాస్టర్ డ్రాగన్ ప్రకాష్, కొరియోగ్రాఫర్లు భాను మాస్టర్, పోలకి విజయ్ పనిచేస్తున్నారు.

యూనిక్ ఫ్యామిలీ కామెడీ డ్రామా..



ఐశ్వర్య రాజేష్, జీవీ ప్రకాష్ కుమార్


జీవీ ప్రకాష్ కుమార్, ఐశ్వర్య రాజేష్ నటించిన ఫ్యామిలీ కామెడీ డ్రామా 'డియర్'. తమిళంలో ఈనెల 11న, తెలుగులో ఈనెల 12న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహించారు. నట్మెగ్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి పృథ్వీరాజ్ నిర్మించారు. నాగ చైతన్య వాయిస్ ఓవర్ అందించిన ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. నూతన వధూవరుల పాత్రల్లో జివి ప్రకాష్ కుమార్ , ఐశ్వర్య రాజేష్ లైఫ్‌లో స్నీక్ పీక్ ఇస్తుంది. భార్యకి ఉన్న గురక అలవాటు కారణంగా రిలేషన్ షిప్ కాంప్లికేటెడ్‌గా మారిన కథాంశం యూనిక్‌గా ఉంది. నాగ చైతన్య వాయిస్ ఓవర్ ప్రధాన ఆకర్షణలలో ఒకటి. జగదీష్ సుందరమూర్తి కెమెరా బ్రిలియంట్‌గా ఉంది. జివి ప్రకాష్ కుమార్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కామిక్ కోణాన్ని ఎలివేట్ చేసింది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి.

అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని ఆంధ్రా ప్రాంతంలో విడుదల చేయనుండగా, ఏషియన్ సినిమాస్ తెలంగాణ ప్రాంతంలో విడుదల చేయనుంది. కాళి వెంకట్, ఇళవరసు, రోహిణి, తలైవాసల్ విజయ్, గీతా కైలాసం, నందిని కీలక పాత్రలలో నటించారు.

ఆద్యంతం భావోద్వేగ భరితంగా నరుడి బ్రతుకు నటన

ప్రస్తుతం పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ వరుస చిత్రాలతో సందడి చేస్తోంది. కంటెంట్ ఓరియెంటెడ్ సబ్జెక్టులతో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ వరుస ప్రాజెక్టులను తెరకెక్కిస్తోంది. మంచి చిత్రాలను అందించే క్రమంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ 'నరుడి బ్రతుకు నటన' అనే సినిమాను మన ముందుకు తీసుకొస్తోంది. ఈ మూవీ చిత్రీకరణ అంతా కూడా కేరళలో జరిగింది. ఇక కేరళ ప్రకృతి అందాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

ఈ సినిమాలో కేరళ అందాలే హైలెట్ కానున్నాయి. శివ కుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న, శృతి జయన్, ఐశ్వర్యా అనిల్ కుమార్, వైవా రాఘవ వంటి వారు ప్రముఖ పాత్రల్లో నటించిన ఈ మూవీని రిషికేశ్వర్ యోగి తెరకెక్కిస్తున్నారు. నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్, సుకుమార్ బొరెడ్డి, డా.సింధు రెడ్డి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి వివేక్ కూచిబొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. విడుదలకు ముందే దాదాపు అరవైకి పైగా అంతర్జాతీయ అవార్డులను గెలుచుకున్న ఈ చిత్రాన్ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ ఈనెల 26న ప్రేక్షకుల ముందుకు తీసుకురావటానికి సన్నాహాలు చేస్తున్నారు. 'ఆద్యంతం భావోద్వేగ భరితంగా సాగే ఈ సినిమా కేరళ అందాలకు ప్రతిబింబంగా నిలుస్తుంది. అలాగే ప్రేక్షకుల ప్రశంసలతోపాటు విమర్శకుల అభినందల్ని పొందిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకుల్ని సైతం అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నారు.



ఆటలు





చాంపియన్స్ అనుపమ, తరుణ్

• కజకిస్థాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్

అస్థానా (కజకిస్థాన్) : కజకిస్థాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత వర్థమాన షట్లర్లు సత్తా చాటారు. పురుషుల సింగిల్స్ విభాగంలో తరుణ్ మన్నెపల్లి, మహిళల సింగిల్స్ విభాగంలో అనుపమ ఉపాధ్యాయ విజేతలుగా నిలిచారు. శనివారం జరిగిన ఫైనల్లో మాజీ జూనియర్ వరల్డ్ నం.1 అనుపమ ఉపాధ్యాయ 21-5, 21-16తో ఇషారాణిపై విజయం సాధించింది. ఆల్ ఇండియన్ టైటిల్ పోరులో అనుపమ 41 నిమిషాల్లోనే సహచర షట్లర్‌పై పైచేయి సాధించింది. 19 ఏండ్ల అనుపమ గతంలో ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ 2021, తజకిస్థాన్ ఇంటర్నేషనల్ సిరీస్ 2023, పొలీష్ ఓపెన్ 2022 టైటిళ్లను సైతం సొంతం చేసుకుంది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో హైదరాబాద్ ఆటగాడు తరుణ్ మన్నెపల్లి వరుస గేముల్లో గెలుపొందాడు. 22 ఏండ్ల తరుణ్ 21-10, 21-19తో ఎనిమిదో సీడ్ మలేషియా షట్లర్ సూంగ్ జూ వెన్‌పై విజయం సాధించాడు. జాతీయ చాంపియన్‌షిప్స్ రన్నరప్ తరుణ్‌కు ఇదే తొలి అంతర్జాతీయ టైటిల్. మిక్స్‌డ్ డబుల్స్‌లో సంజయ్ శ్రీవాత్స ధన్‌రాజ్, మనీశ జోడీ 21-9, 7-21, 2-21తో మూడు గేముల టైటిల్ పోరులో రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకున్నారు.



బట్లర్ బాదేశాడు

• బెంగళూర్‌పై రాజస్థాన్ గెలుపు • కోహ్లి అజేయ సెంచరీ వృథా

బెంగళూర్ 183/3, రాజస్థాన్ 189/4



నవతెలంగాణ-జైపూర్

రాజస్థాన్ రాయల్స్‌కు ఎదురులేదు. ఐపీఎల్ 17లో వరుసగా నాల్గో విజయం సాధించిన రాజస్థాన్ రాయల్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. 184 పరుగుల ఛేదనలో ఓపెనర్ జోశ్ బట్లర్ (100 నాటౌట్, 58 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ సంజు శాంసన్ (69, 42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీతో మెరిశాడు. బట్లర్, సంజు 148 పరుగుల భారీ భాగస్వామ్యంతో రాయల్స్‌కు గెలుపు లాంఛనం చేశారు. బట్లర్ జోరుతో 19.1 ఓవర్లలోనే రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అంతకుముందు, విరాట్ కోహ్లి (113 నాటౌట్, 72 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీతో తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 183 పరుగులు చేసింది. ఐదు మ్యాచుల్లో బెంగళూర్‌కు ఇది నాల్గో పరాజయం.

కోహ్లి శతక నాదం : టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్.. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసింది!. ఓపెనర్లు ఇద్దరూ ఇన్నింగ్స్ 14వ ఓవర్‌కు నిలబడినా.. బెంగళూర్ స్కోరు 200 దాటలేదు. స్పిన్నర్లు అశ్విన్, చాహల్ సహా పేసర్ బర్గర్ బ్యాటర్లను కట్టడి చేశారు. లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి క్రమశిక్షణ బంతులేసిన రాయల్స్ బౌలర్లు 33 డాట్ బాల్స్ సంధించారు. ఓవరాల్ స్కోరుపై ఇది ప్రభావం చూపించింది. ఆర్సీబీ ఓపెనర్లు కోహ్లి (113 నాటౌట్), డుప్లెసిస్ (44) తొలి వికెట్‌కు 125 పరుగుల భారీ భాగస్వామ్యం అందించారు. ఆరంభంలో డుప్లెసిస్, కోహ్లి ఇద్దరూ దూకుడు చూపించలేకపోయారు.డుప్లెసిస్ రెండు ఫోర్లు, రెండు సిక్సర్లు కొట్టినా సౌకర్యవంతంగా కనిపించలేదు. పవర్‌ప్లేలో 53 పరుగులు చేసిన బెంగళూర్ ఆ తర్వాత మరింత నెమ్మదించింది. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 39 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన కోహ్లి.. సెంచరీ కోసం 28 బంతులే తీసుకున్నాడు. 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 67 బంతుల్లో కోహ్లి శతకం సాధించాడు. గ్లెన్ మాక్స్‌వెల్ (1), సౌరవ్ చౌహాన్ (9), కామెరూన్ గ్రీన్ (5 నాటౌట్) నిరాశపరిచారు. బెంగళూర్ ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, ఏడు సిక్సర్లు నమోదు కాగా.. అందులో కోహ్లి ఒక్కడే 12 ఫోర్లు, 4 సిక్సర్లు కొట్టడం గమనార్హం. సమిష్టిగా రాణించటంలో మరోసారి విఫలమైన బెంగళూర్ బ్యాటర్లు జట్టును తక్కువ స్కోరుకే పరిమితం చేశారు!.

నకుమురపై విదిత్ విక్టరీ

ఫిడే క్యాండిడేట్స్ చెస్ 2024



న్యూఢిల్లీ : ఫిడే క్యాండిడేట్స్ చెస్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతీ సూపర్ విక్టరీ సాధించాడు. హికారు నకుముర (అమెరికా)పై 29 ఎత్తుల్లో రెండో రౌండ్‌లో కీలక విజయం నమోదు చేశాడు. నల్లపావులతో ఆడిన విదిత్ గుజరాతీ ఎత్తులకు పైఎత్తులు వేసి నకుమురను కంగుతినిపించాడు. భారత యువ సంచలనం ఆర్. ప్రజ్ఞానందను సహచర గ్రాండ్‌మాస్టర్ డి గుకేశ్ చేతిలో ఓటమి పాలయ్యాడు. ఆరంభంలోనే దూకుడుగా ఆడి సహచర చైన్నై చిన్నోడికి రెండు పావులు కోల్పోయిన ప్రజ్ఞానంద మళ్లీ కోలుకోలేదు. 33 ఎత్తుల్లో గుకేశ్ విజయం సాధించాడు.

భారత్‌కు భారీ ఓటమి

1-5తో ఆసీస్ చేతిలో చిత్తు



పెర్త్ (ఆస్ట్రేలియా) : 2024 పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధతలో భాగంగా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన హాకీ ఇండియా పేలవ ప్రదర్శన చేసింది. ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో భారీ పరాజయం మూటగట్టుకుంది. 1-5తో ఆతిథ్య ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది. తొలి టెస్టులో ఆస్ట్రేలియాకు గట్టి పోటీ ఇస్తారనుకున్న భారత ఆటగాళ్లు.. దారుణంగా విఫలమయ్యారు. మ్యాచ్ ఆరంభం నుంచీ మ్యాచ్‌ను నియంత్రణలో నిలుపుకున్న కంగారూలు.. ఐదు మ్యాచుల టెస్టు సిరీస్‌లో 1-0తో ముందంజ వేశారు. భారత్ తరఫున ఏకైక గోల్ 47వ నిమిషంలో గుర్జంత్ సింగ్ కొట్టాడు. ఆస్ట్రేలియా ఆటగాళ్లు టామ్ విక్హమ్ (20వ, 38వ నిమిషం), టిమ్ బ్రాండ్ (3వ నిమిషం), జోయెల్ రింటాల (37వ నిమిషం), ఫ్లిన్ (57వ నిమిషం) గోల్స్ నమోదు చేశారు. భారత్, ఆస్ట్రేలియా ఆదివారం రెండో టెస్టులో తలపడనున్నాయి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

రెట్టింపు కానున్న ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు

- పెరగనున్న మరణాలు



న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు పెరిగిపోతున్నాయి. 2020-2040 మధ్యకాలంలో ఈ కేసుల సంఖ్య రెట్టింపు కావచ్చని అంచనా. ఫలితంగా మరణాలు కూడా 85% మేర పెరగవచ్చునని లాన్సెట్ కమిషన్ అధ్యయనం తెలిపింది. ముఖ్యంగా పేద దేశాలు, ఓ మోస్తరు ఆదాయం కలిగిన దేశాలు ఈ వ్యాధి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడతాయని హెచ్చరించింది. కేసుల సంఖ్యలో పెరుగుదల అనివార్యమని తేల్చి చెప్పింది. వ్యాధి నిర్ధారణ సరిగా జరగకపోవడం, సకాలంలో చేయకపోవడం వంటి కారణాలతో బాధితుల సంఖ్య మరింత పెరగవచ్చునని తెలిపింది. వృద్ధుల సంఖ్య పెరగడం, జీవితకాలం మెరుగుపడడం వల్ల వయసు మీరిన వారిలో ప్రొస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ఓ ప్రణాళికను రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని, తగిన చర్యలు చేపట్టాలని అధ్యయనం సూచించింది. వ్యాధిని ముందుగానే కనిపెట్టి, అవసరమైన చికిత్స అందించాలని, ప్రొస్టేట్ క్యాన్సర్‌పై ప్రజలకు మరింత అవగాహన కలిగించాలని లాన్సెట్ కమిషన్ సూచించింది. ఈ చర్యల ద్వారా ప్రజల ప్రాణాలు కాపాడవచ్చునని తెలిపింది. వ్యాధిపై జన్యుపరమైన పరిజ్ఞానం పెరుగుతోందని, దీంతో పరమాణువు లక్ష్యంగా చికిత్సలను అభివృద్ధి చేయడానికి అవకాశం ఏర్పడుతుందని వివరించింది. రోగికి ఏ రకమైన చికిత్స అందించాలనే విషయాన్ని అంచనా వేయడానికి కృత్రిమ మేధ పరిజ్ఞానం ఉపకరిస్తుందని ఔషధ కంపెనీ 'పెప్‌ట్రిస్' సహ వ్యవస్థాపకుడు నారాయణన్ వెంకట సుబ్రమణ్యన్ చెప్పారు.

బీ12 లోపిస్తే అన్నీ అనర్థాలే...!




న్యూఢిల్లీ : మన శరీరానికి అన్ని రకాల విటమిన్లు, ఖనిజ లవణాలు అవసరమే. ఏది లోపించినా అనారోగ్యం తప్పదు. ముఖ్యంగా విటమిన్ బీ12 మన నరాల వ్యవస్థ పనితీరులో కీలక పాత్ర పోషిస్తుంది. రక్త కణాల ఉత్పత్తిలో, డీఎన్ఏ సంశ్లేషణలో దీనికి ప్రాధాన్యత ఉంది. విటమిన్ బీ12 లోపం స్వల్పంగా ఉన్నప్పటికీ అనేక లక్షణాలు కన్పిస్తాయి. అవి మన రోజువారీ జీవితంపై తీవ్రమైన ప్రభావం చూపుతాయి. అసలు విటమిన్ బీ12 లోపిస్తే ఏం జరుగుతుంది?

విటమిన్ బీ12 లోపించిన వారు నిస్సత్తువకు గురవుతారు. త్వరగా అలసిపోతారు. బలహీనపడతారు. చిన్న చిన్న పనులు చేయడం కూడా కష్టమవుతుంది. శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది పడతారు. నిలబడినప్పుడు మైకం కమ్మినట్లు అవుతుంది. కొందరిలో నాలుకపై వాపు, పుండ్లు కన్పిస్తాయి. నాలుక ఎర్రబడుతుంది. నాలుకపై చిన్న చిన్న గడ్డలు ఏర్పడతాయి. నోటి అల్సర్, పుండ్లు కూడా రావచ్చు.

నరాలు ఆరోగ్యంగా ఉండాలంటే విటమిన్ బీ12 అవసరం చాలా ఉంది. శరీరంలో బీ12 స్థాయి బాగా తగ్గితే నరాలు దెబ్బతింటాయి. చేతులు, కాళ్లు జలదరిస్తాయి. కండరాలు బలహీనపడతాయి. నడవడం కూడా కష్టమవుతుంది. కొన్ని కేసుల్లో చూపు కూడా పోవచ్చు. ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి బీ12 ఎంతో అవసరం. బీ12 స్థాయి బాగా తగ్గితే రక్తహీనత కలుగుతుంది. అంటే ఆరోగ్యవంతమైన ఎర్ర రక్తకణాల కొరత ఏర్పడుతుంది. రక్తహీనత కారణంగా చర్మం పాలిపోతుంది. శ్వాస సరిగా పీల్చుకోలేరు. గుండె దడ వస్తుంది.

బీ12 లోపం బాగా అధికమైతే మన మానసిక స్థితి పైన కూడా ప్రభావం పడుతుంది. ఒత్తిడికి గురికావడం, ఆందోళన చెందడం, గందరగోళంలో పడడం, గుర్తు పట్టకపోవడం వంటి లక్షణాలు కన్పించవచ్చు. చివరికి మనోవ్యాధి కూడా కలగవచ్చు. ఇన్ని అనర్థాలున్న విటమిన్ బీ12 లోపాన్ని నివారించాలంటే వైద్యుల సలహా మేరకు వారి పర్యవేక్షణలో తగిన చికిత్స పొందడం ఎంతైనా అవసరం.

సముద్ర గర్భం...
ప్లాస్టిక్ వ్యర్థాలకు 'రిజర్వాయర్'



న్యూఢిల్లీ : సముద్ర గర్భంలో మూడు నుండి పదకొండు మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయంటూ ఓ అధ్యయనం బాంబు పేల్చింది. ప్రతి నిమిషమూ సముద్రంలో ప్లాస్టిక్ చెత్త చేరిపోతోందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ప్లాస్టిక్ కాలుష్య భూతానికి సముద్ర గర్భం ఓ విశ్రాంతి ప్రదేశంగా లేదా ఓ రిజర్వాయర్‌గా మారిందని వారు వ్యాఖ్యానించారు. సముద్రంలో చేరిన ప్లాస్టిక్ చిన్న చిన్న ముక్కలుగా విడిపోయి సముద్ర అవశేషాలతో కలిసిపోతున్నాయి. సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల చేరికపై అధ్యయనం నిర్వహించడం ఇదే మొదటిసారి అని ఆస్ట్రేలియాలోని కామన్వెల్త్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (సీఎస్ఐఆర్ఓ)కు చెందిన సీనియర్ పరిశోధక శాస్త్రవేత్త డెనైస్ హార్డెస్టీ చెప్పారు.

సముద్ర ఉపరితలంపై తేలియాడుతున్న దాని కంటే సముద్ర గర్భంలో వంద రెట్లు అధికంగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయని తాము అంచనా వేస్తున్నామని పరిశోధకులు తెలిపారు. ప్లాస్టిక్‌కు సముద్ర ఉపరితలం తాత్కాలిక విశ్రాంతి ప్రదేశంగా మారిందని, సముద్రంలోకి ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రవేశించకుండా అడ్డుకుంటే దానిని తగ్గించవచ్చునని వివరించారు. 'అయితే ప్రతి రోజూ ప్లాస్టిక్ సామగ్రి సముద్రపు లోతుల్లోకి చేరిపోతోంది. ఇది సముద్ర కాలుష్యానికి కారణమవుతోంది' అని ప్రధాన పరిశోధకుడు అలైస్ ఝూ వ్యాఖ్యానించారు. గతంలో సముద్రంలో చిన్న చిన్న ప్లాస్టిక్ వస్తువులు కన్పించేవని, ఇప్పుడు వలలు, కప్పులు మొదలుకొని ప్లాస్టిక్ సంచుల వరకూ...ఒకటేమిటి అన్ని రకాల వ్యర్థాలు దర్శనమిస్తున్నాయని చెప్పారు.

సముద్రంలో పేరుకుపోయిందని భావిస్తున్న 3-11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలలో 54% సముద్రంలో 200 మీటర్ల నుండి 11,000 మీటర్ల లోతుకు చేరిందని పరిశోధకులు తెలియజేశారు. మిగిలిన 46% వ్యర్థాలు 200 మీటర్ల లోతు కంటే పైనే ఉన్నాయని చెప్పారు. మిగిలిన సముద్ర గర్భంలో ఎంత ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయో లోతట్టు, కోస్తా ప్రాంతంలోని సముద్రాలలో అంత వ్యర్థాలు ఉన్నాయని వివరించారు. సముద్రాలతో పోలిస్తే వీటి ఉపరితల ప్రాంతం తక్కువే అయినప్పటికీ వ్యర్థాల చేరిక మాత్రం బాగానే ఉంటోంది. ప్లాస్టిక్ వినియోగం 2040 నాటికి రెట్టింపు అయ్యే అవకాశం ఉండడంతో సముద్ర పర్యావరణ వ్యవస్థను, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని పరిశోధకులు సూచించారు.



రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ప్రచార సభలో మేనిఫెస్టో ఆవిష్కరిస్తున్న సోనియా, ఖర్గే, ప్రియాంక తదితరులు

దేశ గౌరవాన్ని, ప్రజాస్వామ్యాన్ని
తుంగలో తొక్కుతున్నారు !
జైపూర్ సభలో సోనియా విమర్శ



జైపూర్ : దేశ గౌరవాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రధాని నరేంద్ర మోడీ తుంగలో తొక్కుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోనియా గాంధీ విమర్శించారు. ప్రతిపక్ష నేతలు బీజేపీలో చేరేలా అనేక రకాల ఎత్తుగడలకు పాల్పడుతున్నారని విమర్శించారు. జైపూర్‌లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె ప్రసంగించారు. బీజేపీ ఏలుబడిలో గత పదేళ్ళుగా దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం, అసమానతలు అంతకంతకూ పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు మన దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ నాశనమవుతున్నాయని, భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర జరుగుతోందని సోనియా విమర్శించారు. మోడీ సర్కార్ నిరంకుశవాద ప్రభుత్వమని, మనందరం కలిసి దీనికి సరైన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. తనకు తాను గొప్పవాడినని చెప్పుకునే మోడీ ఈ దేశ పేరు ప్రతిష్ఠలను దిగజారుస్తున్నారని విమర్శించారు.

అంతకుముందు సభలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వద్రా మాట్లాడుతూ, బీజేపీ పాలనలో ప్రతిపక్షాలు తీవ్ర దాడులకు గురవుతున్నారని విమర్శించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతున్నాయని, పేదల, రైతుల గోడు పట్టించుకునే వాడు లేడని అన్నారు. న్యాయం కావాలని కోరుతున్న దేశ ప్రజల వాణిని వినిపించేలా తమ ఎన్నికల ప్రణాళిక విడుదల చేశామని, అంతేకానీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాగానే మర్చిపోయే హామీల ప్రకటనలు కాదని అన్నారు.

ఉప్పల్ స్టేడియంకు పవర్‌కట్‌పై విచారణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హెచ్‌సీఏకు చెందిన ఉప్పల్ క్రికెట్ స్టేడియంకు కరెంటు కట్ చేయడంపై టీఎస్ ట్రాన్స్‌కో సీఎమ్‌డీ, విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎమ్ రిజ్వీ విచారణకు ఆదేశించారు. ఈ స్టేడియంకు కరెంటు సరఫరా నిలిపివేతపై విద్యుత్ శాఖపై పలు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయం సీఎమ్‌డీ దృష్టికి వెళ్లడంతో ట్రాన్స్ కో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌ను విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఉప్పల్ స్టేడియం కరెంటు బకాయిలపై 9 ఏండ్లుగా వివాదం నడుస్తుంది. దీనిపై హెచ్‌సీఏ కోర్టులో పిటీషన్ కూడా వేసింది. కోవిడ్ సమయంలో రెండేండ్లు స్టేడియం మూతపడిందనీ, కానీ విద్యుత్ శాఖ బిల్లులు మాత్రం పంపిదని పేర్కొన్నారు. ఆ బిల్లుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీనిపై న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. వాటి ప్రకారం వాయిదాల పద్ధతిలో బకాయిలు చెల్లిస్తామని హెచ్‌సీఏ పేర్కొంది. అయితే టీఎస్ఎస్పీడీసీఎల్ హబ్సిగూడ సర్కిల్ సూపరిటెండెంట్ కార్యాలయం హెచ్‌సీఏపై విద్యుత్ చౌర్యం, సర్‌చార్జీల పేరుతో రూ.1,63,94,521 జరిమానాగా విధించింది. దీని నుంచి మినహాయింపు కావాలని హెచ్‌సీఓ కోరింది. సుదీర్ఘకాలంగా ఈ కేసు పరిష్కారం కాకుండా నిలిచిపోయింది. రెండ్రోజుల క్రితం స్టేడియంకు కరెంట్ కట్ చేయడంతో వివాదం మళ్ళీ రాజుకుంది. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు సంబంధించి హెచ్‌సీఏ అడిగినన్ని పాసులు ఇవ్వలేదనే అక్కసుతో కరెంటు కట్ చేశారనే ప్రచారం జరిగింది. దీనిపైనే ఇప్పుడు విచారణ జరపాలని ఆదేశించారు.

సంక్షోభానికి తాత్కాలిక విరామం

చెన్నై సూపర్ కింగ్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌కు ముందు ఉప్పల్ స్టేడియానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చెలరేగిన వివాదానికి తెర పడింది. 2015 నుంచి నడుస్తున్న ఈ వివాదాన్ని టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీతో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు చర్చలు జరిపారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు అంగీకరించారు. దానిలో భాగంగా వాయిదా పద్ధతిలో పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని హెచ్‌సీఏ చేసిన ప్రతిపాదనను సీఎమ్‌డీ అంగీకరించారు. దీనితో తొలి వాయిదా చెల్లిస్తామని హెచ్‌సీఏ తెలిపినట్టు సమాచారం.

జలాశయాల్లో భారీగా తగ్గిన నీటినిల్వలు

- మూడేండ్ల లెక్కలతో తెటతెల్లం
- అన్ని రిజర్వాయర్లల్లోనూ అదే పరిస్థితి
- ఈ ఏడాది నాలుగునెలల్లోనే పాతాలానికి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని జలాశయాల్లో నీటినిల్వలు భారీగా తగ్గుతూ వస్తున్నాయి. సర్కారు అధికారిక సమాచారమే ఇందుకు నిదర్శనం. రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ గత శుక్రవారం వెలువరించిన లెక్కల ప్రకారం దాదాపు ఎనిమిది ప్రధాన జలాశాయాల్లో గత మూడేండ్లుగా నీటినిల్వలు తగ్గిపోతున్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. జురాల నుంచి లోయర్ మానేరు వరకు అదే పరిస్థితి. డిసెంబరు, 2022, డిసెంబరు 2023తోపాటు గత శుక్రవారం అంటే ఏప్రిల్ ఐదో తేదీ 2024 తీసిన సమాచారం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జలాశయాల నీటి నిల్వ సామర్థ్యాన్ని తెలియజేస్తున్నది. ఈ ఏడాది ప్రథమార్థంలోనే నిల్వలు పడిపోయాయి. కేవలం నాలుగు నెలల్లోనే ఈపరిస్థితి రావడం గమనార్హం. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల ఫలితాలపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. భూగర్భజలాలు అడుగంటడమూ ఇందుకు బలం చేకూరుస్తున్నది. వర్షాభావం, పడిపోయిన భూగర్భజలాల నేపథ్యంలో రిజర్వాయర్లల్లో నీటినిల్వలు పాతాలానికి చేరుకున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వేసవి నేపథ్యంలో ఎండలు తీవ్రత అధికమైంది. ఉక్కపోత రోజురోజుకు పెరుగుతున్నది. ఉదయం ఎనిమిది గంటల తర్వాత ఇంట్లో నుంచి బయటకువెళ్లే పరిస్థితి ఉండటం లేదు. వడదెబ్బకు ఇప్పటికే ఒకరు చనిపోయారు. వేలాదిమంది డీహైడ్రేషన్ భారీన పడుతున్నారు. ఆస్పత్రులు నిండిపోతున్నాయి. సాధారణ ప్రజల విద్యుత్ వినియోగం సైతం రోజురోజుకు పెరుగుతున్నది. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వాడకం భారీస్థాయికి చేరింది. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ వినియోగం సైతం తారాస్థాయికి చేరింది. ఎండలు 43 డిగ్రీలు దాటిపోయాయి. తాగు, సాగునీటికి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

జలాశయాల నీటిమట్టాలు(టీఎంసీల్లో)

రిజర్వాయర్	సామర్థ్యం	డిసెంబరు,22	డిసెంబరు 23	ఏప్రిల్ 24
జురాల	9.66	9.46	7.61	3.20
శ్రీశైలం	215.81	137.59	59.75	34.29
నాగార్జునసాగర్	312.05	303.43	156.67	134.92
శ్రీరాంసాగర్	90.31	90.31	79.30	12.64
ఎల్లంపల్లి	20.18	20.18	16.16	7.59
కడెం	7.60	6.46	3.96	2.82
మిడ్‌మానేర్	27.50	25.67	23.44	7.59
లోయర్‌మానేర్	24.07	22.19	19.76	5.23

ఆరుగ్యారెంటీలపై చర్చకు సిద్ధమా?

- ప్రజల తరపున మేమొస్తాం..

కాంగ్రెస్ నుంచి రాహుల్‌గాంధీ రావాలి :బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సవాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలుపై చర్చించేందుకు సిద్ధమా? ప్రజల తరపున మేమొస్తాం..కాంగ్రెస్ తరపున రాహుల్‌గాంధీ రావాలి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. శనివారం రాత్రి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి, సోనియాగాంధీ ఇండ్లల్లో నోట్లు ముద్రించే మిషన్లు పెడితే తప్ప తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, డిక్లరేషన్లు, గ్యారంటీలు అమలు కావని దెప్పిపొడిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఏం చేస్తున్నదో తెలుసుకునే పరిస్థితిలో రాహుల్ గాంధీ లేడని విమర్శించారు. ఆరు గ్యారెంటీలను గారడీగా మార్చి అబద్ధాలాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా ఉందన్నారు. రైతులకు చేస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీ, నిరుద్యోగులకు రూ. 4వేల నిరుద్యోగ భృతి ఏమయ్యాయని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ చెబుతున్నట్టు దేశంలో పేదరికం పెరగలేదనీ, మోడీ ప్రధాని అయ్యాక 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయట పడ్డారని చట్టబద్ధ సంస్థలు చెబుతున్నాయని చెప్పారు. యూపీఏ హయాంలో వరికి మద్దతు ధర రూ.1350 ఉంటే దాన్ని తమ ప్రభుత్వం రూ.2200కి చేసిందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలకు పెంచామని చెప్పారు. ముద్ర బ్యాంకు లోన్లు, స్టాండప్ ఇండియా పథకం ద్వారా బ్యాంకుల నుంచి ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు రుణాలు ఇప్పించి వ్యాపార సంస్థలు స్థాపించేలా ప్రోత్సహించామన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చిన ఘనత తమదేనని చెప్పారు.

దేశంలో ఉన్నతాధికారుల్లో, మంత్రుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారుల్లో బీసీలు తక్కువ ఉండటానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. బీసీ కమిషన్‌కు తాము చట్టబద్ధత కల్పించామని చెప్పారు. బాబూ జగ్జీవన్‌రామ్‌ను ప్రధాని కాకుండా అడ్డుకున్నదీ, అంబేద్కర్ ఎంపీగా పోటీచేస్తే ఓడించిందీ కాంగ్రెస్ పార్టీనేనని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు బీసీ గురించి మాట్లాడే నైతికహక్కు లేదన్నారు. ఏపీ, తెలంగాణలో ఏనాడైనా బీసీని సీఎం చేశారా? అని ప్రశ్నించారు. అవినీతిరహిత పాలన అందిస్తున్నాం కాబట్టే విదేశీ కంపెనీలకు భారత్‌కు తరలొస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్ లోకి వంపి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్‌ల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకముందే ముందస్తు ప్రవేశాల పేరుతో విద్యార్థుల నుంచి కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలనీ, గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

18,19 తేదీల్లో ఏవో అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయ, సహకార శాఖలో అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏవో) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 18,19 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేశామని వివరించారు. 148 ఏవో పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 28న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

జాతీయ సమైక్యత అవసరం

- గవర్నర్ సీ.పీ.రాధాకృష్ణన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతి ఒక్కరిలో జాతీయ సమైక్య భావన ఉండాలని రాష్ట్ర గవర్నర్ సీ.పీ.రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. శనివారం ఎన్ఐటీ పాట్నాతో కలిసి హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన యువ సంగం ఫేజ్ 4 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ భారతదేశం ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందనీ, భిన్నత్వంలో ఏకత్వం ద్వారా ఈ ఘనతను సాధించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.వెంకటేశం, ఎన్ఐటీ పాట్నా విశ్వవిద్యాలయం అధ్యాపకులు, బీహార్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా

- పీఆర్ ముఖ్యకార్యదర్శి సుల్తానీయా

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా చేయాల్సిన బాధ్యత పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖపై ఉందని ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానీయా అన్నారు. శనివారం ఆయా శాఖల ఉన్నతాధికారులు, సివిల్ ఏజెన్సీలతో హైతదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటిసరఫరా సమస్య రాకుండా చూడాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎద్దడి రాకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంపుసెట్లు, పైపులైన్లను ఏప్రిల్ 12 నాటికి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఏజెన్సీలు పంపుసెట్ల పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉతన్నమైతే 12 గంటల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అవసరమై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో భగీరథ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ జి. కృపాకర్‌రెడ్డి, మేఘా, రాఘవ ,ఎన్‌సీసీ,ఎల్‌అండ్‌టీ, ఐహెచ్‌పి, కోయ అండ్ కంపెనీ, ప్రతిభ ఇండస్ట్రీస్,జీవీపీఆర్,కేఎల్ఎస్ఆర్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి పారుదల రంగంపై ఉత్తమ్‌కు అవగాహన లేదు

- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీటి పారుదల రంగంపై అ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కనీస అవగాహన లేదని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై కేసీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే బాధ్యత లేకుండా పారిపోయిందెవరో ప్రజలకు తెలుసునని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌పై చవకబారు విమర్శలు మానాలని పొన్నాల సూచించారు. మేడిగడ్డ వద్ద సమస్య ఉంటే అన్నారం, సుందిళ్ల ద్వారా నీటిని ఎల్లంపల్లికి ఎందుకు ఎత్తిపోయలేదని ప్రశ్నించారు. కరువుతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రికెట్ మ్యాచ్ చూస్తున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయాలు పక్కన పెట్టి వెంటనే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది అబద్ధాల మ్యానిఫెస్టో

- బీఆర్ఎస్ నేత కేతిరెడ్డి వాసుదేవరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టో అబద్ధాల పుట్టని బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి కేతిరెడ్డి వాసుదేవరెడ్డి విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే మరోసారి పార్లమెంట్ ఎన్నికల్లో అమలుకు సాధ్యంకాని హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తోందని ఆరోపించారు. రుణమాఫీ, రూ.4 వేల నిరుద్యోగ భృతి, రైతు భరోసా ద్వారా ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 మొదలగు హామీలు అమలు చేసిన తర్వాత కొత్త గ్యారంటీలు ప్రకటించాలని సూచించారు. ప్రజలను మభ్యపెట్టి లోకసభ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు ఆ పార్టీ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పికొడుతారని హెచ్చరించారు. పార్టీ మారే నాయకులపై అనర్హత వేటు పడేలా ప్రత్యేక చట్టం తీసుకొస్తామని చెప్పిన కాంగ్రెస్ రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటోందని ప్రశ్నించారు.

పార్లమెంట్ సమన్వయ కర్తలను నియమించిన బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని పలు పార్లమెంట్ నియోజకవర్గాలకు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎన్నికల సమన్వయకర్తలను బీఆర్ఎస్ నియమించింది. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం... మేడ్చల్- శంబీపూర్ రాజు (ఎమ్మెల్సీ), మల్కాజిగిరి- నందికంటి శ్రీధర్, కుత్బుల్లాపూర్ - గొట్టిముక్కల వెంగళరావు, కూకట్‌పల్లి- బేతి రెడ్డి సుభాష్ రెడ్డి(ఎమ్మెల్యే), ఉప్పల్- జహంగీర్‌పాషా, సికింద్రాబాద్ కంటోన్మెంట్- రావుల శ్రీధర్ రెడ్డి, ఎల్బీనగర్ - బొగ్గరపు దయానంద్ గుప్త (ఎమ్మెల్సీ)ను నియమించింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం... మహేశ్వరం- కనకమామిడి స్వామి గౌడ్, రాజేంద్రనగర్- పుట్టం పురుషోత్తంరావు, శేరిలింగంపల్లి- కె నవీన్ కుమార్ (ఎమ్మెల్సీ), చేవెళ్ల- నాగేందర్ గౌడ్, పరిగి- గట్టు రామచంద్రరావు, వికారాబాద్-పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, తాండూర్- బైండ్ల విజయ్ కుమార్‌లను సమన్వయ కర్తలుగా నియమించినట్టు బీఆర్ఎస్ ఒక ప్రకటనలో తెలిపింది.

బిజినెస్

ఆగని పసిడి దరువు



ముంబయి : బంగారం ధరల దరువు ఆగడం లేదు. రోజు రోజుకు పెరుగుతూ నూతన రికార్డ్‌లను సృష్టిస్తుంది. తులం బంగారం 71వేల ఎగువకు చేరడంతో సామాన్యుడు కొనలేని స్థాయికి చేరింది. గుడ్‌రిటర్న్స్ రిపోర్ట్ ప్రకారం.. శనివారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.1,310 పెరిగి రూ.71,400కు చేరింది. 22 క్యారెట్లపై రూ.1,200 ఎగిసి రూ.65,500గా నమోదయ్యింది. 18 క్యారెట్లపై రూ.980 పెరిగి రూ.53,590గా పలికింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ ధర రూ.71,290గా, 22 క్యారెట్ల ధర రూ.65,350 వద్ద నమోదయ్యింది. కిలో వెండిపై రూ.2,000 పెరిగి రూ.87వేలుగా పలికింది.

హాయర్ నుంచి హెక్సా ఇన్వర్టర్ టెక్నాలజీ ఏసిలు

న్యూఢిల్లీ : హెక్సా ఇన్వర్టర్ టెక్నాలజీతో పనిచేసే సూపర్ హెవీ డ్యూటీ రేంజ్ ఎయిర్ కండీషనర్ (ఏసి)లను మార్కెట్ లోకి విడుదల చేసినట్లు హాయర్ ఇండియా తెలిపింది. ఈ టెక్నాలజీతో దాదాపు 65 శాతం ఇంధన ఆదా అవుతుందని పేర్కొంది. 5 ఏళ్ల కాంప్రెహెన్సివ్ వారంటీతో పాటు రూ.15,990ల విలువైన గ్యాస్ ఛార్జింగ్, రూ.8000 వరకు క్యాష్ బ్యాక్, రూ.1500 విలువ చేసే ఉచిత స్టాండర్డ్ ఇన్ స్టాలేషన్, 12 ఏళ్ల పాటు కంప్రెషర్ వారంటీని అందిస్తున్నట్లు తెలిపింది. ఈ మోడళ్లు రూ.49,990 ప్రారంభ ధరతో లభిస్తాయని పేర్కొంది.

పెట్టుబడులపై ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బి అవగాహన

హైదరాబాద్ : పెట్టుబడులపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) నిబంధనలు, నియమాల గురించి ఇన్వెస్టర్లలో అవగాహన కల్పిస్తున్నట్లు ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తెలిపింది. సెబీ 2015 రెగ్యులేషన్ 8 షెడ్యూల్‌లోని ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిషేధం రెగ్యులేషన్స్‌పై పెట్టుబడిదారులకు తమ బ్యాంక్ అవగాహన పెంచుతుందని ఆ బ్యాంక్ డైరెక్టర్ సంజీవ్ బర్న్వాల్ తెలిపారు. డిసెంబర్ 2023 త్రైమాసికంలో తమ బ్యాంక్ డిపాజిట్లు 24 శాతం వృద్ధితో రూ.31,650 కోట్లకు చేరాయని పేర్కొన్నారు. కరెంట్ ఎకౌంట్, సేవింగ్ ఎకౌంట్‌లో బలమైన వృద్ధిని నమోదు చేస్తున్నామన్నారు.

30 ప్రభుత్వ బడులకు సోలార్ రూఫ్‌టాప్‌లు

- హెచ్ఎస్‌బిసి గ్లోబల్, యుడబ్ల్యుహెచ్ సాయం



హైదరాబాద్ : యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ (యుడబ్ల్యుహెచ్), హెచ్ఎస్‌బిసి గ్లోబల్ సర్వీస్ సెంటర్స్ ఇండియా భాగస్వామ్యంలో తెలంగాణలోని 30 ప్రభుత్వ పాఠశాలలకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్‌ను అందిస్తున్నట్లు ప్రకటించాయి. నగరంలోని గోల్కొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల 2వ లాన్సర్స్‌లో సోలార్ రూఫ్‌టాప్ ప్రారంభోత్సవంలో గ్లోబల్ సర్వీస్ సెంటర్స్ ఇండియా ఎండి, హెడ్ మమతా మాదిరెడ్డి, స్కూల్ అడ్మినిస్ట్రేషన్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సిఇఒ రేఖా శ్రీనివాసన్, ఆయా సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఆయా పాఠశాలల్లో స్వచ్ఛమైన పునరుత్పాదన ఇంధన వినియోగాన్ని పెంచనున్నట్లు ఇరు సంస్థలు తెలిపాయి. తమ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ, కర్నాటకలోని మొత్తం 65 స్కూళ్ళ, 6 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నాయి.

నగరంలో తొలి జిస్ విజన్ సెంటర్ ఏర్పాటు



హైదరాబాద్ : ఆప్టిక్స్, ఆప్టోఎలక్ట్రానిక్స్ సైన్స్ గ్లోబల్ సంస్థ జిస్ హైదరాబాద్‌లో తన తొలి జిస్ విజన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. స్పెక్స్‌బంకర్‌తో కలిసి దీన్ని అందు బాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. జూబ్లీహిల్స్‌లో దాదాపు 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో వినియోగదారులకు అత్యాధునిక కంటి సంరక్షణ పరిష్కారాలను అందించనున్నామని స్పెక్స్‌బంకర్ వ్యవస్థాకుడు, సిఇఒ మోహిత్ అగర్వాల్ తెలిపారు. ఇక్కడి విజన్ సెంటర్ విస్తృత శ్రేణిలో జిస్ లెన్స్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

రామ్కీ ఇన్‌ఫ్రాకు బహుళ అవార్డులు

హైదరాబాద్: నిర్మాణ పరిశ్రమ అభివద్ధి మండలి (సిఐడిసి) నిర్వహించిన 15వ విశ్వకర్మ అవార్డ్స్ 2024లో తమకు బహుళ అవార్డులు దక్కినట్లు రామ్కీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ తెలిపింది. తాము అద్భుతమైన విజయాలను అందుకున్నట్లు వెల్లడించింది. నిర్మాణ రంగంలో స్థిరత్వం పట్ల కంపెనీ చూపుతున్న నిబద్ధతకు ఈ ప్రశంసలు నిదర్శమని తెలిపింది. ఉత్తమ నిర్మాణ ప్రాజెక్టులు, సామాజిక అభివృద్ధి, ఉత్తమ వృత్తి, ఆరోగ్యం, భద్రత విభాగాల్లో నాలుగుఅవార్డులను పొందినట్లు పేర్కొంది.

చిన్నారులకు కాల్చిన కడ్డీలతో శంఖు ముద్రలు

- టెక్సాస్‌లో అష్టలక్ష్మి ఆలయ నిర్వాహకులపై దావా

హ్యూస్టన్ : అమెరికాలోని టెక్సాస్‌లో జీయర్ ట్రస్టు నిర్వహిస్తున్న అష్టలక్ష్మి ఆలయంలో రెండేళ్ల కిందట దారుణం చోటుచేసుకుంది. అప్పట్లో అక్కడ నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్లిన బాలుర భుజాలపై ఇనుప చువ్వలను కాల్చి శంఖు చక్రాల ముద్రలు వేశారు. ఇలా ముద్రలు వేయించుకున్న చిన్నారుల్లో 11 ఏళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఇప్పుడు ఆ బాలుడి తండ్రి విజయ్ చెరువు.. ఆలయం నుంచి, ఆలయ నిర్వహణ సంస్థ జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (అమెరికా) నుంచి రూ.7.5 కోట్ల మేర నష్టపరిహారం కోరుతూ ఇటీవల దావా వేశారు. తమ కుమారుడిని తన మాజీ భార్య గుడికి తీసుకెళ్లి ముద్ర వేయించడంతో అతడు ఎంతో బాధకు గురయ్యాడని కోర్టుకు తెలిపారు. దీనికి తండ్రి అనుమతి లేదని, టెక్సాస్‌లో తల్లిదండ్రుల అనుమతి ఉన్నా లేకున్నా బాలలకు పచ్చబొట్లు పొడవడం, కర్రుపెట్టి ముద్ర వేయడం చట్టవిరుద్ధమని విజయ్ న్యాయవాది బ్రాంట్ స్టోగ్నర్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఆలయ నిర్వాహకులు స్పందించాల్సివుంది.

లడఖ్‌లో సరిహద్దు మార్చ్‌ను ఉపసంహరించుకున్న లేహ్ అపెక్స్ బాడీ

లేహ్ : చైనాతో గల చాంగ్‌తాంగ్ సరిహద్దుకు తలపెట్టిన ప్రదర్శనను ఉపసంహరించుకున్నట్లు లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఎబి) శనివారం తెలిపింది. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. పాలనా యంత్రాంగం లేహ్‌ను యుద్ధ జోన్‌గా మారుస్తోందని విమర్శించింది. రైతుల దుస్థితి గురించి దేశ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్న తమ లక్ష్యం నెరవేరిందని ఎల్ఎబి తెలిపింది. దక్షిణ ప్రాంతంలో మంచి పచ్చిక భూములను బడా పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేస్తుండగా, ఉత్తరాదిన చైనా ఆక్రమణలు జరుగుతున్నాయని విమర్శించింది. లడఖ్‌కు రాష్ట్రహోదా కావాలని, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో దీన్ని చేర్చాలని ఇంకా తదితర డిమాండ్లకు మద్దతుగా శాంతియుతంగా తమ ఆందోళన కొనసాగుతుందని తెలిపింది.

గాజా పై ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి ఆరు నెలలు

- వేలల్లో మరణాలు, అంచనాలకు అందని విధ్వంసం
- ఇజ్రాయిల్ దాడులపై సర్వత్రా ఆందోళన
- కాల్పుల విరమణపై కైరోలో నేడు చర్చలు



గాజా : అమెరికా అండదండలతో యుద్ధోన్మాదంతో ఊగిపోతూ గాజా, పరిసర ప్రాంతాలపై ఇజ్రాయిల్ చేపట్టిన అమానవీయ దాడులు మొదలై ఆరు నెలలు పూర్తయ్యింది. చిన్నారులు, మహిళలు సహా వేలాది మంది అమాయక పౌరులు, వారికి సహాయం చేసేందుకు వెళ్లిన కార్యకర్తలు, పాత్రికేయులు ప్రాణాలు కోల్పోయినా, తినేకి తిండి దొరక్క..తల దాచుకునే దిక్కులేక అవస్థలు పడుతున్నా ఇజ్రాయిల్ వైఖరిలో ఇసుమంతైనా మార్పు రావడం లేదు. గతేడాది అక్టోబరు 7న మొదలు పెట్టిన ఈ ఊచకోతలో హమాస్ నియంత్రణలోని ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 182 రోజుల్లో దాదాపు 33 వేల మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. అయితే లెక్కల్లోకి రాని మరణాల సంఖ్య చాలానే వుంటుందని భావిస్తున్నారు. శిథిలాల కింద సమాధి అయిపోయినవారి సంఖ్య కూడా వేలల్లోనే వుంటుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ యుద్ధంలో తల్లిదండ్రులను కోల్పోయి వేల సంఖ్యలో పిల్లలు అనాధలుగా మారిపోయారు. తినడానికి తిండి, నిలువ నీడ లేకుండా రోడ్డున పడ్డారు. ఇక విధ్వంసం, ఆస్తి నష్టం అంచనాలకు కూడా అందని రీతిలో వుంది.

కైరోలో చర్చలకు హమాస్ బృందం

కాల్పుల విరమణపై ఆదివారం కైరోలో జరగనున్న చర్చలకు తమ బృందాన్ని పంపిస్తున్నట్లు హమాస్ వర్గాలు శనివారం తెలిపాయి. శాశ్వతంగా కాల్పుల విరమణ జరగాలనేది తమ డిమాండ్లలో ప్రధానమైనదని హమాస్ తెలిపింది. గాజా నుండి ఇజ్రాయిల్ సైన్యం వైదొలగాలని, గాజా నుండి వెళ్ళిపోయిన పాలస్తీనియన్లనందరూ తిరిగి వారి స్వస్థలాలకు, ఇళ్ళకు తిరిగి రావాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రజల స్వేచ్ఛా రాకపోకలు, ప్రజలకు ఆహారం, వసతి సదుపాయాలు, బందీల మార్పిడి ఒప్పందం తమ డిమాండ్లని స్పష్టం చేసింది. మార్చి 14న తమ వైఖరి ఏదైతే స్పష్టం చేశామో దానికే కట్టుబడి వున్నామని పేర్కొంది. గత 24 గంటల్లో 45 మంది పాలస్తీనియన్లను అదుపులోకి తీసుకున్నట్లు ఇజ్రాయిల్ బలగాలు తెలిపాయి. దీంతో ఇప్పటివరకు అరెస్టయిన పాలస్తీనియన్ల సంఖ్య 8,080కి చేరినట్లు పాలస్తీనా ఖైదీల సొసైటీ తెలిపింది.

నెతన్యాహుకు బైడెన్ ఫోన్‌కాల్

ప్రజలకు హాని కలగకుండా, మానవతా సాయానికి అడ్డంకులు లేకుండా, సహాయ సిబ్బంది భద్రతకు ప్రమాదం లేకుండా తీసుకునే చర్యలపైనే అమెరికా గాజా విధానం ఆధారపడి వుంటుందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్ చేశారు. వరల్డ్ సెంట్రల్ కిచెన్ బృందంపై దాడి నేపథ్యంలో గాజాకు తమ సాయాన్ని నిలిపివేసినట్లు ఎన్‌జిఓ ఓపెన్స్ ఆర్మ్స్ ప్రకటించింది. ఉత్తర గాజాలోని బీట్ హనూన్ నగరంలో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో ఒక పేరా మెడికోతో సహా నలుగురు మరణించారు. ఇప్పటివరకు సాగిన ఈ యుద్ధంలో వెయ్యి మందికి పైగా పిల్లలు ఒక కాలునో లేదా రెండు కాళ్ళనో పోగొట్టుకున్నారని పాలస్తీనా రెడ్ క్రీసెంట్ సొసైటీ తెలిపింది. గాజాలో ప్రతి గంటకు నలుగురు పిల్లలు మరణిస్తున్నారని తెలిపింది.

కొన్ని కీలక పరిణామాలు..

- 'ఆపరేషన్ అల్-అక్సా ఫ్లాష్' పేరిట గతేడాది అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున మెరుపుదాడికి పాల్పడిన హమాస్ మిలిటెంట్లు.. వందలాది మంది చనిపోయారు. 250 మందికిపైగా బందీలుగా చేసుకుని, గాజాకు తీసుకెళ్లారు. ఈ పరిణామంతో ఉలిక్కిపడిన ఇజ్రాయెల్.. హమాస్ తీవ్రవాదులను హతమార్చే పేరుతో గాజాపై యుద్ధానికి తెరలేపింది. అయితే అమాయక పాలస్తీనయన్లను బలితీసుకుంటోంది.
- బందీల్లో ఇప్పటివరకు 109 మంది హమాస్ సురక్షితంగా విడుదల చేసింది. ముగ్గురిని సైన్యం కాపాడింది. 12 మంది మతదేహాలు లభ్యమయ్యాయి. మరో ముగ్గురు ఇజ్రాయిల్ సొంత సైన్యం చేతిలోనే మతి చెందారు. మిగిలినవారిలోనూ 34 మంది చనిపోయి ఉండొచ్చని ఇజ్రాయెల్ భావిస్తోంది. అయితే వీరంతా కూడా ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లోనే ప్రాణాలు కోల్పోయారని హమాస్ ప్రకటించింది.
- మరోవైపు తమవారిని విడిపించాల్సిందిగా ప్రధాని నెతన్యాహుపై బాధితుల కుటుంబీకులు, పౌరుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. నిత్యం నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.
- గాజాలో ఇజ్రాయిల్ యుద్ధానికి 33 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 70 శాతం మంది మహిళలు, చిన్నారులే. ఐరాస వివరాల ప్రకారం.. దాదాపు 17 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. స్థానికంగా 56 శాతానికిపైగా భవనాలు ధ్వంసమయ్యాయి. అటు.. లెబనాన్‌లోని హెజ్‌బొల్లాతోపాటు సిరియాలోని ఇరాన్ మద్దతుదారులపైనా నెతన్యాహు సైన్యం అమానవీయ దాడులు చేస్తోంది.
- యుద్ధం మొదట్లో గాజా సరిహద్దులను దిగ్బంధించడంతో.. ఆహారం, ఇంధనం, ఔషధాలు, మంచినీరు, నిత్యావసర సామగ్రి కొరతతో పౌరులు అల్లాడారు. ప్రస్తుతం పరిస్థితులు మరింత దిగజారాయి. ప్రతిఒక్కరూ ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఉత్తర ప్రాంతంలో 2 లక్షల మంది విపత్కర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నట్లు ఐరాస ఆహార సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది.
- ఇజ్రాయిల్ ఒకవేళ రఫాకు దాడులను విస్తరిస్తే.. మొత్తం 23 లక్షల మంది జనాభాలో సగం మంది క్షుద్బాధకు లోనవుతారని ఇటీవల హెచ్చరించింది.
- అంతర్జాతీయ సమాజం ఒత్తిడి మేరకు పాలస్తీనీయన్లకు కొంతమేర మానవతా సాయానికి ఇజ్రాయెల్ ఒప్పుకోవాల్సివచ్చింది. కానీ పదేపదే ఉల్లంఘనలకు పాల్పడుతోంది. దీంతో అరకొర సాయాన్ని కూడా సరిగ్గా చేరవేయలేని దుస్థితి నెలకొందని స్వచ్ఛందసంస్థలు ఆరోపిస్తున్నాయి.
- గాజాకు సముద్రమార్గంలో ఆహార సాయం అందిస్తోన్న 'వరల్డ్ సెంట్రల్ కిచెన్' సిబ్బందిపై ఇటీవల ఇజ్రాయెల్ చేపట్టిన డ్రోన్ దాడిలో ఆరుగురు మతి చెందడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- గాజాలో అమాయక పౌరులను చంపడాన్ని నిరసిస్తూ, అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ పాలస్తీనియన్లకు మద్దతుగా ఎర్ర సముద్రంలోనూ, గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లోనూ వాణిజ్యనౌకలను మాత్రమే లక్ష్యంగా చేసుకొని యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు దాడులు చేస్తున్నారు. వీరికి ఇరాన్ మద్దతిస్తోంది. వీరిపైనా అమెరికా, బ్రిటన్ సంకీర్ణ సేనలు దాడులు చేస్తున్నాయి.
- దాడులను వెంటనే ఆపాలని అనేక దేశాలు ఇజ్రాయెల్‌ను అంతర్జాతీయ సమాజం పదేపదే డిమాండ్ చేస్తోంది. గాజాలో కాల్పుల విరమణ పాటించాలని ఐరాస భద్రత మండలి, మానవహక్కుల మండలిలు తీర్మానం రూపంలో గొంతెత్తాయి. అయినా కుక్క తోక తరహాలో ఇజ్రాయిల్ తన యుద్ధన్మోదాన్ని కొనసాగిస్తోంది.
- ఇజ్రాయిల్ యుద్ధ నేరాలపై దక్షిణాఫ్రికా, కొలంబియాలు అంతర్జాతీయ న్యాయస్థానం దష్టికి తీసుకెళ్లాయి. తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని అంతర్జాతీయ న్యాయస్థానం కూడా ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్ర భవిష్యత్తు నిర్ణయించే ఎన్నికలివి

- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఆలోచించి ఓటేయాలి
- కావలి 'మేమంతా సిద్ధం' సభలో జగన్
- నెల్లూరు జిల్లాలో రోడ్ షో



కావలి: ప్రస్తుత ఎన్నికల యుద్ధంలో పేదల పక్షాన మీ బిడ్డ ఒక్కడే ఒక పక్షాన నిలబడితే, మరో పక్షాన మోసగాడు చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, ప్రధాని మోడీ నిలబడ్డారని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా విడగొట్టిన మరో జాతీయ పార్టీ వీరితో కలిసి మీ బిడ్డకు వ్యతిరేకంగా చేస్తోందని విమర్శించారు. ఇది ఎంఎల్ఏలు, ఎంపిలను ఎన్నుకునే ఎన్నికలు కావని, రాష్ట్రంలోని పేదలు, అక్కా, చెల్లెమ్మలు, అవ్వ, తాతలు భవిష్యత్తు నిర్ణయించే ఎన్నికలని పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. చంద్రబాబూ... పేదలతో యుద్ధానికి సిద్ధంగా ఉన్నావా? అని ప్రశ్నించారు. శనివారం నెల్లూరు జిల్లాలో జగన్ రోడ్ షో నిర్వహించారు. నెల్లూరు నగరం నుంచి కోవూరు జంక్షన్, సున్నపుబట్టి, కావలి తదితర ప్రాంతాల్లో రోడ్ షో పూర్తి చేసుకొని కావలి పట్టణంలో జరిగిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో మీ బిడ్డ ఆత్మగౌరవాన్ని, విశ్వస నీయతను గెలిపించేందుకు మీరంతా సిద్ధమేనా? అని ప్రజలను అడిగారు. మోసం, అబద్ధాలు, కుట్రలు అన్ని కలగలిపిన క్యారెక్టరే చంద్రబాబు అని దుయ్యబట్టారు. 14 ఏళు సిఎంగా పనిచేశానని చెప్పుకుంటున్న ఆయన ఎన్నికలకు ముందు మేనిఫెస్టో పేరుతో రంగురంగుల కాగితాలు పంచారని, గెలిచాక ఏ ఒక్క హామీనైనా నెరవేర్చలేదని విమర్శించారు. 2014లో ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా నెరవేర్చానని చెప్పే దమ్ము, ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. తాను అడిగిన ప్రశ్నలకు చంద్రబాబు జవాబు చెప్పలేక నోటికి ఫెవికాల్ రాసుకున్నారని విమర్శించారు. ప్రజల వద్దకు వచ్చి ఓటు అడిగే ముందు 'నేను మీకు ఈ పనులు చేశాను. నాకు ఓట్లు వేయండి' అని కాకుండా మీకు అది చేస్తాం, ఇది చేస్తాం అని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

ఈ సందర్భంగా పులి-బంగారు కడియం కథను జగన్ ఉదాహరించారు. కేజీ బంగారం ఇస్తా, బెంజ్ కారు ఇస్తా! సూపర్ సిక్స్ ఇస్తా! సూపర్ 7 ఇస్తా! అంటూ మోసగించాలని చూస్తున్నారని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను అమలు చేశామన్నారు. మీకు సంక్షేమం అందించేందుకు 130 సార్లు డిబిటి బటన్ నొక్కానన్నారు.

మీరు నా కోసం రెండుసార్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కాలని కోరారు. ఒక్కసారి గెలిపిస్తేనే 58 నెలల్లో 2 లక్షలా 71 వేల కోట్ల రూపాయల సంక్షేమాన్ని మీ ఇంటి ముందుకే తెచ్చి ఇచ్చానని వివరించారు. చంద్రబాబును నమ్మితే పులి నోట్లో తల పెట్టినట్లేనన్నారు. అనంతరం సింగరాయకొండ నుంచి కందుకూరు చేరుకున్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా కనిగిరికి వెళ్లనున్నారు.

నిర్మాణ రంగాన్ని నిలబెడతా!

- ఉచిత ఇసుక విధానం పునరుద్ధరిస్తాం
- పాలనా వ్యవస్థను గాడిలో పెడతాం
- సత్తెనపల్లి, పెదకూరపాడు సభల్లో చంద్రబాబు



గుంటూరు: అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుకతో నిర్మాణ రంగాన్ని నిలబెడతామని టిడిపి అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని పునరుద్ధరిస్తామన్నారు. గాడి తప్పిన పరిపాలన వ్యవస్థను గాడిలో పెడతామని అన్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు, సత్తెనపల్లిలో శనివారం రాత్రి జరిగిన సభల్లో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గత ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు, ఇతరులకు లక్షన్నర కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నారని తెలిపారు. పరిపాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాలనను గాడిలో పెడతానన్నారు. వైసిపి నాయకులు ఇసుకను దోచేసి లక్షల మంది కార్మికుల పొట్టగొట్టారని విమర్శించారు. ఇసుక దోపిడీతో 40 లక్షల భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేశారన్నారు. ఇసుక బకాసురుడు పెదకూరపాడు ఎమ్మెల్యే శంకరరావు లాంటి వారు వల్ల భవన నిర్మాణ రంగం బాగా నష్టపోయిందని విమర్శించారు. తల్లి కాంగ్రెస్ పోటీతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదన్నారు. జగన్‌ను వ్యతిరేకిస్తున్న షర్మిల, సునీతల అంశం వారి కుటుంబ వ్యవహారమని పేర్కొన్నారు. తండ్రి హత్యపై పోరాడుతున్న సునీత... షర్మిలకు మద్దతుపై పునరాలోచించుకోవాలన్నారు. కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం పదేళ్ల నుంచి ఉందని, మళ్లీ రాబోయేది ఎన్‌డిఏనని, అందుకే బిజెపి, టిడిపి, జనసేన జట్టుకట్టాయని వివరించారు. వైసిపి ప్రభుత్వంలో మైనారిటీలకు అన్యాయం జరిగిందన్నారు. తాము ఎన్‌డిఏ ఉన్నా ఏ ఒక్క ముస్లిం, మైనారిటీకీ అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇచ్చారు. ఎన్‌డిఏతో 1995 నుంచి 2004 వరకు, 2014 నుంచి 2019 వరకూ కలిసే ఉన్నామన్నారు. ఏనాడు ముస్లిములకు

నీటివాటాలపై రేపటి నుంచి కృష్ణా ట్రిబ్యునల్ విచారణ

- ఇప్పటికే వాదనలు వినిపించిన తెలంగాణ : తాత్సారం చేస్తున్న ఏపీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణా జలాల్లో నీటివాటాలు తేల్చే విషయమై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ సోమవారం నుంచి విచారణ చేపట్టనుంది. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాలకు నోటీసులు జారీచేసింది. ఇప్పటికే కొంత ప్రక్రియ పూర్తయినప్పటికీ, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టలేదు. ఇరు రాష్ట్రాలు రకరకాల కారణాలతో వాయిదాలు కోరుతూ వస్తున్నాయి. దీంతో విచారణ ఆలస్యమవుతున్నది. ఎట్టకేలకు సోమవారం నుంచి తెలుగు రాష్ట్రాల నుంచి నీటి వాటాలకు సంబంధించి వాదనలు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ వినే అవకాశం ఉంది. కాగా ఏపీలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఆ రాష్ట్రం వాదనలు వినిపించే అవకాశం లేదనే ప్రచారం జరుగుతున్నది. ఎన్నికల తర్వాతే ఏపీ వాదనలు వినిపించేందుకు సోమవారం ట్రిబ్యునల్ అనుమతి కోరే అవకాశం ఉంది ఈ నేపథ్యంలో జూన్ రెండో వారంలో ఏపీ తమ వాదన వినిపించే పరిస్థితులు ఉన్నాయని తెలిసింది. తెలంగాణ ఇప్పటికే తన వాదనను దాఖలు చేసిప్పటికీ, ఆంధ్రప్రదేశ్ నుంచి దాఖలు చేసేవరకు తమ వివరాలు బయటపెట్టొద్దని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌ను కోరినట్టు సమాచారం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులను ప్రాజెక్టుల వారీగా నిర్ధారించడం, తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు ఏ ప్రాతిపదికన వినియోగించుకోవాలో మార్గదర్శనం చేయడం తదితర బాధ్యతలను ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి కృష్ణాబేసిన్‌లోకి మళ్లించే నీటిలో ఉమ్మడి ఏపీకి 45 టీఎంసీలలోనూ వాటాలను తేల్చే బాధ్యతనూ ట్రిబ్యునల్‌కే అప్పజెప్పింది. ఈ మేరకు 2023, అక్టోబరులో నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. పునర్విభజన చట్టంమేరకు అప్పగించిన బాధ్యతకు ముందు, గత కేంద్రం గెజిట్‌లో పేర్కొన్న అంశాలపై ట్రిబ్యునల్ తొలుత విచారణ నిర్వహించాల్సి ఉంటుంది. ఆయా అంశాలపై వాదనలను సమర్పించాలని ఇరు రాష్ట్రాలకు ట్రిబ్యునల్ సూచించింది. ఇందులో తమ అవసరాలు, ఏ ప్రాజెక్టుకు ఎంతమేరకు నీరు అవసరం, కరువు ప్రాంతం ఇలా అనేక విషయాలుంటాయి. రాష్ట్రాల విజ్ఞప్తి మేరకు వాదనలు వినిపించేందుకు మార్చి 20 వరకు ట్రిబ్యునల్ గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం జరిగే విచారణ సందర్భంగా ఏపీ మళీ గడువు కోరే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ద్వంద్వ పౌరసత్వానికి ద్వారాలు తెరుస్తున్న సిఎఎ నిబంధనలు

- సుప్రీంలో సిఎఎ వ్యతిరేక పిటిషన్‌దారుల ఆందోళన

న్యూఢిల్లీ : భారతదేశ పౌరసత్వం కావాలని కోరుతున్న విదేశీయులు తమ స్వదేశ పౌరసత్వాన్ని విడనాడాల్సిన అవసరం లేదని పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) నిబంధనలు పేర్కొంటున్నందున ఈ నిబంధనలు ద్వంద్వ పౌరసత్వానికి ద్వారాలు తెరుస్తున్నాయని సిఎఎ వ్యతిరేక పిటిషన్‌దారులు సుప్రీంకోర్టులో ఆందోళన వ్యక్తం చేశారు. సిఎఎ నిబంధనలపై స్టే విధించాలని కోరుతూ వేసిన తమ పిటిషన్‌పై ఏప్రిల్ 9న విచారణ జరగనున్న నేపథ్యంలో పిటిషన్‌దారులు రాతపూర్వకంగా తమ వాదనలు దాఖలు చేశారు. పౌరతస్వ చట్టం-1955లోని సెక్షన్ 9, రాజ్యాంగంలోని 9వ అధికరణ రెండూ కూడా ద్వంద్వ పౌరసత్వాన్ని స్పష్టంగా నిషేధిస్తున్నాయి. మరో దేశ జాతీయులకు భారత పౌరసత్వాన్ని మంజూరు చేసేటపుడు వారు ముందుగా ఆ దేశ పౌరసత్వాన్ని త్యజించాల్సిన వాస్తవాన్ని సిఎఎ నిబంధనలు విస్మరించాయని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేతృత్వంలోని పిటిషనర్లు పేర్కొన్నారు. ఇలా ద్వంద్వ పౌరసత్వాన్ని అనుమతించడం వల్ల నిబంధనలు ఏకపక్షంగా మారతాయని వారు పేర్కొన్నారు.

అహ్మదీయులు, రోహింగ్యాలను మినహాయించారు

సిఎఎలో అంతర్లీనంగా మతపరమైన వేధింపులు కనిపిస్తున్నాయని వారు పేర్కొన్నారు. పొరుగుదేశాలపైన పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల్లో మైనారిటీలు వేధింపులు ఎదుర్కొంటూ ఇక్కడకు వచ్చిన శరణార్థుల కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు కేంద్రం పేర్కొంటోంది. కానీ ఇలా వచ్చిన శరణార్థుల్లో కూడా ఎంపిక చేసిన గ్రూపుల వారిని మాత్రమే సిఎఎ ప్రయోజనాలకు అర్హులుగా ప్రకటించారని వారుపేర్కొన్నారు. మినహాయించబడిన శరణార్థుల గ్రూపులు అక్రమ శరణార్థులుగానే కొనసాగాల్సి వుంటుందన్నారు. వారికి భారత పౌరసత్వం కోరే అవకాశం కూడా లేకుడా పోయిందన్నారు.

లాలూకు వ్యతిరేకంగా అరెస్టు వారెంట్ జారీ


న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు బీహార్ మాజీ ముఖ్యమంత్రి లల్లూ ప్రసాద్ యాదవ్‌కు వ్యతిరేకంగా మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్ ప్రత్యేక న్యాయస్థానం పర్మినెంట్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేల కేసులను విచారించేందుకు ఉద్దేశించిన ఈ ప్రత్యేక న్యాయ స్థానం 1995-97 ఆయుధాలు, మందుగుండు సామగ్రి అక్రమంగా కొనుగోలు కేసులో లల్లూ ప్రసాద్ యాదవ్‌తో సహా 23 మందిని నిందితులుగా పేర్కొంది. వీరందరిపైన చార్జిషీట్‌ను దాఖలు చేసిన పోలీసులు, లలూ ప్రసాద్ యాదవ్‌ను పరారైన నిందితుడిగా ప్రకటించారు. ఈ కేసులో విచారణకు ఆర్జేడి వ్యవస్థాపక నేత తరపున ఎవరూ కోర్టుకు హాజరు కాలేదని, ప్రత్యేక కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభిషేక్ మెహ్రోతా పిటిఐకి తెలిపారు. ఈ కేసు విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మహేంద్ర సైని ఈ అరెస్టు వారెండట జారీ చేశారు.

లాలూకు వ్యతిరేకంగా అరెస్టు వారెంట్ జారీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు బీహార్ మాజీ ముఖ్యమంత్రి లల్లూ ప్రసాద్ యాదవ్‌కు వ్యతిరేకంగా మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్ ప్రత్యేక న్యాయస్థానం పర్మినెంట్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేల కేసులను విచారించేందుకు ఉద్దేశించిన ఈ ప్రత్యేక న్యాయ స్థానం 1995-97 ఆయుధాలు, మందుగుండు సామగ్రి అక్రమంగా కొనుగోలు కేసులో లల్లూ ప్రసాద్ యాదవ్‌తో సహా 23 మందిని నిందితులుగా పేర్కొంది. వీరందరిపైన చార్జిషీట్‌ను దాఖలు చేసిన పోలీసులు, లలూ ప్రసాద్ యాదవ్‌ను పరారైన నిందితుడిగా ప్రకటించారు. ఈ కేసులో విచారణకు ఆర్జేడి వ్యవస్థాపక నేత తరపున ఎవరూ కోర్టుకు హాజరు కాలేదని, ప్రత్యేక కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభిషేక్ మెహ్రోతా పిటిఐకి తెలిపారు. ఈ కేసు విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మహేంద్ర సైని ఈ అరెస్టు వారెండట జారీ చేశారు.

కృతిమ మేధతో ఎన్నికల్లో జోక్యం

- చైనాపై మైక్రోసాఫ్ట్ ఆరోపణలు



న్యూయార్క్ : భారత్‌లో సార్వత్రిక ఎన్నికల వేళ చైనాపై అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సంస్థ అసంబద్ధమైన ఆరోపణలు గుప్పించింది. భారత్ సహా అమెరికా, దక్షిణ కొరియా ఎన్నికల ప్రక్రియలో కృత్రిమ మేధ (ఎఐ)తో జోక్యం చేసుకునేందుకు చైనా ప్రయత్నిస్తోందని ఆరోపించింది. దాదాపు 64 దేశాల్లో ఈ ఏడాది కొత్తగా ప్రభుత్వాలు కొలువుదీరనున్నాయని, ఈ నేపథ్యంలో ఎఐతో జోక్యానికి అవకాశాలున్నాయని మైక్రోసాఫ్ట్ థ్రెట్ అనాలసిస్ సెంటర్ జనరల్ మేనేజర్ క్లింట్ వాట్స్ బ్లాగ్ పోస్టు పెట్టారు. ఓటర్ల మధ్య పలు అంశాల్లో విభజన తీసుకొచ్చి, అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు తనకు అనుకూలంగా వచ్చేలా నకిలీ ఖాతాలను చైనా ఉపయోగిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా తన లక్ష్యాల సాధనకు ఉత్తర కొరియాతో కలిసి చైనా ఎఐ వినియోగాన్ని పెంచిందని పేర్కొన్నారు. ఇటీవల ప్రధాని మోదీ, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ భేటీ అయిన కొన్ని రోజుల తర్వాత మైక్రోసాఫ్ట్ నుంచి ఎఐపై హెచ్చరికలు రావడం గమనార్హం.

అమెజాన్ రెయిన్‌ఫారెస్ట్‌ని భూమి యొక్క ఊపిరితిత్తులుగా పిలవడానికి గల కారణం ఏమిటి ?



1. **ఏ అంతర్జాతీయ ఒప్పందం గ్లోబల్ వార్మింగ్‌ను పారిశ్రామిక పూర్వ స్థాయి కంటే 2 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది?**
ఎ) పారిస్ ఒప్పందం బి) క్యోటో ప్రోటోకాల్
సి) మాంట్రియల్ ప్రోటోకాల్ డి) కోపెన్‌హాగన్ ఒప్పందం

2. **UN వాతావరణ మార్పుల సమావేశం COP26 ఏ నగరంలో జరిగింది?**
ఎ) పారిస్ బి) న్యూయార్క్
సి) గ్లాస్గో డి) బీజింగ్

3. **ప్రపంచవ్యాప్తంగా గ్రీన్‌హౌస్ వాయువులను అత్యధికంగా విడుదల చేస్తున్న దేశం ఏది?**
ఎ) యునైటెడ్ స్టేట్స్ బి) చైనా
సి) భారతదేశం డి) యూరోపియన్ యూనియన్

4. **'కార్బన్ పాదముద్ర' అనే పదం ఈ కింది వాటిలో వేటిని సూచిస్తుంది ?**
ఎ) అడవిలో నిల్వ చేయబడిన కార్బన్ పరిమాణం
బి) మానవ కార్యకలాపాల ద్వారా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా విడుదలయ్యే గ్రీన్‌హౌస్ వాయువుల మొత్తం
సి) మట్టిలో కార్బన్ సీక్వెస్ట్రేషన్ రేటు
డి) సముద్ర పర్యావరణ వ్యవస్థలపై వాతావరణ మార్పు ప్రభావం

5. **ప్రపంచవ్యాప్తంగా అటవీ నిర్మూలనకు ప్రధాన కారణం ఏమిటి?**
ఎ) పట్టణీకరణ బి) వ్యవసాయం
సి) మైనింగ్ డి) పారిశ్రామికీకరణ

6. **'జీవవైవిధ్య హాట్‌స్పాట్' అనే భావన దేనిని సూచిస్తుంది ?**
ఎ) మానవ కార్యకలాపాల వల్ల ముప్పు పొంచి ఉన్న జాతుల వైవిధ్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు
బి) జాతుల వైవిధ్యం మరియు సమృద్ధిగా సహజ వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాలు
సి) అంతరించిపోతున్న జాతుల పరిరక్షణ కోసం నియమించబడిన రక్షిత ప్రాంతాలు
డి) వాతావరణ మార్పుల కారణంగా తీవ్రమైన వాతావరణ సంఘటనల వల్ల ప్రభావితమైన మండలాలు

7. **'కార్బన్ ప్రైసింగ్' భావన యొక్క ప్రధాన లక్ష్యం ఏమిటి ?**
ఎ) కార్బన్ కాలుష్యంపై పన్ను విధించడం ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు వ్యాపారాలను ప్రోత్సహించటం
బి) ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి శిలాజ ఇంధన పరిశ్రమలకు సబ్సిడీ ఇవ్వండి
సి) కార్బన్-ఇంటెన్సివ్ ఉత్పత్తుల వినియోగాన్ని పెంచండి
డి) పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులలో పెట్టుబడిని తగ్గించండి

8. **సముద్రాలలో ప్లాస్టిక్ కాలుష్యం వల్ల ఈ కింది వాటిలో ఏ సముద్ర జంతు జాతులకు ముప్పు ఎక్కువగా ఉంది ?**
ఎ) డాల్ఫిన్లు బి) సముద్ర తాబేళ్లు
సి) షార్క్‌లు డి) జెల్లీ ఫిష్

9. **'వృత్తాకార ఆర్థిక వ్యవస్థ' అనే భావన యొక్క లక్ష్యం ఏమిటి ?**
ఎ) వ్యర్థాలను తగ్గించడం మరియు వనరుల పునర్వినియోగం మరియు రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం
బి) పర్యావరణ ప్రభావాలతో సంబంధం లేకుండా పారిశ్రామిక ఉత్పత్తిని పెంచండి
సి) ఆర్థిక వృద్ధికి సహజ వనరులను ఉపయోగించుకోండి
డి) వ్యవసాయ విస్తరణ కోసం అటవీ నిర్మూలనను వేగవంతం చేయండి

10. **పగడపు దిబ్బ బ్లీచింగ్‌కు ప్రధాన కారణం ఏమిటి?**
ఎ) ఓవర్ ఫిషింగ్ బి) చమురు కాలుష్యం
సి) సముద్ర ఆమ్లీకరణ డి) గ్లోబల్ వార్మింగ్

11. **ఇటీవల 2060 నాటికి కార్బన్ న్యూట్రాలిటీని సాధించే ప్రణాళికలను ఏ దేశం ప్రకటించింది?**
ఎ) యునైటెడ్ స్టేట్స్ బి) రష్యా
సి) బ్రెజిల్ డి) చైనా

12. **ఇంటర్‌గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్ (IPCC) ఏటా వేటిని అంచనా వేస్తుంది ?**
ఎ) అంతర్జాతీయ వాణిజ్య విధానాలు
బి) ప్రపంచ జీవవైవిధ్య పోకడలు
సి) వాతావరణ శాస్త్రం మరియు వాతావరణ మార్పు ప్రభావాలు
డి) సముద్ర కాలుష్య స్థాయిలు

13. **ఈ కింది వాటిలో ఏ పునరుత్పాదక ఇంధన వనరులు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వృద్ధి రేటును కలిగి ఉన్నాయి?**
ఎ) సౌరశక్తి బి) పవన శక్తి
సి) జలవిద్యుత్ శక్తి డి) భూఉష్ణ శక్తి

14. **ఈ క్రింది కార్యక్రమాలలో ఏది యునైటెడ్ స్టేట్స్‌లో క్షీణించిన పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం మరియు హరిత ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పనిచేస్తుంది ?**
ఎ) గ్రీన్ న్యూ డీల్ బి) పారిస్ ఒప్పందం
సి) క్యోటో ప్రోటోకాల్ డి) క్లీన్ పవర్ ప్లాన్

15. **మాంట్రియల్ ప్రోటోకాల్‌కు చేసిన 'గాలీ సవరణ' ద్వారా ఈ కింది వాటిలో వేటిని దశలవారీగా తొలగించాలని లక్ష్యంగా పెట్టుకుంది ?**
ఎ) ఓజోన్ క్షీణతకు కారణమైన గ్రీన్‌హౌస్ వాయువులు
బి) పారిశ్రామిక ప్రక్రియల నుండి కార్బన్ ఉద్గారాలు
సి) సముద్రాలలో ప్లాస్టిక్ కాలుష్యం
డి) ఉష్ణమండల ప్రాంతాల్లో అటవీ నిర్మూలన

16. **ఈ కింది వాటిలో ఏ పర్యావరణ సంస్థ ఇటీవల 'స్టేట్ ఆఫ్ ది వరల్డ్స్ ఫారెస్ట్' నివేదికను విడుదల చేసింది?**
ఎ) గ్రీన్‌పీస్
బి) వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (WWF)
సి) ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP)
డి) ప్రపంచ వనరుల సంస్థ (WRI)



డాక్టర్ కె. శశిధర్
పర్యావరణ నిపుణులు
94919 91918

17. **'పర్యావరణ పాదముద్ర' అనే పదం ఈ కింది వాటిలో దేనిని సూచిస్తుంది ?**
ఎ) రక్షిత సహజ ఆవాసాల మొత్తం ప్రాంతం
బి) పర్యావరణ వ్యవస్థలపై మానవ కార్యకలాపాల ప్రభావం
సి) జీవవైవిధ్య హాట్‌స్పాట్‌ల పంపిణీ
డి) మంచినీటి వనరుల లభ్యత

18. **'వాతావరణ స్థితిస్థాపకత' అనే పదం ఈ కింది వాటిలో వేటిని సూచిస్తుంది ?**
ఎ) మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పర్యావరణ వ్యవస్థల సామర్థ్యం
బి) కార్బన్-ఇంటెన్సివ్ పరిశ్రమల ప్రోత్సాహం
సి) పర్యావరణ ప్రభావంతో నిమిత్తం లేకుండా పట్టణ ప్రాంతాల విస్తరణ
డి) తీవ్రమైన వాతావరణ సంఘటనలను తట్టుకోగల వ్యక్తుల సామర్థ్యం

19. **2050 నాటికి నికర-సున్నా ఉద్గారాలను సాధించడానికి కట్టుబడి ఉన్న ఏ దేశం ఇటీవల వాతావరణ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది?**
ఎ) యునైటెడ్ స్టేట్స్ బి) యునైటెడ్ కింగ్‌డమ్
సి) చైనా డి) ఆస్ట్రేలియా

20. **UN బయోడైవర్సిటీ సమ్మిట్ COP15 పర్యావరణ వ్యవస్థలలో ఏ కీలక భాగం క్షీణించడంపై దృష్టి పెట్టింది?**
ఎ) నేల సంతానోత్పత్తి బి) పరాగ సంపర్క జనాభా
సి) సముద్ర జీవవైవిధ్యం డి) మొక్కల జాతులు

21. **'ఆంత్రోపోసీన్' అనేది ప్రతిపాదిత భౌగోళిక యుగం, ఈ కింది వాటిలో దేని ఆధారంగా వర్గీకరించబడింది ?**
ఎ) పెరిగిన అగ్నిపర్వత కార్యకలాపాలు
బి) భూమి యొక్క పర్యావరణ వ్యవస్థలపై మానవ ప్రభావం యొక్క ఆధిపత్యం
సి) గ్లోబల్ కూలింగ్ ట్రెండ్స్
డి) సహజ ఆవాసాల విస్తరణ

22. **నిరంతర సేంద్రీయ కాలుష్య కారకాల (POPలు) ఉత్పత్తి మరియు వినియోగాన్ని దశలవారీగా నిలిపివేయాలని ఏ పర్యావరణ ఒప్పందం లక్ష్యంగా పెట్టుకుంది?**
ఎ) క్యోటో ప్రోటోకాల్ బి) మాంట్రియల్ ప్రోటోకాల్
సి) బాసెల్ కన్వెన్షన్ డి) స్టాక్‌హోమ్ కన్వెన్షన్

23. **ఇటీవల జరిగిన COP26 ఏ కారణాల వల్ల విమర్శల్ని ఎదుర్కొంది ?**
ఎ) ప్రధాన ఆర్థిక వ్యవస్థల నుండి భాగస్వామ్యం లేకపోవడం
బి) ప్రతిష్టాత్మక ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను సెట్ చేయడంలో వైఫల్యం
సి) అభివృద్ధి చెందుతున్న దేశాలలో వాతావరణ అనుకూలతకు సరిపోని నిధులు
డి) పైవన్నీ

24. **'ఆర్కిటిక్ యాంప్లిఫికేషన్' అంటే ఏమిటి ?**
ఎ) ఆర్కిటిక్ ప్రాంతంలో హిమానీనదాలు వేగంగా కరగడం
బి) భూమ్మీద మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే ఆర్కిటిక్ ప్రాంతం ఎక్కువగా వేడెక్కడం
సి) ఆర్కిటిక్ వాతావరణ నమూనాల కారణంగా ప్రపంచ ఉష్ణోగ్రతలలో తగ్గుదల
డి) వాతావరణ మార్పుల కారణంగా ఆర్కిటిక్ సముద్రపు మంచు విస్తరణ

25. **గ్లోబల్ బయోడైవర్సిటీ ట్రెండ్‌లను హైలైట్ చేస్తూ 'లివింగ్ ప్లానెట్ రిపోర్ట్'ను ఇటీవల ఏ అంతర్జాతీయ సంస్థ విడుదల చేసింది?**
ఎ) ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (UNEP)
బి) వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (WWF)
సి) ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (IUCN)
డి) గ్రీన్‌పీస్

26. **'రీవైల్డింగ్' భావన యొక్క ప్రధాన లక్ష్యం ఏమిటి ?**
ఎ) పట్టణ ప్రాంతాలను సహజ ఆవాసాలుగా విస్తరించడం
బి) క్షీణించిన పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం మరియు స్థానిక జాతులను తిరిగి ప్రవేశపెట్టడం
సి) వ్యవసాయ అవసరాల కోసం అడవులను నరికివేయడం
డి) రక్షిత ప్రాంతాలలో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడం

27. **'యునైటెడ్ నేషన్స్ డికేడ్ ఆన్ ఎకోసిస్టమ్ రీస్టోరేషన్' యొక్క లక్ష్యం ఏమిటి ?**
ఎ) అటవీ నిర్మూలనను ప్రోత్సహించండి
బి) పర్యావరణ క్షీణతను వేగవంతం చేయండి
సి) క్షీణించిన పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడానికి చర్యను సమీకరించండి
డి) పర్యావరణ ప్రభావంతో నిమిత్తం లేకుండా పట్టణ ప్రాంతాలను విస్తరించండి

28. **పర్యావరణ శరణార్థుల గురించి ఈ క్రింది ప్రకటనలలో ఏది సరైనది?**
ఎ) వాతావరణ శరణార్థులకు అంతర్జాతీయ చట్టం కింద రక్షణ ఉంటుంది
బి) వాతావరణ శరణార్థులు స్వచ్ఛందంగా వలసపోతారు
సి) వాతావరణ మార్పు ప్రజల స్థానభ్రంశానికి దోహదం చేయదు
డి) వాతావరణ శరణార్థులు తరచుగా మానవతా సహాయాన్ని పొందడంలో సవాళ్లను ఎదుర్కొంటారు

29. **'అమెజాన్ రెయిన్‌ఫారెస్ట్'ని భూమి యొక్క ఊపిరితిత్తులుగా పిలవడానికి ప్రధాన కారణం ఏమిటి ?**
ఎ) ఇది కిరణజన్య సంయోగక్రియ ద్వారా గణనీయమైన మొత్తంలో ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తుంది
బి) ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కలప ఉత్పత్తిదారు
సి) ఇది ఏదైనా పర్యావరణ వ్యవస్థలో అత్యధిక జాతుల వైవిధ్యాన్ని కలిగి ఉంది
డి) ఇది ప్రపంచ ఉష్ణోగ్రతలను నియంత్రించడానికి బాధ్యత వహిస్తుంది

30. **'రేస్ టు జీరో' ప్రచారం ఈ కింది వాటిలో దేనికి సంబంధించింది ?**
ఎ) సముద్రాలలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడం
బి) 2050 నాటికి నికర-సున్నా ఉద్గారాలను సాధించడం
సి) అంతరించిపోతున్న జాతులను రక్షించడం
డి) సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించడం

సమాధానాలు

1. ఎ	2. సి	3. బి	4. బి	5. బి
6. ఎ	7. ఎ	8. బి	9. ఎ	10. డి
11. డి	12. సి	13. ఎ	14. ఎ	15. ఎ
16. సి	17. బి	18. ఎ	19. బి	20. బి
21. బి	22. డి	23. డి	24. బి	25. బి
26. బి	27. సి	28. డి	29. ఎ	30. బి

విద్యార్థుల ఒత్తిడిని తగ్గించే ఓపెన్ బుక్ ఎగ్జామ్స్



పాకాల శంకర్ గౌడ్
9848377734

సహజంగా పరీక్షలు సమీపిస్తుంటే విద్యార్థుల్లో భయం, ఆందోళన మొదలవుతాయి. ఏడాదిగా చదివిందంతా గుర్తుపెట్టుకుని పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఒక్కోసారి మొదటి వాక్యం గుర్తుకు రాకపోయినా సమాధానం సరిగా రాయలేరు. రాత్రనక, పగలనక కష్టపడి చదువుకొని పరీక్షహాల్లోకి వెళ్లగానే పరీక్షాపత్రం చూస్తూ ఆత్రుతతో టెన్షన్ పడుతూ విద్యార్థులు పరీక్షలు రాస్తూ ఉంటారు. రాబోయే రోజుల్లో విద్యార్థుల్లో టెన్షన్ తగ్గించి, కంఠస్థం (బట్టి పద్ధతి) చేసే విధానానికి స్వస్తి పలికి, పరీక్షలకు పుస్తకాలను తీసుకుని వెళ్లి, చూసి రాసే అవకాశమిస్తే ఎలా ఉంటుందోనని సీబీఎస్ఈ ఆలోచిస్తోంది. ఈ ఆలోచనే ఓపెన్ బుక్ ఎగ్జామ్ చర్చను తెరపైకి తీసుకువచ్చింది.


ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్: పుస్తకాలు చూస్తూ పరీక్షలను రాసే పద్ధతిని ఓపెన్ బుక్ ఎగ్జామ్స్ అంటారు. ఈ పరీక్ష విధానంలో సమాధానం రాసేటప్పుడు విద్యార్థులు వారి పుస్తకాలు, స్టడీనోట్స్, గైడ్లు ఉపయోగించుకోవడానికి అనుమతి ఇస్తారు.ఓపెన్ బుక్ ఎగ్జామ్‌లో విద్యార్థులు ఆమోదింపబడిన స్టడీ మెటీరియల్ మాత్రమే అనుమతిస్తే దాన్ని పరిమితి చేయబడిన ఓపెన్ బుక్ అసెస్మెంట్ అని, ఏదైనా సంబంధిత స్టడీ మెటీరియల్ ఉపయోగిస్తే అది ఉచిత టైప్ ఓపెన్ బుక్ అసెస్మెంట్ అని అంటారు.ఓపెన్ బుక్ పరీక్షలు ప్రస్తుత పరీక్షలతో పోల్చుకుంటే కఠినంగా ఉంటాయి. ప్రస్తుత పరీక్షా విధానంలో విద్యార్థుల జ్ఞానాన్ని వారి బట్టి పట్టే సామర్థ్యాన్ని మనం పరీక్షిస్తున్నాం. ఓపెన్ బుక్ పరీక్షల్లో ప్రశ్నలు సాంప్రదాయ పద్ధతిలో వలె నేరుగా ఉండవు పరోక్షంగా విద్యార్థుల అవగాహనా సామర్థ్యాన్ని పరీక్షించేవిగా ఉంటాయి. విశ్లేషణ స్థాయినీ అంచనా వేసేలా ఉంటాయి. మూల్యాంకన ప్రక్రియను మార్చడానికి, సమస్యలను సంశ్లేషణ చేయడానికి, విశ్లేషించడానికి విద్యార్థులను సమర్థవంతంగా తయారు చేయడానికి సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి విమర్శనాత్మక ఆలోచనలు ప్రోత్సహించడానికి విద్యార్థుల్లో అవగాహనా సామర్థ్యాన్ని పెంచడానికి ఓపెన్ బుక్ ఎగ్జామ్ ఉపయోగపడుతుంది.ఈ విధానం సృజనాత్మకతతో కూడి, పుస్తకాలతో విస్తారమైన పరిచయం లేకుండా విద్యార్థులు సమాధానాలు రాయలేరు. ఓపెన్‌బుక్ పరీక్షలో వచ్చే ప్రశ్నలు విస్తృత పరిధిని కలిగి ఉంటాయి. పుస్తకం ఆమూలాగ్రం చదివి పరీక్ష రాసేలా ఉండదు. ఆ సబ్జెక్టుకి సంబంధించి అనేక పుస్తకాలతో సంబంధం ఉండేలా విస్తృతస్థాయి ప్రశ్నలు ఈ పరీక్షల్లో అడుగుతారు.

బుక్ రీడింగ్, ఇంటర్నల్ డిబేట్‌లకు బాగా అలవాటు పడి ఉంటే ఈ ఓపెన్ బుక్ ఎగ్జామ్ విద్యార్థులకు సులభమవుతుంది. క్షేత్రస్థాయి పరిస్థితులను గమనిస్తే టీచర్లు పాఠాలు బోధించే విధానం గతంతో పోల్చుకుంటే చాలా మారిపోయింది. నూతన భావనలకు అవగాహన కల్పించే బదులుగా ఈ ప్రశ్నకు ఇలా జవాబు రాస్తే ఇన్ని మార్కులు వస్తాయి అనే విధంగా విద్యార్థులకు పాఠ్యాంశ బోధన జరుగుతుంది.ఇలా చేయడం వల్ల విద్యార్థులకు నూతన భావనలపై లోతైన అవగాహన లేకుండా పోతుంది.

విశ్లేషించి జవాబు రాసే ఆలోచన విద్యార్థుల్లో లోపిస్తుంది.ఓపెన్ బుక్ పరీక్షలో ప్రశ్నలు విద్యార్థులను ఆలోచింపజేసేలా ఇండైరెక్ట్‌గా ఉంటాయి. జవాబులు రాసేముందు ప్రశ్నలను అర్థం చేసుకుని భావనలపై అవగాహన లేకుంటే సమాధానాలు రాయలేరు. వారు తెచ్చుకున్న పుస్తకాల్లో స్టడీ మెటీరియల్‌లో ఈ ప్రశ్నకు సమాధానం ఎక్కడ ఉందో తెలుసుకుని దానికి సంబంధించిన సమాచారాన్ని వినియోగించుకొని ప్రశ్నలకు జవాబు రాయాల్సి ఉంటుంది.

ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్స్ ఎందుకు?: నూతన జాతీయ విద్యా విధానం-2020కి అనుగుణంగా మూల్యాంకన పద్ధతిని మార్చడం, ప్రత్యామ్నాయ మూల్యాంకన పద్ధతిని అన్వేషించడం, విద్యార్థుల ప్రయోజనం కోసం వివిధ రకాల పరీక్షలను అమలు చేయాలని సిఫారసు చేసింది. సీబీఎస్ఈ సాధారణ పరీక్షలకు ప్రత్యామ్నాయంగా ఓపెన్ బుక్ ఎగ్జామ్‌ని అన్వేషిస్తుంది. సీబీఎస్ఈ గతేడాది విడుదల చేసిన నేషనల్ కరికులం ఫ్రైమ్ వర్క్ ఆధారంగా ఈ రకమైన ప్రతిపాదనను రూపొందించింది. పాఠశాల విద్య కోసం జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్ వర్క్ ప్రస్తుత మూల్యాంకన ప్రక్రియను సంస్కరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. పరీక్షల సంస్కరణలలో భాగంగా ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ విధానాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసి ఫలితాలను సమీక్షించనుంది సీబీఎస్ఈ.

దేశంలో ఓపెన్ బుక్ పరీక్ష విధానం: 2014లో సీబీఎస్ఈ ఓపెన్ టెక్స్ట్ బేస్డ్ అసెస్మెంట్ (ఓటిబిఏ)ని ప్రవేశపెట్టింది. దీనిద్వారా 9, 11 తరగతులలో ఓపెన్ బుక్ పరీక్షలు నిర్వహించారు. బట్టి పట్టే విధానాన్ని తగ్గించి సమాచార ప్రాసెసింగ్ నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకొని అమలు చేసారు. కాని విద్యార్థుల్లో క్రిటికల్ థింకింగ్ స్కిల్స్ పెంచడంలో విఫలమయ్యామనే భావనతో 2017-18 విద్యాసంవత్సరంలో దీన్ని నిలిపివేశారు.2019లో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కాలేజీలలో ఓపెన్ బుక్ ఎగ్జామ్‌ను అడ్వయిజర్ బోర్డ్ సిఫారసు చేసిన తర్వాత అనుమతించింది. 2020-21 కరోనా సమయంలో ఢిల్లీ యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ, ఐఐటి ఢిల్లీ, ఐఐటి ఇండోర్, ఐఐటి బాంబే, కేంద్రీయ విద్యాలయాలు విద్యార్థులను మూల్యాంకనం చేయడానికి ఓపెన్ బుక్ టెస్టులను నిర్వహించాయి. తెలంగాణ రాష్ట్రంలో ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ ప్రయోగం 2021-22లో తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ పరీక్షలకు ఈ విధానం అమలు చేసి సత్ఫలితాలను పొందింది. అప్లైడ్ ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్‌లో పాస్ పర్సంటేజ్ 24 శాతం పెరిగింది.కేరళ రాష్ట్రంలో ఉన్నత విద్యా సంస్థల్లో అంతర్గత మూల్యాంకనం కోసం ఈ ఓపెన్ బుక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.



ప్రయోజనాలు: ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ విద్యార్థులకు ముఖ్యమైన భావనలు, హై ఆర్డర్ స్కిల్స్, సెల్ఫ్ అసెస్మెంట్‌పై దృష్టి పెట్టడంలో సహాయపడుతుంది. క్లిష్టమైన సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుంది. బోర్డ్ ఎగ్జామ్ ఆధారంగా నడిచే కోచింగ్ పరిశ్రమ విస్తరణను నిరోధిస్తుంది. వనరుల నిర్వహణ నైపుణ్యాలను ప్రోత్సహిస్తుంది. విద్యార్థుల్లో పరీక్షకు సంబంధించిన ఒత్తిడిని తగ్గిస్తుందని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ భువనేశ్వర్‌కు చెందిన వైద్య విద్యార్థులతో జరిపిన అధ్యయనంలో తేలింది. విద్యార్థుల ఆత్మహత్యలను తగ్గించడానికి ఇది దోహదపడుతుంది. పరీక్షలు స్వేచ్ఛగా ఎలాంటి ఒత్తిడి లేకుండా రాస్తారు.

సీబీఎస్ఈ పైలట్ ప్రాజెక్టు: నేషనల్ కరికులం ఫ్రేమ్ వర్క్ ప్రకారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 9 నుండి 12వ తరగతి విద్యార్థులకు ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని పరీక్షించనుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 9, 10వ తరగతి లకు ఇంగ్లీష్, గణితం, సైన్స్, 11 తరగతిలకు ఇంగ్లీష్, గణితం, జీవశాస్త్రం కోసం ఓపెన్ బుక్ పరీక్షలు ఉంటాయి.జూన్ నాటికి సీబీఎస్ఈ పైలట్ ప్రాజెక్టు రూపకల్పన, అభివృద్ధి ఖరారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి సహాయ సహకారాలు తీసుకోవాలని నిర్ణయించింది.నవంబర్, డిసెంబర్ లో ఎంపిక చేసిన బడుల్లో ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా ఓపెన్ బుక్ ఎగ్జామ్ నిర్వహించనుంది సీబీఎస్ఈ.వచ్చే ఫలితాలను విశ్లేషించి ఈ పరీక్షా విధాన అమలుపై నిర్ణయం తీసుకోనుంది.

ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ అంటే కాపీ కొట్టే విధానం కాదని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలి. పాఠ్యాంశాలలోని భావనలను అవగాహన చేసుకొని లోతైన అధ్యయనం చేస్తేనే ఈ పరీక్షా విధానంలో విద్యార్థులు సరైన జవాబులు రాయగలరు.రాబోయే తరాల భవిష్య త్తును దృష్టిలో పెట్టుకొని, ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులు పోటీపడేలా సీబీఎస్ఈ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాల ఆధారంగా మరింత అధ్యయనం చేసి ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్‌పై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఫిన్లాండ్, సింగపూర్, ఇంగ్లాండ్, అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వివిధ పరీక్షల్లో ఈ ఓపెన్ బుక్ ఎగ్జామ్ అమలు చేసి సత్ఫలితాలు పొందుతున్నాయి.

ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్ అంటే కాపీ కొట్టే విధానం కాదని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలి. పాఠ్యాంశాలలోని భావనలను అవగాహన చేసుకొని లోతైన అధ్యయనం చేస్తేనే ఈ పరీక్షా విధానంలో విద్యార్థులు సరైన జవాబులు రాయగలరు.రాబోయే తరాల భవిష్య త్తును దృష్టిలో పెట్టుకొని, ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులు పోటీపడేలా సీబీఎస్ఈ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాల ఆధారంగా మరింత అధ్య యనం చేసి ఓపెన్ బుక్ ఎగ్జామినేషన్‌పై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఫిన్లాండ్, సింగపూర్, ఇంగ్లాండ్, అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వివిధ పరీక్షల్లో ఈ ఓపెన్ బుక్ ఎగ్జామ్ అమలు చేసి సత్ఫలితాలు పొందుతున్నాయి.

'ఆరోగ్య భారత్' అందని ద్రాక్షేనా?

ముఖ్యంగా మనదేశంలో వైద్య రంగం దాదాపు ప్రయివేటీకరణ, కార్పోరేట్ వ్యక్తుల సంస్థల్లో ఉన్నదనేది వాస్తవం. అధిక ఫీజులు, స్కానింగ్, మందులు ఖర్చులు ఎక్కువగా ఉండటంతో పేద మధ్య తరగతి ప్రజలకు పూర్తిగా వైద్యం ఎండమావి వలే ఉన్నది. ముఖ్యంగా మహిళలు పిల్లలు రక్తహీనత, న్యూమోనియా, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కూడా ఈ విషయాలను ధ్రువపరుస్తుంది. ప్రజలకు ఆరోగ్యం అందించే బాధ్యత ప్రభుత్వానిదే అయినా, మనదేశంలో మాత్రం ఇదో ఓట్లు దండుకునే కార్యక్రమంగా ఉచిత, సంక్షేమ పథకాలు అమల్లో భాగంగా చూడటం బాధాకరం.





ఐ.ప్రసాదరావు
6305682733

1948 ఏప్రిల్ 7న " ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ)" ఏర్పడిన రోజునే 1949 నుంచి ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా జరుపుతున్నారు. ప్రపంచ జనాభా అంతా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో, అనేక వ్యాధులు నిర్మూలనకు కృషి చేయడం దీని ముఖ్య ఉద్దేశం. ఇటీవల కాలంలో మనందరం చూసిన 'కరోనా' విస్ఫోటనం మన ఆరోగ్య వ్యవస్థ ఎలా ఎంతగా దిగజారిందో బట్టబయలు చేసింది. అప్పటినుంచే ప్రపంచ దేశాలు, ప్రజలు ఆరోగ్య సంరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడంలో నిమగ్నమయ్యాయి. అయితే ఇటీవల వెల్లడించిన 2024 గ్లోబల్ హెల్త్ ఇండెక్స్ సూచికలో సింగపూర్ మొదటి స్థానంలో నిలిచింది. ఆఖరి స్థానంలో ఆఫ్రికా దేశమైన లెసోతో ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రతీ వెయ్యి మంది జనాభాకు ఒక వైద్యుడు ఉండాలి. మనదేశంలో ప్రతీ 10,189 మందికి ఒక ప్రభుత్వ వైద్యుడు ఉన్నాడు. అందుబాటులో ఉన్న వైద్య నివేదికల ప్రకారం..మనదేశంలో 10 లక్షల మంది వైద్యులు రిజిస్టర్ కాబడి ఉన్నారు. వీరిలో 58 శాతం పట్టణ/నగర ప్రాంతాలలో సేవలందిస్తుండగా, కేవలం 18.8 శాతం వైద్యులు మాత్రమే గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్నారు. ప్రపంచంలో స్పెయిన్, ఇటలీ, ఐస్‌లాండ్, జపాన్, స్విట్జర్లాండ్, స్వీడన్, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఆరోగ్య రంగంలో ముందంజలో ఉంటూ, ఆదేశ ప్రజలకు సురక్షిత ఆరోగ్యం అందిస్తున్నాయి. ఇక మన పొరుగు దేశమైన 'భూటాన్' తీవ్రంగా వైద్యుల కొరతతో సతమతమవుతోంది. ఈ దేశంలో ప్రతీ ఐదు వేల మందికి ఒక వైద్యుడు ఉండటం ఆందోళన కలిగించే అంశం. జపాన్ ప్రజలు మంచి ఆరోగ్యంతో ఫిట్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

ఇక మన భారతదేశంలో అందరికీ ఆరోగ్యం అందని ద్రాక్షవలే ఉన్నది. 142 కోట్ల మందికి అవసరమైన డాక్టర్లు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బంది, ఆసుపత్రులు అందుబాటులో లేవు. దీనికి ప్రధాన కారణం మనదేశ స్థూల జాతీయోత్పత్తిలో కేవలం ఒక శాతం నిధులు మాత్రమే నేటికీ కేటాయించడం జరుగుతోంది. ఇంత తక్కువ నిధులతో అందరికీ ఆరోగ్యం ఎలా అందిస్తారో... పాలకులకే తెలియాలి. ఈ ఏడాది " మై హెల్త్ - మై రైట్" అనే థీమ్ తో జరుపుకుంటున్న ఈ ఆరోగ్య దినోత్సవం మనదేశంలో అందరికీ ఈ సౌకర్యం లభిస్తుందా? అనేది బిలియన్ డాలర్ల ప్రశ్న..!? కేరళ, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో వైద్య రంగానికి బడ్జెట్లో నిధులు ఎక్కువగా కేటాయించి ఖర్చు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ, ప్రజల అందరికీ అందుబాటులో ఉంచుతున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కూడా కొంత మేరకు ఆరోగ్య సేవలందించటం చూస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం "ఆయుష్మాన్ భవ" వంటి కార్యక్రమాలు చేపడుతున్నా, ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా నేటికీ మనదేశంలో నాణ్యమైన వైద్యం అందరికీ అందుబాటులో లేదు. దీనికి ప్రధాన కారణం పేదరికం, నిరుద్యోగంతో పాటు ప్రభుత్వ విధానాలు. ముఖ్యంగా మనదేశంలో వైద్య రంగం దాదాపు ప్రయివేటీకరణ, కార్పోరేట్ వ్యక్తుల సంస్థల్లో ఉన్నదనేది వాస్తవం. అధిక ఫీజులు, స్కానింగ్, మందులు ఖర్చులు ఎక్కువగా ఉండటంతో పేద మధ్య తరగతి ప్రజలకు పూర్తిగా వైద్యం ఎండమావి వలే ఉన్నది. ముఖ్యంగా మహిళలు పిల్లలు రక్తహీనత, న్యూమోనియా, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కూడా ఈ విషయాలను ధ్రువపరుస్తుంది. ప్రజలకు ఆరోగ్యం అందించే బాధ్యత ప్రభుత్వానిదే అయినా, మనదేశంలో మాత్రం ఇదో ఓట్లు దండుకునే కార్యక్రమంగా ఉచిత, సంక్షేమ పథకాలు అమల్లో భాగంగా చూడటం బాధాకరం.

ఇక మనదేశంలో వైద్య విద్య నేటికీ ఖరీదైన చదువుగానే పరిగణించబడుతోంది. ధనికులకు మాత్రమే లభ్యమవుతుంది. దీనికి ప్రధాన కారణం వైద్య కళాశాలలు ఎక్కువగా ప్రయివేటు రంగంలో నెలకొల్పారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య విద్య లభించుటలేదు. ప్రభుత్వ వైద్య కాలేజీల్లో తగినంత బోధనా సిబ్బంది, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నాణ్యత గల విద్య అందిపుచ్చుకుని లేకపోవడం జరుగుతుంది. అందుచేతనే అమెరికా, రష్యా, చైనా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా వంటి విదేశాలకు విద్యార్థులు వలసపోతున్నారు.అక్కడే చదువుకుని, అక్కడే స్థిరపడుతున్నారు. అక్కడ ఉన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక, ప్రభుత్వాల విధానాలు వారిని ఆకర్షించుట చేత అక్కడే వైద్యులుగా స్థిరపడుతున్నారు. ఇక మన భారతదేశంలో అనేక వివక్షతలు వెంటాడుతూనే ఉండుట, రాజకీయ విధానాలు, సౌకర్యాల లేమి వల్ల వైద్యులు, ఇతర సిబ్బంది ఇక్కడ పనిచేయుటకు సుముఖత చూపడం లేదు.

2047 నాటికి వికసిత భారత్ అనే లక్ష్యం చేరుకోవాలంటే ముందు అందరికీ ఆరోగ్య భద్రత కల్పించాలి. వైద్య రంగానికి ఇక నుంచైనా బడ్జెట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఎక్కువగా కేటాయించి ఖర్చు చేయాలి. లైబ్రరీలు, లాబొరేటరీస్, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి. రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. అందరూ ఆరోగ్యంగా ఉంటేనే ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతమవుతుందని గ్రహించాలి. మగవారితో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాల్లో సమభాగం కల్పించాలి. వివక్షతలు లేకుండా చూడాలి. ఇప్పటికే మనదేశంలో ఊబకాయం, డయాబెటిస్, థైరాయిడ్, మానసిక అనారోగ్యం, వివిధ శారీరక అనారోగ్యాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కల్తీలతో ఆహారం కలుషితమవుతుంది. వాయు కాలుష్యము, పెస్టిసైడ్స్ వలన కాలుష్యం మానవుని అనారోగ్యాలకు కారణమవుతున్నాయి. జంక్ ఫుడ్స్, ఫ్రైడ్ ఐటమ్స్ తినుట వలన కూడా యవ్వనంలోనే అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు. తస్మాత్ జాగ్రత్త. గుండె, ఊపిరి తిత్తులు, మూత్రపిండాల సంబంధించిన వ్యాధులు ప్రబలి తున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం వలన కూడా అనారో గ్యాలతో బాధపడుతున్నారు. కనీసం ప్రతీ రోజూ ఒక గంట వ్యాయామం చేయాలి. యోగా, ధ్యానం చేయడం జరగాలి. పరిశు భ్రత పాటించాలి. పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. అందరికీ ప్రభుత్వం మంచినీరు సరఫరా చేయాలి. ప్రజలు కూడా ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి. పౌష్టికాహారం తీసుకోవాలి. పరిశుభ్రత పాటించాలి. "ఆరోగ్యమే మహాభాగ్యము" అనే భావన అందరిలో కల్పించడమే ఈ దినోత్సవ పరమార్థం.

(నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం)